సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 178

మంగళవారం 14-3-2023

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | VIJAYAWADA | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండగ రోజు'



'ది ఎలిఫెంట్ విష్పరర్స్' షార్ట్‌ఫిల్మ్‌కు అవార్డు అందుకున్న దర్శకురాలు కార్తీకి, నిర్మాత గునీత్ మోంగా



అదరగొట్టిన ఎవ్రీవేర్ ఎవ్రీథింగ్..

'ఎవ్రీవేర్ ఎవ్రీథింగ్ ఆల్ ఎట్ వన్స్' చిత్రానికి గాను ఉత్తమ దర్శకుడి అవార్డును డానియల్ క్వాన్, డానియల్ స్కీనెర్ట్.. నటనకుగాను మిషెల్ యో ఉత్తమ నటి అవార్డును స్వీకరించారు.





ఉత్తమ నటుడు: బ్రెండెన్ ఫ్రాసెర్

('దివేల్' సినిమాలో నటనకు గాను)

నటనలో మూడు దశాబ్దాల చరిత్ర ఉన్న బ్రెండెన్‌కు ఇదే తొలి ఆస్కార్ కావడం విశేషం.

తెలుగు పాటకు ఆస్కార్ డాన్స్

'నాటు నాటు'పాటకు బెస్ట్ ఒరిజినల్ సాంగ్ విభాగంలో అవార్డు



లాస్ ఏంజిలిస్‌లో అవార్డు అందుకున్న కీరవాణి, చంద్రబోస్

బెస్ట్ డాక్యుమెంటరీ షార్ట్ ఫిల్మ్ విభాగంలో మన దేశానికే చెందిన 'ది ఎలిఫెంట్ విష్పరర్స్'కు ఆస్కార్

'ఎవ్రీవేర్ ఎవ్రీథింగ్ ఆల్ ఎట్ వన్స్'కు ఉత్తమ చిత్రం, దర్శకుడు, ఎడిటింగ్, స్క్రీన్‌ప్లే సహా ఏడు అవార్డులు..

బెస్ట్ ఇంటర్నేషనల్ ఫీచర్ ఫిల్మ్ సహా నాలుగు అవార్డులతో అలరించిన 'ఆల్ క్వైట్ ఆన్ ది వెస్టర్న్ ఫ్రంట్'

2లో

'సెవులు సిల్లు పడేలా కీసు పిట్ట కూసినట్టు..'
..ఆ కూత ప్రపంచానికి వినిపించింది
'కాలు సిందు తొక్కేలా దుమారం రేగినట్టు.. నాటు నాటు నాటు ఊర నాటు'..
..ఆ సిందు ప్రపంచాన్ని కాలు కదిపేలా చేసింది

అంతగా 'నాటు నాటు'పాట మనసుకి పట్టేసింది. 95వ ఆస్కార్ అవార్డ్స్‌లో 'ఊర నాటు...'పాట వీర విజయం సాధించింది. దేశానికి తొలి ఆస్కార్ అవార్డ్‌ను నాటిన చిత్రం 'ఆర్ఆర్ఆర్'. తెలుగుకి తొలి ఆస్కార్‌ని తెచ్చింది కూడా ఈ చిత్రమే. గతంలో 'గాంధీ', 'స్లమ్ డాగ్ మిలియనీర్'వంటి చిత్రాలకుగాను భారతీయులకు ఆస్కార్ దక్కినప్పటికీ అవి భారతీయ చిత్రాలు కావు. అందుకే ఆస్కార్ సాధించిన తొలి భారత చిత్రంగా 'ఆర్ఆర్ఆర్' చరిత్ర సాధించింది. ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మించిన 'ఆర్ఆర్ఆర్'లోని 'నాటు నాటు..' పాట 'బెస్ట్ ఒరిజినల్ సాంగ్' విభాగంలో ఆస్కార్ సాధించింది. చిత్ర సంగీత దర్శకుడు కీరవాణి, పాట రచయిత చంద్రబోస్ ఈ అవార్డు అందుకున్నారు. ఆదివారం రాత్రి 8 గంటల (భారతీయ కాలమానం ప్రకారం సోమవారం ఉదయం 5.30 గంటల)కు లాస్ ఏంజిలిస్‌లోని డాల్బీ థియేటర్లో ప్రారంభమైన ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవాన్ని భారతదేశం మొత్తం ఆసక్తిగా తిలకించింది. 'అండ్ ది అవార్డ్ గోస్ టు.. నాటు నాటు' అనే శబ్దం సెవులు సిల్లు పడేలా వినిపించాలనే సినీ ప్రేమికుల ఆకాంక్ష నెరవేరింది. సౌండ్ బలంగా వినిపించింది. 'నాటు నాటు..' సృష్టించిన చరిత్రకు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుతున్నాయి. మన దేశానికి చెందిన 'ది ఎలిఫెంట్ విష్పరర్స్'కు బెస్ట్ డాక్యుమెంటరీ షార్ట్ ఫిల్మ్ విభాగంలో ఆస్కార్ అవార్డు దక్కింది. దేశం నుంచి శౌనక్‌సేన్ డైరెక్షన్‌లో రూపొందిన 'ఆల్ దట్ బ్రీత్స్' డాక్యుమెంటరీ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో నామినేషన్ దక్కించుకున్నా అవార్డును సొంతం చేసుకోలేకపోయింది. ఏది ఏమైనా రెండు ఆస్కార్‌లతో 'ఆర్ఆర్ఆర్'లోని 'ఎత్తర జెండా' పాటలా దేశ జెండా విశ్వవ్యాప్తంగా ఎగిరింది. దేశం సాధించిన ఘనతకు ప్రధాని నరేంద్ర మోదీ, ఏపీ సీఎం వైఎస్ జగన్, తెలంగాణ సీఎం కేసీఆర్‌లతోపాటు పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఊర నాటు ఆస్కార్ హిట్టు | ఉక్రెయిన్‌లో 17 రోజుల కష్టం | అంబారీ ఎక్కి ఆస్కార్ వచ్చింది

- ఫ్యామిలీలో▶





చందాదారుల సొమ్ముతో దందా!

- సేకరించిన డబ్బులను దారి మళ్లించిన మార్గదర్శి
- సొమ్ములు మన చందాదారులవి.. పెత్తనం పక్క రాష్ట్రాల వారిది
- ఇదో పోంజీ స్కామ్.. అక్రమాలకు ఆధారాలున్నాయన్న కోర్టులు
- పలువురు చందాదారుల నుంచి ఫిర్యాదులూ అందాయి
- విచారణకు సహకరించని యాజమాన్యం
- చందాదారుల సొమ్ముకు భద్రత కల్పించడం మా విధి
- ఈ కేసులో విచారణ కొనసాగిస్తాం
- మీడియాతో సీఐడీ అదనపు డీజీ సంజయ్, స్టాంపులు–రిజిస్ట్రేషన్ల ఐజీ వి.రామకృష్ణ

14లో



నేటి నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

తొలిరోజు ఉభయ సభలనుద్దేశించి ప్రసంగించనున్న గవర్నర్

సాక్షి, అమరావతి: శాసనసభ బడ్జెట్ సమావేశాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 10 గంటలకు శాసనసభ, శాసన మండలి సభ్యులను ఉద్దేశించి గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగించనున్నారు. గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టాక ఆయన పాల్గొంటున్న తొలి అధికారిక కార్యక్రమం ఇదే. నజీర్ ప్రసంగం తర్వాత

మిగతా 2వ పేజీలో ▶

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతం

స్థానిక సంస్థల ఎన్నికల్లో 95 శాతానికి పైగా నమోదు

- టీచర్లు, పట్టభద్రుల స్థానాల్లో 87, 63 శాతంకు పైగా పోలింగ్
- కట్టుదిట్టమైన భద్రత నడుమ స్ట్రాంగ్‌రూంలకు బ్యాలెట్‌బాక్స్‌లు
- 16న ఉ.8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభం



ఒంగోలులోని సెయింట్ జేవియర్స్ హైస్కూల్ పోలింగ్ కేంద్రంలో దివ్యాంగురాలిని ఎత్తుకుని పోలింగ్ బూత్‌లోకి తీసుకెళ్తున్న మహిళా ఏఎస్ఐ

2లో

NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE | Vencobb CHICKEN

సూచించిన నేటి గ్రుడ్లు & చికెన్ తిరుపతి జోన్ ధరలు

గ్రుడ్ల రిటైల్ ధర ₹ 66 డజన్	ఫారం దగ్గర లైవ్ బర్డ్	101 కిలో	డ్రెస్డ్ స్కిన్‌తో	178 కిలో
	రిటైల్ లైవ్ బర్డ్	123 కిలో	స్కిన్‌లెస్	203 కిలో

ఇదండీ జగత్



రేపట్నుంచి చాయ్ తాగడానికి కూడా ఎవరూ ఉండటం లేద్సార్! యాత్రకు మీతో పాటు నేనూ వస్తాను!!



అవినాశ్‌పై ఎలాంటి చర్యలొద్దు

అరెస్టు సహా ఎలాంటి బలవంతపు చర్యలు చేపట్టొద్దు

- సీబీఐకి తెలంగాణ హైకోర్టు ఆదేశం.. మధ్యంతర ఉత్తర్వులు జారీ
- సునీత పిటిషన్ వెనుక సీబీఐ హస్తం ఉంది
- ఏడాది తర్వాత ఆమె మాట మార్చారు..
- ఆ అభియోగాల వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయి
- వివేకా అల్లుడు, షమీమ్ పాత్రపై సీబీఐ విచారణ చేయడం లేదు
- అన్ని అంశాలపై దర్యాప్తు సాగేలా ఆదేశించండి
- హైకోర్టులో అవినాశ్‌రెడ్డి తరపు న్యాయవాది వాదనలు

10లో

మొదలైన పెట్టుబడుల కార్యాచరణ

సీఎస్ చైర్మన్‌గా 17 మంది సభ్యులతో మానిటరింగ్ కమిటీ ఏర్పాటు

- జీఐఎస్ ఎంఓయూలు వేగంగా వాస్తవ రూపంలోకి తేవడమే కమిటీ లక్ష్యం
- ప్రతీ 15 రోజులకొకసారి కమిటీ సమీక్ష
- ఎంఓయూలపై ఇప్పటికే కమిటీ భేటీ
- ఎప్పటిలోగా ఉత్పత్తిలోకి తీసుకు వచ్చేది చెప్పాలంటూ కంపెనీలను కోరిన పరిశ్రమల శాఖ



సాక్షి, అమరావతి: విశాఖ వేదికగా మార్చి 3–4 తేదీల్లో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో కుదిరిన పెట్టుబడుల ఒప్పందాలను వాస్తవ రూపంలోకి తీసుకువచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం తక్షణ కార్యాచరణ ప్రణాళికకు శ్రీకారం చుట్టింది. సదస్సులో కుదిరిన ఒప్పందాలను సాధ్యమైనంత త్వరగా అమల్లోకి తీసుకురావడానికి సీఎస్ చైర్మన్‌గా 17 మంది సభ్యులతో మానిటరింగ్ కమిటీని ఏర్పాటుచేస్తూ

మిగతా 2వ పేజీలో ▶



గవర్నర్, సీఎంకు లోకాయుక్త వార్షిక నివేదిక అందజేత



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ లోకాయుక్త వార్షిక నివేదిక–2022ను సోమవారం గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అందజేశారు. ఏపీ లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణ్‌రెడ్డి విజయవాడలోని రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్‌ను కలిశారు. ఈ సందర్భంగా లోకాయుక్త వార్షిక నివేదికను అందించారు.

ముఖ్యమంత్రిని కలిసిన లోకాయుక్త

అదేవిధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఏపీ లోకాయుక్త జస్టిస్ లక్ష్మణరెడ్డి కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు లోకాయుక్త వార్షిక నివేదికను అందించారు. ఆయా కార్యక్రమాల్లో లోకాయుక్త రిజిస్ట్రార్ టి.వెంకటేశ్వర రెడ్డి, డిప్యూటీ రిజిస్ట్రార్ సీహెచ్ పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

బోయ, వాల్మీకి కులాల అధ్యయన నివేదిక సీఎం జగన్‌కు అందజేత



సాక్షి, అమరావతి: బోయ, వాల్మీకి కులాల సమస్యలపై అధ్యయనం చేసిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి శామ్యూల్ ఆనంద్‌కుమార్ నివేదిక (పార్ట్–1)ను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అందించారు. ఆయన సోమవారం సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి నివేదిక అందజేశారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌ను గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి కాంతిలాల్ దండే కూడా కలిశారు.

మంత్రులకు సబ్జెక్టుల కేటాయింపు

అసెంబ్లీ, మండలిలో సమాధానాలు చెప్పేందుకు..


సాక్షి, అమరావతి: మంగళవారం నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ, శాసన మండలి సమావేశాల్లో సమాధానాలు చెప్పేందుకు పలువురు మంత్రులకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి సబ్జెక్టులను కేటాయించారు. సాధారణ పరిపాలన శాఖకు సంబంధించి అంశాలను వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి, శాంతి భద్రతలకు సంబంధించిన అంశాలను హోం శాఖ మంత్రి తానేటి వనితకు, న్యాయ శాఖకు చెందిన అంశాలను మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్‌కు, ఎన్‌ఆర్‌ఐ సాధికార సంబంధాలు, ప్రభుత్వ రంగ సంస్థల అంశాలను ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌కు కేటాయించారు.

తెలుగు పాటకు 'ఆస్కార్' అభిషేకం

ఆర్‌ఆర్‌ఆర్ చిత్ర బృందానికి పలువురి ప్రశంసలు

సాక్షి, అమరావతి/రామచంద్రపురం/నగరి(చిత్తూరు జిల్లా) : తెలుగు సినిమా ఆర్‌ఆర్‌ఆర్‌లోని నాటు నాటు పాటకు ఒరిజినల్ పాటల విభాగంలో ఆస్కార్ అవార్డు లభించడంపై పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తెలుగు పాటను ఈ సినిమా అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడంపై ప్రశంసలు కురిపిస్తున్నారు. చిత్ర యూనిట్‌కు అభినందనలు తెలుపుతున్నారు.

తెలుగు సినీ చరిత్రలో ఆర్‌ఆర్‌ఆర్ కలికితురాయి



దశాబ్దాల ఆస్కార్ అవార్డు కలను నిజం చేసిన తెలుగు సినిమా ఆర్‌ఆర్‌ఆర్ చలనచిత్ర పరిశ్రమ చరిత్రలో కలికి తురాయిగా నిలిచిపోతుంది. ఆస్కార్ అవార్డు సాధించిన ఆర్‌ఆర్‌ఆర్ చిత్ర బృందానికి అభినందనలు. దర్శకుడు రాజమౌళి, సినీ గేయ రచయిత చంద్రబోస్, జూనియర్ ఎన్టీఆర్, రామ్‌చరణ్, చిత్ర బృందం సమష్టి కృషి మూలంగా ఆస్కార్ అవార్డు దక్కింది.

– మంత్రి చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాలకృష్ణ

ఆస్కార్ వేదికపై తెలుగు కీర్తి రెపరెపలు



తెలుగు పాట ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడం గర్వకారణం. ఆర్‌ఆర్‌ఆర్ చిత్రంలోని నాటు నాటు అనే పాట ఆస్కార్ వేదికపై రెపరెపలాడింది. ఈ సినిమా దర్శకుడు రాజమౌళికి, సంగీత దర్శకుడు కీరవాణికి, నటీనటులు, ఆర్‌ఆర్‌ఆర్ చిత్ర బృందానికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

– మంత్రి ఆర్కే రోజా


తెలుగు సంస్కృతి విశ్వవ్యాప్తమైంది..



తెలుగు సినిమా స్థాయిని మరోసారి ప్రపంచానికి చాటి చెప్పింది ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలోని నాటు నాటు పాట. ఈ పాట ఆస్కార్ అందుకోవడం తెలుగువారందరికీ గర్వకారణం. విశ్వ వేదికపై భారతీయ సినిమాకి దక్కిన గొప్ప గౌరవం. తెలుగు సంస్కృతి విశ్వవ్యాప్తమైంది.

– సోము వీర్రాజు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు.

భారతీయ సినిమా మరో స్థాయికి..



ఆర్ ఆర్ ఆర్ చిత్రం నుంచి నాటు నాటు.. గీతంలోని తెలుగు పదం నేల నాలుగు చెరగులా హుషారెత్తించింది. ఆ హుషారు ఈ రోజు ఆస్కార్ వేదిక మీద రెట్టించిన ఉత్సాహంతో కనిపించింది. ఆస్కార్ అవార్డు పొందడం ద్వారా భారతీయ సినిమా మరో స్థాయికి చేరింది. 'ది ఎలిఫెంట్ విస్పరర్స్' డాక్యుమెంటరీ ఆస్కార్ పురస్కారం దక్కించుకోవడం సంతోషదాయకం.

– పవన్‌కళ్యాణ్, జనసేన పార్టీ అధినేత

ఆస్కార్ విజేతలకు సీపీఎం అభినందనలు



ఆర్‌ఆర్‌ఆర్ సినిమాకు ఉత్తమ ఒరిజినల్ సాంగ్, ది ఎలిఫెంట్ విస్పరర్స్‌కు ఉత్తమ డాక్యుమెంటరీ షార్ట్‌ఫిల్మ్ విభాగాల్లో ఆస్కార్ పురస్కారాలు లభించడంపై సీపీఎం రాష్ట్ర కమిటీ హర్షం వ్యక్తం చేస్తోంది. ఈ రెండు చిత్ర బృందాలకు పార్టీ తరపున శుభాకాంక్షలు. 2009 తర్వాత మన దేశానికి చెందిన రెండు చిత్రాలు అవార్డులు గెలుచుకోవడం, తెలుగు సినిమాకు మొదటిసారి ఆస్కార్ రావడం గర్వకారణం.

– శ్రీనివాసరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి

'ఎమ్మెల్సీ' పోలింగ్ ప్రశాంతం

16న ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభం

సాక్షి, అమరావతి/సాక్షి నెట్‌వర్క్ : రాష్ట్రంలో మూడు పట్టభద్రులు, రెండు టీచర్, నాలుగు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. తొమ్మిది స్థానాల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్ల నుంచి పెద్దఎత్తున స్పందన కనిపించింది. అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో స్వల్ప సంఘటనలు మినహా రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. స్థానిక మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు పోలింగ్‌లో పాల్గొని తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం 1,538 పోలింగ్ స్టేషన్లలో ఉ.8 గంటలకు మొదలైన పోలింగ్ సా.4 గంటలకు ముగిసింది. గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో 63.65 శాతానికి పైగా పోలింగ్ నమోదు కాగా, స్థానిక సంస్థల ఎన్నికల్లో 95 శాతానికిపైగా, టీచర్ల నియోజకవర్గాల్లో 87.15 శాతానికి పైగా పోలింగ్ నమోదైనట్లు ప్రాథమిక సమాచారం. పోలైన ఓటింగ్ శాతాన్ని ఎన్నికల సంఘం అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. సమయం ముగిసినప్పటికీ చాలామంది ఓటర్లు ఇంకా క్యూలైన్లలోనే ఉన్నారు. దీంతో సా.4 గంటలకు క్యూలైన్లో ఉన్నవారినీ కూడా ఓటింగ్‌కు అనుమతించారు. పోలింగ్ ప్రక్రియను పూర్తిగా వెబ్‌కాస్టింగ్ చేశారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా సచివాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి ఎప్పటికప్పుడు పోలింగ్ సరళిని సమీక్షిస్తూ అధికారులకు సూచనలు చేశారు. ఇక పోలింగ్ పూర్తయిన తర్వాత బ్యాలెట్ బాక్సులను అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. మార్చి 16న ఉ.8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు మొదలుపెట్టడానికి అధికారులు ఏర్పాట్లుచేస్తున్నారు.

ప్రశాంత పోలింగ్‌కు పటిష్ట చర్యలు

ఇక రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా పోలీసు శాఖ అన్ని చర్యలు తీసుకుంది. 20 జిల్లాల్లోని 1,535 పోలింగ్ కేంద్రాల్లో 125 కేంద్రాలు అత్యంత సున్నితమైనవి, 498 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, 912 సాధారణ పోలింగ్ కేంద్రాలుగా గుర్తించింది. తదనుగుణంగా పోలింగ్ సక్రమ నిర్వహణకు తగిన బందోబస్తు ఏర్పాటుచేసింది. మొబైల్ పార్టీలు, స్ట్రైకింగ్ ఫోర్స్, క్యూఆర్ టీమ్‌లను వినియోగించింది. ముందస్తు చర్యల్లో భాగంగా 7,093 లైసెన్స్‌డ్ ఆయుధాలను స్వాధీనం చేసుకుంది. అల్లర్లకు పాల్పడే అవకాశాలున్నాయని భావించిన 6,792 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేయడంతోపాటు 1,858 మందిపై నాన్‌బెయిలబుల్ వారెంట్లు జారీచేసింది. విస్తృతంగా తనిఖీలు నిర్వహించి రూ.75.94లక్షల నగదు, 2,909 లీటర్ల మద్యాన్ని జప్తుచేసింది.



ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేస్తున్న శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి

జిల్లాల వారీగా ఇలా..

- శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో తూర్పు రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ పోలింగ్ ప్రక్రియ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. టీచర్స్ ఎమ్మెల్సీకి సంబంధించి జిల్లాలో 8,165 మంది ఓటర్లకు గానూ 7,215 మంది.. పట్టభద్రుల ఎమ్మెల్సీకి సంబంధించి 1,07,632 మంది ఓటర్లకు గానూ 68,695 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పొదలకూరులో, కలెక్టర్ చక్రధర్‌బాబు దంపతులు, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నెల్లూరులో ఓటు హక్కు వినియోగించుకున్నారు.
- స్థానిక సంస్థల కోటాలో ఉమ్మడి పశ్చిమ గోదావరిలో రెండు స్థానాలకు 15 నియోజకవర్గాల్లోని స్థానిక ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 1,105 ఓట్లకు గాను పోలింగ్ ముగిసేసరికి 1,088 ఓట్లు నమోదయ్యాయి. నర్సాపురం ఎంపీ రఘురామకృష్ణరాజు, శాసనమండలి సభ్యులు షేక్ సాబ్జీ, మంతెన సత్యనారాయణరాజుతో పాటు కొందరు ఎంపీటీసీలు, కౌన్సిలర్లు ఓటు హక్కు వినియోగించుకోలేదు.
- తూర్పు రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రకాశం జిల్లాలోనూ ప్రశాంతంగా జరిగాయి. జిల్లాలో మూడు డివిజన్లలో కలిపి ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికకు 91.40 శాతం, పట్టభద్రుల నియోజకవర్గానికి 69.23 శాతం పోలింగ్ నమోదైంది.
- అన్నమయ్య జిల్లా పరిధిలో రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎన్నికలు జరిగాయి. అలాగే, పీలేరు, మదనపల్లి, తంబళ్లపల్లి నియోజకవర్గాల్లో తూర్పు రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు పోలింగ్ నిర్వహించారు. పశ్చిమ రాయలసీమ పరిధిలో పట్టభద్రుల స్థానానికి 68.31 శాతం, ఉపాధ్యాయుల స్థానానికి 93.36శాతం పోలింగ్ నమోదైంది. తూర్పు రాయలసీమ పరిధిలో పట్టభద్రులకు 66.93 శాతం, ఉపాధ్యాయులు 88.77 శాతం వంతున నమోదైంది.
- కర్నూలు జిల్లాలో పశ్చిమ రాయలసీమ పట్టభద్ర, ఉపాధ్యాయ, కర్నూలు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక సోమవారం ప్రశాంతంగా జరిగింది. పట్టభద్రులకు సంబంధించి సా.4గంటలకు 59.37 శాతం పోలింగ్ నమోదైంది. తుది పోలింగ్ శాతం విడుదల కావాల్సి ఉంది. ఇక టీచర్ ఎమ్మెల్సీకి సంబంధించి 90.26 శాతం మంది ఓటు వేశారు.
- వైఎస్సార్ జిల్లా టీచర్ల ఎమ్మెల్సీ ఎన్నికల్లో జిల్లా వ్యాప్తంగా 91.31శాతం పోలింగ్ నమోదైంది. అలాగే, పట్టభద్రుల స్థానానికి 72.01శాతం నమోదైంది. కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి పులివెందులలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎమ్మెల్యేలు కూడా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

తిరుపతిలోని రెండు కేంద్రాల్లో రీపోలింగ్

చిత్తూరు కలెక్టరేట్ : తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి తిరుపతిలోని రెండు పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్‌కు ఎన్నికల కమిషన్ ఆదేశించింది. చిన్నబజారు వీధిలోని 229, సత్యనారాయణపురంలోని 233 పోలింగ్ బూత్‌ల్లో రిగ్గింగ్ జరిగిందని కొందరు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎన్నికల కమిషన్‌కు కలెక్టరేట్ అధికారులు నివేదిక పంపారు. దీంతో రీపోలింగ్‌కు ఎన్నికల కమిషన్ ఉత్తర్వులిచ్చింది. ఈనెల 15న ఉ.8 గంటల నుండి సా.4 గంటల వరకు ఆ రెండు కేంద్రాల్లో రీపోలింగ్ నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీచేసినట్లు రిటర్నింగ్ అధికారి, చిత్తూరు జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్ సోమవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రశాంత పోలింగ్‌లో టీడీపీ చిచ్చు

- తిరుపతి, శ్రీకాళహస్తిలో రెచ్చిపోయిన టీడీపీ మూకలు



తిరుపతి కొర్లగుంట పోలింగ్ కేంద్రం వద్ద సీఐ చంద్రశేఖరన్‌ను దూషిస్తున్న టీడీపీ నేత ఉమాపతి

సాక్షి, తిరుపతి/ఒంగోలు/సాక్షి ప్రతినిధి నెల్లూరు: ప్రశాంతంగా జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌ని అడ్డుకునేందుకు టీడీపీ శ్రేణులు అడ్డదారులు తొక్కారు. ఓటర్లను అడ్డుకుంటూ పోలింగ్‌ను తీవ్ర ఆలస్యం చేసేందుకు యత్నించారు. దొంగ ఓట్లంటూ రచ్చరచ్చ చేశారు. కొందరు టీడీపీ కార్యకర్తలు మద్యం సేవించి వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులకు తెగబడ్డారు. మహిళలను దుర్భాషలాడుతూ నానా హంగామా చేయడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. నెల్లూరులో టీడీపీ నేతలు బీదా రవిచంద్ర, అబ్దుల్ అజీజ్.. ఒంగోలులో మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, తిరుపతిలో టీడీపీ మూకలు దౌర్జన్యాలకు తెగబడ్డారు. వివరాలివీ.. తిరుపతి సత్యనారాయణపురంలోని 233, 234 పోలింగ్ కేంద్రాల్లో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి తమ ఓటును వినియోగించుకునేందుకు వెళ్లారు. వీరినెలా అనుమతిస్తారంటూ టీడీపీ నేతలు పోలీసులు, ఎన్నికల నిర్వాహకులపై దౌర్జన్యానికి దిగారు. వారిద్దరు ఓటు వేయడానికి వెళ్లారని ఎంత చెబుతున్నా వినకుండా రచ్చచేయడంతో అరెస్టు చేయక తప్పలేదు.

మద్యం సేవించి రాళ్లు రువ్వి..

తిరుపతి బాలాజీ కాలనీ పరిధిలోని పోలింగ్ కేంద్రం వద్ద కూడా టీడీపీ శ్రేణులు రెచ్చిపోయారు. మద్యం సేవించి పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. రచ్చచేసేందుకు సిద్ధమయ్యారు. పోలింగ్ ముగియడానికి గంట ముందు టీడీపీకి చెందిన గోవిందాచారి అనే కార్యకర్త మహిళలను దొంగ ఓటర్లంటూ దుర్భాషలాడటం ప్రారంభించారు. రాళ్లు రువ్వారు. టీడీపీకి వామపక్ష పార్టీ శ్రేణులు మద్దతు పలికాయి. దీంతో ఇరువర్గాలు ఘర్షణకు దిగారు. పోలీసులు వైఎస్సార్‌సీపీ, టీడీపీ నేతలను అరెస్టుచేశారు. టీటీడీ పరిపాలన భవనం సమీపంలోని గోవిందరాజస్వామి ఉన్నత పాఠశాలలోనూ దాదాపు ఇదే పరిస్థితి సృష్టించారు.

శ్రీకాళహస్తిలో..

ఇక శ్రీకాళహస్తి నియోజకవర్గ పరిధిలోని ఏర్పేడులో పోలింగ్ ఏజెంట్‌గా వ్యవహరిస్తున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త దామోదర్‌రెడ్డిపై టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొజ్జల సుధీర్‌రెడ్డి, అతని అనుచరులు దాడిచేశారు. నియోజకవర్గంలో బీసీలంతా వైఎస్సార్‌సీపీ బలపరచిన అభ్యర్థులకే ఓట్లు వేస్తున్నారనే ఉద్దేశ్యంతోనే దామోదర్‌పై దాడిచేశారని ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం ఆగ్రహం వ్యక్తంచేశారు. శ్రీకాళహస్తి పట్టణంలో 39, 39ఏ, 39బీ పోలింగ్ బూత్‌లలోకి టీడీపీ నేతలు చొరబడ్డారు. దొంగ ఓట్లు వేయిస్తున్నారంటూ వైఎస్సార్‌సీపీ ఏజెంట్లపై దాడికి తెగబడ్డారు.

పోలీసులపై దామచర్ల దౌర్జన్యం

ఒంగోలులో పోలీసులు అదుపులోకి తీసుకున్న టీడీపీ కార్యకర్త కాకర్ల ఈశ్వర్ అనే వ్యక్తిని టీడీపీ మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పోలీస్‌స్టేషన్ నుంచి బలవంతంగా తీసుకువెళ్లారు. స్థానిక సెయింట్ థెరిస్సా ఉన్నత పాఠశాల పోలింగ్‌బూత్‌కు సమీపంలో సోమవారం ఈశ్వర్ రెచ్చగొట్టే చర్యలకు దిగుతున్నాడంటూ ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. చివరకు ఇరువర్గాలు భౌతికదాడులకు దిగుతుండడంతో పోలీసులు చెల్లాచెదురు చేశారు. ముందస్తు చర్యగా పోలీసులు ఈశ్వర్‌ను టూటౌన్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఇది తెలుసుకున్న జనార్దన్ తన అనుచరులతో అక్కడకు వెళ్లి పోలీసులు ఎంతగా వారిస్తున్నా లెక్కచేయకుండా దౌర్జన్యంగా ఈశ్వర్‌ను బయటకు తీసుకెళ్లారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు మండిపడడంతో దామచర్లతోపాటు మరికొందరిపై కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.



గొడవకు కారణం అయిన టీడీపీ కార్యకర్తను పోలీస్ స్టేషన్ నుంచి బయటకు తీసుకొస్తున్న దామచర్ల

నెల్లూరులో సీఐపై టీడీపీ నేతల రుబాబు

తూర్పు రాయలసీమ పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా సోమవారం నెల్లూరు నగర నియోజకవర్గ పరిధిలోని రామ్మూర్తినగర్ ప్రైమరీ స్కూల్‌లోని పోలింగ్ కేంద్రానికి టీడీపీ మాజీ ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర, ఆ పార్టీ నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ కలిసి వచ్చారు. పోలింగ్ కేంద్రంలో ఓటేసిన రవిచంద్ర అక్కడే నిలబడి ఉన్నారు. ఇంతలో బాలాజీనగర్ సీఐ రాములు నాయక్ అక్కడకు చేరుకుని ఓటేశారు కదా వెళ్లిపోవాలని బీదాకు సూచించారు. దీంతో ఆయన కొద్దిసేపు ఉండి వెళ్తామని చెప్పారు. పోలింగ్ కేంద్రం వద్ద ఉండకూడదని సీఐ మరోసారి చెప్పడంతో బీదా ఆయనతో వాగ్వాదానికి దిగారు. అక్కడే ఉన్న అబ్దుల్ అజీజ్ మరింతగా రెచ్చిపోయి.. 'సార్ ఏమనుకుంటున్నావ్.. టచ్‌చేసి చూడు'.. అంటూ సీఐను తోశారు. అంతేకాక.. పోలింగ్ కేంద్రంలోనే సీఐపై చిందులు తొక్కుతూ నానాయాగీ చేశారు. మరోవైపు.. పోలింగ్ కేంద్రం వద్ద మొబైల్ కౌంటర్ ఏర్పాటుచేయలేదంటూ వారిరువురూ సీఐపై మండిపడ్డారు. నిజానికి.. గత పదిరోజులుగా కలెక్టర్ ఈ విషయంలో విస్తృత ప్రచారం కల్పించారు. కానీ, టీడీపీ నేతలు మాత్రం అవేవీ పట్టించుకోకుండా పోలీస్ అధికారిపై దురుసుగా ప్రవర్తించారు.

తెలుగు పాటకు ఆస్కార్ డ్యాన్స్

అదరగొట్టిన ఎవ్రీవేర్ ఎవ్రీథింగ్..

మొత్తం 23 విభాగాల్లో ఆస్కార్ అవార్డులను ప్రకటించారు. 'ఎవ్రీవేర్ ఎవ్రీథింగ్ ఆల్ ఎట్ వన్స్' చిత్రం ఏడు ప్రధాన విభాగాల్లో (ఉత్తమ చిత్రం, దర్శకుడు, నటి, సహాయ నటుడు, సహాయ నటి, ఎడిటింగ్, ఒరిజినల్ స్క్రీన్‌ప్లే) అవార్డులను కొల్లగొట్టింది. ఉత్తమ చిత్రానికిగాను దీని నిర్మాతలు ఆంథోనీ రుస్సో, జో రుస్సో, మైక్ లరోకా, జోనాథన్, ఉత్తమ దర్శకుడి అవార్డును డానియల్ క్వాన్, డానియల్ స్కీనెర్ట్ అందుకున్నారు.

- ఇదే చిత్రంలోని నటనకుగాను మిషెల్ యో ఉత్తమ నటి అవార్డును స్వీకరించారు. పలు యాక్షన్ చిత్రాల్లో నటించిన ఆమెకు దక్కిన తొలి ఆస్కార్ అవార్డు ఇదే. అంతేకాదు ఉత్తమ నటిగా ఆస్కార్ గెలిచిన తొలి ఏషియన్ మహిళ మిచెల్ యోనే కావడం మరో విశేషం.
- ఇక 'దివేల్' చిత్రంలోని నటనకుగాను బ్రెండెన్ ఫ్రాసెర్‌ను ఆస్కార్ బెస్ట్ యాక్టర్ అవార్డు వరించింది. నటనలో మూడు దశాబ్దాల చరిత్ర ఉన్న బ్రెండెన్‌కు ఇదే తొలి ఆస్కార్ కావడం విశేషం.
- అలాగే తొమ్మిది నామినేషన్లు దక్కించుకున్న జర్మన్ ఫిల్మ్ 'ఆల్ క్వైట్ ఆన్ ది వెస్టర్న్ ఫ్రంట్'కు నాలుగు విభాగాల్లో (బెస్ట్ ఇంటర్నేషనల్ ఫీచర్ ఫిల్మ్, బెస్ట్ సినిమాటోగ్రఫీ, బెస్ట్ ఒరిజినల్ స్కోర్, బెస్ట్ ప్రొడక్షన్ డిజైన్) అవార్డులు దక్కాయి.
- తొమ్మిది నామినేషన్లు దక్కించుకున్న 'ది బన్షీస్ ఆఫ్ ఇనిషెరీన్', ఏడు నామినేషన్లు దక్కించుకున్న 'ది ఫేబుల్‌మ్యాన్స్', ఆరు నామినేషన్లు పొందిన 'టార్', మూడు నామినేషన్లు దక్కించుకున్న 'బ్యాట్‌మన్' చిత్రాలకు ఒక్క ఆస్కార్ అవార్డు కూడా దక్కలేదు.

ఆస్కార్‌లో ఏడు అవార్డులతో 'ఎవ్రీవేర్ ఎవ్రీథింగ్ ఆల్ ఎట్ వన్స్' హవా

ఉత్తమ నటుడు: బ్రెండెన్ ఫ్రాసెర్
ఉత్తమ నటి: మిషెల్ యో
ఉత్తమ దర్శకుడు: డానియల్ క్వాన్, డానియల్ స్కీనెర్ట్
ఉత్తమ ఒరిజినల్ సాంగ్: 'ఆర్‌ఆర్‌ఆర్'లోని 'నాటు నాటు'(మ్యూజిక్ డైరెక్టర్ కీరవాణి, లిరిక్ రైటర్ చంద్రబోస్)

నాలుగు అవార్డులు దక్కించుకున్న 'ఆల్ క్వైట్ ఆన్ ది వెస్టర్న్ ఫ్రంట్'

రాష్ట్రంలో రూ. 4,070 కోట్లతో అంతర్రాష్ట్ర ప్రసార వ్యవస్థ

పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆమోదం

- కర్నూలులో పెట్టుబడులు పెట్టనున్న కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ
- విండ్, సోలార్ ఎనర్జీ జోన్‌ల కోసం రూ.3,546 కోట్లతో భారీ ప్రాజెక్టు
- కొలిమిగుండ్ల వద్ద రూ.524.04 కోట్లతో మరొక ప్రాజెక్టు
- ఒకటి 2024 నవంబర్‌కి, రెండోది 2025 నవంబర్‌కల్లా ప్రారంభం



సాక్షి, అమరావతి: కేంద్ర ప్రభుత్వ సంస్థ పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్రంలో భారీ వ్యయంతో నెలకొల్పే గ్రీన్ ఎనర్జీ ట్రాన్స్‌మిషన్ లైన్లను ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం కర్నూలు జిల్లాలో రూ.4,070.04 కోట్ల విలువైన రెండు భారీ ప్రాజెక్టులను నెలకొల్పనుంది. ఈ ప్రాజెక్టులకు పవర్ గ్రిడ్ డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలిపింది. రూ.3,546 కోట్ల అంచనా వ్యయంతో కర్నూలులో విండ్ ఎనర్జీ జోన్, సోలార్ ఎనర్జీ జోన్ కోసం అంతర్రాష్ట్ర ట్రాన్స్‌మిషన్ లైన్ల ప్రాజెక్టు మొదటిది. ఇది 2025 నవంబర్‌కి ప్రారంభమవుతుంది. మరో ప్రాజెక్టు కొలిమిగుండ్ల వద్ద రూ.524.04 కోట్ల అంచనా వ్యయంతో వస్తుంది. ఇది 2024 నవంబర్‌కు ప్రారంభిస్తారు.

బీవోటీ విధానంలో..

కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ పవర్ గ్రిడ్ కార్పొరేషన్ దేశమంతటా ట్రాన్స్‌మిషన్ లైన్లు నిర్వహిస్తోంది. విద్యుదుత్పత్తి సంస్థలు ఉత్పత్తి చేసే కరెంటును అమ్ముకోవడానికి ఈ నెట్‌వర్క్‌ను వినియోగించుకుంటాయి. అయితే, కొత్తగా నిర్మించే లైన్లను ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో బిల్ట్, ఆపరేట్, ట్రాన్స్‌ఫర్ (బీవోటీ) విధానంలో నిర్మించాలని కేంద్రం ఆదేశించింది. తాజా ప్రాజెక్టులు కూడా ఈ విధానంలోనే నిర్మిస్తారు. దీనివల్ల కొంతకాలం తరువాత ఈ లైన్లు ప్రభుత్వ ఆధీనంలోకి వస్తాయి. తద్వారా ట్రాన్స్‌కో, డిస్కంలపై ఆర్థిక భారం తప్పుతుంది. గతంలో కంపెనీలు ఈ అంతర్రాష్ట్ర ట్రాన్స్‌మిషన్ వ్యవస్థను వినియోగించుకోవడం కోసం లాంగ్ టర్మ్ యాక్సెస్ విధానంలో పవర్ గ్రిడ్‌కు దరఖాస్తు పెట్టుకునేవి. అయితే, కేంద్ర ప్రభుత్వం లాంగ్‌టర్మ్ యాక్సెస్‌కు బదులు జనరల్ నెట్‌వర్క్ యాక్సెస్ (జీఎన్‌ఏ) విధానాన్ని తెచ్చింది. దీంతో అవసరాలకు తగ్గట్టు ట్రాన్స్‌మిషన్ లైన్లను ఇతరులకు ఇవ్వడం, ఇతరుల నుంచి వాడుకోవడం వంటివి స్వల్ప, మధ్యకాలిక ఒప్పందాల ద్వారా చేయొచ్చు.

డిస్కంలకు ప్రయోజనం

ఆంధ్రప్రదేశ్ పవర్ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ (ఏపీ ట్రాన్స్‌కో)కు ప్రస్తుతం 5,532.161 సీకేఎం (సర్క్యూట్ కిలోమీటర్లు) మేర 400 కేవీ ట్రాన్స్‌మిషన్ లైన్‌లు, 12,200.9 సీకేఎం మేర 220 కేవీ ట్రాన్స్‌మిషన్ లైన్‌లు, 13,568.18 సీకేఎం పొడవున 132 కేవీ ట్రాన్స్‌మిషన్ లైన్లు ఉన్నాయి. వీటి ద్వారా రాష్ట్రంలోని తూర్పు, మధ్య, దక్షిణ ప్రాంత విద్యుత్ సంస్థలకు ఏడాదికి సగటున 70 వేల మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను పంపిణీ చేస్తున్నారు. కొత్త ప్రాజెక్టులు పూర్తయితే రాష్ట్ర నెట్‌వర్క్‌తో పాటు పవర్‌గ్రిడ్ లైన్లను డిస్కంలు వినియోగించుకోవచ్చు. సోలార్ పవర్ పాలసీలో భాగంగా వచ్చే ఐదేళ్లలో 5 గిగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టులను నెలకొల్పాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. సోలార్ పార్కుల అభివృద్ధి, ఉత్పత్తిని ప్రోత్సహించడం, సౌరశక్తితో నడిచే వ్యవసాయ పంపు సెట్లను తీసుకురావడం, స్థానిక తయారీ సౌకర్యాలను ప్రోత్సహించడం వంటివి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ట్రాన్స్‌మిషన్ లైన్లు ఏర్పాటు చేయడం వల్ల పునరుత్పాదక శక్తిని ఉత్పత్తి చేసి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసేందుకు కూడా వీలు కలుగుతుంది.

మొదలైన పెట్టుబడుల కార్యాచరణ

▶ మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి ఇప్పటికే ఉత్తర్వులు జారీచేశారు. ఈ కమిటీకి మెంబర్ కన్వీనర్‌గా రాష్ట్ర పరిశ్రమలు, పెట్టుబడుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వ్యవహరిస్తారు. వీరితో పాటు వ్యవసాయ, పశు సంవర్థక, ఆర్థిక, ఇంధన, జలవనరులు, పర్యాటక, రెవెన్యూ, వాణిజ్య పన్నుల శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, జీఏడీ (కో–ఆర్డినేషన్), స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్, శాఖల ముఖ్య కార్యదర్శులు, ప్లానింగ్, ఐటీ–ఐటీఈఎస్, ట్రాన్స్‌పోర్ట్ శాఖల కార్యదర్శులు సభ్యులుగా ఉంటారు. వీరుకాకుండా అవసరమైతే ఇతర శాఖలకు చెందిన అధికారులను ప్రత్యేక ఆహ్వానితులుగా పిలుస్తారు. ప్రతీ శాఖలో కుదిరిన ఒప్పందాలను ఆయా ఇన్వెస్టర్లతో సమీక్షించి పనులు ఎప్పుడు ప్రారంభిస్తారు? ఎప్పటిలోగా ఉత్పత్తిలోకి తీసుకొస్తారన్న అంశాలపై ఒక అజెండాను రూపొందించి ఆ వివరాలను పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శితో పాటు సమీక్ష కోసం మానిటరింగ్ కమిటీకి ఇవ్వాల్సిందిగా ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు. ఇక మానిటరింగ్ కమిటీ తరచూ సమావేశమై పెట్టుబడులను త్వరితగతిన వాస్తవ రూపంలోకి తీసుకురావడానికి ఉన్న అడ్డంకులు, సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించాలన్నారు. విశాఖ జీఐఎస్–2023 సమావేశాల సందర్భంగా మొత్తం 386 ఒప్పందాలు జరిగినట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ ఒప్పందాల ద్వారా రూ.13,11,468 కోట్ల పెట్టుబడులతో పాటు 6,07,383 మందికి ఉపాధి లభించనుంది.

ప్రతీ 15రోజులకోసారి సమీక్షిస్తాం



జాతీయ, అంతర్జాతీయ కార్పొరేట్ దిగ్గజ ప్రముఖులను విశాఖకు తీసుకొచ్చి లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించిన రాష్ట్రం ఇప్పుడు వాటిని వాస్తవరూపం లోకి తీసుకురావడంపై దృష్టిసారించింది. ఎంఓయూలు కుదుర్చుకున్న కంపెనీలు ఎప్పటిలోగా ఉత్పత్తి ప్రారంభించాలని భావిస్తున్నాయో అన్న దానిపై సమాచారం సేకరించి దానికనుగుణంగా కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నాం. ఇందులో భాగంగా తొలి సమావేశం గత శుక్రవారం సీఎస్ అధ్యక్షతన జరిగింది. ఇలా ప్రతీ 15 రోజులకొకసారి సమావేశమై ఎంఓయూల పరిస్థితిని సమీక్షిస్తాం.


– జి. సృజన, రాష్ట్ర పరిశ్రమల శాఖ డైరెక్టర్

నేటి నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

▶ మొదటి పేజీ తరువాయి

రెండు సభలు వాయిదా పడనున్నాయి. ఆ తర్వాత స్పీకర్ తమ్మినేని సీతారాం నేతృత్వంలో బీఏసీ (బిజినెస్ అడ్వైజరీ కమిటీ) సమావేశం జరగనుంది. ఇందులో సభ ఎన్ని రోజులు నిర్వహించాలి, ఏ అంశాలపై చర్చించాలి, రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టే తేదీని నిర్ణయించనున్నారు. ఈ నెల 14 నుంచి 24 వరకు సమావేశాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమికంగా భావిస్తున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. కనీసం 7, 8 రోజులు సమావేశాలు నిర్వహించే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. కాగా మంగళవారం బీఏసీ తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది. శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో ప్రవేశపెట్టే ముసాయిదా బిల్లుల్ని ఈ సమావేశంలో ఆమోదించనున్నారు.

లాంగ్ కోవిడ్ వల్లే ఆకస్మిక మరణాలు



లబ్బీపేట (విజయవాడ తూర్పు): ఆరోగ్యంగా ఉన్నవాళ్లు కూడా ఆకస్మికంగా కుప్పకూలి మరణిస్తున్న ఘటనల్ని ఇటీవల చూస్తున్నాం. అలా కుప్పకూలి మరణించిన వారి వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్నాయి. ఈ మరణాలకు కోవిడ్ వ్యాక్సినే కారణమని.. కొన్నిరకాల మందులు వాడటం వల్లే మరణాలు సంభవిస్తున్నాయనే ప్రచారం సోషల్ మీడియాలో జోరుగా సాగుతోంది. ఆ ప్రచారం నిజం కాదని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. ఆకస్మిక మరణాలకు కారణాలను కార్డియాలజీ నిపుణులు వివరిస్తున్నారు.

కోవిడ్ తర్వాత పెరిగిన గుండె సమస్యలు

కోవిడ్ తర్వాత ప్రజల్లో గుండె జబ్బులు బాగా పెరిగినట్టు వైద్యులు స్పష్టం చేస్తున్నారు. ముఖ్యంగా లాంగ్ కోవిడ్ ప్రాబ్లమ్స్ (పోస్ట్ కోవిడ్ కండిషన్) ఎదుర్కొన్న వారిలో గుండె జబ్బులు రెండు రెట్లు అధికమని వైద్యులు చెబుతున్నారు. అలాంటి వారిలోనే కార్డియాక్ అరెస్టులు జరుగుతున్నట్టు వెల్లడిస్తున్నారు. ఆకస్మిక మరణాలతోపాటు, కొందరు పీఓటీఎస్ (పొచ్యురల్ టాచీకార్డియా సిండ్రోమ్) ఇబ్బందులకు గురవుతున్నారు. అంటే ఉన్న పొజిషన్ నుంచి మారినా, కూర్చుని, పడుకుని లేచినా గుండె దడగా ఉండటం జరుగుతుందని (కూర్చుని లేచిన తర్వాత లేదా పడుకున్న తర్వాత గుండె కొట్టుకునే రేటు చాలా త్వరగా పెరగటం) చెబుతున్నారు.

ఇవీ కారణాలు

- రక్తనాళాల్లో పూడికల వల్ల గుండెపోట్లు వస్తున్నాయి.
- గుండె కండరాలు ఉబ్బడం (మయో కార్డిటైస్) వల్ల కూడా మరణాలు సంభవిస్తున్నాయి.
- గుండె అకస్మాత్తుగా ఆగిపోవడం (కార్డియాక్ అరెస్ట్–అరిటమియా) కూడా కారణం.
- పల్మనరీ ఎంబోలిజం (గుండె నుంచి ఊపిరితిత్తులకు వచ్చే రక్తనాళాల్లో పూడికలు) కూడా దీనికి కారణమవుతోంది.

ముందుగా గుర్తించడం కష్టమే

కోవిడ్ తర్వాత కొందరిలో హార్మోన్ల సమతుల్యత లోపించిన కారణంగా రక్తంలో గడ్డలు ఏర్పడుతున్నాయి. ఇలాంటి వారిలో డీ–డైమర్ వంటి పరీక్ష చేసినప్పుడు రక్తం చాలా సాధారణంగా ఉన్నా.. మరుసటి రోజుకే గడ్డలు ఏర్పడి పల్మనరీ ఎంబోలిజమ్‌తో అకస్మాత్తుగా మరణించే అవకాశాలు కూడా ఉన్నట్టు వైద్య నిపుణులు చెబుతున్నారు. కార్డియాక్ అరెస్ట్, పల్మనరీ ఎంబోలిజంను ముందుగా గుర్తించడం కష్టమేనని పేర్కొంటున్నారు. రక్తంలో నీటి శాతం తగ్గినా రక్తం చిక్కబడి గడ్డలు ఏర్పడే అవకాశం కూడా ఉంది.

అపోహలెన్నో..

ఆకస్మిక మరణాలకు కోవిడ్ వ్యాక్సిన్ కారణమని.. ఫలానా వ్యాక్సిన్ వేసుకున్న వారికి గుండెపోటు వస్తోందంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని వైద్యులు కొట్టిపారేస్తున్నారు. కోవిడ్‌ను ఎదుర్కొనేందుకు వ్యాక్సిన్ అత్యుత్తమ మార్గమని గుర్తించి అందరికీ వేయడం జరిగిందంటున్నారు. పాశ్చాత్య దేశాల్లో వేసిన ఎంఆర్ఎన్ఏ (ఫైజర్, మోడెర్నా) వంటి వ్యాక్సిన్లలో దుష్ఫలితాలను గుర్తించారని, అవి మన దేశంలో వేయలేదని స్పష్టం చేస్తున్నారు.

ముందు జాగ్రత్తలే మేలు

- గుండెను ఆరోగ్యంగా ఉంచుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందు జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో మేలని వైద్యులు చెపుతున్నారు.

లాంగ్ కోవిడ్ ప్రాబ్లమ్స్‌తోనే..

కోవిడ్ తర్వాత హార్ట్ ప్రాబ్లమ్స్ పెరిగాయి. లాంగ్ కోవిడ్ ప్రాబ్లమ్స్ (పోస్టు కోవిడ్ కమిషన్) ఉన్న వారిలో గుండె జబ్బులు వచ్చే అవకాశం రెండు రెట్లు అధికం. ఆకస్మిక మరణాలకు పల్మనరీ ఎంబోలిజం, కార్డియాక్ అరెస్టులు కారణంగా ఉంటున్నాయి. కోవిడ్ తర్వాత హార్మోన్లలో సమతుల్యత లోపించిన కారణంగా రక్తంలో గడ్డలు ఏర్పడుతున్నాయి. రక్తంలో నీటిశాతం తగ్గినా రక్తం చిక్కబడి గడ్డలు ఏర్పడతాయి. అలాంటి వారు ఆకస్మికంగా మరణించే అవకాశం ఉంది. జీవనశైలి మార్చుకోవడం, ఆహార నియమాలు పాటించడం, రెగ్యులర్ వ్యాయామం చేయడం ద్వారా గుండె జబ్బులను అధిగమించవచ్చు.

– బి.విజయ్ చైతన్య, కార్డియాలజిస్ట్, విజయవాడ

- శ్రమతో కూడిన జీవన విధానాన్ని అలవర్చుకోవడం
- జీవన శైలిని మార్చుకోవడం
- స్వచ్ఛమైన ఆహారం తీసుకోవడం
- రెగ్యులర్‌గా వ్యాయామం చేయడం
- నీరు ఎక్కువగా తీసుకోవడం ద్వారా గుండెను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చని చెబుతున్నారు.

క్లుప్తంగా...

టెన్త్ పరీక్షల హాల్‌టికెట్లు రెడీ

నేటినుంచి డౌన్‌లోడ్‌కు అవకాశం



సాక్షి, అమరావతి: టెన్త్ పబ్లిక్ పరీక్షల హాల్‌టికెట్లను ఎస్సెస్సీ బోర్డు సిద్ధం చేసింది. వీటిని మంగళవారం నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ డి.దేవానందరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన మేరకు.. ఏప్రిల్ 3వ తేదీన ప్రారంభంకానున్న ఈ పరీక్షలకు హాల్‌టికెట్లను ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల నామినల్ రోల్స్ ఆధారంగా పాఠశాల లాగిన్ ద్వారా బోర్డు వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. వాటిని ధ్రువీకరించి తమ పాఠశాల విద్యార్థులకు జారీచేస్తారు. హాల్‌టికెట్‌పై విద్యార్థి ఫొటో లేకపోయినా, తప్పుగా ముద్రితమైనా ప్రధానోపాధ్యాయుడు విద్యార్థి సరైన ఫొటోను అతికించి దాన్ని సక్రమంగా ధ్రువీకరించి సంబంధిత విద్యార్థికి అందించాలి. అటెస్ట్ చేసిన హాల్‌టికెట్ల కాపీని పరీక్షకేంద్రం చీఫ్ సూపరింటెండెంట్‌లకు ఫార్వర్డ్ చేయాలి. అటువంటి విద్యార్థులను పరీక్షకేంద్రాల్లోకి అనుమతించాలని అభ్యర్థన పంపాలి. ఫొటోమార్పు దరఖాస్తును (వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంది) ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ కార్యాలయానికి పరీక్షలు పూర్తయ్యేలోపు పంపాలి. స్ట్రీమ్, జిల్లా, పాఠశాల పేరు, విద్యార్థి పేరు, పుట్టిన తేదీలను నమోదు చేయడం ద్వారా ఇతరులు కూడా బోర్డు వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

ఇంటర్ హాల్‌టికెట్లు సిద్ధం

ఇంటర్ బోర్డు కార్యదర్శి శేషగిరిబాబు వెల్లడి

సాక్షి, అమరావతి: ఇంటర్మీడియెట్ (జనరల్, ఒకేషనల్) విద్యార్థులందరికీ 2023 పబ్లిక్ పరీక్షల (థియరీ)కు సంబంధించిన హాల్‌టికెట్లను పబ్లిక్ డొమైన్‌లో అందుబాటులో ఉంచినట్టు ఇంటర్ విద్యామండలి కార్యదర్శి ఎంవీ శేషగిరిబాబు సోమవారం రాత్రి ఒక ప్రకటనలో వెల్లడించారు. వీటిని విద్యార్థులు స్వయంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. ఫస్టియర్ విద్యార్థులు వారి ఫస్టియర్ హాల్‌టికెట్ నంబర్ లేదా ఎస్ఎస్‌సీ హాల్‌టికెట్ నంబర్ ఉపయోగించి ప్రస్తుత థియరీ పరీక్షల హాల్‌టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. సెకండియర్ విద్యార్థులు వారి ఫస్టియర్ లేదా సెకండియర్ హాల్‌టికెట్ నంబర్ ఉపయోగించి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. హాల్‌టికెట్స్‌లో ఫొటోలు, సంతకాలు, ఇతర సవరణలు అవసరమైన విద్యార్థులు వారి కాలేజీ ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకువెళ్లి సరిచేయించుకోవాల్సి ఉంటుంది. డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్లపై ప్రిన్సిపాల్ సంతకం ఉండాల్సిన అవసరం లేదని శేషగిరిబాబు పేర్కొన్నారు.

ప్రతిష్టాత్మకంగా 'ఫ్యామిలీ డాక్టర్' విధానం

- ఎక్కడా లోటుపాట్లు లేకుండా చూడండి
- అధికారులకు వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి రజిని ఆదేశం



సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రవేశపెట్టిందని, త్వరలో సీఎం జగన్ ఈ కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో ప్రారంభించనున్న నేపథ్యంలో ఎక్కడా లోటుపాట్లు లేకుండా చూడాలని అధికారులను వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని ఆదేశించారు. వైద్యశాఖలోని అన్ని విభాగాల అధిపతులతో సోమవారం మంగళగిరిలోని ప్రధాన కార్యాలయంలో మంత్రి రజిని 2023–24 బడ్జెట్ అంచనాలు, వైఎస్సార్ కంటివెలుగు, ఆరోగ్యశ్రీ, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్, 104 వాహనాలు, ఫ్యామిలీ డాక్టర్, విలేజ్ క్లినిక్స్‌పై సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ జిల్లా నోడల్ అధికారులు తమ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్‌ను పరిశీలించి లోటుపాట్లు ఉంటే సరిచేయాలని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని పీహెచ్‌సీలు, వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్‌లో ఎక్కడా వైద్య సిబ్బంది కొరత ఉండటానికి వీల్లేదని స్పష్టంచేశారు. మందులషాపుల్లో మత్తు మందులు, ఇతర అనధికారిక విక్రయాలను అరికట్టాలని ఔషధ నియంత్రణ విభాగాన్ని ఆదేశించారు. 'వైఎస్సార్ కంటివెలుగు' మూడో దశలో భాగంగా 35,42,151మంది వృద్ధులకు ఆరు నెలల్లో స్క్రీనింగ్ పూర్తి చేయాలని చెప్పారు. అవసరమైన వారికి శస్త్రచికిత్సలు చేయాలని, మందులు, కళ్లద్దాలు పంపిణీ చేయాలని ఆదేశించారు. చికిత్స కోసం వచ్చే రోగులకు ఇంటి నుంచి ఆస్పత్రికి, చికిత్స అనంతరం ఆస్పత్రి నుంచి ఇంటికి చేర్చడానికి రవాణా సౌకర్యం కల్పించే అవకాశాన్ని పరిశీలించాలని సూచించారు. 146 కొత్త 104 మొబైల్ మెడికల్ యూనిట్స్ అందుబాటులోకి వస్తున్న దృష్ట్యా పాతవాటిలో ఎన్ని 'మహాప్రస్థానం' సేవలకు పనికొస్తాయో చూడాలన్నారు. వైద్యశాఖ ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ నివాస్, ఏపీఎంఎస్ఐడీసీ ఎండీ మురళీధర్‌రెడ్డి, డీఎంఈ వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

సమగ్ర ఆరోగ్య సంరక్షణ సేవలపై దృష్టి

వైద్యశాఖ ముఖ్యకార్యదర్శి కృష్ణబాబు



సాక్షి, అమరావతి: ప్రజలకు సమగ్ర ఆరోగ్య సంరక్షణ సేవలను అందించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్యకార్యదర్శి ఎంటీ కృష్ణబాబు తెలిపారు. ఈ క్రమంలో ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లలో వైద్య సేవలను మరింత విస్తరిస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి జిల్లాకు నలుగురు చొప్పున ఎంపిక చేసిన మాస్టర్ ట్రైనర్లకు కన్ను, చెవి, ముక్కు, గొంతు, మానసిక, అత్యవసర, వృద్ధుల ఆరోగ్య సేవలపై గుంటూరు జిల్లాలోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఆరు రోజుల పాటు శిక్షణ ఇస్తున్నారు. ఈ కార్యక్రమంలో సోమవారం కృష్ణబాబు, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ నివాస్ పాల్గొన్నారు. కృష్ణబాబు మాట్లాడుతూ విలేజ్ క్లినిక్‌లలోని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్(సీహెచ్‌వో), ఏఎన్ఎంలకు కన్ను, చెవి, ముక్కు, గొంతు, మానసిక, వృద్ధుల సంరక్షణ, ఉపశమన చికిత్సలు, ఇతర అంశాల్లో సేవలపై నైపుణ్యాలు పెంపొందించేలా శిక్షణ ఇస్తున్నట్టు వెల్లడించారు. మాస్టర్ ట్రైనర్లు జిల్లాలకు వెళ్లి సీహెచ్‌వోలకు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. వడదెబ్బలు, బ్రెయిన్, హార్ట్ స్ట్రోక్ ఘటనల్లో బాధితులకు సత్వరమే అందించాల్సిన ప్రాథమిక వైద్య సేవలపై సీహెచ్‌వోలకు శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. ప్రజలకు సమగ్ర ఆరోగ్య సేవలు అందించేందుకు రాష్ట్ర బడ్జెట్‌లో 7.3శాతం ప్రభుత్వం ఖర్చు పెడుతోందని కమిషనర్ నివాస్ చెప్పారు.

దోపిడీ చేసిన చంద్రబాబును జైల్లో పెట్టాలి

897వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన పరిరక్షణ సమితి నేతలు

తాడికొండ: అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రాన్ని నిలువు దోపిడీ చేసిన చంద్రబాబు, ఆయన బినామీలు, కులవాదులను వెంటనే అరెస్టు చేసి జైల్లో పెట్టాలని బహుజన పరిరక్షణ సమితి నాయకులు డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు సోమవారం 897వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కుటిల రాజకీయాలతో రాష్ట్రాన్ని గుప్పెట్లో పెట్టుకునేందుకే రాష్ట్రంలో ఎల్లో మీడియాలో లేనిది ఉన్నట్లు ప్రచారం చేస్తున్నారని, వారిని ప్రజలు నమ్మే రోజులు ఎప్పుడో పోయాయన్నారు. నిత్యం నీతులు వల్లించే 'ఈనాడు' రాజగురువు రామోజీ మార్గదర్శి చిట్‌ఫండ్ కంపెనీ పేరుతో చేసిన అక్రమాల గుట్టురట్టయితే దానికి మేనేజర్లను బాధ్యులను చేయడం సిగ్గుచేటన్నారు. బహుజన పరిరక్షణ సమితి నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, బేతపూడి సాంబయ్య, పెరికే వరప్రసాద్, ఈపూరి ఆదాం, పులి దాసు, గంటా సుందరరావు పాల్గొన్నారు.

తెలంగాణ

కన్న బిడ్డలే కడతేర్చారు!

ఆస్తి కోసం తండ్రిని హతమార్చిన కూతుళ్లు, మనవడు

రాజంపేట: ఆస్తికోసం కన్న తండ్రినే కడతేర్చిన ఘటన కామారెడ్డి జిల్లా రాజంపేట మండల కేంద్రంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. రాజంపేటకు చెందిన కొప్పుల ఆంజనేయులు (80)కు ఇద్దరు భార్యలు ఉండగా, మొదటి భార్య లక్ష్మికి ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. కొడుకు 25 సంవత్సరాల క్రితమే మరణించాడు. మొదటి భార్య తనని సక్రమంగా చూడకపోవడంతో ఆంజనేయులు 20 సంవత్సరాల క్రితం బాలమణిని రెండో పెళ్లి చేసుకున్నాడు. ఆంజనేయులుకు నాలుగు ఎకరాల వరకు వ్యవసాయ భూమి ఉండగా గ్రామంలో నివసిస్తున్న రెండో కూతురు లీలావతి పేరిట ఇదివరకే రెండెకరాలు పట్టా చేయించాడు. కూతురు లీలావతి, మొదటి భార్య లక్ష్మి తరచూ ఆంజనేయులుతో ఆస్తికోసం గొడవపడేవారు. మిగిలిన రెండెకరాల భూమి తనకే చెందాలని లీలావతి, ఆమె కొడుకు భానుప్రసాద్ కలసి ఆంజనేయులును వేధింపులకు గురిచేసేవారు. ఆదివారం ఉదయం లీలావతి, తన పెద్ద సోదరి లక్ష్మీ నర్సవ్వ, కొడుకు భానుప్రసాద్‌తో కలసి పథకం ప్రకారం ఆంజనేయులును ఇంట్లోనే చంపేశారు. తర్వాత ఆంజనేయులు ఉంటున్న ఇంటిని తగులబెట్టి ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు ప్రయత్నించారు.

ధరపైనే గంపెడు ఆశలు

జంగారెడ్డిగూడెం: వర్జీనియా పొగాకు ధరపై ఈ ఏడాది రైతులు గంపెడు ఆశలు పెట్టుకున్నారు. గత ఏడాది కన్నా ఈ ఏడాది పంట ఉత్పత్తికి పెట్టుబడులు పెరగడంతో ఆ నష్టాన్ని భర్తీ చేసుకోవాలనే ఆశతో ఉన్నారు. వర్జీనియా పంటకు కుకుంబర్ వైరస్, నల్లకాడు తెగులు వల్ల 25 శాతం మొక్కలు చనిపోవడం, మళ్లీ కొత్తమొక్కలు నాటడంతో సాగు ఖర్చులు విపరీతంగా పెరిగాయి. గత ఏడాదితో పోల్చితే ఒక్కొక్క బార్న్‌కు రూ.2 లక్షలు అదనంగా ఖర్చయ్యింది. ఎరువుల ధరలు పెరగడం, జిడ్డు మందులు, కూలీ రేట్లు పెరగడంతో రైతులు అదనంగా పెట్టుబడులు పెట్టాల్సి వచ్చింది. ఈ నెల 23 నుంచి పొగాకు వేలం ప్రారంభం కానుంది.

గతేడాది అత్యధికంగా రూ. 245 ధర

గతేడాది ఎన్ఎల్ఎస్ ఏరియా పరిధిలో ఐదు వేలం కేంద్రాల్లో సరాసరి కేజీ ధర రూ.190.74 లభించింది. 42.50 మిలియన్ కిలోల పొగాకును రైతులు అమ్ముకున్నారు. అత్యధికంగా కేజీకి రూ.245 లభించింది. ఇదిలా ఉంటే ఈ ఏడాది ఎన్ఎల్ఎస్ ఏరియా పరిధిలో 11,705 మంది రైతులు, 13575.24 బ్యారన్‌లను రిజిస్టర్ చేసుకోగా, 21720.38 హెక్టార్లలో పంట పండించేందుకు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. 21005.12 హెక్టార్లలో మాత్రమే పంటలు పండించారు. పొగాకు బోర్డు ఎన్ఎల్ఎస్ పరిధిలో 47.48 మిలియన్ కిలోల పంటకు అనుమతించింది. దేవరపల్లి వేలం కేంద్రం పరిధిలోని బ్లాక్ సాయిల్‌లో పండించే రైతులు 1062 మంది, 1115.50 బ్యారన్లను 1450.18 హెక్టార్లలో పండించేందుకు 2.7 మిలియన్ కిలోల పంటకు అనుమతించారు. లైట్ సాయిల్స్ పరిధిలో 1680 మంది రైతులకు 1943.17 బ్యారన్ల పరిధిలో 3109.07 హెక్టార్లలో 6.8 మిలియన్ కిలోలు, ఈస్టన్ లైట్ సాయిల్ పరిధిలో 47 మంది రైతులు 55 బ్యారన్లకు 88 హెక్టార్లలో 1.92 మిలియన్ కిలోలు పంట పండించేందుకు బోర్డు అనుమతించింది.

రైతులతో ఈడీ సమావేశం

వర్జీనియా పొగాకు రైతు సంఘం నాయకులతో పొగాకు బోర్డు ఈడీ అద్దంకి శ్రీధర్‌బాబు ఇప్పటికే సమావేశం నిర్వహించారు. సమావేశంలో రైతు సంఘాల ప్రతినిధులు ఈ–వేలం ప్రక్రియలో మార్పులు చేయాలని, వ్యాపారులు సిండికేట్ అవ్వకుండా కట్టడి చేయాలని, పొగాకు బేళ్లను కంపెనీలు ఎవరికి వారు పంచుకోకుండా చూడాలని, అన్ని కంపెనీలు వేలం ప్రారంభం నుంచే వేలం పాట పాడుకోవాలని రైతు సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. దీనిపై అన్ని చర్యలు తీసుకుంటామని బోర్డు అధికారులు రైతులకు హామీ ఇచ్చారు.

ఈ నెల 23 నుంచి వేలం ప్రారంభం

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఉన్న ఐదు వేలం కేంద్రాల్లో ఈనెల 23 నుంచి వేలం ప్రారంభం కానుంది. ఎన్ఎల్ఎస్ పరిధిలో గల జంగారెడ్డిగూడెం–1, జంగారెడ్డిగూడెం–2, కొయ్యలగూడెం, గోపాలపురం, దేవరపల్లి, చాగల్లులో వేలం ప్రారంభం కానున్నట్లు అధికారులు ప్రకటించారు. దీంతో వేలానికి రైతులు సమావేశం అవుతుండగా, ధరపైనే గంపెడు ఆశతో ఉన్నారు.

కేజీకి రూ. 220 సరాసరి ధర ఇప్పించాలి

అత్యధికంగా కేజీకి రూ. 250 నుంచి రూ. 260 ఇస్తేనే గాని రైతులకు గిట్టుబాటు కాదు. దీనికి కారణం బ్యారన్ పంట పండించేందుకు అయిన ఖర్చు ఈ ఏడాది గతం కన్నా రూ. 2.50 లక్షలుగా ఉంది. పంట దిగుబడి నాణ్యంగా ఉంది. దీనిని బట్టి పొగాకు బోర్డు అధికారులు, బయ్యర్లు రైతును ఆదుకుంటేనే గాని నష్టాల నుంచి రైతు గట్టెక్కలేడు. – పరిమి రాంబాబు, వర్జీనియా పొగాకు రైతు సంఘం అధ్యక్షుడు, జంగారెడ్డిగూడెం 1 వేలం కేంద్రం

ఖర్చులు విపరీతంగా పెరిగాయి

ఈ ఏడాది సాగులో తీవ్ర ఒడిదుడుకులు ఎదుర్కొన్నాం. కుకుంబర్ వైరస్ ద్వారా, నల్లకాడ తెగులు వల్ల రైతుకు నష్టం సంభవించింది. దీంతో చాలా వరకు పంట చనిపోయింది. అయినా కష్టనష్టాలను భరించి రైతులు వర్జీనియా సాగు చేశారు. పంట ఖర్చులు విపరీతంగా పెరిగాయి. రైతులకు ప్రారంభ ధర కేజీకి రూ.225తో ప్రారంభించాలి. క్రమేపీ కేజీ ధర అత్యధికంగా రూ. 260 ఇవ్వాలి.

– సత్రం వెంకట్రావు, వర్జీనియా పొగాకు రైతు సంఘం అధ్యక్షుడు, జంగారెడ్డిగూడెం 2 వేలం కేంద్రం

రాజకీయాల్లో ఆస్కార్ అవార్డు ఏటా పవన్‌కే

- సినిమా ప్రీ రిలీజ్ వేడుకల్లా జనసేన ఆవిర్భావ దినాలు
- చంద్రబాబు స్క్రిప్ట్ ప్రకారం సీఎం జగన్‌పై విషం చిమ్మడమే నీ పనా?
- ఏం ఉద్ధరించావని కాపులు నిన్ను నమ్మాలి?
- దేశంలో ఎక్కడా లేని రీతిలో సామాజిక న్యాయం చేస్తున్న సీఎం వైఎస్ జగన్
- కాపుల కోసం నిలబడింది జగనే..
- 2024లోనే కాదు 2029లోనూ వైఎస్ జగన్ వెంటే కాపులు
- పవన్ కళ్యాణ్‌పై మాజీ మంత్రి పేర్ని నాని ధ్వజం



సాక్షి, అమరావతి: రాజకీయాల్లో ఆస్కార్ అవార్డు ఉంటే ఏటా జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌కే దక్కుతుందని మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) ఎద్దేవా చేశారు. జనసేన ఆవిర్భావ దినాన్ని సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లా గతంలో మంగళగిరిలో, గతేడాది ఇప్పటంలో, ఈ ఏడాది మచిలీపట్నంలో నిర్వహిస్తున్నారంటూ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. నాని సోమవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఇప్పటం సభ తర్వాత ప్రజలను ఏం ఉద్ధరించావో చెప్పాలని పవన్‌ను డిమాండ్ చేశారు. వారాంతంలో వచ్చి చంద్రబాబు స్క్రిప్ట్‌తో సీఎం వైఎస్ జగన్‌పైన, ప్రభుత్వంపైన విషం చిమ్మడమే ఆయన పని అని మండిపడ్డారు. నిలకడ, నిబద్ధత, నిజాయితీ లేని పవన్‌ను కాపులే కాదు.. ఏ వర్గం ప్రజలూ నమ్మరని తేల్చిచెప్పారు. అసలాయన రాజకీయాల్లోకి ఎందుకు వచ్చాడో? ఆశయం ఏమిటో చెప్పడని విమర్శించారు. కాపులు ఓట్లేసి ఉంటే 2019లో గాజువాక, భీమవరంలో ఓడిపోయేవాడిని కాదని పవన్ అనడం హేయమన్నారు. ఒక కులం ఓట్లేస్తే కులనాయకుడేనని, ప్రజా నాయకుడు కాదన్నారు. దేశంలో ఎక్కడా లేని రీతిలో రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు, కాపులు, అగ్రవర్ణ పేదలకు సామాజికన్యాయం చేస్తున్న వైఎస్ జగన్‌ని ప్రజలు ఎందుకు వద్దంటారనేది పవన్ ఆలోచించడంలేదని అన్నారు. తెలంగాణలో బీసీ జాబితా నుంచి తొలగించిన 26 కులాలను బీసీల్లోనే ఉంచాలని ఆ రాష్ట్ర సీఎం కేసీఆర్‌కు లేఖ రాసింది సీఎం జగన్ అని చెప్పారు. పవన్, ఆయన దత్తతండ్రి చంద్రబాబు ఎందుకు నోరువిప్పలేదని నిలదీశారు. వైఎస్సార్‌సీపీలో కాపులు ఊడిగం చేస్తున్నారంటున్నారని, ఆయన తల్లిని తిట్టించారని 2014లో గొంతెత్తి అరిచిన పవన్.. అదే చంద్రబాబుతో తిరుగుతున్నాడంటే ఊడిగం చేసేది ఆయనేనని అన్నారు. 2012 నుంచి 2023 వరకు నీ చరిత్ర ఏమిటో చర్చిద్దామని సవాల్ విసిరారు. 'జగన్ గెలుస్తారని 2012లో పార్టీ పెట్టకుండా చంద్రబాబు వారించారని చెప్పావా.. లేదా? 2014లో లోపాయికారీ ఒప్పందంతో టీడీపీకి మద్దతివ్వలేదా? 2019లో ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీల్చడానికి మీతో పోటీ చేయించింది చంద్రబాబే కదా' అని విమర్శించారు. కాపులకు బీసీ రిజర్వేషన్లిస్తానని మాట తప్పి, ఉద్యమించిన వారిపై అక్రమ కేసులు పెట్టిన బాబును నిలదీయకపోగా, మద్దతిచ్చింది పవనే అని చెప్పారు. కాపులకు రిజర్వేషన్లపై లేని హామీలు ఇచ్చి బాబులా మోసం చేయలేనని సీఎం వైఎస్ జగన్ 2019లో చెప్పారన్నారు. కాపుల అభివృద్ధికి ఏటా రూ.2 వేల కోట్ల చొప్పున ఐదేళ్లలో రూ.10 వేల కోట్లు ఖర్చు చేస్తానని హామీ ఇచ్చిన జగన్.. ఈ మూడున్నరేళ్లలోనే రూ.30వేల కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. తమ కోసం నిలబడిన సీఎం జగన్‌ను 2024, 2029లో కూడా కాపులు గెలిపిస్తారని స్పష్టం చేశారు. పులివెందుల, కడపలో కాపులు, బలిజలు అంతా వైఎస్ కుటుంబంతోనే ఉన్నారని చెప్పారు.

చంద్రబాబు ఆస్కార్ కోసమే పవన్ రాజకీయ డాన్స్

- నేటి సాయంత్రానికి పవన్‌కు ప్యాకేజీ సిద్ధం
- మంత్రి దాడిశెట్టి రాజా



సాక్షి, అమరావతి: మూడు నెలల తరువాత బయటకు వచ్చిన పవన్‌కళ్యాణ్ తన యజమాని చంద్రబాబు చెప్పినట్టుగా నటించి మంగళవారం సాయంత్రానికి ప్యాకేజీ తీసుకోడానికి సిద్ధపడుతున్నారని రాష్ట్ర ఆర్ అండ్ బీ శాఖ మంత్రి దాడిశెట్టి రామలింగేశ్వరరావు (రాజా) చెప్పారు. చంద్రబాబు ఇచ్చే అవార్డే పవన్‌కు ఆస్కార్‌వంటిదని, దానికోసంనాటునాటు పాటకంటే బాగా రాజకీయ డాన్స్ చేస్తున్నారని దుయ్యబట్టారు. మంత్రి రాజా సోమవారం విజయవాడలో విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు రాసిన జనసేన రాజ్యాంగంలోని మాటలనే ఆ పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో పవన్ వల్లిస్తారని ఎద్దేవా చేశారు. బీసీలు, కాపులు కలిపి చంద్రబాబుకు రాజ్యాధికారం కల్పించాలన్నట్టుగా, బాబు పల్లకీ మోయాలని, లేదంటే బానిసలే అన్నట్టుగా దత్తపుత్రుడు మాట్లాడుతున్నారని విమర్శించారు. 2019 ఎన్నికల్లో జనసేన పోటీ చేసిన 18 లోక్‌సభ స్థానాల్లో ఒక్కటి కూడా బీసీలకు ఎందుకివ్వలేదని నిలదీశారు. వైఎస్సార్‌సీపీ ఓట్లను చీల్చాలనే 2019లో ప్రతి అసెంబ్లీ, ప్రతి పార్లమెంటు నియోజకవర్గానికి ప్రత్యేక అజెండా పెట్టుకున్న విషయం రాష్ట్రంలో అందరికీ తెలుసన్నారు. వంగవీటి రంగాను చంపించింది చంద్రబాబే అని తన పుస్తకంలో రాసిన హరిరామ జోగయ్య... ఇప్పుడు చంద్రబాబు గూటిలో దూరేందుకు సిద్ధంగా ఉన్నాననడం సిగ్గుచేటన్నారు. జోగయ్య పెట్టిన కాపు సేవా సమితి పేరును కమ్మ సేవా సమితి అని మార్చుకుంటే సరిగ్గా సరిపోతుందన్నారు. చంద్రబాబు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ కాపులు రోడ్డెక్కితే రకరకాల కేసులు ఎదుర్కోవాల్సి వచ్చిందన్నారు. అయినా పవన్ మళ్లీ కాపులను గంపగుత్తగా చంద్రబాబు కాళ్ల దగ్గర పడేయాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. టీడీపీ, జనసేన ఎన్ని కుట్రలు చేసినా 2024లో ప్రజలు వైఎస్సార్‌సీపీని గెలిపించడం ఖాయమన్నారు.

అనంతపురం ముతవల్లీ సస్పెన్షన్

సాక్షి, అమరావతి: వక్ఫ్ ఆస్తుల అన్యాక్రాంతంతోపాటు అనేక అక్రమాలకు పాల్పడిన అనంతపురం నగర జమాద్ ముతవల్లీ షఫీవుల్లాను ఆ పదవి నుంచి తొలగిస్తూ వక్ఫ్ బోర్డు సీఈఓ అబ్దుల్‌ఖాదీర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. 40 ఏళ్లగా అనంతపురం నగర జమాద్‌కు చెందిన వక్ఫ్ ఆస్తుల అన్యాక్రాంతం తదితర ఆరోపణలు ఎదుర్కొంటున్న షఫీవుల్లాపై ఇటీవల విచారణ నిర్వహించారు. ఆయనపై వచ్చిన ఆరోపణలు నిజమని తేలడంతో ముతవల్లీషిప్‌ను సస్పెండ్ చేస్తూ తదుపరి విచారణకు ఆదేశించారు. ఈ వ్యవహారంపై వక్ఫ్ బోర్డు డిప్యూటీ సెక్రటరీ షేక్ నూర్‌సాహెబ్‌ను విచారణాధికారిగా నియమించారు.

కాపు నేతలను దెబ్బ తీసే కుట్ర

కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు


సాక్షి, అమరావతి: 'ఆర్ఆర్ఆర్' సినిమాలోని 'నాటు నాటు' పాటకు ఆస్కార్ అవార్డ్ రావడం అభినందనీయమని, రాజకీయాల్లో ఆస్కార్ ఇవ్వాల్సి వస్తే చంద్రబాబు కోసం రోజుకో మాదిరి నటిస్తున్న పవన్‌కళ్యాణ్‌కు ఇవ్వాలని కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషగిరి (శేషు) చెప్పారు. ఆయన సోమవారం తాడేపల్లిలో మీడియాతో మాట్లాడుతూ రెండు రోజులుగా బీసీ, కాపు సంక్షేమ సేన సమావేశాల్లో పవన్ మాటలను గమనిస్తే ఆయన కులానికో మాట, పూటకో వేషం వేస్తున్నట్టు ఉందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో రాజకీయంగా ఎదిగిన కాపు నేతలను దెబ్బతీసేందుకు చంద్రబాబు చేసిన కుట్రలో పావుగా మారారని మండిపడ్డారు. ప్రజారాజ్యం నుంచి జనసేన వరకు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా తీవ్రంగా నష్టపోతున్న కాపు యువత ఇప్పటికైనా ఆలోచించాలని, బాబు కోసం పనిచేస్తున్న పవన్‌ను నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు.

నేడు మచిలీపట్నంలో జనసేన ఆవిర్భావ సభ

సాక్షి, అమరావతి: జనసేన పార్టీ పదో ఆవిర్భావ సభ మంగళవారం కృష్ణా జిల్లా మచిలీపట్నంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆ పార్టీ ఏర్పాట్లు చేసుకుంది. సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభమయ్యే సభకు విజయవాడ ఆటోనగర్ నుంచి వారాహి వాహనంలో పవన్‌కళ్యాణ్ బయలుదేరి తాడిగడప, పోరంకి, పెనమలూరు, పామర్రు సెంటర్ మీదుగా సాయంత్రం 5 గంటలకు మచిలీపట్నం చేరుకుంటారని జనసేన పార్టీ వర్గాలు తెలిపాయి.

గవర్నర్‌తో మర్యాదపూర్వక భేటీ

పవన్‌కళ్యాణ్ సోమవారం సాయంత్రం రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సాయంత్రం ఐదు గంటలకు రాజభవన్‌కు చేరుకుని, రాష్ట్ర కొత్త గవర్నర్‌గా నియమితులైనందుకు జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు అభినందనలు తెలిపారు.







నేను హింసకు ఎందుకు అభ్యంతరం చెబుతానంటే – అది మంచి చేసినట్టుగా కనబడినప్పుడు, ఆ మంచి కేవలం తాత్కాలికం, కానీ అది చేసే చెడు మాత్రం శాశ్వతం.

– మహాత్మా గాంధీ

సాక్షి

మంగళవారం, మార్చి, 14

చెయ్యెత్తి జైకొట్టిన ఆస్కార్

అనుకున్నదే అయింది. ఆశించినది దక్కింది. ప్రతిష్ఠాత్మక అకాడెమీ అవార్డుల (ఆస్కార్) విశ్వ వేదికపై భారతీయ సినిమా వెలుగులీనింది. తెలుగు సినిమా 'ఆర్.ఆర్.ఆర్' తొలిసారిగా మన వెండితెరకు 'బెస్ట్ ఒరిజినల్ సాంగ్' విభాగంలో కీర్తి కిరీటధారణ చేసింది. హాలీవుడ్‌లో సినీ శిఖరమని భావించే ఆస్కార్‌ను పూర్తి స్వదేశీ నిర్మాణంతో అందుకోవాలన్న భారతీయ సినిమా దీర్ఘకాల స్వప్నం నెరవేరింది. ఉత్తమ డాక్యుమెంటరీ షార్ట్ ఫిల్మ్‌గానూ మన దక్షిణ భారతీయురాలు అనాథ ఏనుగు సంరక్షణపై తమిళనాట తీసిన చిత్రమే (కార్తికీ గొంజాల్వెజ్ తొలియత్నం 'ది ఎలిఫెంట్ విష్పరర్స్') ఆస్కార్ సాధించింది. వెరసి కమర్షియల్ సినిమానే కాదు, కదిలించే డాక్యుమెంటరీతోనూ విదేశాలతో పోటీపడగలమని ఒకటికి రెండు ఆస్కార్ ప్రతిమల సాక్షిగా 95వ అకాడెమీ అవార్డుల ప్రకటన నిరూపించింది. ప్రధానంగా అమెరికన్ల వ్యవహారమైన ఆస్కార్ కోటలో మన సినిమా పాగావేసింది.

రెండు విభిన్న పార్శ్వాలకు ప్రతీకగా, మూడు విభాగాల్లో ఆస్కార్ తుది జాబితాకు నామినేటై, అందులో ఏకంగా రెండింటిలో పురస్కార విజేతగా నిలవడం భారతీయ సినిమా కనివిని ఎరుగని విషయం. ఇది యావద్భారత సినీ ప్రపంచం రొమ్ము విరుచుకొనే సమయం. శతాధిక వసంత భారతీయ సినీ చరిత్రలో సువర్ణాక్షర లిఖిత సందర్భం. స్వాతంత్ర్యం సిద్ధించే నాటికి వివిధ భాషల్లో ఏటా 283 ఫీచర్ ఫిల్మ్స్ తీస్తున్న మన భారతీయ చిత్ర పరిశ్రమ ఇవాళ ఏటా 2 వేల సినిమాలకి ఎదిగింది. మూకీల రోజుల్లోనే విదేశాలకు వెళ్ళిన మన సినిమాకు ఉత్తమ విదేశీ చిత్ర విభాగమంటూ 1956లో కొత్త కేటగిరీ పెట్టినప్పటి నుంచి గత 67 వత్సరాలుగా ఆస్కార్ అందని ద్రాక్షపండే. ఇన్నేళ్ళలో మన సినిమాలు మూడే తుది జాబితా దాకా వెళ్ళినా, ఒక్క ఓటుతో అవార్డు మిస్సయిన మదర్ ఇండియా (1957), ఆ తర్వాత మీరా నాయర్ 'సలామ్ బాంబే' (1988), ఆమిర్‌ఖాన్ 'లగాన్' (2001)– ఏవీ అవార్డు తేలేకపోయాయి. ఇప్పటికి వేరే కేటగిరీలోనైతేనేం ఆ కోరిక తీరింది.

ఆస్కార్ మనకు మరీ కొత్త కాదు. విదేశీయులు తీసిన చిత్రాల్లో మనం ఆస్కార్ అందుకోవడం అటెన్‌బరో 'గాంధీ' (1982) నుంచి ఉంది. 'ప్యాసా', 'ఆమ్రపాలి', 'గైడ్'లకు పనిచేసిన కాస్ట్యూమ్ డిజైనర్ స్వర్గీయ భానూ అతయ్యా 'గాంధీ'తో తొలి భారతీయ ఆస్కార్ విజేతయ్యారు. ఆ పైన గౌరవంగా ఇచ్చే జీవన సాఫల్య పురస్కారాన్ని దిగ్దర్శకుడు సత్యజిత్ రాయ్ (1991) అందుకున్నారు. ఇక, భారత్‌లోని పట్టణ ప్రాంత పేదరికంపై విదేశీయులు తీసిన 'స్లమ్‌డాగ్ మిలియనీర్' (2008) సంగీత దిగ్గజం రెహమాన్‌కు రెండు (బెస్ట్ ఒరిజినల్ సాంగ్, ఒరిజినల్ స్కోర్) ఆస్కార్లు తెచ్చింది. పాటకు రెహమాన్‌తో కలసి గీత రచయిత గుల్జార్ గౌరవం పంచుకున్నారు. అదే చిత్రంలో బెస్ట్ సౌండ్ మిక్సింగ్‌కు మరో ఇద్దరితో కలసి రసూల్ పూకుట్టి విజేతగా నిలిచారు. షార్ట్ ఫిల్మ్‌లకొస్తే – ఉత్తరప్రదేశ్ నేపథ్యంలో తీయగా 2018లో ఆస్కార్ గెలిచిన షార్ట్ ఫిల్మ్ 'పీరియడ్. ఎండ్ ఆఫ్ ఎ సెంటెన్స్'కు నిర్మాతల్లో ఒకరు భారతీయ వనిత గునీత్ మోంగా. అయితే, దర్శకురాలు విదేశీయురాలు. ఇలా ఇప్పటిదాకా అన్నీ విదేశీ భాగస్వామ్యంలో మనవాళ్ళు ఎగరేసిన జెండాలు. తొలిసారి పూర్తి స్వదేశీ దర్శక, నిర్మాణాలైన 'ఆర్‌ఆర్‌ఆర్', 'ఎలిఫెంట్' రెండూ ఆస్కార్లు తేవడం మరువలేని ఘనత.

బ్రిటీషు పాలనా కాలపు నేపథ్యంలో వేర్వేరు కాలఘట్టాలకు చెందిన పోరాటయోధుడు అల్లూరి, ఆదివాసీ ముద్దుబిడ్డ కొమురం భీమ్ కలిస్తే ఎలా ఉంటుందనే కాల్పనిక కథ 'ఆర్‌ఆర్‌ఆర్' తెరపై సినిమాటిక్ భావోద్వేగాలకు పరాకాష్ఠ. అసలు చరితను సైతం ఆలోచింప జేయనివ్వని రాజమౌళీంద్రజాలం. కీరవాణి బాణీలో నృత్యప్రధాన గీతం 'నాటు నాటు' దేశదేశాల్లో అభిమానుల్ని సంపాదించుకుంది. దానికి చంద్రబోస్ కూర్చిన తేటతెలుగు మాటలు, ప్రేమ్ రక్షిత్ సమకూర్చిన స్టెప్పులు, రెండు నెలల కఠోరసాధన– 20 రోజుల షూటింగ్‌తో జూనియర్ ఎన్టీఆర్ – రామ్‌చరణ్‌ల సమన్వయ నృత్య విన్యాసం – అన్నీ కలిసొచ్చాయి. ఆస్కార్ విజేతల్ని నిర్ణయించే 9 వేల పైచిలుకు సభ్యుల్నీ ఊపేశాయి. భారతదేశం తరపున ఉత్తమ విదేశీ చిత్ర విభాగంలో అధికారిక ఎంట్రీగా గుజరాతీ 'ఛెల్లో షో' వెళ్ళినా, అది తుదిపోరు దాకా చేరుకోనే లేదు. ఆ మాట కొస్తే, గత 21 ఏళ్ళలో ఏ ఇతర భారతీయ ఎంట్రీ తుది 5 చిత్రాల జాబితాలో నిలవలేదు. ఈసారి 'ఆర్‌ఆర్‌ఆర్' అమెరికన్ డిస్ట్రిబ్యూటర్ వేరియన్స్ ఫిల్మ్స్– రాజమౌళి బృందం పట్టుదలగా 'ఫర్ యువర్ కన్సిడరేషన్' క్యాంపెయిన్‌లో 14 కేటగిరీల్లో సినిమాను ప్రమోట్‌చేసింది. ప్రచారమూల్యం మాటెలా ఉన్నా, చివరకు ఒక కేటగిరీలో ఆస్కార్ కల నిజమైంది. తుది జాబితా నాటికే 'నాటు నాటు'పై పెరిగిన అంచనాలు ఫలించాయి.

పాపులర్ హాలీవుడ్ ఎంట్రీలను పక్కకు నెట్టి మరీ మన 'నాటు నాటు' ఈ ఘనత సాధించింది. ఇప్పటికే గోల్డెన్ గ్లోబ్, క్రిటిక్స్ ఛాయిస్ అవార్డ్‌లూ వరించేసరికి తెలుగు పాటకు విశ్వకీర్తి దక్కింది. క్రిటిక్స్ ఛాయిస్ అవార్డ్ ఈ చారిత్రక ఫ్యాంటసీకి, న్యూయార్క్ ఫిల్మ్ క్రిటిక్స్ వారి బెస్ట్ డైరెక్టర్ అవార్డ్ రాజమౌళికీ దక్కాయి. ఇంతకన్నా గొప్ప పాటలు, సినిమాలొచ్చాయన్న కొందరి సన్నాయి నొక్కులు సినిమా జోరు, అవార్డుల హోరులో కలసిపోయాయి. 'ఈ నక్కలవేట ఎంతసేపు? కుంభస్థలాన్ని బద్దలుకొడదాం పద' అని ఈ చిత్రంలో ఓ హీరో డైలాగ్. అవును. రాజమౌళి బృందం ఇప్పుడు అంతర్జాతీయ అవార్డుల కుంభస్థలాన్ని బద్దలుకొట్టింది. పక్కా ప్రణాళికతో అడుగేస్తే అసాధ్యమే లేదని మన ఫిల్మ్ మేకర్స్‌లో నమ్మకం కలిగించింది. వ్యాపారంలోనూ, వ్యవహారంలోనూ కొత్త తలుపులు తెరిచి, కొత్త ఎత్తులు చూపిన మన సినిమాకు స్వాగతం. అందుకు ఇది ఓ శుభారంభం.

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, తిథి: బ.సప్తమి సా.5.06 వరకు, తదుపరి అష్టమి, నక్షత్రం: జ్యేష్ఠ తె.4.34 వరకు (తెల్లవారితే బుధవారం), తదుపరి మూల, వర్జ్యం: ఉ.10.53 నుండి 12.25 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.35 నుండి 9.24 వరకు, తదుపరి రా.10.56 నుండి 11.44 వరకు, అమృతఘడియలు: రా.8.04 నుండి 9.37 వరకు.

సూర్యోదయం : 6.14
సూర్యాస్తమయం: 6.06
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

ఏ ప్రభుత్వమైనా ఇదే తంతు!



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

నిష్పక్షపాతంగా ఉండాల్సిన దర్యాప్తు సంస్థలు పాలకుల చేతి చిలకలుగా ఉంటున్నాయన్న ఆరోపణలు కొత్తవి కాదు. ఈ సంస్కృతికి ఏ ఒక్క పార్టీనో నిందించి ప్రయోజనం లేదు. సీబీఐ, ఈడీ, ఆదాయ పన్ను శాఖ ఉన్నతాధికారుల చేతులు మెలిపెట్టి వారిని వాడుకోవడంలోనూ; రాజనీతికి, దేశ విశిష్ట రాజ్యాంగ చట్ట నిబంధనలకు యథేచ్ఛగా తిలోదకాలివ్వడంలోనూ పాలకుల మధ్య ఎత్తుగడలలో తేడాలే తప్ప వ్యవహారం మొత్తం ఒకే రకం. అలాగే ఇవాళ ప్రతిపక్ష నాయకుల్ని, పాత్రికేయుల్ని, ప్రజా సమస్యలకు న్యాయమైన పరిష్కారాన్ని కోరుతూ ఉద్యమాలు నిర్వహిస్తున్న పౌర హక్కుల ఉద్యమకారులపై పోలీసు జులుం వినియోగించే సంస్కృతికి కూడా పాలక పార్టీలు సమాన స్థాయిలో మూల విరాట్టులేనని మరచిపోరాదు.

నిష్పక్షపాతంగా ఉండాల్సిన సంస్థలను కేంద్ర ప్రభుత్వం వాడుకుంటోందన్న రొడ్డ కొట్టుడు ప్రకటనలను ప్రజలు వినలేక చస్తున్నారు. ఎందుకంటే, 'అందరూ శాకాహారులే అయితే రొయ్యల బుట్ట కాస్తా ఎలా ఖాళీ అయిపోయిం'దన్న ప్రశ్నకు సమాధానం వారికి ఇంతవరకూ దొరకలేదు కాబట్టి! దేశ స్వాతంత్ర్య అమృతోత్సవాలు జరుపుకొంటున్న ముహూర్త కాలంలో కూడా ఈ ప్రశ్నకు సమాధానం దొరకడం లేదు. ఎందుకని? నాయకులకన్నా స్వాతంత్ర్యం కోసం ఆస్తులు, ప్రాణాలు సహా దేశ ప్రజా బాహుళ్యం అనంతమైన త్యాగాలు చేసి ఉన్నారు గనుక.

ఇవాళ ప్రతిపక్ష నాయకుల్ని, వారి అనుయాయుల్ని, పాత్రికేయుల్ని, పౌర సమాజాన్ని, ప్రజా సమస్యలకు న్యాయమైన పరిష్కారాన్ని కోరుతూ ఉద్యమాలు నిర్వహిస్తున్న పౌర హక్కుల ఉద్యమకారులను హింసిస్తూ, వారిపై పోలీసు జులుం వినియోగించే పాలక సంస్కృతికి కాంగ్రెస్, బీజేపీ పార్టీలు సమాన స్థాయిలో మూల విరాట్టులేనని మరచిపోరాదు. అంతేగాదు, కోర్టుల్ని ధిక్కరించి, వాటి చేతుల్ని మెలిపెట్టి పనులు నిర్వహించుకునే సంస్కృతికి తెరలేపినవీ కూడా ఈ రెండు పార్టీలేనని నిద్రలోనూ మరవరాదు.

అలహాబాద్ హైకోర్టు సాహసించి ఇందిరాగాంధీ 'ఎమర్జెన్సీ రాకెట్' బాగోతాన్ని బట్టబయలు చేస్తూ శఠిస్తూ చెప్పిన చరిత్రాత్మక తీర్పును ఆమోదిస్తూనే సుప్రీంకోర్టు ప్రసిద్ధ న్యాయమూర్తి కృష్ణయ్యర్ ఉదార దృక్పథంతో ఇందిరా గాంధీ 'విషయాన్ని చక్కబెట్టుకోవడానికి' వెసులుబాటు కల్పించబట్టి తక్షణం ఆమె రాజీనామా వాయిదా పడింది. సీబీఐ, ఈడీ, ఆదాయ పన్ను శాఖ ఉన్నతాధికారుల చేతులు మెలిపెట్టి వారిని వాడుకోవడంలోనూ; రాజనీతికి, దేశ విశిష్ట రాజ్యాంగ చట్ట నిబంధనలకు యథేచ్ఛగా తిలోదకాలివ్వడంలోనూ కాంగ్రెస్, బీజేపీ పాలకుల మధ్య ఎత్తుగడలలో తేడాపాడాలే తప్ప వ్యవహారం మొత్తం ఒకే రకం. ప్రజాబాహుళ్యాన్ని, వారి సంక్షేమాన్ని ప్రజాస్వామిక పద్ధతుల్లో తీర్చిదిద్దుతూ వచ్చిన ఉదాహరణలు తక్కువ. స్వతంత్ర సంస్థలుగా ఉండవలసిన సీబీఐ, ఈడీ, ఆదాయపు పన్ను శాఖలను గతంలో 'చేతివాటు' పనిముట్లుగా వాడుకున్న తీరు చివరికి సుప్రీంకోర్టు దృష్టికి వెళ్లడమూ, కోర్టు సీబీఐ, ఈడీ అధికారులను చీవాట్లు పెడుతూ, ఇకమీదట 'మీరు కేంద్ర ప్రభుత్వానికే కాదు, సుప్రీం న్యాయస్థానానికి బాధ్యులై ఉండాల'ని కఠినంగా ఆదేశించడమూ జరిగింది.

బహుశా ఈ పరిణామాలను గమనించిన తరువాతనే కేంద్ర సీబీఐ మాజీ ఉన్నతాధికారి, గూఢచార శాఖ మాజీ అధిపతి రామేశ్వర్ నాథ్ కావ్ కూడా పాలకుల ప్రలోభాల ఫలితంగా గూఢచార శాఖ అధికారులు చూచి రమ్మంటే కాల్చి వచ్చే బాపతులుగా తయారు కావడం విచారకరమని ఒక పుస్తకమే రాసి విడుదల చేశారు. ఈ బాగోతం ఇప్పుడు కూడా పెద్ద ఎత్తున సాగుతోంది. ఇలాంటి ఉదాహరణలను పెక్కింటిని 'హిందూ' దినపత్రిక మేటి పక్ష పత్రిక అయిన 'ఫ్రంట్ లైన్' ప్రత్యేక ప్రతినిధి, విశిష్ట విశ్లేషకుడైన ఆశుతోష్ శర్మ పేర్కొన్నారు: ''రూ. 300 కోట్ల మనీ లాండరింగ్ కుంభకోణం కేసులో నిందితుడైన కేంద్ర మంత్రి నారాయణ్ రానే, అధికార పక్షంలో చేరడంతోనే అతనిపై అంతకుముందున్న కేసు కాస్తా మాఫీ అయిపోయింది. అదే తరహాలో పశ్చిమ బెంగాల్‌లో 'నారద' కుంభకోణంలో నిందితుడైన సువేందు అధికారిపై విచారణ కాస్తా రద్దయిపోయింది. మధ్యప్రదేశ్ షిండే సేనకు చెందిన భావనా గవ్లీకి 'ఈడీ' జారీ చేసిన అయిదు సమన్లను ఖాతరు చేయకపోయినా ప్రస్తుత లోక్‌సభలో 'షిండే సేన'కు ఛీఫ్ విప్‌గా ఉన్నారు. అలాగే, విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్ట (ఫెమా) ఉల్లంఘన కేసులో ఈడీ విచారణలో ఉన్న యశ్వంత్ యాదవ్, ఎమ్మెల్యే యామినీ యాదవ్ దంపతులిద్దరూ ఇప్పుడు 'షిండే సేన'లో సభ్యులుగా ఉన్నారు. మనీ లాండరింగ్ కేసులో శివ సేన సభ్యుడుగా ఉన్న ప్రతాప్ సర్ నాయిక్‌పై 'ఈడీ' సోదా నిర్వహించితే ఇప్పుడతను షిండే సేనలోకి చేరడంతోనే కేసు కాస్తా మాఫీ అయిపోయింది.

ఈ సందర్భంలోనే ఢిల్లీ ముఖ్యమంత్రి, 'ఆప్' జాతీయ నాయకుడైన అరవింద కేజ్రీవాల్ (మార్చి 1న) ఒక ప్రశ్న సంధిస్తూ 'ఈ రోజున ఆప్ మంత్రి మనీష్ సిసోడియా బీజేపీలో చేరితే, రేపంటే రేపే విడుదలైపోడా?' అని ఓ జోక్ వదిలారు. అంతేగాదు, సుప్రీంకోర్టు న్యాయవాది కాళేశ్వరం రాజ్ – 'భారతదేశంలో న్యాయ వ్యవస్థ ఎంత బలహీనంగా ఉందంటే, కోర్టు నిర్ణయించిన న్యాయమూర్తుల నియామకాల్ని కూడా తిమ్మినిబమ్మిని చేసి తారుమారు చేయగల శక్తి పాలక వర్గానికి ఉందని అర్థమవుతోంది' అని చురక వేశారు. అయితే, ఎప్పుడయితే సుప్రీం కోర్టుకు ప్రగతిశీల ప్రధాన న్యాయమూర్తిగా డీవై చంద్రచూడ్ పదవీ స్వీకారం చేశారో అప్పటినుంచీ సుప్రీంకోర్టు నుంచి వెలువడుతున్న ప్రజాహిత నిర్ణయాలు దేశ ప్రజలకు మంగళకర సూచనగా భావించాలి. ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ పాలనా కాలంలో సుప్రీం న్యాయమూర్తి హోదాలో జస్టిస్ ఖన్నా దేశవ్యాప్తంగా పౌర హక్కుల వినాశానికి, పాలక నియంతృత్వ ధోరణులకు 'ఫుల్ స్టాప్' పెట్టించి రాజకీయ ఖైదీల విడుదలకు ఉత్తర్వులు జరూరుగా జారీ చేసి, దేశంలోనూ, విదేశాలలోనూ ఖ్యాతి గడించారు. తాను సుప్రీం ప్రధాన న్యాయమూర్తి కానున్న సమయంలో ఆ పదవిని త్యాగం చేసిన జస్టిస్ ఖన్నాను విదేశాలు మరచిపోలేదుగానీ, మన దేశంలో అలాంటి న్యాయమూర్తికి ఏటా నివాళులర్పించగల కనీస సంస్కారం కూడా మనలో కరువై పోయింది.

ఒక దేశం, ఒకే ఎన్నిక, ఒకే నాయకుడు అన్న ధోరణి రాజ్యాంగం నిర్దేశించి, గ్యారంటీ చేసిన ఫెడరల్ (సమాఖ్య) వ్యవస్థకు చేటు కల్గిస్తుందని దేశ ప్రజలు స్వాతంత్ర్య అమృతోత్సవ వేళ గుర్తించాల్సిన సమయం వచ్చింది. ఈ సందర్భంగా కవయిత్రి మాయా ఏంజెలో (శివలక్ష్మి అనువాదం) స్వేచ్ఛా పక్షికీ, 'పంజరంలోని పక్షి'కీ గల తేడాను వర్ణిస్తూ చెప్పిన మాటల్ని విందాం:

"స్వేచ్ఛా పక్షి తన శక్తి మేరకు
ఆకాశాన్ని సైతం శుభ్రం చేయడానికి
ధైర్యం చేస్తుంది...
పంజరంలో పక్షి
భయంకరంగా వణికే గొంతుతో పాడుతుంది
కానీ, చాలాకాలంగా
సుదూరపు కొండలనుంచి
శ్రుతి తప్పిన రాగం అస్పష్టంగా
పంజరం నుంచి విముక్తి కోసం
పక్షి స్వర రాగం
విషాదంగా వినపడుతూనే ఉంటుంది
స్వేచ్ఛా పక్షులు ఆహ్లాదకరమైన ఇతర పక్షుల
గురించి ఆలోచిస్తాయి
చెట్లు వదిలే వాణిజ్య వాయువుల్ని మృదువుగా ఆస్వాదిస్తాయి
ఆ పక్షులు ఆకాశానికి తమ పేరు పెట్టుకుంటాయి!
కానీ పంజరంలోని పక్షి తన కలల సమాధిపై నిలబడి ఉంటుంది
ఆ పక్షి రెక్కలు కత్తిరించబడ్డాయి, పాదాలు కట్టివేయబడ్డాయి
కాబట్టి పంజరంలో పక్షి పాడటానికి తన గొంతు
సవరించుకుంటుంది
పంజరంలో పక్షి పాడుతుంది
భయకంపితమైన స్వరంతో
తన స్వేచ్ఛను ఎలుగెత్తి చాటే
పక్షి స్వర రాగం విషాదంగా వినబడుతూనే ఉంది!"

abkprasad2006@yahoo.co.in

రెండో మాట



సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

అద్భుత క్షణం



'నాటు నాటు' పాట ఆస్కార్ పురస్కారం గెలుచుకుంది. భారతీయ సినిమాకూ, సంగీతానికీ, డాన్స్‌కూ ఎంత అద్భుతమైన క్షణం.

– రాజీవ్ కుమార్, ఇన్వెస్టర్

నవ్వుకో అవార్డు



మనకొచ్చిన ఆస్కార్ అవార్డులు అలా ఉండనీ. దయచేసి దీపికా పదుకోణ్ నవ్వుకు ఒక ఆస్కార్ ఇవ్వండి. ఉఫ్! ఆ వేడుకల్లో అందరినీ ఎలా సంభ్రమానికి గురి చేసింది!

– పూజా త్రిపాఠీ, వైద్యురాలు

దేనికి అభ్యంతరం?



'సేమ్– సెక్స్' (ఒకే లింగ) వివాహాలను భిన్న లింగ వివాహితులు ఎందుకు వ్యతిరేకిస్తున్నారో నాకు అర్థం కావడం లేదు. మిమ్మల్ని ఎవరూ మీ భార్యకు విడాకులు ఇచ్చి, ఇంకో అబ్బాయిని పెళ్లి చేసుకొమ్మని కోరడం లేదు కదా! ఎవరో ఇంకెవరినో పెళ్లి చేసుకుంటే మీదేం పోతుంది?

– సౌమిత్ర పఠారే, సైకియాట్రిస్ట్

అందరం అంతే!



ఇండియాలోని ప్రతి సమస్యకూ కారణం ఉత్తరాదివాళ్లే అని చెప్పే ఈ చెత్తవాగుళ్లను కొంచెం ఆపుదామా? మనం(దక్షిణ భారతీయులు) మాత్రం ఏమైనా సాధువులమా?

– ప్రియాశ్మిత, ఆంత్రప్రెన్యూర్

మొదటి అవార్డు



ఉత్తమ నటిగా ఆస్కార్ అవార్డును మిషెల్ యోకు నటి హాలీ బెర్రీ కళ్లనీళ్ల పర్యంతమవుతూ బహూకరించారు. 95 ఏళ్లలో ఈ అవార్డును అందుకున్న 'వర్ణపు' (కలర్: శ్వేతజాతేతరులు అన్న అర్థంలో) మహిళలు వీళ్లిద్దరు మాత్రమే!(మిషెల్ ఈ పురస్కారం గెలుచుకున్న మొదటి ఆసియా మహిళ కూడా!)

– స్పెన్సర్ ఆల్ట్‌హౌజ్, జర్నలిస్ట్

దేశానికి అంకితం



ఒక ఇండియా నిర్మాణానికి మేము మొట్టమొదటి ఆస్కార్ అవార్డు గెల్చుకున్నాం. ఇద్దరం మహిళలం దీన్ని సాధించాం. నేను ఇంకా వణుకుతూనే ఉన్నాను. నా హృదయం మొత్తం ప్రేమ, ఉద్వేగాలతో నిండిపోయింది; అదంతా కూడా మా గెలుపు కోసం మమ్మల్ని ఇండియాలో ఉత్సాహపరిచిన ప్రతి ఒక్కరినుంచీ పీల్చుకున్నది. అందమైన, వైవిధ్య భరితమైన నా భారతదేశానికి ఈ పురస్కారం అంకితం.

– గునీత్ మోంగా, 'ది ఎలిఫెంట్ విష్పరర్స్' నిర్మాత

అవార్డుల ఏనుగు



ఆసియాకు మరో చారిత్రక తొలి అవార్డు: దర్శకురాలు కార్తికీ గొంజాల్వెజ్, నిర్మాత గునీత్ మోంగా 'ది ఎలిఫెంట్ విష్పరర్స్'కు గానూ ఉత్తమ లఘు డాక్యుమెంటరీ విభాగంలో ఆస్కార్ గెలుచుకున్న తొలి భారతీయ ఫిలింమేకర్స్. వాళ్లకు అభినందనలు.

– నాన్సీ యాంగ్ యువెన్, రచయిత్రి

ఇన్‌బాక్స్

దూసుకుపోతోంది

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గత నాలుగు సంవత్సరాల నుండి భారతదేశంలో ఏ రాష్ట్రం చేపట్టని సంక్షేమ కార్యక్రమాలను అమలుచేస్తోంది. స్వతంత్రం వచ్చి ఇన్నేళ్లయినా కనీసావసరాలు తీరనివారుగా ఎందరో ప్రజలు మిగిలిపోయారు. ఇప్పుడు సీఎం అలాంటి అట్టడుగున ఉన్నవారికి వినూత్నమైన సచివాలయం, వలంటీర్ వంటి వ్యవస్థల ద్వారా చేరువయ్యారు. విద్య, వైద్య రంగాలకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తూ... ప్రజల చేతుల్లో డబ్బులు మెదిలే విధంగా అనేక సంక్షేమ పథకాలను అమలుచేస్తున్నారు.

'చేయూత', 'అమ్మఒడి', 'ఆసరా', 'విద్యా దీవెన', 'వసతి దీవెన' వంటి పథకాలు వీటిలో కొన్ని మాత్రమే. ఇటువంటి పథకాల అమలు వల్ల ప్రజల కొనుగోలు శక్తి పెరిగింది. దీంతో ఇప్పటివరకూ దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న అనేక కుటుంబాలు ఇప్పుడు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. జగన్ నాయకత్వంలో... ఏపీ శరవేగంతో అభివృద్ధి చెంది భారతదేశంలోనే ఓ గొప్ప స్థాయికి చేరుకుంటుందని ప్రజలు నమ్ముతున్నారు.

– నాగెండ్ల సుమతీ రత్నం
దాచేపల్లి, పల్నాడు జిల్లా

వాళ్లిక చూడాల్సింది కిందికి కాదు... పైకి!

అభిప్రాయం



జాన్‌సన్ చోరగుడి

క్రమంగా గడచిన నాలుగేళ్లలో మన రాష్ట్రంలో– 'ఫీల్ గుడ్' వాతావరణం కనిపిస్తున్నది. అందుకు కారణం– రాజ్యము – ప్రజల మధ్య ఏర్పడిన దట్టమైన– 'ఎకో సిస్టం' అని నా ఫిబ్రవరి 11 వ్యాసంలో రాశాను. అయితే, ఎంతో విస్తృతమైన లోతైన విషయమది, దాన్ని అంత క్లుప్తంగా చెబితే చాలదు, అందుకు కొన్ని ఉదాహరణలు చెబితే అప్పుడు మరింత స్పష్టత దొరుకుతుంది.

రాష్ట్రంలో పిల్లల భద్రత గురించి ఫిబ్రవరి 22న ఓ వార్త 'ది హిందూ' ఆంగ్ల పత్రికలో వచ్చింది. పోలీస్, కార్మికశాఖ, విద్య, ఆరోగ్య శాఖలు, మానవ అక్రమ రవాణా నిరోధక విభాగాలు వారం రోజుల పాటు రాష్ట్రంలో నిర్వహించిన దాడుల్లో 5–15 ఏళ్ళ మధ్య వయస్సు ఉన్న 285 మంది పిల్లల్ని గుర్తించారు. వీరిలో 45 మంది ఇప్పటివరకు బడి ముఖం చూడలేదు! వీళ్లంతా విషాదకర స్థితిలో ఇక్కడ ఫ్యాక్టరీలు, ఇటుక బట్టీలు, హోటళ్లు, మెకానిక్ షెడ్లలో బాలకార్మికులుగా పని చేస్తున్నారు. ఎవరు వీళ్ళు అంతా అని చూసినప్పుడు– ఛత్తీస్‌గఢ్, ఒడిశా, తెలంగాణ, అస్సాం, పశ్చిమ బెంగాల్ నుంచి వీళ్ళు ఆంధ్రప్రదేశ్‌కు అక్రమంగా తరలించబడ్డారు. ఇలా బాలల శ్రమ దోపిడీ చేస్తున్న యాజమాన్యాలకు స్థానికంగా బాలకార్మికులు అందుబాటులో లేకపోవడం వల్ల, బయట నుంచి వారిని దిగుమతి చేసుకుంటున్నారు. మరి వారు ఇక్కడ ఎందుకు అందుబాటులో లేరు అంటే... ఇక్కడ ఆ వయస్సు పిల్లలు బడుల్లో ఉంటున్నారు గనుక.

అంగన్‌వాడీ వయస్సు తర్వాత, 'అమ్మఒడి' నుంచి 'విదేశీ విద్యాదీవెన' వరకు పుట్టిన బిడ్డ విషయంలో ఇక్కడి విద్యా వైద్య శాఖలు పూర్తిగా వారి బాధ్యతలు తీసుకుంటున్నాయి. దిగువ వర్గాల కాలనీల్లో నేరాలు తగ్గి పిల్లలు–స్త్రీలు క్షేమంగా ఉండడాన్ని– 'ఫీల్ గుడ్' కాలంగానే చూడాలి.

ఈ ప్రభుత్వానిది అంతా సంక్షేమంపై 'ఫోకస్' అనే మాట ఉన్నప్పటికీ, అదేమంత 'స్మూద్'గా ఈ ప్రభుత్వానికి గొప్ప పేరు వచ్చేట్టుగా కూడా సాగడం లేదు. ఇప్పటికీ ఇంకా అసంతృప్తులకు కొదవలేదు! ప్రభుత్వ ప్రాధాన్యతలైన విద్య, వైద్యం పట్ల ఎగువ మధ్యతరగతి వర్గాలకు వారి అభ్యంతరాలు వారి కున్నాయి. పోనీ వాళ్ళను వదిలిపెట్టి, ప్రయోజనాలు అందు కొంటున్న వారి సంగతి ఏమిటి? అని చూసినప్పుడు... అభివృద్ధి చెందుతున్న సమాజాల్లో ఆకాంక్షల వర్గాల (యాస్పై



రింగ్ సెక్షన్స్) అవసరాలకు 'ఫుల్ స్టాప్' అంటూ ఉండదు. ఉండాలి, అనుకోవడమూ కుదరదు. అయితే, 'అభివృద్ధి' ఏదీ? అంటూ 'సంక్షేమాన్ని' విమర్శిస్తున్నవారి దృష్టిలో పడకుండా తప్పించుకునేవీ ఉంటాయి. ఉదాహరణకు గత ప్రభుత్వంలో పెండింగ్ ఉన్న పారిశ్రామిక రాయితీలు రూ. 962 కోట్లు ఈ ప్రభుత్వం చెల్లించింది. ఈ నాలుగేళ్లలో రూ. 1,715 కోట్లు పారిశ్రామిక రాయితీలూ, రూ. 1,114 కోట్లు విద్యుత్ రాయితీలూ ఈ ప్రభుత్వం సంపన్న పారిశ్రామిక వర్గాలకు చెల్లించింది. అయితే, ఇవేవీ 'పబ్లిసిటీ' ఉండే అంశాలు కాదు.

కనుక గత ముప్పై ఏళ్ల ఆర్థిక సంస్కరణల కాలంలో జీవన ప్రమాణాలు పెరిగి, కొత్తగా ఎగువ మధ్యతరగతి స్థాయికి చేరిన వారు... ప్రభుత్వం నుంచి కిందికి పేదలకు ఏమి వెళుతున్నాయి అని కాకుండా, ఉద్యోగులుగా ఉన్న తమ పిల్లల్ని– మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్ ప్రైజెస్ (ఎమ్ఎస్ఎమ్ఈ) ల్లో 'ఆంత్రప్రెన్యూర్లు'గా చూడ్డం అవసరం. అప్పుడు ఈ కొత్త సామాజిక వర్గాల నుంచి పదిమందికి ఉపాధి కల్పించే– 'ఎంప్లాయర్స్' తయారవుతారు. వర్ధమాన వర్గాల్లో ఇటువంటి 'షిఫ్ట్' జరిగినప్పుడు, సంప్రదాయ – 'పవర్ పాలిటిక్స్' నుంచి వారు 'ఫంక్షనల్ పాలిటిక్స్'లో ప్రవేశించి అక్కడ బలపడి విస్తరిస్తున్న కొత్త మార్కెట్లో విజేతలు అవుతారు. ఎందుకీమాట అనడం అంటే, ఈ రోజున ప్రభుత్వం వద్ద 48 వేల ఎకరాల భూమి పారిశ్రామిక అవసరాలకు చౌక ధరలకు కేటాయించడానికి సిద్ధంగా ఉంది. అనుమతులు 12 రోజుల్లో ఇస్తున్నారు, కొత్తగా వస్తున్న పాలసీలో 21 రోజుల్లో భూమి కేటాయింపు చేస్తారు. ఎమ్ఎస్ఎమ్ఈలకు ప్రభుత్వం ఇప్పటివరకు రూ.1,706 కోట్లు రాయితీలుగా ఇచ్చింది.


'సంక్షేమం' పేరుతో చేస్తున్న వ్యయం గురించి ఇటీవల ఐఐటీ ఢిల్లీ ఎకనమిక్స్ ప్రొఫెసర్ జీజే థామస్– 'ఇండియా నీడ్స్ బడ్జెట్ ఫర్ ఇట్స్ యంగ్' శీర్షికతో ఒక ప్రముఖ ఆంగ్లపత్రికకు రాసిన వ్యాసంలో ఆసక్తికరమైన వ్యాఖ్య చేశారు. 'తమ కుటుంబ జీవన ప్రమాణాలు పెరగడానికి పిల్లల విద్య కొత్త మార్గాలను తెరుస్తుందని మధ్యతరగతి తల్లిదండ్రులు అప్పులు చేసి మరీ వారిని చదివిస్తున్నారు. అటువంటప్పుడు, తన యువత విద్య కోసం ఒక దేశం అప్పు చేయడం మరింత మంచిది కదా?' అంటారాయన. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గత నాలుగు ఏళ్లుగా ఇక్కడ చేస్తున్నది అదే.

వ్యాసకర్త అభివృద్ధి–సామాజిక అంశాల వ్యాఖ్యాత

భ్రమ

ఒక వర్తకుడు తన పరివారంతో ఒంటెల మీద సరకులు వేసుకుని ఎడారి దాటుతున్నాడు. కనుచూపుమేరలో ఎదురుగా ఎత్తైన పట్నపు గోడలు, ఆకాశపు రంగుతో ఉన్న సరస్సుని చూశాడు. వాటిని చేరుకోవాలని ఆశతో పరివారాన్ని ఆ దిక్కుకి నడిపించాడు. అక్కడికి వెళ్లేసరికి పట్నపు గోడలు, నీటి ఛాయలేవీ కనిపించలేదు.

'అవి ఎండమావులు. అదంతా భ్రమ' అన్నారు పరివారం. వ్యాపారిలోని ఆశ , భ్రమ వినిపించుకోనివ్వలేదు. అక్కడే గుడారం వేసి తరువాత రోజు కోసం వేచి చూద్దామన్నాడు. మరునాడు కూడా



జ్యోతిర్మయం

ఎప్పటిలాగే గోడలు, సరస్సు కనబడగా పరివారాన్ని పరుగులు తీయించాడు. దగ్గరికెళ్తే ఏమీ కనబడలేదక్కడ.

సేవకుల మాటలు వినిపించుకోకుండా ఎండమావుల వెంట పరుగులు తీయించాడు వ్యాపారి. ఆ భ్రాంతిలో పడి నిజ ప్రపంచాన్ని మరచిపోయాడు.

కొన్నాళ్లకు ఒంటెల మీదున్న సరకులన్నీ పాడైపోగా, తెచ్చిన ఆహారపదార్థాలు, నీళ్లు అడుగంటాయి. వ్యాపారితో ఉంటే చావు తప్పదని అతన్ని వదిలేసి వెళ్లిపోయారు సేవకులు. కొద్దిరోజులకే వ్యాపారి ఒంటెలన్నీ చనిపోయాయి. ఆకలిదప్పులు తాళలేక అతడూ మరణించాడు.

ఈ కథలో ఎండమావుల్ని చూసి మోసపోయిన వ్యాపారిని చూసి జనులు నవ్వుకుంటారు. అతడొక పిచ్చివాడని ఎగతాళి చేస్తారు. కానీ జనులకు తెలియని విషయమేమంటే... తాము కూడ అశాశ్వతాలైన సంపద, ఐశ్వర్యం, అందాల వెనుక భ్రాంతితో పరుగులు తీస్తున్నామనీ, వాటినే శాశ్వతమైనవని భ్రమపడుతూ తాత్కాలిక ఆనందం పొందుతున్నామనీ గ్రహించకపోవడం. వ్యాపారి ఎండమావుల్ని వెంబడించినట్టే అనిత్యాలను వెంబడిస్తూ తామూ మోసపోతున్నామని జనులు గ్రహించాలి. నిజమైన ఆనందాన్నీ, ముక్తినీ ఇచ్చేదేదో గ్రహించి, సద్గురువు శిక్షణలో ఉత్తమ మార్గంలో పయనించాలి.

– అమ్మాజీ ఉమామహేశ్వర్

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

టోల్ ఫ్రీ నం: 1800 425 9899

క్లుప్తంగా...

21న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో ఈ నెల 22న ఉగాది ఆస్థానాన్ని పురస్కరించుకుని కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరుగనుంది. సాధారణంగా సంవత్సరంలో నాలుగు సార్లు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు మంగళవారం ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. కాగా, తిరుమలలో సోమవారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. ఆదివారం అర్ధరాత్రి వరకు 81,458 మంది స్వామివారిని దర్శించుకున్నారు. హుండీలో రూ.3.81 కోట్లు వేశారు. టికెట్లు లేని వారికి 12 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ఉగాది రోజు అర్చకులు, వేదపండితులకు సత్కారాలు

- ప్రతి జిల్లాలో ఇద్దరు అర్చకులు, ఒక వేదపండితుడికి..
- ఆదేశాలు జారీచేసిన దేవదాయశాఖ

సాక్షి, అమరావతి: శోభకృత నామసంవత్సర ఉగాది పండుగ సందర్భంగా ఈ నెల 22న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయాల్లో పనిచేసే అర్చకులను, వేదపండితులను సత్కరించనున్నారు. ప్రతి జిల్లాలో దేవదాయ శాఖ పరిధిలోని ఆలయాల్లో పనిచేసే 62 ఏళ్ల పైబడిన ఇద్దరు అర్చకులను, ఒక వేదపండితుడిని గుర్తించి కలెక్టర్ల చేతుల మీదుగా సన్మానించనున్నారు. ఈ మేరకు దేవదాయశాఖ కమిషనర్ తమ శాఖ జిల్లాల అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఒక్కొక్కరికి రూ.10,116 సంభావన, ప్రశంసాపత్రం ఇచ్చి నూతన వస్త్రాలు, శాలువాతో సత్కరించాలని పేర్కొన్నారు. ఇందుకుగాను అర్చక సంక్షేమనిధి నుంచి ప్రతి జిల్లాకు రూ.50 వేల చొప్పున విడుదల చేయనున్నట్టు తెలిపారు. అధిక వార్షికాదాయం ఉండే ఆలయాలు సైతం వీలునుబట్టి స్థానిక ట్రస్టు బోర్డుల ఆమోదం మేరకు వాటి పరిధిలో ప్రత్యేకంగా ఉగాది పురస్కార కార్యక్రమాలు నిర్వహించుకోవాలని ఆయా ఆలయాల ఈవోలకు సూచించారు.

దేశం నలుమూలల శ్రీవారి ఆలయ నిర్మాణాలు

- టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి



ఆలయం ప్రథమ వార్షికోత్సవంలో టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి, విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ

కొమ్మాది(భీమిలి): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు దేశం నలుమూలల శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాలు (టీటీడీ ఆధ్వర్యంలో) నిర్మిస్తున్నామని టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి తెలిపారు. సోమవారం రుషికొండలోని శ్రీమహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం ప్రథమ వార్షికోత్సవానికి విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీతో కలసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే జమ్ము కశ్మీర్‌లో శ్రీవారి ఆలయ నిర్మాణం వేగవంతం అవుతుందన్నారు. అదే విధంగా శ్రీకాకుళం జిల్లా సీతంపేటలోనూ, రంపచోడవరంలో శ్రీవారి ఆలయాలు నిర్మిస్తామని, వచ్చే ఏప్రిల్‌లో ఆలయ నిర్మాణానికి ముహూర్తాలు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. వచ్చే ఏడాది నుంచి తిరుమల తిరుపతి దేవస్థానంలో జరిగే కార్యక్రమాలు యథావిధిగా రుషికొండ శ్రీవారి ఆలయంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. త్వరలో ఇక్కడ ఆలయంలో కళ్యాణ కట్ట, శ్రీవారి ప్రసాదం లడ్డూలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు పేర్కొన్నారు. శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి మాట్లాడుతూ సింహాచలం అప్పన్నస్వామి ప్రతిరూపంగా ఇక్కడ రుషికొండలో శ్రీవారు భక్తులకు దర్శనమిస్తున్నారన్నారు. సాగర తీరానికి అభిముఖంగా ఉన్న శ్రీవారి ఆలయం రానున్న కాలంలో ఉత్తరాంధ్ర వైకుంఠధామంగా వెలుగొందనుందని తెలిపారు.

పోలవరం ప్రాజెక్టు ఈఈ ఆదిరెడ్డి ఆకస్మిక మృతి

పోలవరం రూరల్: పోలవరం ప్రాజెక్టు డివిజన్–1లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న పానగంటి ఆదిరెడ్డి (61) గుండెపోటుతో మృతి చెందారు. ఆయన స్వస్థలం నెల్లూరు. సోమవారం ఉదయం ఆయన ఇంటి వద్ద నుంచి బయలుదేరి పోలవరం వచ్చారు. పోలవరం గ్రామంలోని ఇరిగేషన్ ప్రాజెక్టు క్వార్టర్స్‌లో మకాం ఉన్న ప్రాంతానికి చేరుకున్నారు. మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో భోజనం తినేందుకు లేచి కుప్పకూలిపోయి అపస్మారక స్థితిలోకి వెళ్లారు. వెంటనే అక్కడే ఉన్న సిబ్బంది 108కి సమాచారం ఇచ్చారు. కొద్దిసమయంలోనే అక్కడికి చేరుకున్న 108 అంబులెన్సులో ఆయన్ని పోలవరం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆదిరెడ్డికి భార్య, ఇద్దరు సంతానం. 2018లో పోలవరం ప్రాజెక్టుకు బదిలీపై వచ్చారు. ఆదిరెడ్డి మృతదేహాన్ని అంబులెన్స్‌లో స్వగ్రామమైన నెల్లూరుకు తరలించారు. విషయం తెలిసిన వెంటనే ప్రాజెక్టు సీఈ సుధాకర్‌బాబు, ఎస్ఈ నరసింహమూర్తి తదితరులు ఆస్పత్రికి వెళ్లి ఆదిరెడ్డి భౌతికకాయాన్ని సందర్శించారు.

అశక్తులకు 'వైఎస్సార్ పెన్షన్' శక్తి

సామాజిక భద్రతలో అగ్రగామిగా ఆంధ్రప్రదేశ్



కర్నూలు జిల్లా గూడూరుకు చెందిన ఉమాదేవి తలసేమియా వ్యాధితో బాధపడుతోంది. ప్రతి 21 రోజులకు ఒకసారి రక్తమార్పిడి చేయాలి. బిడ్డను కాపాడుకోవడానికి ఆమె తల్లిదండ్రులు పడుతున్న వేదనను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పెద్ద మనసుతో అర్థంచేసుకుంది. ఉమాదేవికి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్యం అందిస్తోంది. అంతేకాదు.. వైఎస్సార్ పెన్షన్ కానుకగా ప్రతినెలా రూ.10 వేలు పింఛను అందించి ఆ కుటుంబానికి భరోసా ఇస్తోంది.



కర్నూలు జిల్లా చానుగొండ్ల గ్రామానికి చెందిన గంగాధర్ హిమోఫిలియాతో బాధపడుతున్నాడు. మోకాళ్లు, కాలిమడం, చేతులు (జాయింట్లు) వాపులు వాస్తున్నాయి. కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో తలసేమియా, సికిల్‌సెల్ రోగుల మాదిరిగానే గంగాధర్‌కు కూడా వైద్యం అందించి ఉచితంగానే మందులు ఇస్తున్నారు. కష్టాల్లో ఉన్న అతని కుటుంబానికి భరోసా ఇచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ పెన్షన్ కానుక ద్వారా ప్రతినెలా రూ.10 వేలు అందిస్తోంది.

- దీర్ఘకాలిక రోగగ్రస్తులకు పెద్ద మొత్తంలో పెన్షన్ సాయం
- దేశంలోనే అత్యధిక పెన్షన్ ఇస్తున్న రాష్ట్రంగా ఏపీకి గుర్తింపు
- తలసేమియా, హీమోఫిలియా, సికిల్‌సెల్ బాధితులకు నెలకు రూ.10వేలు..
- పక్షవాతం, కండరాల క్షీణత, మూత్రపిండాల వ్యాధిగ్రస్తులకు రూ.5వేలు
- ఉచిత వైద్యంతోపాటు పెన్షన్ అందజేతతో జాతీయ స్థాయిలో ప్రశంసలు

సాక్షి, అమరావతి: .. ఇలా ఈ ఇద్దరికే కాదు.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో వేల మంది అశక్తులకు సీఎం వైఎస్ జగన్ పెన్షన్ అందిస్తూ వారికి శక్తినిస్తోంది. ఇలాంటి తీవ్ర, దీర్ఘకాలిక బాధితులను ఆదుకునేందుకు వారికి ఉచిత వైద్యంతో పాటు ప్రతి నెలా పెద్ద మొత్తంలో వారికి పెన్షన్ అందిస్తూ జాతీయస్థాయిలో ప్రశంసలు అందుకుంటోంది. తలసేమియా, సికిల్‌సెల్, హిమోఫిలియా, తీవ్రమైన మూత్రపిండాల (కిడ్నీ) రోగులు, కిడ్నీ, లివర్, గుండె శస్త్రచికిత్సలు చేయించుకున్న వారికి, ఇంకా అనేక దీర్ఘకాలిక అనారోగ్యాలతో బాధపడుతున్న వారికి, దివ్యాంగులకు సైతం నెలవారీ పెన్షన్ అందిస్తూ వారికి కొండంత అండగా నిలుస్తోంది. అలాగే, దేశంలో అత్యధిక పెన్షన్ మొత్తాన్ని అందిస్తున్న రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ రికార్డు సృష్టించింది. ఇదే విషయాన్ని కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత మంత్రి వీరేంద్రకుమార్ సైతం గతేడాది గుజరాత్‌లో జరిగిన జాతీయ సదస్సులో ప్రస్తావించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని అభినందించారు. ఏపీని మిగిలిన రాష్ట్రాలూ స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. మొత్తం మీద సామాజిక భద్రతలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అగ్రగామిగా నిలుస్తోందనడానికి ఇదే గొప్ప నిదర్శనం.

దివ్యాంగులకు బాబు మొక్కుబడిగా..

గత చంద్రబాబు ప్రభుత్వం రాష్ట్రంలో దివ్యాంగులకు నామమాత్రంగా పెన్షన్ ఇచ్చి సరిపెట్టింది. అది కూడా వారిని రెండు కేటగిరిలుగా చూపించి రూ.వెయ్యి, రూ.1,500 చొప్పున పెన్షన్ ఇచ్చేది. కానీ, వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక 2019 జూన్ నుంచి దివ్యాంగులతోపాటు అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సాంత్వన చేకూర్చేలా పింఛన్లు మంజూరు చేసింది. దివ్యాంగులందరిని ఒకే కేటగిరిగా చేసి నెలకు రూ.3 వేలు చొప్పున పింఛను ఇస్తుండటం విశేషం.



శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలంలో కిడ్నీ వ్యాధిగ్రస్తురాలికి రూ.10 వేలు పింఛను అందిస్తున్న వలంటీర్, గృహసారథులు

సమస్యల వారీగా రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న పెన్షన్ వివరాలు..

వ్యాధి	ఎంతమంది	నెలకు ఒకరికి (రూ.లలో)	నెలకు మొత్తం (రూ.లలో)
తలసేమియా	1,456	10వేలు	1,45,60,000
సికిల్ సెల్	1,668	10వేలు	1,66,80,000
తీవ్రమైన హీమోఫిలియా	1,081	10వేలు	1,08,10,000
తీవ్రమైన కిడ్నీ సమస్యతో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారు	4,352	10వేలు	4,35,20,000
తీవ్రమైన కిడ్నీ సమస్యతో ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నవారు	6,306	10వేలు	6,30,60,000
కిడ్నీ, కాలేయం, గుండె మార్పిడి	1,526	5వేలు	76,30,000
ద్వైపాక్షిక బోదకాలు–గ్రేడ్ 4 (ఎలిఫెంటియాసిస్)	1,290	5వేలు	64,50,000

అశక్తులకు అండగా ప్రభుత్వం



రాష్ట్రంలో అశక్తులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తోంది. రాష్ట్రంలో 14 రకాల రోగ పీడితులు, వైకల్యాలున్న 7,98,352 మందికి నెలకు మొత్తం రూ.255కోట్లకు పైగా పింఛన్లు ఇస్తోంది. దివ్యాంగులతోపాటు తలసేమియా, సికిల్‌సెల్, హీమోఫిలియా, బోదకాలు, కిడ్నీ, లివర్, గుండె మార్పిడి చేసుకున్న వారికి, కిడ్నీ రోగులకు, కుష్టు వ్యాధిగ్రస్తులకు, పక్షవాతం, రోడ్డు ప్రమాదాలతో కుర్చీ, మంచానికే పరిమితమైన వారికి, కండరాల క్షీణత వంటి సమస్యలున్న వారికి ప్రభుత్వం ఉచిత వైద్యంతోపాటు నెలనెలా పింఛను ఇస్తూ ఆదుకుంటోంది.

– బి. రవిప్రకాశ్‌రెడ్డి, సంచాలకుడు, రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ



వైభవంగా ఖాద్రీశుడి బ్రహ్మ రథోత్సవం

కదిరి: అశేష భక్తజనం గోవింద నామస్మరణ మధ్య సోమవారం శ్రీసత్యసాయి జిల్లా కదిరిలో శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మ రథోత్సవం వైభవంగా జరిగింది. సాక్షాత్తు బ్రహ్మ దేవుడే ముందుండి రథాన్ని నడిపి స్వామివారు తిరువీధుల్లో విహరించేందుకు సహకరిస్తారని భక్తుల నమ్మకం. ప్రత్యేక పూజల అనంతరం ఉదయం 8.11 గంటలకు రథం ముందుకు కదిలింది. స్వామివారు తిరువీధుల గుండా విహరిస్తూ మధ్యాహ్నం 1.24 గంటలకు యథాస్థానం చేరుకున్నారు. తొలుత కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి ప్రత్యేక పూజలు జరిపి లక్ష్మీనారసింహుడిని దర్శించుకున్నారు. అనంతరం రథాన్ని కొంత దూరం లాగి రథోత్సవాన్ని ప్రారంభించారు. మూడు లక్షల మందికి పైగా భక్తులు రథోత్సవానికి విచ్చేసినట్లు అధికారుల అంచనా.

108 వాహనంలో అగ్నిప్రమాదం

పామూరు: షార్ట్ సర్క్యూట్‌తో 108 వాహనం అగ్ని ప్రమాదానికి గురైన ఘటన ప్రకాశం జిల్లా పామూరు మండలంలో సోమవారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. పామూరు మండలం రజాసాహెబ్‌పేట గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని డయాలసిస్ నిమిత్తం కందుకూరు తీసుకెళ్లేందుకు సీఎస్ పురం మండలానికి చెందిన 108 వాహనంతో వాహన పైలెట్ పరాంకుశం తిరుపతిరావు, ఈఎంటీ మధుసూదన్‌రెడ్డి రజాసాహెబ్‌పేటకు వెళ్లారు. గ్రామంలోని ఎస్టీకాలనీకి చెందిన డయాలసిస్ బాధితుడు జయంపు ఏసురాజు, అతని తల్లి వరమ్మను ఎక్కించుకున్నారు. వాహనం గ్రామ సమీపంలోని పొగాకు బ్యారన్‌లు దాటుతుండగా వాహన పైలెట్ తిరుపతిరావు సీట్ వద్ద చిన్నగా మంటలు వచ్చాయి. వెంటనే అప్రమత్తమై 108లోని అందరూ కిందకు దిగారు. క్షణాల్లో వాహనం మొత్తం మంటలు వ్యాపించాయి. స్థానికులు నీరు జల్లి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అయితే వాహనంలోని ఆక్సిజన్ సిలిండర్, డీజిల్ ట్యాంకర్ పేలి సమీపంలోని పొగాకు బ్యారన్ వద్ద బేళ్లు వేసేందుకు సిద్ధంగా ఉన్న పొగాకుపై నిప్పులు పడ్డాయి. పొగాకు పూర్తిగా కాలిపోయింది. మంటలపై నీరు పోసేందుకు యత్నించిన సాదినేని వరదయ్య అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామానికి చెందిన పొన్నగంటి నరసింహ, జయమ్మలకు రూ.25 లక్షలు, పోలిబోయిన మల్లికార్జునకు రూ.10 లక్షలు, యర్రగొర్ల మాల్యాద్రి, పద్మలకు రూ.5లక్షల పంట నష్టం ఏర్పడిందని సమాచారం. మరికొందరి పొగాకు పాక్షికంగా కాలిపోయింది. అగ్నిమాపక సిబ్బంది రంగంలోకి దిగి మంటలను ఆర్పివేశారు.

తల్లీ కూతురు హత్య.. వ్యక్తికి జీవితాంత ఖైదు



నిందితుడు సయ్యద్ మౌలాలి


చిత్తూరు అర్బన్: తల్లీ, కూతు రిని హతమార్చి.. బాలికపై లైంగికదాడికి పాల్పడ్డ వ్యక్తికి మరణించేంత వరకు జైలుశిక్ష విధిస్తూ చిత్తూరులోని ప్రత్యేక మహిళా కోర్టు సోమవారం తీర్పునిచ్చింది. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ శైలజ కథనం మేరకు.. తంబళ్లపల్లె మండలంలోని గంగిరెడ్డి కాలనీకి చెందిన సయ్యద్ మౌలాలి(47) అనే వ్యక్తి వృత్తిరీత్యా చెరువులను లీజుకు తీసుకుని చేపలు పట్టి విక్రయించే వ్యాపారం చేసేవాడు. మండలంలోని గిరిజన తాండాకు చెందిన సరళమ్మ(37)కు భర్త మరణించాడు. ఆమెతో మౌలాలి కొన్నాళ్లపాటు సహజీవనం చేశాడు. ఆమెకు ముగ్గురు కుమార్తెలు, తల్లి ఉన్నారు. సరళమ్మ వేరే మగాళ్లతో ఫోన్‌లో మాట్లాడుతోందనే అనుమానంతో ఆమెతో రాత్రి పొలం వద్ద గొడవపడ్డాడు. మాటామాటా పెరిగి ఆమెను కర్రతో తలపై కొట్టాడు. ఆమె చనిపోవడంతో పెద్దేరు ప్రాజెక్టులో వేసేశాడు. శవం పైకి తేలకుండా చీరకు రాళ్లు కట్టిపడేశాడు. మరుసటి రోజు ఆమె తల్లి గంగులమ్మ తన కుమార్తె ఎక్కడని మౌలాలిని నిలదీసింది. నీ కుమార్తె ఉదయానికల్లా వస్తుందని నమ్మబలికాడు. ఆమెకు మద్యం అలవాటు ఉండడంతో మద్యం తెచ్చి ఇచ్చాడు. ఆమె నిద్రిస్తున్న సమయంలో చీరకొంగుతో గొంతుకు బిగించి చంపేశాడు. శవాన్ని ఓ చెరువులోకి తీసుకెళ్లాడు. శవం పైకి లేవకుండా ఆమె చీరను నీటిలోని ఓ చెట్టు మొదలుకు కట్టివేశాడు. ఆ మరుసటిరోజు సరళమ్మ కుమార్తెలు తమ అమ్మ, అవ్వ ఎక్కడని మౌలాలీని నిలదీశారు. వారికి కరోనా రావడంతో మదనపల్లె ఆస్పత్రిలో చేర్పించానని వారిని నమ్మించాడు. వారితో కలసి అక్కడే పడుకునే వాడు. వారిలో పెద్ద అమ్మాయిపై లైంగిక దాడి చేశాడు. ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించాడు. ఇలా నెల రోజులు గడిచాక ఆ పిల్లలు ముగ్గురిని కర్ణాటక గౌనిపల్లెలోని ఓ ఇంట్లో ఉంచాడు.

బంధువుల ఫిర్యాదు

సరళమ్మ, ఆమె తల్లి గంగులమ్మ, కుమార్తె కనపడకపోవడంతో వారి బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడు సయ్యద్ మౌలాలిని అరెస్టు చేసి.. బాలికలను అతడి నుంచి విడిపించారు. నిందితుడు చెప్పిన వివరాలతో చెరువులో పడున్న తల్లి, కుమార్తె మృతదేహాలను బయటకు తీశారు. అతనిపై పలు హత్యలు, అత్యాచారం, అట్రాసిటీ, అపహరణ కేసులు నమోదు చేశారు. నిందితుడిపై మోపిన అభియోగాలు న్యాయస్థానంలో రుజువుకావడంతో.. అతను మరణించేంత వరకు జైల్లో ఉండాలని, రూ.10 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి శాంతి సోమవారం తీర్పునిచ్చారు. బాలికకు రూ.5 లక్షల పరిహారం మంజూరు చేయాలని కలెక్టర్‌కు సూచిస్తూ తీర్పులో పేర్కొన్నారు.

ఎయిమ్స్‌కు రాష్ట్ర ప్రభుత్వ సహకారం భేష్

- వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద నవంబర్ నుంచి 710 మంది రోగులకు చికిత్స
- మంగళగిరి ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ ముఖేశ్ త్రిపాఠి



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న మంగళగిరి ఎయిమ్స్ డైరెక్టర్ ముఖేశ్ త్రిపాఠి, డీన్‌లు

సాక్షి, అమరావతి: మంగళగిరిలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)కి రాష్ట్ర ప్రభుత్వ సహకారం భేషుగ్గా ఉందని ఆ సంస్థ డైరెక్టర్, సీఈవో డాక్టర్ ముఖేశ్ త్రిపాఠి చెప్పారు. ఎయిమ్స్‌లో వైద్యసేవలు ప్రారంభించి నాలుగు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సోమవారం వార్షికోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తాను స్వయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను కలిసి ప్రభుత్వం వైపు నుంచి కావాల్సిన సహకారాన్ని వివరించినట్టు తెలిపారు. సీఎం సానుకూలంగా స్పందించారన్నారు. ఎయిమ్స్‌కు శాశ్వత నీటిసరఫరా పనులను ఈ ఏడాది జూలైలోగా పూర్తిచేయాలని అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశించినట్టు తెలిపారు. రహదారి సౌకర్యానికి సంబంధించి కేంద్ర అటవీశాఖ నుంచి అనుమతులు లభించాయని, ఆర్‌అండ్‌బీ శాఖ రోడ్డు వేయడానికి చర్యలు తీసుకుంటోందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఎయిమ్స్‌లో వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ట్రస్టుతో ఎంవోయూ చేసుకున్నట్టు చెప్పారు. ఆరోగ్యశ్రీ పథకం కింద గత నవంబర్ నుంచి ఇప్పటివరకు 710 మంది రోగులు ఉచితంగా వైద్యసేవలు అందుకున్నారన్నారు. 2019 మార్చి 12వ తేదీన రోగుల సంరక్షణ సేవలు ప్రారంభించామని, ఈ నాలుగేళ్లలో 9,67,192 మంది ఓపీ, 7,477 మంది ఐపీ సేవలు అందుకున్నారని వివరించారు. ఇప్పటివరకు 2,590 మేజర్, 29,486 మైనర్ సర్జరీలు నిర్వహించామన్నారు. 37 స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ సేవలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయని చెప్పారు. త్వరలోనే కార్డియాలజీ సేవలను అందుబాటులోకి తీసుకొస్తామని, ఇందుకోసం వైద్యుల నియామకం చేపడుతున్నామని తెలిపారు. ప్రస్తుతం రోజుకు సగటున 2,500 మంది రోగులు ఓపీ సేవలు పొందుతున్నట్టు చెప్పారు. ఇన్‌పేషంట్స్ కోసం 555 బెడ్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యం, పరీక్షలకు రూ.వంద ఖర్చవుతుంటే.. తమవద్ద రూ.30 నుంచి రూ.40 వరకు మాత్రమే ఖర్చవుతాయని చెప్పారు. ఆస్పత్రిలో ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ అమలవుతోందని ఈ క్రమంలో ప్రజలు ఆన్‌లైన్‌లో ఓపీడీ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. ప్రస్తుతం ఎంబీబీఎస్, నర్సింగ్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని, త్వరలో పారా మెడికల్ కోర్సులను అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. రూ.1,680 కోట్లతో చేపట్టిన ఎయిమ్స్ ఏర్పాటు పనులు పూర్తి కావచ్చాయని ఆయన తెలిపారు. చికిత్స పొందిన పలువురు రోగులు తమ అనుభవాలను మీడియాతో పంచుకున్నారు. తమకు వైద్యసేవల్లో ఎయిమ్స్ చూపుతున్న చొరవను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రిటైర్డ్ ఉద్యోగులు ప్రశంసించారు. సంఘం తరపున డైరెక్టర్, డీన్‌లకు జ్ఞాపికలు ఇచ్చారు. అనంతరం నాలుగేళ్ల ఎయిమ్స్ ప్రస్థానంపై రూపొందించిన బ్రోచర్‌ను డైరెక్టర్, డీన్‌లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీన్‌లు డాక్టర్ జాయ్ ఎ ఘోషల్, డాక్టర్ శ్రీమంతకుమార్ దాస్, డాక్టర్ దీప్తి వేపకొమ్మ, డాక్టర్ వినీత్ థామస్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శంకరన్, మీడియా సెల్ ప్రతినిధి వంశీకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

తెలంగాణ

ఏఈ పేపర్ లీక్

- ఈ నెల 5న జరిగిన పరీక్ష రెండు పేపర్లు ముందే లీక్
- టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీర్ పేపర్ కూడా బయటికి..

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ఈ నెల 5న నిర్వహించిన అసిస్టెంట్ ఇంజనీర్స్ (ఏఈ సివిల్) పరీక్ష పేపర్లు లీకైనట్టు పోలీసులు తేల్చారు. టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి వ్యక్తిగత సహాయకుడైన పి.ప్రవీణ్ కుమార్ ఈ ప్రశ్నపత్రాలనే టీచర్ రేణుక, ఆమె భర్త లవుద్యావత్ డాక్యాకు అందించాడని గుర్తించారు. వీటితోపాటు ప్రవీణ్‌కు చెందిన పెన్‌డ్రైవ్‌లో టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీర్ పరీక్ష పేపర్ కూడా ఉందని, దాన్ని విక్రయించేందుకు అతను ఒప్పందం చేసుకున్నాడని ఆధారాలు సేకరించారు. ఈ వ్యవహారంపై దర్యాప్తు చేసిన సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రఘునాథ్ నేతృత్వంలోని బృందం.. ప్రవీణ్‌తోపాటు, రాజశేఖర్, రేణుక, లవుద్యావత్ డాక్యా, రాజేశ్వర్, నీలేశ్, గోపాల్, శ్రీనివాస్, రాజేందర్‌లను అరెస్టు చేసింది. వారి నుంచి పెన్‌డ్రైవ్‌లు, ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకుంది. ప్రవీణ్ పెన్‌డ్రైవ్‌ను పరిశీలించిన పోలీసులు.. అందులో టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీర్ పరీక్ష పేపర్ ఉందని, దాన్ని విక్రయించడానికి అతను ప్రయత్నించాడని గుర్తించారు. ప్రవీణ్ కంప్యూటర్‌ను ఫోరెన్సిక్ పరీక్షలకు పంపారు. ఆ నివేదిక అందిన తర్వాత.. అతను, రాజశేఖర్ ఎప్పుడెప్పుడు, ఎవరెవరి కంప్యూటర్లను యాక్సస్ చేశారు? ఏమేం పేపర్లు డౌన్‌లోడ్ చేశారనేది తెలుతుందని హైదరాబాద్ సౌత్‌వెస్ట్ జోన్ డీసీపీ కిరణ్ సోమవారం వెల్లడించారు.

సాక్షి దినపత్రికకు చందాదారులుగా మీరు చేరదలిచారా?
అయితే ఈ నెంబరుకు మిస్డ్ కాల్ ఇవ్వగలరు
8678906509
మేము మీకు అందుబాటులో ఉంటాము
సాక్షి

తెలుగువారికి సీడబ్ల్యూసీ వచ్చేనా?

- కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో చోటు కోసం తెలంగాణ, ఏపీ నేతల యత్నాలు
- సుబ్బరామిరెడ్డికి రెన్యువల్ చేసే అవకాశం ఉందనే అంచనాలు
- తన వంతు ప్రయత్నాలు చేస్తున్న సీనియర్ నేత జానారెడ్డి!
- ఢిల్లీలో ప్రయత్నాలు, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జితో మంతనాలు
- టీపీసీసీ నుంచి హైకమాండ్‌కు మూడు పేర్లు?
- జానా, మల్లు రవి, షబ్బీర్ అలీలను సిఫార్సు చేశారనే ప్రచారం

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్‌లో అత్యున్నత విధాన నిర్ణాయక మండలి అయిన వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ)లో తెలుగు వారికి చోటు లభించడంపై పార్టీలో తీవ్ర చర్చ జరుగుతోంది. ఇటీవలే కాంగ్రెస్ ప్లీనరీ జరిగిన నేపథ్యంలో త్వరలోనే సీడబ్ల్యూసీతోపాటు పార్టీ జాతీయ కార్యవర్గాన్ని ప్రకటించాల్సి ఉంది. ఇందులో సీడబ్ల్యూసీతోపాటు పార్టీ ప్రధాన కార్యదర్శి పదవులపై తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు నేతలు ఆశలు పెట్టుకున్నారు. సీడబ్ల్యూసీలో సభ్యత్వం కోసం మొదటి నుంచీ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సీనియర్ నాయకుడు, ప్రస్తుత సీడబ్ల్యూసీ సభ్యుడు టి.సుబ్బరామిరెడ్డి పేరు వినిపిస్తుండగా.. తాజాగా తెలంగాణ సీనియర్ నాయకుడు జానారెడ్డి పేరు తెరపైకి వచ్చింది.

ఎవరికి చాన్స్ ఇస్తారు?

ఏపీకి చెందిన సుబ్బరామిరెడ్డి గాంధీ కుటుంబానికి సన్నిహితుడు కావడం, సోనియాగాంధీతో సహా ఇతర కాంగ్రెస్ పెద్దలతో రాజకీయంగా సంబంధాలు ఉండటంతో ఆయనకు ఈసారి కూడా సీడబ్ల్యూసీ సభ్యత్వం వస్తుందనే చర్చ జరుగుతోంది. మరోవైపు సీడబ్ల్యూసీలో తెలుగు రాష్ట్రాల నేతలకు అవకాశం దక్కడం కష్టమేనని, వచ్చినా సుబ్బరామిరెడ్డికి మాత్రమే పరిమితం అవుతుందని పార్టీ వర్గాలు అంటున్నాయి. అయితే తెలంగాణ సీనియర్ నాయకులు కొందరు సీడబ్ల్యూసీ సభ్యత్వంపై ఆశలు పెట్టుకున్నారు. ఈ దిశగా కె.జానారెడ్డి తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది. ఇందుకోసం ఆయన ఢిల్లీ వెళ్లి వచ్చారనే చర్చ గాంధీభవన్ వర్గాల్లో జరుగుతోంది. ఇటీవల రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే హైదరాబాద్ వచ్చినప్పుడు ఆయనను కలసి సీడబ్ల్యూసీ సభ్యత్వంపై చర్చించినట్టు సమాచారం.

మూడు పేర్లు సిఫార్సు!

టీపీసీసీ నుంచి సీడబ్ల్యూసీ కోసం మూడు పేర్లు ప్రతిపాదించారని.. సామాజిక కోణంలో ఓసీలకైతే జానారెడ్డి, ఎస్సీలకు అయితే మల్లు రవి, మైనార్టీలకు ఇవ్వాల్సి వస్తే షబ్బీర్ అలీకి చాన్స్ ఇవ్వాలని అధిష్టానాన్ని కోరినట్టు సమాచారం. టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడిగా ఉన్న మల్లు రవి.. సీడబ్ల్యూసీకి ఎన్నికలు జరిగితే పోటీ చేయాలని భావించారు. కానీ సీడబ్ల్యూసీకి ఎన్నికలు వద్దని ఏఐసీసీ నిర్ణయించడంతో నేరుగా పదవి కోసం ప్రయత్నాలు చేసుకుంటున్నట్టు తెలిసింది. మొత్తమ్మీద కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో తెలుగు రాష్ట్రాల నేతలకు ప్రాతినిధ్యం లభిస్తుందా? వస్తే ఎవరికి అనే చర్చ గాంధీభవన్ వర్గాల్లో జోరుగా సాగుతోంది.

చల్లగరిగలో ఆస్కార్ పండుగ

- 'నాటు..నాటు' రచయిత చంద్రబోస్ స్వగ్రామంలో వేడుకలు

వరంగల్ డెస్క్: విశ్వ వేదికపై చెలరేగి బెస్ట్ ఒరిజినల్ సాంగ్ కేటగిరీలో ఆస్కార్ అవార్డు దక్కించుకున్న 'నాటు.నాటు' పాట రచయిత చంద్రబోస్ స్వగ్రామం జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం చల్లగరిగలో సోమవారం పండుగ వాతావరణం నెలకొంది. చంద్రబోస్ పేరు విశ్వవేదికపై మారుమోగడంతో యావత్ గ్రామం సంబరాల్లో మునిగిపోయింది. చంద్రబోస్ వేదికపై నిల్చుని ఆస్కార్ అవార్డు అందుకున్న క్షణాలను టీవీల్లో చూసిన గ్రామస్తులు పులకించిపోయారు. చంద్రబోస్ ఇంటి ముందు బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచి సంబరాలు జరుపుకున్నారు.

గ్రంథాలయంలో పఠనం.. శివాలయంలో భజనలు

చంద్రబోస్‌గా సుపరిచితమైన కనుకుంట్ల సుభాష్ చంద్రబోస్ తండ్రి నర్సయ్య ఉపాధ్యాయుడు. తల్లి మదనమ్మ గృహిణి. వీరికి నలుగురు(రాజేందర్, కోటేశ్వర్‌రావు, స్వరూప, చంద్రబోస్) సంతానం కాగా చంద్రబోస్ ఆఖరివాడు. ఒకటినుంచి పదో తరగతి వరకు స్వగ్రామమైన చల్లగరిగలోనే చదివాడు. గ్రామంలో చంద్రబోస్ ఇంటిని అనుకునే గ్రంథాలయం, దానికి అనుకుని శివాలయం ఉంటాయి. పాఠశాల ముగియగానే గ్రంథాలయానికి వెళ్లేవాడు. చందమామ, బొమ్మరిల్లు, పురాణ గాథలు.. ఇలా గ్రంథాలయంలోని ప్రతి పుస్తకాన్ని చదివేవాడు. ఆ సమయంలోనే చిన్న చిన్న కవితలు, కథలు రాసి గ్రంథాలయంలో ఉంచేవాడని, తను రాసినవి ఎవరైనా చదువుతున్నారా.. లేదా అన్నది కిటకిలోనుంచి చూసేవాడని బాల్యమిత్రుడు దావు వీరారెడ్డి తెలిపారు. ఇక ప్రతి సోమవారం శివాలయంలో భజనలు చేసేవారు. ఇందులో చంద్రబోస్ లేకుండా భజన సాగేది కాదు. తండ్రి తబలా కొడుతుంటే చంద్రబోస్ పాటలు, కీర్తనలు పాడేవాడని, ఇంటిల్లిపాదికీ ఆధ్యాత్మిక భావన ఎక్కువని గ్రామస్తులు చెప్పుకొచ్చారు. హార్మోనియం, కంజర బాగా కొట్టేవాడని తెలిపారు. చంద్రబోస్‌లో సాహిత్య కాంక్ష పెరగడానికి, పాటల రచయితగా ఎదగడానికి గ్రంథాలయం, శివాలయమే కారణమని, ఇవి లేకుండా చంద్రబోస్ ప్రస్థానాన్ని ఊహించుకోలేమని గ్రామానికి చెందిన రాజమౌళి చెప్పారు. హైదరాబాద్‌లో డిప్లొమా, ఇంజనీరింగ్ చదివి..ఆ తర్వాత సినీ రంగ ప్రవేశం చేశారని తెలిపారు.

ओएनजीसी
ONGC
Oil and Natural Gas Corporation Ltd.
ఈస్ట్రన్ ఆఫ్‌షోర్ అసెట్ / HPHT అసెట్, కాకినాడ (ఆం.ప్ర.)
ఆసక్తి వ్యక్తీకరణ (EOI)
EOA/HPHT అసెట్, కాకినాడ వారు ONGC OGT, మల్లవరం, HPHT-EOA, ONGC, తూర్పు గోదావరి జిల్లా వద్ద 3 సంవత్సరాల కొరకు వార్షిక సివిల్ నిర్వహణ పనులు చేపట్టుటకు ప్రముఖ మరియు అనుభవం గల ఏజెన్సీల నుండి ఆసక్తి వ్యక్తీకరణ (EOI) కోరుతున్నారు. ఆసక్తి గల ఏజెన్సీలు PQC (గత అనుభవం) సంబంధించి డాక్యుమెంటరీ రుజువుతో పాటు తమ ప్రొఫైల్‌ను saravanan2_r@ongc.co.in మరియు yaaaswi_akkiraju@ongc.co.in కు ఇ-మెయిల్ ద్వారా 03-04-2023న 14.00 గం.కు లేదా ఆలోగా దాఖలు చేయవలసిందిగా కోరబడుతున్నారు. తదుపరి వివరాల కోసం వెబ్‌సైట్ http://tenders.ongc.co.in దర్శించండి.
ఓఎన్‌జిసి జీతేగా తో జీతేగా ఇండియా

క్లుప్తంగా...

అమెరికా తుపాకీ సంస్కృతికి నాలుగేళ్ల చిన్నారి బలి

హూస్టన్: ఇంటికో తుపాకీ పథకం అమల్లో ఉందా అన్నట్లు కనిపించే అమెరికాలో గన్ కల్చర్.. నాలుగేళ్ల చిన్నారి ప్రాణాలను తోడేసింది. టెక్సాస్ రాష్ట్రంలోని హూస్టన్ నగర సమీపంలోని హ్యారిస్ కౌంటీలో ఆదివారం ఈ దుర్ఘటన జరిగింది. కౌంటీ పోలీసు అధికారి ఎడ్ గోంజాల్వేజ్ తెలిపిన వివరాల ప్రకారం 'బామెల్ నార్త్ హూస్టన్ రోడ్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లోని ఇంట్లో ఐదుగురు పిల్లలు ఆడుకుంటున్నారు. వీరిలో నాలుగు, మూడేళ్ల అక్కాచెల్లెళ్లు ఇంటి పడకగదిలోకెళ్లి అక్కడే ఉన్న సెమీ ఆటోమేటిక్ పిస్టల్‌ను చూశారు. పిస్టల్‌ను చేతిలోకి తీసుకున్న చెల్లెలు వెంటనే అక్కకు గురిపెట్టి కాల్చింది. తుపాకీ శబ్దంతో కుటుంబసభ్యులు హుటాహుటిన అక్కడికొచ్చి చూసేసరికి నాలుగేళ్ల అమ్మాయి రక్తమోడుతూ కనిపించింది. 911కు ఫోన్‌చేసి అత్యవసర సిబ్బంది వచ్చి వైద్యంచేసేలోపే చిన్నారి ప్రాణాలు విడిచింది. లోడ్ చేసిన తుపాకులను జాగ్రత్త చేయాలని ఎంతగా విజ్ఞప్తి చేస్తున్నా తుపాకీ యజమానుల నిర్లక్ష్యం ఇలా ఎందరో అమాయకుల ప్రాణాలను బలికోరుతోంది' అని ఆయన విచారం వ్యక్తంచేశారు.

విమానంలో మెడికల్ ఎమర్జెన్సీ ప్రయాణికుని మృతి

న్యూఢిల్లీ/కరాచీ: ఢిల్లీ నుంచి దోహాకు బయల్దేరిన ఇండిగో విమానంలో ప్రయాణికుడు హఠాత్తుగా అనారోగ్యానికి గురై ప్రాణాలు కోల్పోయారు. ఆదివారం రాత్రి జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మృతున్ని నైజీరియాకు చెందిన 60 ఏళ్ల అబ్దుల్లాగా గుర్తించారు. విమానం ఆదివారం ఢిల్లీ నుంచి దోహా (ఖతార్) వెళ్తుండగా మార్గమధ్యంలో అబ్దుల్లా ఆరోగ్యం క్షీణించింది. మెడికల్ ఎమర్జెన్సీ కారణంగా వెంటనే విమానాన్ని పాకిస్తాన్‌లోని కరాచీ ఎయిర్‌పోర్ట్‌లో దింపేసి వైద్య బృందాన్ని రప్పించారు. కానీ అప్పటికే అతను మృతి చెందాడు.

నేపాల్ అధ్యక్షుడిగా పౌడెల్ ప్రమాణం

కఠ్మాండు: నేపాల్ మూడో అధ్యక్షుడిగా రాంచంద్ర పౌడెల్(78) సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఇటీవలి ఎన్నికల్లో నేపాలీ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత పౌడెల్ సీపీఎన్–యూఎంఎల్ సారథ్యంలోని ప్రతిపక్ష కూటమి బలపరిచిన సుభాష్ చంద్ర నెంబంగ్‌పై సునాయాస విజయం సాధించిన విషయం తెలిసిందే. ఆయనకు 8 పార్టీలు మద్దతు ప్రకటించాయి. పౌడెల్ గతంలో పార్లమెంట్ స్పీకర్‌గా, ఐదు పర్యాయాలు మంత్రిగా పనిచేశారు.

ప్రకృతి రమణీయత ఉట్టిపడే అందమైన దేశం, ప్రపంచ పర్యాటకులకు స్వర్గధామమైన థాయ్‌లాండ్‌ను వాయు కాలుష్యం ముంచెత్తుతోంది. గాలి నాణ్యత దారుణంగా పడిపోతుండడంతో జనం ఇళ్లకే పరిమితం కావాల్సి వస్తోంది. గాలి నాణ్యతను ఎప్పటికప్పుడు తెలియజేసే యాప్‌లను జనం ఫోన్లలో ఇన్‌స్టాల్ చేసుకుంటున్నారు. యాప్ ఇచ్చే సూచనల ప్రకారం నడుచుకుంటున్నారు. ఎర్ర మార్క్ కనిపిస్తే ఇంట్లో ఉండిపోవాల్సిందే. ఉదయం పూట వ్యాయామం చేయాలన్నా బయటకు వెళ్లలేని పరిస్థితి. థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో కాలుష్యం బెడద మరింత తీవ్రంగా ఉండడం కలవరం సృష్టిస్తోంది. ఎయిర్ పొల్యూషన్ దెబ్బకు టూరిస్టుల సంఖ్య తగ్గిపోతోంది. ప్రధాన పర్యాటక ప్రాంతాలు వెలవెలబోతున్నాయి.



సుందర దేశంలో విషపు గాలి!

14.49 లక్షల మంది బాధితులు

థాయ్‌లాండ్ ప్రజారోగ్య శాఖ గణాంకాల ప్రకారం.. కాలుష్యం వల్ల దేశంలో ఈ ఏడాది జనవరి 1 నుంచి ఇప్పటిదాకా 14,49,716 మంది అస్వస్థతకు గురయ్యారు. రాజధాని బ్యాంకాక్‌లో 31,695 మంది అనారోగ్యం బారినపడ్డారు. శ్వాస పీల్చుకోవడంలో ఇబ్బందులకు గురయ్యారు. బాధితుల్లో క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్, నిమోనియా, బ్రాంకైటీస్, ఆస్తమా, ఇన్‌ఫ్లూయెంజా, ఊపిరితిత్తుల క్యాన్సర్ వంటి లక్షణాలు కనిపించాయి. బ్యాంకాక్‌లో తాజాగా 50కిపైగా ప్రాంతాల్లో పీఎం 2.5 స్థాయిలు క్యూబిక్ మీటర్‌కు 51 నుంచి 78 మైక్రోగ్రాములు ఉన్నట్లు తేలిందని కాలుష్య నియంత్రణ విభాగం డైరెక్టర్ జనరల్ పిన్సాక్ సురాస్వాడీ చెప్పారు. ఇంటి నుంచి బయటకు వెళ్లినప్పుడు కాలుష్యం నుంచి ఉపశమనం కోసం ప్రజలు ముఖానికి మాస్కు తప్పనిసరిగా ధరించాలని థాయ్ ఎయిర్ క్వాలిటీ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రఫాన్ సూచించారు. కాలుష్యం తీవ్రత తగ్గుముఖం పట్టకపోతే ఇళ్ల నుంచే పనిచేయాలని ఉద్యోగులకు సూచిస్తామని థాయ్‌లాండ్ మంత్రి అనుపోంగ్ పావోజిండా చెప్పారు. బ్యాంకాక్‌లో వాహనాల రాకపోకలపై ఆంక్షలు విధించాలని భావిస్తున్నట్లు తెలిపారు.



ప్రత్యేక వైద్యశాలలు

కాలుష్యం, తద్వారా అనారోగ్య సమస్యలు పెరిగిపోతుండడంతో థాయ్‌లాండ్ ప్రజారోగ్య శాఖ ప్రత్యేక వైద్యశాలలు ఏర్పాటు చేసింది

థాయ్‌లాండ్‌ను ముంచెత్తుతున్న వాయు కాలుష్యం

ఈ ఏడాది ఇప్పటిదాకా 14,49,716 మందికి అస్వస్థత

పంట వ్యర్థాల దహనం, ట్రాఫిక్‌తో సమస్య తీవ్రం

నానాటికీ క్షీణిస్తున్న వాయు నాణ్యత

కాలుష్యం బారినపడిన వారిలో శ్వాస ఆడకపోవడం, చర్మంపై దద్దుర్లు, గుండె సంబంధిత వ్యాధులు తలెత్తున్నాయి.

బాధితులకు చికిత్స అందించడానికి దేశవ్యాప్తంగా 66 ప్రత్యేక క్లినిక్‌లు ఏర్పాటు చేశారు.

వాయు కాలుష్యంతో ముడిపడి ఉన్న వ్యాధులు, నివారణ చర్యలపై సమగ్ర అధ్యయనం చేయాలని బ్యాంకాక్‌లోని 22 ప్రధాన ఆసుపత్రులకు వ్యాధుల నియంత్రణ విభాగం సూచించింది.

–సాక్షి, నేషనల్ డెస్క్

ఎందుకీ తీవ్ర కాలుష్యం?

థాయ్‌లాండ్‌లో ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ దాకా ప్రభుత్వం తరచుగా కాలుష్య హెచ్చరికలు జారీ చేయడం సాధారణమే. అయితే, ఈసారి మాత్రం కాలుష్య తీవ్రత మరింత పెరిగింది. ఉత్తర థాయ్‌లాండ్‌లో రైతులు పంట వ్యర్థాలను దహనం చేస్తుంటారు. మూడు నెలల పాటు ఈ సీజన్ కొనసాగుతుంది. ఈ సమయంలో తీవ్ర కాలుష్యం ఉత్పన్నమవుతుంది. ప్రమాదకరమైన సూక్ష్మ ధూళి రేణువులు వెలువడుతాయి. విషపూరిత కార్బన్ మోనాక్సైడ్ వాయువు విడుదలవుతుంది. పంట వ్యర్థాల దహనం కారణంగా రైతులు శ్వాస సంబంధిత వ్యాధుల బారినపడుతున్నట్లు, మానసిక సమస్యలు ఎదుర్కొంటున్నట్లు గుర్తించామని థాయ్‌లాండ్ డెవలప్‌మెంట్ రీసెర్చ్ సెంటర్ సీనియర్ పరిశోధకుడు కనికా థాంపానిష్‌వోంగ్ చెప్పారు. దేశంలో 2021లో వాయు కాలుష్యం వల్ల 29,000 మంది మరణించారని అంచనా. ఇక రాజధాని బ్యాంకాక్‌లో తీవ్రరూపం దాలుస్తున్న ట్రాఫిక్ సమస్య వల్ల కాలుష్యం పెరిగిపోతోంది. చలికాలం కావడంతో పరిస్థితి భీతావహంగా మారుతోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌ఓ) సూచించిన దానికంటే థాయ్‌లాండ్ ప్రజలు సగటున నాలుగు రెట్లు అధికంగా సూక్ష్మ ధూళి కణాలను(పీఎం 2.5) పీలుస్తున్నట్లు అధ్యయనంలో తేలింది. కాలుష్యం వల్ల దేశంలో ప్రజల జీవిత కాలం సగటున రెండేళ్లు తగ్గినట్లు థాయ్‌లాండ్ 'ఎయిర్ క్వాలిటీ లైఫ్ ఇండెక్స్' అంచనా వేసింది.

వేధిస్తున్న నిధుల కొరత

మరోవైపు కాలుష్యాన్ని తగ్గించడంపై థాయ్‌లాండ్ సర్కారు దృష్టిపెట్టింది. ఈ దిశగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయడానికి అంతర్జాతీయ సంస్థలు, పరిశోధనా కేంద్రాలతో కలిపి పనిచేస్తోంది. కాలుష్య నియంత్రణ కోసం కొత్త కొత్త విధానాలు రూపొందిస్తున్నప్పటికీ నిధుల కొరత వల్ల అవి ఆశించిన ఫలితాలు ఇవ్వడం లేదని నిపుణులు చెబుతున్నారు. ఎయిర్ క్వాలిటీ పాలసీల అమలుకు బడ్జెట్‌లో ప్రభుత్వం తగినన్ని నిధులు కేటాయించకపోవడం పెద్ద అవాంతరంగా మారింది. స్వచ్ఛమైన గాలిని పీల్చడం ప్రజల హక్కు, ఆ హక్కును కాపాడడంలో థాయ్‌లాండ్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆరోపిస్తూ గ్రీన్‌పీస్ థాయ్‌లాండ్, ఎన్విరాన్‌మెంటల్ లా ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సంస్థలు గత ఏడాది మార్చి నెలలో కోర్టులో పిటిషన్లు దాఖలు చేశాయి. 'క్లీన్ ఎయిర్ బిల్లు'ను ఆమోదించాలంటూ థాయ్‌లాండ్ క్లీన్ ఎయిర్ నెట్‌వర్క్ అనే మరో సంస్థ పోరాడుతోంది. ఈ బిల్లు చట్టరూపం దాలిస్తే.. కాలుష్యానికి కారణమయ్యే వారికి పెద్ద మొత్తంలో జరిమానాలు విధించవచ్చు. మరోవైపు పంట వ్యర్థాలను దహనం చేయకుండా కొన్ని స్వచ్ఛంద సంస్థలు రైతుల్లో అవగాహన పెంచేందుకు ప్రయత్నిస్తున్నాయి.

ఇరాన్‌లో వేలాది నిరసనకారులకు క్షమాభిక్ష

దుబాయ్: ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనల్లో అరెస్టయిన 22 వేల మందికి ఇరాన్ క్షమాభిక్ష ప్రకటించింది. గత ఏడాది సెప్టెంబర్‌లో ఓ యువతి పోలీస్ కస్టడీలో మృతి చెందినప్పటి నుంచి దేశవ్యాప్తంగా ఆందోళనలు చెలరేగడం, అణచివేత చర్యల్లో భాగంగా పోలీసుల కాల్పుల్లో వందల మంది చనిపోవడం తెలిసిందే. వేలాది మందిని జైళ్లపాలయ్యారు. ఈ నేపథ్యంలోనే 22 వేల మందికి సుప్రీం నేత అయతొల్లా అలీ ఖమేనీ క్షమాభిక్ష ప్రసాదించినట్లు ఇరాన్ న్యాయశాఖ అధిపతి జి.ఎం.ఎజెహి సోమవారం తెలిపారు. వీరితోపాటు వివిధ ఆరోపణలను ఎదుర్కొంటున్న మొత్తం 82 వేల మందికి సుప్రీం నేత క్షమాభిక్ష ప్రకటించారన్నారు. వచ్చే వారం నుంచి ప్రారంభం కానున్న రంజాన్ నెల సందర్భంగా సుప్రీం నేత ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు వివరించారు. తాజా చర్యతో ప్రభుత్వ విధానాలపట్ల దేశ ప్రజల్లో పెల్లుబుకుతున్న ఆగ్రహం తీవ్రతను పాలకులు గుర్తించినట్లయింది.

అమెరికాలో కాలిఫోర్నియాను వరదలు ముంచెత్తుతున్నాయి. రాష్ట్రంలో పలు ప్రాంతాలు ఇలా వరద నీటితో మునిగాయి. మరో తుపాను రావచ్చన్న హెచ్చరికలు భయపెడుతున్నాయి.



చైనాలో ఇన్‌ఫ్లూయెంజా పంజా

బీజింగ్: చైనాలో ఇన్‌ఫ్లూయెంజా (హెచ్3ఎన్2) కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. గత వారం రోజుల వ్యవధిలో ఫ్లూ పాజిటివ్ కేసుల రేటు 41.6 శాతం పెరిగినట్లు చైనీస్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ తాజాగా ఒక నివేదికలో వెల్లడించింది. మునుపటి వారంతో పోలిస్తే 25.1 శాతం ఎక్కువ పెరుగుదల నమోదైనట్లు తెలియజేసింది. షాంగ్జీ ప్రావిన్స్‌లోని జియాన్ నగరంలో ఇన్‌ఫ్లూయెంజా కేసుల పట్ల అధికారులు అప్రమత్తమయ్యారు. ఫ్లూ వ్యాప్తి మరింతగా పెరిగితే లాక్‌డౌన్ తరహా ఆంక్షలు విధించాలని ప్రతిపాదించారు. హాంకాంగ్ వైరస్‌గా పిలిచే హెచ్3ఎన్2 వల్ల ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో మరణాలు సైతం నమోదయ్యాయి. ఈ వైరస్ సోకిన వారిలో జ్వరం, దగ్గు, జలుబు, శ్వాసకోశ సమస్యలు, శరీరంలో నొప్పులు, వికారం, వాంతులు, అతిసారం వంటి లక్షణాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా, చైనాలో కోవిడ్–19 పాజిటివిటీ రేటు 5.1 శాతం నుంచి 3.8 శాతానికి తగ్గడం విశేషం.

భారీ సైనిక విన్యాసాలు.. అణుక్షిపణుల ప్రయోగం

వేడెక్కుతున్న కొరియా ద్వీపకల్పం

సియోల్: కొరియా ద్వీపకల్పం వేడెక్కుతోంది. ఒకవైపు అమెరికా– దక్షిణకొరియా భారీ సైనిక విన్యాసాలు ప్రారంభం కాగా, వీటిని సవాల్ చేస్తూ జలాంతర్గామి నుంచి అణు సామర్థ్యమున్న క్షిపణులను ఉత్తరకొరియా ప్రయోగించింది. దక్షిణకొరియా, అమెరికా సైనిక బలగాలు సోమవారం నుంచి భారీ స్థాయిలో సైనిక విన్యాసాలు మొదలుపెట్టాయి. 2018 తర్వాత పెద్ద ఎత్తున చేపట్టిన ఈ ఉమ్మడి విన్యాసాలు 11 రోజుల పాటు కొనసాగనున్నాయి. అయితే, దక్షిణకొరియా, అమెరికాల చర్యలు తమ దేశ దురాక్రమణకు రిహార్సల్ వంటివని ఆరోపిస్తున్న ఉత్తరకొరియా దీనికి నిరసనగా ఆదివారం జలాంతర్గామి నుంచి రెండు క్షిపణులను ప్రయోగించింది. ఈ రెండు క్షిపణులు వ్యూహాత్మక ఆయుధాలని అధికార వార్తాసంస్థ కేసీఎన్‌ఏ అభివర్ణించింది. దేశ అణు సామర్థ్యాన్ని ఇవి చాటుతున్నాయని తెలిపింది. ఇవి రెండు గంటలపాటు గాలిలోనే ఉన్నాయని, 1,500 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించే సత్తా ఉందని తెలిపింది. అయితే, ఉత్తరకొరియా జలాంతర్గామి నుంచి అణు వార్‌హెడ్లను మోసుకెళ్లే క్షిపణుల పరిజ్ఞానాన్ని సాధించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అవి పాత నగలు: తేజస్వీ

పట్నా: ''మా ఇంట్లో ఈడీ అధికారులు సోదాలను అరగంటలోనే పూర్తి చేశారు. అయినా పైనుంచి రావాల్సిన ఆదేశాల కోసం అంతకుముందు గంటల తరబడి ఎదురు చూపులు చూశారు'' అంటూ ఆర్జేడీ నేత, బిహార్ డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. తమ అక్క, చెల్లెళ్ల నివాసాల్లో సోదాల అనంతరం స్వాధీనం చేసుకున్నట్లుగా ఈడీ చెబుతున్నవి వారి, అత్తింటి వారి సొంత పాత నగలేనన్నారు. రైల్వే జాబ్స్ కుంభకోణంలో రూ.600 కోట్ల మేర విలువైన నేరపత్రాలు లభించాయన్న ఈడీ వాదనలను కొట్టిపారేశారు.

నియంతలా మోదీ పాలన: ఖర్గే

హస్తినలో విపక్షాలతో కలిసి కాంగ్రెస్ నిరసన ర్యాలీ



నిరసన ర్యాలీ సందర్భంగా మీడియాతో ఖర్గే, విపక్ష పార్టీల ఎంపీలు

న్యూఢిల్లీ: ప్రధాని మోదీ ఒక నియంతలాగా పాలిస్తున్నారంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ధ్వజమెత్తారు. ''బీజేపీ నేతలు ప్రజాస్వామ్యాన్ని అణచివేస్తూ దాన్ని రక్షిస్తున్నామని చెప్పుకుంటున్నారు. వాళ్ల డిక్షనరీలో రాజ్యాంగానికి స్థానం లేకుండా పోయింది'' అంటూ దుయ్యబట్టారు. పార్లమెంటు అధికార పార్టీ తీరుకు నిరసనగా విపక్ష సభ్యులతో కలిసి పార్లమెంట్ నుంచి విజయ్ చౌక్ వరకూ ర్యాలీ నిర్వహించారు. బీఆర్‌ఎస్, ఆమ్ ఆద్మీ పార్టీ, వామపక్షాల సభ్యులు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ.. ప్రతిపక్షాలను వేధించడమే లక్ష్యంగా దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తున్నారని, పైగా ప్రజాస్వామ్యం, జాతీయవాదం, దేశ గౌరవం గురించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. అధికార పార్టీ పెద్దల తీరు దొంగే దొంగ.. దొంగ అని అరిచినట్లుగా ఉందన్నారు. ప్రధాని మోదీ గతంలో చైనా, దక్షిణ కొరియా, కెనడా, యూఏఈలో పర్యటించినప్పుడు ఏం మాట్లాడారో గుర్తుకు తెచ్చుకోవాలని ఖర్గే హితవు పలికారు. లోక్‌సభలో కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, ప్రహ్లాద్ జోషీ చేసిన వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని కోరుతూ కాంగ్రెస్ ఎంపీ అధిర్ రంజన్ చౌదరి లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాశారు.

అందుకే పార్లమెంట్ వాయిదా: జైరామ్ రమేశ్

పార్లమెంట్ సమావేశాలు జరగడం ప్రభుత్వానికి ఇష్టం లేదని, అందుకే వాయిదా వేశారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ విమర్శించారు. ఈ మేరకు ట్వీట్ చేశారు. అదానీ కుంభకోణం నుంచి ప్రజల దృష్టిని మళ్లించాలన్నదే ప్రభుత్వ కుతంత్రమని ఆరోపించారు.

దద్దరిల్లిన పార్లమెంట్

రాహుల్ గాంధీ 'ప్రజాస్వామ్యంపై దాడి' వ్యాఖ్యలపై దుమారం

- క్షమాపణ చెప్పాలని లోక్‌సభ, రాజ్యసభలో అధికార పక్షం డిమాండ్
- అదానీ అంశంపై జేపీసీ ఏర్పాటు చేయాలన్న విపక్షాలు
- ఉభయ సభలు నేటికి వాయిదా



న్యూఢిల్లీ: భారత్‌లో ప్రజాస్వామ్యంపై దాడి జరుగుతోందంటూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఇటీవల యూకేలో చేసిన వ్యాఖ్యల పట్ల సోమవారం పార్లమెంట్ ఉభయ సభలు దద్దరిల్లాయి. రాహుల్ వెంటనే క్షమాపణ చెప్పాలని కేంద్ర మంత్రులు డిమాండ్ చేయగా, గౌతమ్ అదానీ వ్యవహారంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయాల్సిందేనని కాంగ్రెస్ పునరుద్ఘాటించింది. ఇరు పక్షాల నడుమ వాగ్వాదాలతో ఉభయ సభలు స్తంభించాయి. నినాదాలు, అరుపులు కేకలతో హోరెత్తిపోయాయి. ఎలాంటి కార్యకలాపాలు జరక్కుండానే లోక్‌సభ, రాజ్యసభ మంగళవారానికి వాయిదా పడ్డాయి.

రాహుల్‌కు కొంతైనా సిగ్గుంటే..

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు సోమవారం ఉదయం పునఃప్రారంభమయ్యాయి. ఇటీవల మరణించిన మాజీ సభ్యులకు లోక్‌సభలో సంతాపం ప్రకటించారు. అనంతరం రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడారు. రాహుల్ గాంధీపై విరుచుకుపడ్డారు. భారత ప్రజాస్వామ్యంపై ఇష్టానుసారంగా నోరుపారేసుకున్నారని, లండన్‌లో మన దేశ ప్రతిష్టను, గౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరించారని దుయ్యబట్టారు. విదేశీ శక్తులే భారత్‌ను కాపాడాలంటూ రాహుల్ మాట్లాడడం ఏమిటని నిలదీశారు. రాహుల్ వ్యాఖ్యలను లోక్‌సభ మొత్తం ఖండించాలని, ఈ దిశగా చొరవ తీసుకోవాలని స్పీకర్ ఓం బిర్లాకు విజ్ఞప్తి చేశారు. రాహుల్‌ను సభకు రప్పించి, క్షమాపణ చెప్పించాలని అన్నారు. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీ మాట్లాడుతూ.. రాహుల్ గాంధీకి కొంతైనా సిగ్గుంటే సభకు వచ్చి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాహుల్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. స్పీకర్ ఓం బిర్లా స్పందిస్తూ.. మన దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ బలంగా ఉందని, రోజురోజుకూ బలోపేతం అవుతోందని వెల్లడించారు. సభ సజావుగా సాగేలా సభ్యులంతా సహకరించాలని సూచించారు. నినాదాలు ఆపాలని కోరారు. మన ప్రజాస్వామ్యంపై ప్రజలకు గొప్ప విశ్వాసం ఉందన్నారు. సభను మరుసటి రోజుకు వాయిదా వేస్తున్నట్లు చెప్పారు.

రాజ్యసభలో అదే రగడ

రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై రాజ్యసభలోనూ అధికార, విపక్ష సభ్యుల మధ్య రగడ జరిగింది. ఎవరూ శాంతించకపోవడంతో చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ సభను మంగళవారానికి వాయిదా వేశారు. రాజ్యసభలో కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్ మాట్లాడారు. రాహుల్ గాంధీ వ్యాఖ్యలను రాజ్యసభ ఖండించాలని డిమాండ్ చేశారు. పీయూష్ గోయల్ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని ఖర్గే కోరారు.

రాహుల్‌పై దేశద్రోహం కేసు పెట్టాలి

కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ మీడియాతో మాట్లాడారు. తుక్డే–తుక్డే గ్యాంగ్ తరహాలో మాట్లాడిన రాహుల్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. ఆయనపై దేశ ద్రోహం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. భారత ప్రజాస్వామ్యాన్ని రాహుల్ కించపర్చారని కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్ ఆక్షేపించారు. పార్లమెంట్‌కు రాహుల్ క్షమాపణ చెప్పాలన్నారు.

ప్రభుత్వ కమిటీ లేదు

'అదానీ దర్యాప్తు'పై లోక్‌సభలో కేంద్రం

న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ మీద వచ్చిన ఆరోపణలపై విచారణకు ప్రభుత్వపరంగా ఎలాంటి కమిటీనీ వేయలేదని కేంద్రం స్పష్టం చేసింది. వాటిపై నియంత్రణ సంస్థ సెబీ దర్యాప్తు చేస్తోందని గుర్తు చేసింది. ఈ విషయమై లోక్‌సభలో పలువురు ఎంపీలు అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి ఈ మేరకు లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు. ''ఇండొనేసియా నుంచి బొగ్గు దిగుమతుల విషయమై కూడా అదానీ కంపెనీపై విడిగా జరుగుతున్న దర్యాప్తు ఇంకా తుది దశకు చేరలేదు. విద్యుదుత్పత్తి, సంపిణీ పరికరాల దిగుమతికి సంబంధించి అదానీ గ్రూప్‌పై వచ్చిన ఆరోపణల మీద డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటలిజెన్స్ దర్యాప్తు పూర్తయింది. నివేదిక కూడా అందింది. హిండెన్‌బర్గ్ నివేదిక వెలుగు చూసిన తర్వాత గత జనవరి 24 నుంచి మార్చి 1 మధ్య అదానీ గ్రూప్‌కు చెందిన 9 లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్‌లో 60 శాతం క్షీణత నమోదైంది'' అని మంత్రి చెప్పారు.

సీనియర్ సిటిజన్లకు రైలు చార్జీల్లో రాయితీ పునరుద్ధరించాలి

రైల్వే శాఖకు పార్లమెంటరీ కమిటీ సిఫారసు

న్యూఢిల్లీ: రైల్వే శాఖ సీనియర్ సిటిజన్లకు చార్జీల్లో అందించే రాయితీని తిరిగి పునరుద్ధరించాలని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ప్రభుత్వానికి సిఫారసు చేసింది. 60 ఏళ్లు పైబడిన పురుషులకు 40 శాతం, 58 ఏళ్లు దాటిన మహిళలకు టికెట్ ధరలో 50 శాతం చొప్పున అన్ని రైళ్లలోని అన్ని తరగతుల్లోనూ రాయితీ ఉండేది. కరోనా నేపథ్యంలో 2020 మార్చి 20 నుంచి దీన్ని రద్దు చేశారు. బీజేపీ ఎంపీ రాధా మోహన్ సింగ్ సారథ్యంలోని రైల్వే శాఖ స్టాండింగ్ కమిటీ డిమాండ్ ఫర్ గ్రాంట్లపై సోమవారం పార్లమెంట్‌కు సమర్పించిన 14వ నివేదికలో దీన్ని ప్రస్తావించింది. ఈ రాయితీని పునరుద్ధరించాలని కోరింది. కనీసం స్లీపర్ క్లాస్, థర్డ్ ఏసీకైనా వర్తింపజేయాలని సూచించింది. అయితే అలాంటి యోచనేదీ లేదని రైల్వే శాఖ గతంలోనే స్పష్టం చేసింది. ప్రయాణికులకు ఇప్పటికే టికెట్ ధర్లపై 55 శాతం వరకు రాయితీ ఇస్తున్నట్టు తెలిపింది.

వందేభారత్ రైళ్ల ఉత్పత్తిపై ఆందోళన

వందేభారత్ రైళ్ల తయారీ మందగమనంపై కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. ''2022–23లో 35 రైళ్లు తయారవాల్సి ఉండగా ఇప్పటిదాకా కేవలం 8 రైళ్లే సిద్ధమయ్యాయి. లక్ష్యాన్ని చేరుకోవాలన్నా, రైలు ప్రయాణికుల ఆకాంక్షలు నెరవేరాలన్నా వందేభారత్ రైలు ఇంజన్లు, బోగీల తయారీ వేగాన్ని ముమ్మరం చేయాలి. ఇందుకోసం పలు ప్రాంతాల్లోని ఉత్పత్తి కేంద్రాలకు రైల్వేశాఖ సాంకేతిక తోడ్పాటు అందించాలి'' అని సూచించింది.

2022 మార్చికి చలామణిలో రూ.31 లక్షల కోట్ల విలువైన కరెన్సీ: కేంద్రం

న్యూఢిల్లీ: గత సంవత్సరం మార్చి నెలనాటికి దేశంలో రూ.31.33 లక్షల కోట్ల విలువైన కరెన్సీ చలామణిలో ఉందని కేంద్రం ప్రకటించింది. 2014 ఏడాదిలో చలామణిలో రూ.13 లక్షల కోట్ల కరెన్సీ ఉండగా గత మార్చికి ఇంతటి భారీ స్థాయికి పెరిగిందని సోమవారం లోక్‌సభలో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. మంత్రి వెల్లడించిన వివరాల ప్రకారం.. 2014 ఏడాది మార్చిలో డీజీపీలో 11.6 శాతంగా ఉన్న బ్యాంక్ నోట్లు, నాణేల వాటా 2022 మార్చి 25వ తేదీకల్లా 13.7 శాతానికి పెరిగింది. 2016 మార్చి నెలలో రూ.16.63 లక్షల కోట్ల కరెన్సీ చలామణిలో ఉండగా పాత పెద్ద నోట్ల రద్దు కారణంగా 2017 మార్చినాటికి కరెన్సీ చలామణి రూ.13.35 లక్షల కోట్లకు తగ్గింది. ఆ తర్వాత మళ్లీ చలామణిలో ఉన్న కరెన్సీ పెరుగుతూ పోయింది. చలామణిలో ఉన్న కరెన్సీ విలువ 2018 మార్చికి రూ.18.29 లక్షల కోట్లకు, 2019 మార్చినాటికి రూ.21.36 లక్షల కోట్లకు, 2020 మార్చినాటికి రూ.24.47 లక్షల కోట్లకు, 2021 మార్చి నాటికి రూ.28.53 లక్షల కోట్లకు, 2022 మార్చి నాటికి రూ.31.33 లక్షల కోట్లకు ఎగబాకింది. నల్ల ధనం చలామణికి చరమగీతం పాడటంతోపాటు డిజిటల్ ఆర్థికవ్యవస్థను ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం అడుగులువేసిందని మంత్రి ఉద్ఘాటించారు.

దుర్భేధ్యమైన ఉక్కు సైన్యం

పూర్తిగా ఆధునీకరిస్తాం: చైనా అధ్యక్షుడు



బీజింగ్: దేశ సార్వభౌమత్వమే పరమావధిగా అత్యంత పటిష్టతర ఉక్కు సైన్యంగా దేశ సాయుధబలగాలను శక్తివంతం చేస్తామని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ప్రకటించారు. ఉప్పు–నిప్పుగా ఉండే సౌదీ అరేబియా, ఇరాన్‌ల మధ్య దౌత్య సంబంధాలను పునరుద్దరించడంలో సఫలీకృతమై అంతర్జాతీయ సమాజంలో ప్రతిష్టను పెంచుకున్న చైనా.. దేశ సైన్యానికి 'ఆధునిక' జవసత్వాలను అందించడంపై దృష్టిపెట్టింది. చైనాకు మూడోసారి అధ్యక్షుడయ్యాక జిన్‌పింగ్ తొలిసారిగా ప్రసంగించారు. చైనా పార్లమెంట్ సమావేశాల ముగింపు సందర్భంగా ప్రజల నుద్దేశించి మాట్లాడారు. ' అంతర్జాతీయ వ్యవహారాల్లో మరింత క్రియాశీలక పాత్ర పోషించడంతోపాటు అమెరికాసహా పొరుగు దేశాల నుంచి ముప్పు, దేశ సార్వభౌమత్వ సంరక్షణ కోసం సైన్యాన్ని 'గ్రేట్ వాల్ ఆఫ్ స్టీల్(ఉక్కు సైన్యం)'గా మారుస్తాం. చైనా ముందుకుతెచ్చిన గ్లోబల్ డెవలప్‌మెంట్ ఇనీషియేటివ్(జీడీఐ), గ్లోబల్ సెక్యూరిటీ ఇనిషియేటివ్ వంటి కార్యక్రమాల అమలు సహా ప్రపంచ పురోభివృద్ధి, సంస్కరణ పథంలో చైనా ఇకమీదటా గతిశీల పాత్ర పోషించనుంది. దాంతోపాటే దేశ భద్రత, అభివృద్ధి ప్రయోజనాలను కాపాడుకునేందుకు దేశ భద్రత, సాయుధ బలగాలను అజేయశక్తిగా నవీకరించాలి. సుస్థిరాభివృద్ధికి భద్రతే వెన్నుముక' అని జిన్‌పింగ్ వ్యాఖ్యానించారు. 'మీరు నాపై ఉంచిన నమ్మకమే నన్ను ముందుకునడిపే చోదకశక్తి. నా భుజస్కంధాలపై పెద్ద బాధ్యతల్ని మోపారు' అన్నారు. ''పొరుగు ప్రాంతాలతో శాంతియుత అభివృద్ధినే కోరుకుంటున్నాం. తైవాన్ స్వతంత్రత కోరే వేర్పాటువాదులను, బయటి శక్తుల జోక్యాన్ని అడ్డుకుంటున్నాం. చైనా ఆధునీకరణ ప్రక్రియను మరింత ముందుకు తీసుకెళ్దాం' అని పార్లమెంట్‌లో సభ్యులనుద్దేశించి అన్నారు.

'స్వలింగ వివాహం'పై ధర్మాసనం: సుప్రీం

- ఇది తీవ్రమైన అంశమే
- మానవ హక్కులు, ప్రత్యేక వివాహ చట్టం వంటివి ఇమిడి ఉన్నాయని వ్యాఖ్య



న్యూఢిల్లీ: స్వలింగ వివాహాలకు చట్టబద్ధత కల్పించాలంటూ దాఖలైన పిటిషన్లను ఐదుగురు న్యాయమూర్తుల సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం విచారించనుంది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం సోమవారం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ఈ సందర్భంగా ధర్మాసనం పలు వ్యాఖ్యలు చేసింది. ''స్వలింగ వివాహాలకు చట్టబద్ధత ఇవ్వాలా వద్దా అనే అంశానికి ఒకవైపు రాజ్యాంగం ప్రసాదించిన మానవహక్కులు, మరోవైపు ప్రత్యేక శాసనాలు, ఇంకోవైపు ప్రత్యేక వివాహ చట్టం ఉన్నాయి. ఇంతటి ప్రధానమైన అంశాన్ని రాజ్యాంగ ధర్మాసనమే తేల్చాలి'' అని వ్యాఖ్యానించింది. ఇలాంటి వివాహాలను అనుమతించకూడదని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అభిప్రాయాన్ని వెల్లడించడం తెల్సిందే. ''భారతీయ కుటుంబ వ్యవస్థకు స్వలింగ వివాహాలు పూర్తి విరుద్ధం. వ్యక్తిగత చట్టాలు, సామాజిక విలువల సున్నిత సమతుల్యతను ఇవి భంగపరుస్తాయి' అంటూ ఆదివారం కోర్టుకు అఫిడవిట్ సమర్పించింది. ''ఈ అంశంలో శాసన అంశాలు, మానవ హక్కులు ఇమిడి ఉన్నాయి. దీనిని రాజ్యాంగ ధర్మాసనమే పరిష్కరిస్తుంది' అంటూ సుప్రీంకోర్టు ఈ అంశాన్ని ఏప్రిల్ 18వ తేదీకి వాయిదావేసింది. 'స్వలింగ వివాహాలను అనుమతిస్తే ఎదురయ్యే సమస్యల గురించీ ఆలోచించాలి. ఇద్దరు తండ్రులు లేదా కేవలం ఇద్దరు తల్లులు మాత్రమే జంటగా జీవించే కుటుంబంలో ఎదిగే పిల్లల మానసిక స్థితి ఎలా ఉంటుంది ? ప్రజల ఆకాంక్షలకు ప్రతిబింబమైన పార్లమెంట్ ఇలాంటి విషయాలను సమీక్షించాల్సి ఉంది. ఈ కేసు తీర్పు మొత్తం భారతీయ సమాజంపై తీవ్ర ప్రభావం చూపనుంది. అందుకే కేసులో భాగస్వామ్య పక్షాల వాదోపవాదనలను విస్తృతస్థాయిలో వినాలి' అని కేంద్ర ప్రభుత్వం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టును కోరారు. ఈ కేసు విచారణను ప్రత్యక్ష ప్రసారం చేయాలని ఒక న్యాయవాది కోరగా రాజ్యాంగ ధర్మాసనాల విచారణలన్నీ ప్రత్యక్ష ప్రసారాలు అవుతున్నాయని ధర్మాసనం గుర్తుచేసింది.

సాక్షి 24|7 తమిళనాడు
TAMILNADU
మంగళవారం । 14 । మార్చి । 2023

యువరత్న అవార్డుల ప్రదానం



రాజస్థానీ అసోసియేషన్ ఆఫ్ తమిళనాడు నేతృత్వంలో అత్యుత్తమ సేవలకు గాను యువరత్న అవార్డులను సోమవారం చెన్నైలో ప్రదానం చేశారు. లేడీ ఆండాల్ ఆడిటోరియంలో జరిగిన ఈ వేడుకలో ఐటీ శాఖమంత్రి మనో తంగరాజ్ చేతుల మీదుగా నిర్వాహకులు గౌతమ్, శ్రేయా జైన్, మానుషి జైన్, మయూర్ అభయా యువరత్న అవార్డులను ఉత్తమ యువతీ, యువకులకు ప్రదానం చేశారు. – సాక్షి, చెన్నై

న్యూస్‌రీల్

విషజ్వరంతో బాలిక మృతి

అన్నానగర్: కొండంపాళయం సమీపంలో సోమవారం ఆరేళ్ల బాలిక విష జ్వరంతో మృతి చెందింది. వివరాలు.. మూవర్ నగర్‌కు చెందిన గణేషన్ మూర్తి కూమార్తె అనుసియా శ్రీ (6)ఓ ప్రైవేట్ పాఠశాలలో 1వ తరగతి చదువుతోంది. గత మూడు రోజులుగా విపరీతమైన జ్వరంతో బాధపడుతోంది. దీంతో తల్లిదండ్రులు ఆమెని అక్కడి ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. సోమవారం ఉదయం ఇంట్లో ఉన్న బాలిక పరిస్థితి ఒక్కసారిగా విషమించింది. వెంటనే తల్లిదండ్రులు ఆమెని చికిత్స నిమిత్తం కోయంబత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మార్గమధ్యంలోనే అనుసూయశ్రీ మృతి చెందినట్లు తెలిపారు. తుడియాలూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోలాహలంగా నంబి స్వామిగల్ దర్శనోత్సవం

తిరువొత్తియూరు: తిరుకురుంగుకుడిలో పంగుణి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఐదుగురు నంబి స్వామిగల్ సిద్ధులకు దర్శనమిచ్చే ఉత్సవం సోమవారం కోలహాలంగా సాగింది. ఈ ఉత్సవంలో అశేష సంఖ్యలో భక్తులు పాల్గొని గోవిందా, గోపాల నామస్మరణతో స్వామిని దర్శించుకున్నారు. వివరాలు.. నెల్‌లై జిల్లా కలక్కాడు సమీపంలో ఉన్న తిరుకురుంగుడి 1500 సంవత్సరాలకు పురాతనమైన అలగియ నంబియార్ వైష్ణవ ఆలయం ఉంది. 108 వైష్ణవ దివ్య క్షేత్రాలలో ఒకటిగా ప్రసిద్ధి పొందిన ఈ ఆలయం అల్వార్లతో మంగళాశాసనం చేయబడి ప్రత్యేక క్షేత్రంగా భాసిల్లుతోంది. ఏటా ఈ ఆలయంలో పంగుణి నెలలో బ్రహ్మోత్సవాలను ప్రత్యేకంగా నిర్వహిస్తూ ఉంటారు. ఈ మేరకు ఈ సంవత్సరం బ్రహ్మోత్సవాలు ఈనెల 8న ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. నంబి వైష్ణ పెరుమాళ్ స్వామి రోజు వివిధ వాహనంపై నాలుగు మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ ఉత్సవాల్లో ముఖ్య కార్యక్రమమైన ఐదుగురు నంబి స్వాములు సిద్ధులకు దర్శనమిచ్చు ఘట్టం ఆదివారం రాత్రి వైభవంగా సాగింది. ఈ సందర్భంగా నింద్రసనంబి, అమర్తనంబి, పల్లికొండనంబి, తిరుమలైనంబి, తిరుపార్కడల్‌నంబి అనే ఐదుగురు నంబి స్వాములను అలంకరించి వేరు వేరుగా ఐదు గరుడ వాహనాలపై ఊరేగించారు. సోమవారం వేకువజాము వరకు ఈ వేడుక సాగింది. కాగా మరో ముఖ్య ఘట్టమైన రథోత్సవం 17న నిర్వహించనున్నారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి



డాక్టర్ సుభాష్ కౌశిక్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

కొరుక్కుపేట: సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ హోమియోపతి మినిస్ట్రీ ఆఫ్ ఇండియా న్యూఢిల్లీ పెన్షనర్స్ అసోసియేషన్ సమావేశం సోమవారం చెన్నై అరుంబాక్కంలోని భారత ఆయుష్ ప్రభుత్వ మంత్రిత్వ శాఖలోని కెప్టెన్ శ్రీనివాస మూర్తి ఆయుర్వేద పరిశోధనా సంస్థ వద్ద నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ హోమియోపతి మినిస్ట్రీ ఆఫ్ ఇండియా న్యూఢిల్లీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సుభాష్ కౌశిక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షనర్స్ అసోసియేషన్ సమస్యలను క్రమబద్ధీకరిస్తానని హామీ ఇచ్చారు. సీసీఆర్ హెచ్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ హరిసింగ్, ప్రధాన కార్యదర్శి ఎంఎస్‌పీ పణికర్ అసోసియేషన్ కార్యకలాపాల వివరాలను తెలియజేశారు.

కలవరపెడుతున్న హెచ్3ఎన్2

ఇప్పటికే విషజ్వారాలతో అల్లాడుతున్న రాష్ట్ర ప్రజానీకాన్ని హెచ్3 ఎన్2 ఇంఫ్లూయెంజా కలవర పెడుతోంది. ఈ వైరస్ ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 46 కేసులు నమోదవడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. దీనికితోడు కరోనా మహమ్మారి కూడా మళ్లీ అంతకంతకూ విజృంభిస్తుండడంతో పెద్దఎత్తున రోగులు ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు.

- రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తున్న హెచ్3 ఎన్2 ఇంఫ్లూయెంజా
- తిరుచ్చిలో ఓ యువకుడి మృతి
- వైరస్ నిర్ధారణ అయితే వెంటనే సమాచారం ఇవ్వండి
- ప్రైవేటు ల్యాబ్‌లకు ఆరోగ్యశాఖ మంత్రి ఆదేశాలు
- జాగ్రత్తలు పాటించాలని ప్రజలకు సూచన
- పైపైకి కరోనా కేసులు..



ఫీవర్ క్యాంపు (ఫైల్)



చిన్నారి సూర్య కుమార్‌తో కలిసి మీడియాతో మాట్లాడుతున్న మంత్రి ఎం.సుబ్రమణియన్

సాక్షి, చెన్నై: మారిన వాతారణ పరిస్థితులు, హెచ్3 ఎన్2 ఇంఫ్లూయెంజా వైరస్ వ్యాప్తికారణంగా రాష్ట్రంలో జ్వరపీడితల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. చెన్నై శివారుల్లో ఉన్న ఈ కేసులు ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా వ్యాపించింది. తిరుచ్చిలో ఓయువకుడి మరణంతో ఆందోళన నెలకొంది. అలాగే కరోనా కేసులు కూడా పైపైకి వెళ్తుండటంతో ఆరోగ్యశాఖ మరింత అప్రమత్తమైంది. ప్రజలు జాగ్రత్తలు పాటించాలనే హెచ్చరికలు జారీ అయ్యాయి. వివరాలు.. గత కొద్ది రోజులుగా చెన్నై, శివారు జిల్లాల్లో జ్వరాలు విజృంభిస్తూ వచ్చిన విషయం తెలిసిందే. జ్వరం, దగ్గ, గొంతు నొప్పి, జలుబు, ఒళ్లు నొప్పులు వంటి సమస్యలతో బాధ పడుతున్న వారు అధికంగా ఉండడంతో గత వారం రాష్ట్ర ప్రభుత్వం నేతృత్వంలో ఫీవర్ క్యాంప్‌లు సైతం ఏర్పాట్లు చేశారు. ఇందులో గుర్తించిన కొన్ని కేసుల శాంపిల్స్‌ను పరిశీలనకు పంపించారు. సుమారు 300 వందల మందిని స్వీయ నిర్బంధంలో ఉండే విధంగా ఆదేశాలు ఇచ్చారు. ఈ పరిస్థితుల్లో తాజాగా వైరస్ రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాలకు వ్యాపించింది. గ్రామాలు, పట్టణాలు, నగరాలలో ఈ వైరస్ విజృంభిస్తుండం కలవరం రేపుతోంది. జ్వరాలతో క్లీనిక్‌లు, ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద జనం బారులు తీరుతున్నారు. ఇందులో సోమవారం నాటికి 46 వరకు హెచ్3 ఎన్2 వైరస్ కేసులు నమోదు కావడం గమనార్హం. అదే సమయంలో తిరుచ్చి తెప్పకులంలో ఆదివారం రాత్రి తీవ్ర జ్వరంతో బాధ పడుతున్న యువకుడు (27) మరణించడం మరింత కలవరం రేపుతోంది. ఈ యువకుడికి కరోనా నిర్ధారణ కావడంతో పాటు తాజా వైరస్ లక్షణాలు అధికంగా ఉండంతో శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపించారు. ఈ వైరస్‌కు తోడుగా కరోనా కేసులు సైతం రాష్ట్రంలో పెరుగుతున్నాయి. ఆదివారం ఒక్క రోజు 58 కేసులు నమోదు అయ్యాయి. ఇందులో కోయంబత్తూరులో మాత్రమే 10 కేసులు ఉన్నాయి. వీరందరినీ ఎక్కడికక్కడ ప్రత్యేక వార్డుల్లో ఉంచి చికిత్స అందిస్తున్నారు. కేసుల పెరుగుదల నేపథ్యంలో జాగ్రత్తలు తప్పనిసరి అని, ఏమాత్రం నిర్లక్ష్యం తగదని.. ప్రజలను ఆరోగ్య శాఖతో పాటూ వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

అప్రమత్తతే శ్రీరామ రక్ష..



రాష్ట్రంలో వైరస్ వ్యాప్తి నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేస్తూ ఆరోగ్యశాఖ మంత్రి ఎం. సుబ్రమణ్యం హెచ్చరించారు. గత ఏడాది కృష్ణగిరిలో శానిటైజర్ బాటిల్ తీసుకెళ్తూ మంటల్లో పడి సూర్యకుమార్ (10) బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ బాలుడికి ప్రభుత్వం 6 సార్లు ప్రత్యేక చికిత్సలు నిర్వహించింది. ఈఆపరేషన్లలో పాల్గొన్న చెన్నై ఓమందూరార్ ఆసుపత్రి వైద్యులను సత్కరించే కార్యక్రమం సోమవారం చెన్నైలో జరిగింది. ఇందులో ఆరోగ్య మంత్రి మాట్లాడుతూ, ఈ బాలుడికి ఆరోసారి ఆపరేషన్ చేసినట్లు వివరించారు. సీఎం స్టాలిన్ ఆదేశాలతో ప్రత్యేక చొరవ చూపించి బాలుడిని ఆరోగ్యవంతుడిని చేశామన్నారు. దేశవ్యాప్తంగా కరోనా కేసులు, ఇంఫ్లూయెంజా కేసులు పెరుగుతున్నాయని వెల్లడించారు. తమిళనాడులోనూ ఈ కేసుల పెరుగుతున్నాయని , ఫీవర్ క్యాంప్‌లను మరింత విస్తృతం చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కేంద్ర ఆరోగ్య శాఖ రాష్ట్రాలకు హెచ్చరికలు జారి చేసిందన్నారు. గత వారం జరిగిన ఫీవర్ క్యాంప్‌ల ద్వారా 263 జ్వర బాధితులను గుర్తించామని, వీరికి చికిత్స అందిస్తున్నామన్నారు.

మాస్కులు ధరించండి..



ప్రజలు దయ చేసి బయటకు వచ్చే సమయంలో, అతిపెద్ద కార్యక్రమాలకు హాజరయ్యే సమయంలో మాస్కులు తప్పనిసరిగా ధరించాలని, భౌతిక దూరం పాటించాలని మంత్రి సూచించారు. విద్యార్థులకు థర్మల్ స్కానింగ్‌కు ఆదేశించామని, పరీక్షల సమయంలో వారి ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు తెప్పకులంలో మరణించిన యువకుడి శరీరం నుంచి సేకరించి శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపించామని, హెచ్3 ఎన్2 వైరస్ నిర్ధారణ కావాల్సి ఉందన్నారు. ప్రైవేటు ల్యాప్‌లలో ఈ వైరస్ కేసులు నిర్ధారణ అయిన పక్షంలో తక్షణం ప్రభుత్వానికి సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. ఈ వైరల్ ఫీవర్‌కు ప్రత్యేకంగా ఎలాంటి టీకా లేదని, ప్రస్తుతానికి సాధారణ జ్వరానికి అందించే చికిత్స కొనసాగుతున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

బడ్జెట్‌లో మరిన్ని 'కొత్త' పథకాలు

- అధికారులతో సీఎం తుది కసరత్తు
- గృహిణులకు త్వరలో నెలనెలా రూ. 1000 పంపిణీ ప్రారంభం



సచివాలయంలో అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం స్టాలిన్

సాక్షి, చెన్నై: లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఈసారి రాష్ట్ర ఆర్థిక, వ్యవసాయ బడ్జెట్‌లో సరి కొత్త పథకాలను సీఎం స్టాలిన్ ప్రకటించనున్నారు. ఇందుకు సంబంధించిన తుది కసరత్తుల్లో ఆయన నిమగ్నమయ్యారు. వివరాలు.. ఈనెల 20వ తేదీ నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలుప్రారంభం కానున్న విషయం తెలిసిందే. తొలి రోజు ఆర్థిక, మరుసటి రోజు వ్యవసాయ బడ్జెట్‌ను సభలో దాఖలు చేయనున్నారు. ఇందులోని అంశాలు, కొత్త పథకాల గురించి తుది కసరత్తులలో సీఎం ఉన్నారు. ఇందులో భాగంగా సోమవారం సచివాలయంలో సీనియర్ ఐఏఎస్ అధికారులు, సీనియర్ మంత్రులతో సీఎం స్టాలిన్ సమావేశమయ్యారు. లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రజల్ని ఆకర్షించే విధంగా బడ్జెట్ ద్వారా ప్రకటనలు చేయబోతున్నారు. అలాగే గృహిణులకు నెలకు రూ. 1000 పంపిణీ పథకం అమలుకు సిద్ధమయ్యారు. ఇందుకోసం ఇప్పటి వరకు సేకరించిన సమాచారాలు, వివరాలపై సమీక్షించారు. ఇదిలా ఉండగా ఆర్థిక, వ్యవసాయ ముసాయిదా బడ్జెట్‌ను పీఎంకే ప్రకటంచింది. ఏటా బడ్జెట్‌కు ముందుగా పీఎంకే నేతృత్వంలో ముసాయిదా బడ్జెట్ దాఖలు చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులోని అనేక అంశాలు ప్రభుత్వ బడ్జెట్‌లోనూ ఉంటాయి. ఈ సమయంలో ఈ ఏడాది పీఎంకే ముసాయిదా బడ్జెట్‌లో పలు ముఖ్య అంశాలు, పథకాలు ఉండడం గమనార్హం.

మెట్రో వాటర్ బోర్డు..

చెన్నై చింతాద్రి పేటలో రూ. 24.92 కోట్లతో మెట్రో వాటరు బోర్డుకు ప్రధాన కార్యాలయాన్ని పునరుద్ధరించారు. ఆరు అంతస్తులతో కూడిన ఈ భవనాన్ని సీఎం స్టాలిన్ సోమవారం ప్రారంభించారు. అలాగే వాటర్ బోర్డుకు ప్రత్యేక వెబ్ సైట్, కంట్రోల్ రూమ్‌ను కూడా ఏర్పాటు చేశారు. ఈ కంట్రోల్ రూమ్ నుంచి వాటర్ ట్యాంకర్లను పర్యవేక్షిస్తారు. ఆయా వాహనాల్లోని జీపీఎస్ ఆధారంగా ఈ పర్యవేక్షణ సాగుతుంది. అలాగే నీటికోసం వచ్చే విజ్ఞప్తుల ఆధారంగా తక్షణం ఆయా ప్రాంతాలకు వాహనాలను మళ్లించేందుకు వీలుగా ప్రత్యేక సమాచార వ్యవస్థను రూపొందించారు. ఇదిలా ఉండగా ఇందిరా గాంధి వర్సిటీలో కేరళ విద్యార్థులపై జరిగిన దాడిని సీఎం స్టాలిన్ ట్విట్టర్ ద్వారా ఖండించారు.

పన్నుపోటు లేని 'రంగన్న' పద్దు

- పుదుచ్చేరి అసెంబ్లీలో దాఖలు
- రూ. 11,600 కోట్లతో పథకాలు



బడ్జెట్ దాఖలు చేస్తున్న పుదుచ్చేరి ముఖ్యమంత్రి రంగస్వామి

సాక్షి, చెన్నై: పన్ను పోటు లేని బడ్జెట్‌ను సోమవారం పుదుచ్చేరి ముఖ్యమంత్రి రంగస్వామి అసెంబ్లీలో దాఖలు చేశారు. పథకాలు, ప్రాజెక్టులు, ఇతర వ్యయాల నిమిత్తం భారీగా కేటాయింపులు చేపట్టారు. వివరాలు.. కేంద్ర పాలిత ప్రాంతమైన పుదుచ్చేరి అసెంబ్లీ సమావేశాలు ఈనెల 9వ తేదీన ప్రారంభమైన విషయం తెలిసిందే. తొలి రోజున లెఫ్టినెంట్ గవర్నర్ తమిళిసై ప్రసంగించారు. ఆ తదుపరి సోమవారం సభ ప్రారంభమైంది. ఆర్థికశాఖ బాధ్యతలు సీఎం చేతిలో ఉండడంతో 2023–24కు గాను ఆర్థిక బడ్జెట్‌ను స్వయంగా ఆయనే సభలో దాఖలు చేశారు. పుదుచ్చేరిలో పథకాల అమలు, ప్రాజెక్టులకు నిధులు, ఇతర ఖర్చులతో రూ. 11600 కోట్లతో బడ్జెట్‌ను సభముందుకు తీసుకొచ్చారు.

గ్యాస్ సిలిండర్‌పై రూ. 300 రాయితీ

అన్ని కుటుంబం కార్డుదారులకు ఉపయోగ పడే విధంగా గ్యాస్ సిలిండర్‌పై రూ. 300 రాయితీని అసెంబ్లీ వేదికగా సీఎం ప్రకటించారు. నెలకు రూ. 300 చొప్పున 12 నెలలకు ఈ రాయితీ వర్తింపజేస్తామన్నారు. ఈ కారణంగా ప్రభుత్వంపై రూ. 126 కోట్లు అదనపు భారం పడనున్నట్లు సీఎం వివరించారు. మహిళా శిశు సంరక్షణకు ప్రత్యేక పథకాన్ని ప్రవేశ పెట్టారు. బిడ్డ పుట్టానే 18 సంవత్సరాలకు గాను జాతీయ బ్యాంక్‌లో రూ. 50 వేలు చొప్పున డిపాజిట్ చేయాలని నిర్ణయించారు. వర్తక సంక్షేమ బోర్డు ఏర్పాటు , రూ. 2 కోట్లను నిధులను కేటాయించారు. బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణంతో పాటుగా 50 విద్యుత్, మరో 50 డిజిటల్ బస్సుల కొనుగోలుకు నిధులు కేటాయించారు. పాల ఉత్పత్తి పెంపే లక్ష్యంగా పాడి రైతులకు 50 శాతం రాయితీతో పశువుల కొనుగోలు పథకాన్ని ప్రకటించారు. పుదుచ్చేరిలో ప్రపంచ తమిళ మహానాడు ఈ ఏడాది నిర్వహించనున్నారు. విద్య ప్రాధాన్యత పెంచేందుకు ప్రత్యేక చర్యలు, విద్యార్థులకు ల్యాప్‌టాప్‌ల పంపిణీ, ఉపకారణ వేతనం పెంపునకు నిర్ణయించారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించే విధంగా సాయంత్రం వేళల్లో చిరుధాన్యాలతో అల్పాహారం అందించనున్నారు.

సీబీఈఎస్‌ఈ సిలబస్..

6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలో సీబీఎస్‌ఈ సిలబస్‌ను అమలు చేయనున్నారు. కొత్త విద్యుత్ కనెక్షన్లు మంజూరు, ఆలయాలోని విగ్రహాలు, ఆభరణాలు, ఆస్తుల వివరాల కంప్యూటరీకరణ కోసం చర్యలు చేపడుతామని ప్రకటించారు. కామరాజర్ విద్యా పథకాన్ని అమల్లోకి తీసుకురావడమే కాకుండా విద్యార్థులకు ప్రోత్సాహక నగదును పంపిణీ చేస్తామన్నారు. కులాంతర వివాహం చేసుకునే వారికి ఇస్తున్న రూ. 2.50 లక్షల పోత్సాహక నిధిని రూ. 3 లక్షలకు పెంచారు. పన్నుపోటు, ఇతర వడ్డనలకు ఆస్కారం ఇవ్వకుండా బడ్జెట్‌ను సీఎం రూపొందించి సభలో ప్రవేశ పెట్టడంపై బీజేపీ – ఎన్ఆర్‌కాంగ్రెస్ కూటమి హర్షం వ్యక్తం చేసింది.

చారిత్రక ఘట్టం

- నాటునాటు పాట, ది ఎలిఫెంట్ విస్పరర్స్ లఘు చిత్రానికి ఆస్కార్ రావడంపై అభినందనల వెల్లువ



తమిళ సినిమా: ఇప్పుడు భారతీయుల గుండెచప్పుడు ఆర్‌ఆర్‌ఆర్‌లోని నాటునాటు పాట అంటే అతిశయోక్తి కాదేమో. ఈ విజువల్ వండర్‌కు క్రియ దర్శక దిగ్గజం రాజమౌళి అయితే, కర్త, కర్మలు జూనియర్ ఎన్టీఆర్, రామ్‌చరణ్, సంగీత దర్శకుడు ఎమ్ ఎమ్ కీరవాణి, గీత రచయిత చంద్రబోస్, గాయకులు రాహుల్ సిప్లిగంజ్, కాలభైరవ, నృత్య దర్శకుడు ప్రేమ్ రక్షిత్ అయ్యారు. ఈ పాట ఇప్పటికే ప్రపంచ సినీ ప్రేక్షకులను ఓలలాడించి, స్టెప్పులు వేయించింది. ఇప్పుడు ఆస్కార్ బరిలో విజయ కేతం ఎగరేసి తెలుగు సినిమా ఖ్యాతిని విశ్వవేదికపై ఘనంగా చాటింది. దీంతో పాటు మరో తమిళ డాక్యుమెంటరీ చిత్రం ది ఎలిఫెంట్ విస్పరర్స్ చిత్రం ఆస్కార్ అవార్డు గెలుచుకుని సత్తా చాటింది. దీంతో సినీ రాజకీయ ప్రముఖులు ఈ చిత్ర రూపకర్తలపై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

గొప్ప కీర్తి..

ఆర్‌ఆర్‌ఆర్ చిత్రం, ది ఎలిఫెంట్ విస్పరర్స్ డాక్యుమెంటరీ చిత్రం ఆస్కార్ అవార్డులను తెలుసుకోవడం గొప్ప ఘనత. ఆస్కార్ అవార్డును గెలుచుకున్న తొలి ఇండియన్ పాట నాటునాటు కావడం చారిత్రాత్మకం. సంగీత దర్శకుడు కీరవాణి, గీత రచయిత చంద్రబోస్‌కు అభినందనలు. అలాగే ఎలిఫెంట్ విస్పరర్స్ చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు. ఆ డాక్యుమెంటరీ చిత్రం దర్శక నిర్మాతలు కార్తీకి కన్సాల్వాస్, గునిత్ మింగిలను ఎంత పొగిడినా తక్కువే.

– సీఎం స్టాలిన్

అంతా ఏనుగులకే చెందుతుంది...



ది ఎలిఫెంట్ విస్పరర్స్ తమిళనాడు, ముదుమలై ఆడవి ప్రాంతంలో సాగే కథా చిత్రం. అక్కడ ఏనుగుల సంరక్షణ శిబిరాలు ఏనుగులను సంరక్షించే బొమ్మన్, బెల్లి దంపతుల నేపథ్యంలో సాగే కథ ఇది. వేర్వేరు ప్రాంతాల్లో తల్లి ఏనుగుతో నుంచి విడిపోయిన రెండు ఏనుగు పిల్లల సంరక్షణ బాధ్యతలను ఈ బొమ్మన్, బెల్లి దంపతులు తీసుకుంటారు. వాటిని సొంత పిల్లలుగా చూసుకుంటారు. కాగా ఈ డాక్యుమెంటరీ చిత్రానికి ఆస్కార్ అవార్డు రావడంపై బొమ్మన్, బెల్లి దంపతులు స్పందిస్తూ ఆనదం వ్యక్తం చేశారు. కాగా ఈ ఘనత అంతా ఆ ఏనుగులకే దక్కుతుందని పేర్కొన్నారు.

ఊహించని ఘనత

భారతీయ సినిమా ఈ రోజు వేడుక చేసుకుంటోంది. ప్రపంచ సినీ చరిత్రలో భారతీయ సినిమా రెండు ఆస్కార్ అవార్డులను గెలుచుకుని ఊహించని ఘనత సాధించింది. కార్తీకి కన్సాల్వాస్ దర్శకత్వంలో రూపొందిన ది ఎలిఫెంట్ విస్పరర్స్ ఉత్తమ డాక్యుమెంటరీ చిత్రంగా ఆస్కార్ అవార్డును గెలుసుకోవడం మహా ఆనందం కలిగిస్తోంది. ఇది పలువురు దర్శకులకు ప్రోత్సాహకరంగా నిలుస్తుంది. అదేవిధంగా రాజమౌళి దర్శకత్వం వహించిన ఆర్‌ఆర్‌ఆర్ చిత్రంలో కీరవాణి సంగీత సారథ్యంలో చంద్రబోస్ రాసిన నాటు నాటు పాట ఆస్కార్ అవార్డు గెలుచుకొని సినీ ప్రపంచాన్నే డాన్స్ చేయించింది.

– దక్షిణ భారత సినీ నటీనటుల సంఘం

హృదయ పూర్వక అభినందనలు

అత్యంత ప్రతిష్టాత్మక అవార్డు అయిన ఆస్కార్ అవార్డును గెలుచుకున్న సంగీత దర్శకుడు కీరవాణి, రచయిత చంద్రబోస్, ది ఎలిఫెంట్ విస్పరర్స్ డాక్యుమెంటరీ చిత్ర దర్శకురాలు కార్తీకి కన్సాల్వాస్‌లకూ హృదయపూర్వక అభినందనలు. గర్వించదగ్గ భారతీయులకు నా సెల్యూట్.

– రాజనీకాంత్, నటుడు

తెలుగు సినీ వైభవం విశ్వవ్యాప్తం

భారతీయ చలనచిత్ర పరిశ్రమలోని భాగమైన తెలుగు చలనచిత్ర పరిశ్రమ వైభవం ప్రపంచానికి నేడు తెలిసింది, దర్శక దిగజం రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కించిన ఆర్‌ఆర్‌ఆర్ చిత్రంలోని నాటు నాటు అనే పాట నేడు బెస్ట్ ఒరిజినల్ సాంగ్ కేటగిరిలో ఆస్కార్ అవార్డు సాధించడం తెలుగోడి విజయం. గీత రచయిత చంద్రబోస్‌కు, సంగీత దర్శకుడు కీరవాణికి, దర్శకుడు రాజమౌళికి, నిర్మాత దానయ్యకు, నృత్య దర్శకుడు ప్రేమ్ రక్షిత్‌కు, ముఖ్యంగా ఆ పాటకు అభినయించిన జూనియర్ ఎన్టీఆర్, రామ్ చరణ్‌కు ధన్యవాదాలు.

– కేతిరెడ్డి జగదీశ్వర్రెడ్డి, తెలుగు ఫిలిం ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు

అన్నాడీఎంకే శ్రేణుల నిరసన



నినాదాలు చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

సాక్షి, చెన్నై: అన్నాడీఎంకే తాత్కాలిక ప్రధాన కార్యదర్శి పళణి స్వామిపై పోలీసుల కేసు నమోదు చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఆ పార్టీ వర్గాలు సోమవారం రాష్ట్రవ్యాప్తంగా నిరసన వ్యక్తం చేశాయి. వివరాలు.. మదురై విమానాశ్రయంలో తనను పళణిస్వామి ఆదేశాల మేరకు భద్రతా సిబ్బంది చితక్కొట్టినట్టు, సెల్ ఫోన్ నేలకేసి కొట్టినట్టుగా అమ్మమక్కల్ మున్నేట్ర కళగం నాయకుడు రాజేశ్వరన్ ఆదివారం అవనీయాపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అదే సమయంలో విమానం నుంచి కిందికి దిగి వస్తూ, బస్సులో ప్రయాణించే సమయంలో పళణిస్వామికి వ్యతిరేకంగా నినాదాలు చేయడం, అవహేళన చేయడం వంటి చర్యలకు రాజేశ్వరన్ పాల్పడినట్లు అన్నాడీఎంకే సీనియర్ ఆర్‌బీ ఉదయ కుమార్ సైతం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే, పళణి స్వామిపై మాత్రం ఆరు సెక్షన్లతో మదురై పోలీసులు కేసు నమోదు చేశారు. రాజేశ్వరన్‌పై ఎలాంటి కేసు పెట్టలేదు. పళణిస్వామి ఆయన భద్రతా సిబ్బంది కృష్ణన్, సెంథిల్ నాథన్‌పై హత్యాయత్నం కేసు కూడా పోలీసులు పెట్టారు. సోమవారం ఈ సమాచారంతో అన్నాడీఎంకే వర్గాలు భగ్గుమన్నాయి. పళణిపై కేసు నమోదు చేయడాన్ని వ్యతిరేకిస్తూ, పోలీసుల తీరును ఖండిస్తూ రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల రాస్తారోకోలకు దిగారు. హఠాత్తుగా జరిగిన నిరసనల కారణంగా అనేక చోట్ల ప్రజలకు ఇబ్బందులు తప్పలేదు. అన్నాడీఎంకే వర్గాలను కట్టడి చేయడం పోలీసులకు తలనొప్పిగా మారింది. చెన్నైలోని ఆ పార్టీ ప్రధాన కార్యాలయం నుంచి పెద్దఎత్తున అన్నాడీఎంకే కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం లాయడ్స్ రోడ్డులో రాస్తారోకో చేపట్టారు. అలాగే చెన్నైలో తిరువాన్మియూరుతో పాటుగా పలు చోట్ల నిరసనలు జరిగాయి.

క్లుప్తంగా

విపత్తుల కాలంలో వైద్య సేవలు కీలకం



సంచికను ఆవిష్కరిస్తున్న జస్టిస్ ఎస్. మణి కుమార్, ఆసుపత్రి సీఈవో భారతీరెడ్డి

సాక్షి, చెన్నై: భూకంపం, సునామీ, తుపాన్లు వంటి ప్రకృతి వైపరిత్యాల సమయంలో వైద్య రంగం సేవలు కూడా అత్యంత కీలకమని జస్టిస్ ఎస్. మణికుమార్ వ్యాఖ్యానించారు. విపత్తుల కాలంలో సత్వరం అందించాల్సిన వైద్య సేవలు, చికిత్సలు, ప్రజల ప్రాణాలకు రక్షణపై రెండు రోజుల జాతీయ సదస్సు ముగింపు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చెన్నై వడపళనిలోని విజయ హెల్త్ సెంటర్ లో శని, ఆదివారాలలో ఈ సదస్సు జరిగింది. ఆసుపత్రి మేనేజింగ్ ట్రస్టీ, సీఈవో భారతిరెడ్డి, ట్రస్టీలు వసుంధరరెడ్డి, ఆరాధనరెడ్డి, నాగిరెడ్డి, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ విశ్వనాథ్ రెడ్డి తదితరులు ఈ సదస్సుకు నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా అతిథులు ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు.

ప్రత్యేకంగా మాక్ డ్రిల్..

ఇండియన్ మెడికల్ అసోసియేషన్‌తో కలిసి విజయా గ్రూప్ ఆఫ్ హాస్పిటల్ నిర్వహించిన ఈ సదస్సులో 200 మందికి పైగా వైద్యనిపుణులు, అధ్యాపకులు, పరిశోధకులు, ప్రకృతి విపత్తుల నివారణా నిపుణులు పాల్గొని సలహాలు, సూచనలు చేశారు. ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజలను కాపాడడం, విపత్తుల కారణంగా ప్రాణాపాయంలో చిక్కుకున్న వారికి అతి తక్కువ సమయంలో చికిత్స అందించడం, ఏ విధంగా రక్షించడం తదితర అంశాలపై ఆసుపత్రులు, ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా తమిళనాడు స్టేట్ డిజాస్టర్ రిస్క్ రిడక్షన్ మేనేస్‌మెంట్ (టీఎస్ఆర్ఆర్ఎం), నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్డీఆర్ఎఫ్), తమిళనాడు అగ్నిమాపకదళానికి చెందిన వంద మందితో కలిసి విజయా ఆసుపత్రి నిర్వాహకులు ప్రదర్శించిన మాక్ డ్రిల్ సదస్సుకే హైలైట్‌గా నిలిచింది. తద్వారా డిజాస్టర్ మెడిసిన్‌పై ప్రత్యక్ష అవగాహన కార్యక్రమం జరిగింది. ఆసుపత్రి ఎమర్జెన్సీ విభాగం, ఆర్థోపెడిక్ విభాగం, న్యూరాలజీ, హృద్రోగ తదితర విభాగాలు ఈ మాక్ డ్రిల్లో కీలక పాత్ర పోషించాయి. ఇటీవలే స్వర్ణోత్సవాలను జరుపుకున్న విజయా హాస్పిటల్ సామాజిక అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ సదస్సును నిర్వహించామని నిర్వాహకులు తెలిపారు. హెల్త్ సెంటర్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనిల్ కుమార్ నేతృత్వంలోని నిర్వాహక కమిటీ ఈ సదస్సును విజయవంతం చేసిందన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలని రాస్తారోకో

తిరువళ్లూరు: పాఠశాలకు వెళ్లేందుకు రవాణా సదుపాయం కల్పించాలని డిమాండ్ చేస్తూ దాదాపు 100 మంది విద్యార్థులు సోమవారం ఉదయం తిరువళ్లూరులో రాస్తారోకో నిర్వహించారు. వివరాలు.. పూండమల్లి యూనియన్ నయపాక్కం గ్రామం నుంచి మేవలూరు ప్రాంతంలోని ప్రభుత్వ మహోన్నత పాఠశాలకు నిత్యం 300 మంది విద్యార్థులు కాలినడకన వెళ్తుంటారు. ఇక్కడ బస్సు రవాణా సదుపాయం లేకపోవడంతో ఐదు కిలోమీటర్ల దూరం ఇబ్బందులు పడుతూ నడక సాగిస్తున్నారు. తమ బస్సు సదుపాయాన్ని కల్పించాలని కోరుతూ గత రెండు నెలల నుంచి పలుమార్లు ఉన్నత అధికారులకు వినతి పత్రం సమర్పించారు. దీంతో తల్లిదండ్రులు, స్థానికులతో కలిసి సోమవారం ఉదయం తిరుపతి–చెన్నై జాతీయ రహదారిలో విద్యార్థులు రాస్తారోకో నిర్వహించారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న అధికారులు ఘటన స్థలానికి చేరుకుని ఆందోళన విరమింపజేశారు.



నినాదాలు చేస్తున్న విద్యార్థులు

ఘనంగా మహోకుంభాభిషేకం



ఆలయ గోపుర కలశానికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకుడు



విశేష అలంకరణలో సాయిబాబా

తిరుత్తణి: తిరుత్తణి శివారులో నూతనంగా నిర్మించిన షిర్డీ సాయిబాబా ఆలయ మహాకుంభాభిషేకం సోమవారం ఉదయం కోలాహలంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని దర్శించుకున్నారు. వివరాలు.. తిరుత్తణి శివారులోని కార్తికేయపురం మోట్టూరులో బాబా భక్తుడు గోపాలకృష్ణన్ కృషితో షిర్డీసాయిబా ఆలయాన్ని నిర్మించారు. సోమవారం ఆలయ మహాకుంభాభిషేకం సందర్భంగా ఉదయం విఘ్నేశ్వర పూజ, పూర్ణాహుతి, హోమ పూజలు చేపట్టి ఉదయం 10 గంటలకు పుణ్యతీర్థాలతో గోపురానికి కుంభాభిషేకం చేపట్టారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

పంచ మహా యాగ పూజలు ప్రారంభం



యాగ పూజలు చేస్తున్న శివాచార్యులు

వేలూరు: వాలాజలోని శ్రీ ధన్వంతరి ఆరోగ్య పీఠంలో పీఠాధిపతి డాక్టర్ మురళీధర స్వామిజీ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం వారహీ యాగంతో పాటు పంచ మహా యాగ పూజలు ప్రారంభమయ్యాయి. పంచమి తిథి దినోత్సవాన్ని పురస్కరించుకొని దేశ వ్యాప్తంగా ఉన్న ప్రజలందరూ ఆరోగ్యంగాను, సుఖ సంతోషాలతో ఉండాలని, ఎటువంటి వైరస్ వ్యాధులు రాకుండా ప్రజలను కాపాడాలని కోరుతూ సూళిని, కాళీ, త్రిపుర భైరవిలకు విశేష వనమూళికలు, పసుపు, వంటి వాటితో పంచ ముఖాలు కలిగిన శ్రీ పంచముక వారహీ హోమ పూజలు చేశారు. అనంతరం పంచ ద్రవ్యాలతో అభిషేకం, అర్చన దీపారధన పూజలు నిర్వహించారు. అదే విధంగా షష్టి దినోత్సవం కావడంతో సాయంత్రం శ్రీకార్తీక కుమారుడికి చత్రు సంహార హోమ, అభిషేకం నిర్వహించనున్నట్లు పీఠాధిపతి తెలిపారు.

24 కిలోల గంజాయి స్వాధీనం

– నలుగురి అరెస్టు

అన్నానగర్: ఉసిలంబట్టి సమీపంలో సోమవారం 24 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి నలుగురిని అరెస్టు చేశారు. వివరాలు.. మదురై జిల్లా ఉసిలంబట్టి సమీపంలోని తోట ప్రాంతంలో అక్రమంగా గంజాయిని నిల్వ చేసి విక్రయిస్తున్నట్లు జిల్లా ఎస్పీ శివప్రసాద్‌కు సోమవారం రహస్య సమాచారం అందింది. ఈ మేరకు ప్రత్యేక విభాగం పోలీసులు మామరతుపట్టి ప్రాంతంలో తనిఖీలు చేశారు. ఇందులో 24 కిలోల గంజాయిని గుర్తించి సీజ్ చేశారు. ఈ గంజాయి నిల్వ ఉంచిన మదురై ధనకంకుళానికి చెందిన సురేష్ (29), మేలమడైకి చెందిన శరవణన్ (30), కరుగటాన్ పట్టికి చెందిన నాగేంద్రన్ (28), అన్నంబరిపట్టికి చెందిన ప్రసాద్ (28)ను అరెస్టు చేశారు. అలాగే ద్విచక్రవాహనాన్ని కూడా స్వాధీనం చేసుకున్నారు.

తారు ఫ్యాక్టరీ ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఆందోళన



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న రాజపాళ్యం గ్రామస్తులు

తిరువళ్లూరు: పర్యావరణానికి ముప్పు కలిగేలా నిర్మిస్తున్న తారు పరిశ్రమ నిర్మాణ పనులను వెంటనే నిలిపి వేయాలని డిమాండ్ చేస్తూ తిరువళ్లూరు జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని మెయ్యూరు రాజపాళ్యం గ్రామస్తులు సోమవారం ఉదయం ముట్టడించారు. వివరాలు..తిరువళ్లూరు జిల్లా ఊత్తుకోట తాలుకా మెయ్యూరు గ్రామంలో సుమారు 3,500 మంది ప్రజలు నివాసం ఉంటున్నారు. వ్యవసాయ ప్రధాన ఆధారంగా ఉన్న ఈ గ్రామంలో పెరుమాల్ పట్టు గ్రామానికి చెందిన వినోద్‌కుమార్, జయపాల్ సుమారు నాలుగు ఎకరాల స్థలంలో తారు పరిశ్రమను ఏర్పాటు చేస్తున్నారు. ఈ తారు పరిశ్రమ ఏర్పాటు వల్ల వ్యవసాయం దెబ్బతినడంతో పాటు తాగు, సాగునీరు, గాలి కలుషితమయ్యే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తారు పరిశ్రమకు ఇచ్చిన పర్మిషన్‌ను వెంటనే రద్దు చేయాలని కోరుతూ ఇప్పటికే పలు సార్లు ఉన్నత అధికారులకు విజ్ఞప్తి చేశారు. అయినా ఫలితం లేకపోవడంతో సోమవారం ఉదయం కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించి తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

మెట్రో కోసం మురుగన్ గుడి కూల్చివేత

• పెరంబూర్‌లో ఉద్రిక్తత



ఆలయాన్ని జేసీబీతో తొలగిస్తున్న అధికారులు

కొరుక్కుపేట: మెట్రో రైలు పనుల కోసం చెన్నై పెరంబూర్‌లో 50 ఏళ్ల క్రితం నిర్మించిన మురుగన్ ఆలయాన్ని కూల్చివేశారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వివరాలు.. రాజధాని చెన్నైలో కొనసాగుతున్న మెట్రో రైలు ప్రాజెక్టు కోసం పలుచోట్ల దేవాలయాలు, మున్సిపల్ ఆస్తులను స్వాధీనం అధికారులు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో మెట్రో రైల్వే పనుల కోసం పెరంబూర్ రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న వెయ్యి చదరపు అడుగుల స్థలంలో శ్రీవల్లి బాల సుబ్రమణియార్ (మురుగన్) ఆలయాన్ని తొలగించాలని నిర్ణయించారు. దీన్ని కొడుంగయూర్లోని నందిమఠం ప్రాంతానికి చెందిన ఇరుసమ్మాళ్(75) ఐదు దశాబ్దాల క్రితం నిర్మించారు. గతేడాది డిసెంబరులో తిరువీకా నగర్ మండల అధికారులు ఈ ఆలయాన్ని పరిశీలించారు. అవసరమైన ప్యాకేజీ తీసుకుని ఆలయాన్ని తొలగించి ఆ స్థలాన్ని కార్పొరేషన్‌కు అప్పగించాలని నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. అయితే ఇప్పటి వరకు ఆలయ పాలకవర్గం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం విద్యుత్ లైన్ మిషన్‌తో వచ్చి మురుగన్ ఆలయాన్ని కూల్చివేశారు. 50 మందికి పైగా అధికారులు, పోలీసులు పాల్గొన్నారు. సోమవారం ఉదయం ఐదు గంటలకు ఆలయాన్ని తొలగించే పనులు ప్రారంభం కాగా, మధ్యాహ్నానికి మెట్రో అధికారులకు స్థలాన్ని అప్పగించారు. ఆలయం కూల్చి వేయడంతో స్థానికులు, భక్తులు పెద్దఎత్తున గుమిగూడారు. ఫలితంగా పెరంబూర్‌లో ఉద్రిక్తత నెలకొంది. కాగా, ఆలయంలోని విగ్రహాలు, అన్ని వస్తువులను నిర్వాహకులు ఆదివారమే తీసుకెళ్లారు. తిరువీకా నగర్ 6వ మండల అధికారి మురుగన్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సెంథిల్ నాథన్ పనులను పర్యవేక్షించారు.

క్విజ్ పోటీలు



ఎస్‌సీఎల్ఏఎస్‌లో ఎక్స్ క్విజ్ ఐటీ ఇంటర్ కాలేజ్ పోటీలు సోమవారం జరిగాయి. 80 బృందాలకు చెందిన 300 మంది విద్యార్థులు ఈ క్విజ్‌కు హాజరు అయ్యారు. ఎస్ఎస్ఈ విద్యార్థులు మోహన్ రామ్ , ఆదిత్యన్ ఇందులో విజేతలుగా నిలిచారు. వీరికి క్విజ్ నిర్వాహకులు అరవింద్‌రాజీవ్ సారథి, ప్రిన్సిపల్ గుణిత అరుణ్ చాదోహ్కా బహుమతులను అందజేశారు. – సాక్షి, చెన్నై

మానవ హక్కుల కమిషన్ నేపథ్యంలో ‘సుమోటో’



చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్ ఆవిష్కరణలో యూనిట్ సభ్యులు

తమిళ సినిమా: మానవ హక్కుల కమిషన్ నేపథ్యంలో రూపొందిన చిత్రం సుమోటో. లక్ స్టోన్ ప్రొడక్షన్ పతాకంపై ఏజీ మొహమ్మద్ మన్సూర్ నిర్మించిన ఈ చిత్రానికి రామస్వామి పి.రాజా కథ, కథనం, మాటలు, దర్శకత్వం బాధ్యతలను నిర్వహించారు. ఇందులో నిశ్శబ్దం చిత్రం ఫేమ్ అజయ్ శ్రీధర్ కథానాయకుడుగాను నటి పణిమలర్ పన్నీర్ సెల్వం, హంసరేఖ నాయికలుగా నటించారు. దర్శకుడు లియాకత్ అలీ ఖాన్ ప్రతినాయకుడుగా నటించిన ఈ చిత్రం నిర్మాణ కార్యక్రమాలు పూర్తి చేసుకుని త్వరలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా ఇటీవల రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి ఎం.సుబ్రమయణిన్ చేతులు మీదుగా చిత్ర యూనిట్ చిత్ర టైటిల్‌ను, ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు వివరాలు తెలుపుతూ ఇది కోవిడ్ 19 కారణంగా అనారోగ్యానికి గురైన ఓ యువతి కోసం రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ స్వయంగా జోక్యం చేసుకుని చేసే న్యాయపోరాటం చేయడమే ఈ చిత్రం కథ అన్నారు. ఇది మొట్టమొదటిసారిగా పూర్తిస్థాయి మానవ హక్కుల కమిషన్ నేపథ్యంలో రూపొందించిన కథా చిత్రం అని చెప్పారు. ఈ చిత్రం ప్రపంచ మానవ హక్కుల కమిషన్ ప్రశంసలను పొందిందని తెలిపారు. చిత్రానికి ఇళయరాజా వేలు స్వామి ఛాయాగ్రహణం, వారెన్ చార్లీ సంగీతాన్ని అందించారని దర్శకుడు వెల్లడించారు.

కోలీవుడ్ టాక్స్

ఆ విషయంలో చాలా క్లియర్



నటి కాజల్

తమిళ సినిమా: అగ్ర కథానాయికల్లో ఒకరు కాజల్ అగర్వాల్. ఉత్తరాదికి చెందిన ఈ బ్యూటీ దక్షిణాదిలో ముఖ్యంగా తెలుగు, తమిళం భాషల్లో స్టార్ హీరోలందరితో జతకట్టారు. కాగా కథానాయకిగా మంచి ఫామ్‌లో ఉండగానే ప్రేమించిన వ్యక్తిని పెళ్లి చేసుకొని ఓ బిడ్డకు తల్లి కూడా అయ్యారు. అయితే ఇదంతా రెండేళ్ల లోపే జరిగిపోయింది. 2020లో పెళ్లి చేసుకున్న కాజాల్ అగర్వాల్ 2022 కల్లా గోడకు తగిలిన బంతిలా మళ్లీ నటన వైపు తిరిగొచ్చేశారు. వివాహం అయిన తర్వాత, నటీమణులు హీరోయిన్‌గా కొనసాగటం కష్టమే అంటారు. దాన్ని కాజల్ అగర్వాల్ బ్రేక్ చేశారు. పెళ్లే కాదు బిడ్డకు తల్లి అయిన తర్వాత కూడా ఈ బ్యూటీ హీరోయిన్‌గా నటిస్తున్నారు. మరో విషయం ఏమిటంటే కమలహాసన్‌కు జంటగా నటిస్తున్న ఇండియన్ –2 చిత్ర షూటింగ్ వాయిదాలు పడుతూ రావటం కాజల్ పాలిట వరంగా మారిందనే చెప్పాలి. ప్రస్తుతం ఈమె ఇండియన్ 2 చిత్రంలో నటిస్తున్నారు. తదుపరి తెలుగులో బాలకృష్ణ సరసన నటించే లక్కీ చాన్స్ కాజల్‌ను వరించింది. కాగా కోలీవుడ్లో నటుడు అజిత్‌కు జంటగా నటించే అవకాశం కూడా ఈమె తలుపు తట్టిందనేది తాజా సమాచారం. అజిత్ 62వ చిత్రంలో కాజల్‌ను హీరోయిన్‌గా పరిశీలిస్తున్నట్లు తెలిసింది. వీరిద్దరు ఇంతకుముందు వివేకం చిత్రంలో జతకట్టారన్నది గమనార్హం. ఇకపోతే పెళ్లి అయిన తర్వాత కూడా గ్లామర్‌గా నటిస్తారా..? అన్న ప్రశ్నకు కాజల్ అగర్వాల్ బదులిస్తూ వైనాట్ అని టక్కున చెప్పారు. ఈ విషయంలో తాను తన భర్త చాలా క్లియర్‌గా ఉన్నామని పేర్కొన్నారు. ప్రేమ సన్నివేశాల్లో సహ నటుడితో సన్నిహితంగా నటించాల్సి ఉంటుందన్నారు. అలా నటించనని చెప్పడం వీలుకాదన్నారు. వివాహ జీవితం, చేసే వృత్తి వేరు వేరు అన్నారు. అయితే గ్లామర్ సన్నివేశాలు చిత్ర కథకు ఎంతవరకు అవసరం అన్నది కూడా ముఖ్యమన్నారు. వివాహానంతరం తాను నటించనని ప్రచారం చేశారని, అయితే తాన చర్యలతో దాన్ని బ్రేక్ చేశానని కాజల్ అగర్వాల్ పేర్కొన్నారు.

తమ్ముడి దర్శకత్వంలో

అన్నయ్య గేమ్ ఆన్



గేమ్ ఆన్ చిత్రంలో మధుబాల

తమిళ సినిమా: ఇంతకుముందు అన్నయ్య దర్శకత్వంలో తమ్ముడు కథానాయకుడిగా నటించిన చిత్రాలు చూశాం. అలా నటుడు మోహన్ రాజా దర్శకత్వంలో జయం రవి కథానాయకుడిగా, సెల్వ రాఘవన్ దర్శకత్వంలో ధనుష్ నటించిన పలు చిత్రాలు విజయవంతమయ్యాయి. కాగా తాజాగా తమ్ముడు దర్శకత్వంలో అన్నయ్య కథానాయకుడుగా నటిస్తున్న చిత్రం రూపొందడం విశేషం. ఆ చిత్రమే గేమ్ ఆన్ బాబు.జి సమర్పణలో కస్తూరి క్రియేషన్స్, గోల్డెన్ రింగ్స్ ప్రొడక్షన్స్ సంస్థల ద్వారా రవి కస్తూరి నిర్మిస్తున్న ఈ చిత్రానికి దయానంద్ కథ కథనం దర్శకత్వం బాధ్యతలను నిర్వహిస్తున్నారు. ఆయన అన్నయ్య గీతానంద్ కథానాయకుడుగా నటిస్తున్న ఇందులో నేహా సోలంగి నాయకిగా నటిస్తున్నారు. ప్రధాన పాత్రలో నటి మధుబాల, ఆదిత్య మీనన్, శుభలేఖ సుధాకర్, వాసంతి కృష్ణన్ తదితరులు నటిస్తున్నారు. దీనికి అభిషేక్ ఏఆర్ సంగీతాన్ని, అరవింద్ ఛాయాగ్రహణం అందిస్తున్నారు. చిత్ర వివరాలను దర్శకుడు తెలుపుతూ సిద్ధార్థ అనే 27 ఏళ్ల యువకుడు ఓ రియల్ ఎస్టేట్ సంస్థలో వ్యాపార ప్రతినిధిగా బాధ్యతలు నిర్వహిస్తుంటాడన్నారు. అతనికి రాహుల్ అనే మిత్రుడు మోక్ష అనే స్నేహితురాలు ఉంటారన్నారు. అయితే ఒకరోజు ఉద్యోగం పోవడంతో తన ఇంటికి వచ్చిన సిద్ధార్థకు అక్కడ తాను ఎంతగానో ప్రేమించే మిత్రులు చేస్తున్న ఓ పని చూసి షాక్‌కు గురౌతున్నారు. తన జీవితంలో తాను ప్రేమిస్తున్న అందరూ తనను అవసరానికి వాడుకుంటున్నారనీ, ఎవరూ నిజమైన ప్రేమను అందించడం లేదని గ్రహించి విషం తాగి ఆత్మహత్యకు పాల్పడతాడన్నారు. అలాంటి సమయంలో అనూహ్యంగా ఒక వ్యక్తి రక్షించడంతో ప్రాణాపాయం నుంచి రక్షించబడి రియల్ టైం సైకాలజికల్ అనే గేమ్ లోకి అడుగు పెడతాడని చెప్పారు. ఆ తర్వాత అతని జీవితం ఎటువైపు మళ్లిందనే పలు ఆసక్తికరమైన అంశాలతో గేమ్ ఆన్ చిత్రం రూపొందినట్లు పేర్కొన్నారు.

నటి లిజీ ఆంటనికి ‘ది ఫినామినల్ షీ’ అవార్డు



అవార్డు అందుకుంటున్న లిజీ ఆంటని

తమిళ సినిమా: నటి లిజీ ఆంటని ఫినామినల్ షీ పురస్కారాన్ని అందుకున్నారు. ఇండియాలోని వివిధ రంగాల్లో సాధించిన మహిళా మణులను గౌరవించే విధంగా ఇండియా జాతీయ న్యాయవాదుల సంఘం సలహాదారులు, సుప్రీంకోర్టు న్యాయవాది అయిన విణాక్షి కదన్ 2018లో ది ఫినామినల్ షీ అనే సంఘాన్ని ప్రారంభించారు. ఈ సంఘం అన్యాయానికు గురైన మహిళలకు చట్టపరమైన సహాయాన్ని అందిస్తూ వారికి మంచి మార్గాన్ని చూపిస్తోంది. అదే విధంగా ఏటా దేశంలోని వివిధ రంగాలకు చెందిన మహిళ సేవకులను ఈ అవార్డుతో ఘనంగా సత్కరిస్తూ వస్తున్నారు. ఈ అవార్డ కమిటీలో పద్మశ్రీ అవార్డు గ్రహీతలు, హైకోర్టు న్యాయమూర్తులు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, న్యాయవాదులు, పార్లమెంట్ సభ్యులు, వీరితోపాటు ప్రముఖ సంస్థలకు చెందిన 500 మంది సీఈవోలు, ప్రముఖ వ్యాపారవేత్తలు, పాత్రికేయులు సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ ఏటా అవార్డుల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అందులో 100 మందిక ఎంపిక చేసి ఫినామినల్ షీ అవార్డులు అందజేస్తోంది. తాజాగా ఈ అవార్డుకు ఎందుకైన వారిలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి రేఖ పల్లి, పంజాబ్, హర్యానా హైకోర్టు న్యాయమూర్తి లీసా గిల్, రాజ్యసభ సభ్యురాలు డాక్టర్ శశికళ పుష్పా రామస్వామి, పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ సోమా ఘోష్, పద్మశ్రీ శ్రీవాస్తవ, ఐఏఎస్ అధికారి సౌమ్య శర్మ, ఆదివాసీల సంరక్షణ శాఖ మంత్రి రేణుక సింగ్ తదితర ప్రముఖ శాఖలకు చెందిన మహిళామణులు చోటు చేసుకున్నారు. వీరిలో తమిళ నటి లిజీ ఆంటని కూడా చోటు దక్కించుకున్నారు. ఈమె 2011లో తూంగా నగరం అనే చిత్రం ద్వారా నటిగా పరిచయమయ్యారు. ఆ తర్వాత తంగమీన్‌గల్, పేరన్బు, నాడోడిగల్ 2, నెత్రిక్కన్, శివరంజనీయం ఇన్నుమ్ పల పెన్‌గలుమ్ తదితర చిత్రాల్లో కీలకపాత్రలు పోషించి గుర్తింపు పొందారు. కాగా శనివారం రాత్రి జరిగిన ది నామియల్ సీ అవార్డుల కార్యక్రమంలో లిజీ ఆంటనిని అవార్డు అందుకున్నారు.

ఇకపై నన్నెవరూ కలవొద్దు



కన్నై నంబాదే చిత్ర యూనిట్

తమిళ సినిమా: నిర్మాతగా, డిస్ట్రిబ్యూటర్‌గా సినీరంగ ప్రవేశం చేసిన ఉదయనిధి స్టాలిన్ ఆ తర్వాత కథానాయకుడిగాను పరిచయం అయ్యి మంచి గుర్తింపు తెచ్చుకున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం రాష్ట్ర క్రీడా శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఈయన కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం కన్నై నంబాదే. నటి ఆధునిక నైతిక నటించిన ఇందులో నటి భూమిక, నటుడు ప్రసన్న, శ్రీకాంత్, నటి వసుంధర తదితరులు ముఖ్యపాత్రలు పోషించారు. లిపి సినీ క్రాఫ్ట్ పతాకంపై వీఎన్. రంజిత్ కుమార్ నిర్మించిన ఈ చిత్రానికి ఇరవుక్కు అయిరం కన్‌గళ్ చిత్రం ఫేమ్ ఎం.మారన్ దర్శకత్వం వహించారు. సిద్ధు కుమార్ సంగీతాన్ని అందించిన ఈ చిత్రం నిర్మాణ కార్యక్రమాలు పూర్తి చేసుకుని ఈ నెల 17వ తేదీన విడుదలకు సిద్ధమవుతోంది. దీన్ని రాష్ట్ర వ్యాప్తంగా రెడ్ జెయింట్ మూవీస్ సంస్థ విడుదల చేస్తోంది. ఈ సందర్భంగా చిత్ర కథానాయకుడు మీడియా సమావేశంలో మాట్లాడుతూ మారన్ ఇంతకుముందు దర్శకత్వం వహించిన ఇరవుక్కు అయిరం కన్ గళ్ చిత్రాన్ని చూసి అందులో కథానాయకుడిగా నటించిన అరుళ్ నిధికి ఫోన్ చేసి చిత్రం బాగుందని అభినందించానన్నారు. దర్శకత్వంలో వచ్చి వంశం చిత్రంలో తాను నటించాల్సిందని, అయితే ఆ చిత్రం కోసం చాలా హోం వర్క్ చేయాలని దర్శకుడు చెప్పడంతో అందుకు అరుళ్ నిధి కరెక్ట్ అని చెప్పి దర్శకుడిని ఆయన దగ్గరకు పంపానన్నారు. ఇప్పుడు అరుళ్ నిధి దర్శకుడు మారన్‌ను తన వద్దకు పంపి కథ వినమని చెప్పారన్నారు. మారన్ మొదట తనకు ఒక ప్రేమ కథను చెప్పారని, అయితే తనకు క్రైమ్ థ్రిల్లర్‌లో నటించాలని కోరిక అని చెప్పడంతో దర్శకుడు ఈ కథను తయారు చేసుకోవచ్చారన్నారు. ఈ చిత్ర షూటింగ్ అధిక భాగం రాత్రిళ్లోనే నిర్వహించినట్లు చెప్పారు. అయితే కరోనా తదితర కారణాల వల్ల ఈ చిత్ర షూటింగ్ను పూర్తి చేయడానికి నాలుగేళ్లు పట్టిందన్నారు. ఈ చిత్ర షూటింగ్ ప్రారంభించినప్పుడు తాను పూర్తిస్థాయిలో రాజకీయాలకు వస్తానని భావించలేదన్నారు. చిత్రం పూర్తి చేసిన తర్వాత ఎన్నికల్లో ప్రచారం, ఆ తర్వాత యువజన విభాగ కార్యదర్శి, ఆపై శాసనసభ్యుడు, ఇప్పుడు మంత్రి వరకు ఎదిగానన్నారు. ఈనేపథ్యంలో తాను నటనకు స్వస్తి చెప్పానని, కాబట్టి ఇకపై ఎవరు సినిమాలకు సంబంధించి తనను కలవొద్దని ఆయన స్పష్టం చేశారు.

క్లుప్తంగా

రెండు ద్విచక్రవాహనాలు ఢీ -ఇద్దరి మృతి

అన్నానగర్: రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరు మృతిచెందిన ఘటన నామగిరిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. నామగిరిపేట యూనియన్ నారైకినరుకు చెందిన అయ్యనార్ రైతు. ఇతను తన బంధువు సెంగమలై (55)తో కలిసి ఆదివారం స్కూటర్‌పై మెట్టల వైపు వెళ్తున్నారు. మరోవైపు మనోజ్ (26), ఆనంద్ (19) బైక్‌పై ముల్లుకురిచ్చి వెళుతున్నారు. ఆయిల్‌పట్టి వద్ద రెండు వాహనాలు ఢీకొనడంతో అయ్యనార్, సెంగమలైకు తీవ్ర గాయాలయ్యాయి. మనోజ్, ఆనంద్ స్వల్పంగా గాయపడ్డారు. ఆయిల్‌పట్టి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన అయ్యనార్, సెంగమలైను చికిత్స నిమిత్తం సేలం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మనోజ్, ఆనంద్‌లను స్థానిక ఆసుపత్రిలో చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో అయ్యనార్, సెంగమలై మృతి చెందారు. నామగిరిపేట ఇన్‌స్పెక్టర్ గణేష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

22 కిలోల గంజాయి స్వాధీనం -ఇద్దరు యువకుల అరెస్టు

తిరువొత్తియూరు: చెన్నై పాడి వంతెన వద్ద 22 కిలోల గంజాయి కలిగివున్న ఇద్దరు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అంబత్తూర్ విజిలెన్స్ విభాగం పోలీసులకు పాడి సమీపంలో గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందింది. ఇన్‌స్పెక్టర్ ధనమ్మాల్ వాహన తనిఖీ చేశారు. ఆ మార్గంలో వచ్చిన ఇద్దరు యువకులను విచారణ చేశారు. వారు పొంతనలేని సమాధానం చెప్పడంతో స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించారు. మధురై కూడల్ నగర్‌కు చెందిన కార్తిక్ (26), తేని ఉత్తమపాళయం ప్రాంతానికి చెందిన భాస్కర్ (35)గా తెలిసింది. వారి బ్యాగులను తనిఖీ చేయగా 22 కిలోల గంజాయి ఉన్నట్టు తెలిసింది. ఇద్దరిని కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు.

కోడలిపై యాసిడ్ దాడి -అన్నాడీఎంకే నాయకురాలి అరెస్టు

తిరువొత్తియూరు: కడలూరు జిల్లాలో కోడలిపై ఆసిడ్ పోసి హత్యాయత్నం చేసిన అన్నాడీఎంకే మహిళా నాయకురాలిని పోలీసులు అరెస్టు చేశారు. కడలూరు జిల్లా విరుదాచలానికి చెందిన కలివరదన్ భార్య ఆండాళ్ విరుదాచలం అన్నాడీఎంకే ఉప కార్యదర్శిగా ఉన్నారు. వీరి కుమారుడు ముకేష్ రాజ్. ఇతని భార్య కృతిక (26). వీరికి రిషిత (5), రిషిక (1) అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ క్రమంలో కృతికపై అనుమానం పెంచుకున్న అత్త ఆండాలు కోడల్ని తరచూ వేధింపులకు గురి చేసేది. ఆదివారం రాత్రి ఆండాళ్‌కు కృత్తికకు గొడవలు జరిగాయి. ఆదివారం అర్ధరాత్రి సమయంలో కృత్తిక ఇంటిలో నిద్రపోతున్న సమయంలో అక్కడికి వచ్చిన ఆండాలు టాయిలెట్‌కు ఉపయోగించే ఆసిడ్‌ను కృత్తిక ముఖంపై పోసి నోటిలో కూడా పోసి హత్య చేయడానికి ప్రయత్నించింది. కృత్తిక కేకలు వేయడంతో ఇరుగు పొరుగు వారు దీనిపై విరుదాచలం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కృత్తికను చికిత్స కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి ఆండాలును అరెస్టు చేశారు.

విద్యార్థి దుర్మరణం

తిరువొత్తియూరు: మద్యం మత్తులో బైక్‌పై వెళుతూ ప్లాట్‌ఫాంను ఢీకొనడంతో విద్యార్థి మృతిచెందాడు. మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. తెన్‌కాశి జిల్లాకు చెందిన నోబెల్ (21) అదే ప్రాంతంలోని ఓ కాలేజీలో డిగ్రీ చదువుతున్నాడు. మదురై జిల్లాకు చెందిన స్నేహితుడు శివ భారతి (21)తో కలిసి చెన్నై వడపళని అళగిరి నగర్‌లో ఉంటున్న స్నేహితుడిని చూడడానికి తెన్‌కాశి జిల్లా నుంచి బైక్‌పై చెన్నైకి వచ్చారు. చెన్నై అమైన్‌దకరై రోడ్డులోని టాస్మాక్ దుకాణంలో మద్యం తాగి మరో స్నేహితుడు విష్ణును చూడడానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో బైక్ అదుపుతప్పి ప్లాట్‌ఫాంను ఢీకొన్నారు. నోబెల్ అక్కడికక్కడే మృతి చెందగా శివభారతికి తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని చికిత్స నిమిత్తం కీలపాక్కం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసుల కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

విషం తాగి ఇద్దరి ఆత్మహత్య

అన్నానగర్ : సిరుగనూరులో విషం తాగి ఇద్దరు వ్యక్తులు ఆత్మహత్య చేసుకున్నారు. తిరుచ్చి జిల్లా సిరుగనూరు సమీపంలోని అయ్‌కుడికి చెందిన సెల్వం (55) రైతు. తాగుడు అలవాటు ఉంది. ఆదివారం పొలానికి వేసే పురుగుమందు తాగి ఇంట్లో అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. గమనించిన ఇరుగుపొరుగు వారు అతడిని రక్షించి చికిత్స నిమిత్తం కొల్లిడ్ నంబర్ వన్ టోల్‌గేట్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం తిరుచ్చి ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. సిరుగనూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అదే విధంగా కట్టుపుత్తూరు సమీపంలోని కడువెట్టి నడుతేరుకు చెందిన పళనివేల్ (65) ఆరు నెలలుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఇందుకోసం సంప్రదాయ వైద్యంతో చికిత్స పొందుతున్నాడు. కానీ కడుపునొప్పి తగ్గకపోవడంతో మనస్తాపానికి గురైన పళనివేల్ సోమవారం పురుగుమందు తాగాడు. ఈ విషయం తెలుసుకున్న ఇరుగుపొరుగు వారు 108లో నామక్కల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే ఆలస్యం కావడంతో మృతి చెందాడు. కుమారుడు రాజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కాట్టుపుత్తూరు సబ్ ఇన్‌స్పెక్టర్ సెంథిల్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తొలిరోజు ప్రశాంతం

- ప్లస్–2 పరీక్షలు ప్రారంభం
- హాజరైన 8.75 లక్షల మంది
- కట్టుదిట్టమైన ఏర్పాటు చేసిన అధికారులు
- నేటి నుంచి ప్లస్–1 విద్యార్థులకు..



చెన్నై అశోక్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో ప్రార్థనలు చేస్తూ..



తిరువళ్లికేని లేడీవెల్లింగ్‌టన్ పాఠశాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

సాక్షి, చెన్నై: రాష్ట్రంలో సోమవారం నుంచి ప్లస్–2 పబ్లిక్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు ల్యాంగ్వేజ్ సబ్జెక్టు పరీక్ష కట్టుదిట్టమైన ఆంక్షల నడుమ జరిగింది. పరీక్షలకు ముందుగా తమ తల్లిదండ్రులతో కలిసి ఉదయాన్నే విద్యార్థులు ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు. ఆయా పరీక్ష కేంద్రాల వద్ద సైతం దేవుడిని ప్రార్థించే విధంగా, విద్యార్థుల్లో ధైర్యాన్ని మనో ఉల్లాసాన్ని నింపే విధంగా కార్యక్రమాలు జరిగాయి. వివరాలు.. కరోనా పరిస్థితుల అనంతరం మూడేళ్ల తర్వాత ఈ సారి కట్టుదిట్టమైన ఆంక్షలతో పబ్లిక్ పరీక్షలకు ఏర్పాట్లు చేసిన విషయం తెలిసిందే. సోమవారం నుంచి ప్లస్ –2 పరీక్షలు ప్రారంభమయ్యాయి. తొలి రోజు పరీక్షలకు 8.75 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. ఏప్రిల్ 3వ తేదీ వరకు ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా 3225 సెంటర్లను అధఇకారులు ఏర్పాటు చేశారు.

గంట ముందే రాక..

ఉదయాన్నే విద్యార్థుల తమ తమ ప్రాంతాలలోని ఆలయాలకు తల్లిదండ్రులతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంట ముందుగానే పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకున్నారు. ఇక్కడ సైతం దేవుళ్లను ప్రార్థించే ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల్లో ధైర్యాన్ని నింపే విధంగా, ఆందోళనలను తొలగించే రీతిలో కౌన్సెలింగ్ కార్యక్రమాలు నిర్వహించారు. తనిఖీల అనంతరం 9.30 గంటల తర్వాతా పరీక్ష హాల్లోకి విద్యార్థులను అనుమతించారు. 10 గంటలకు విద్యార్థులు జవాబు పత్రాలను అందజేశారు. తొలి 15 నిమిషాలు ప్రశ్నా పత్రం పరిశీలన, తదితర వాటికి కేటాయించారు. 10.15 నుంచి మధ్యాహ్నం 1.15 గంటల వరకు పరీక్ష జరిగింది. 3,100 మందితో ఫ్లయింగ్ స్క్వాడ్‌లు తనిఖీలు చేపట్టాయి. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద పోలీసుల గస్తీ సైతం ఏర్పాటు చేశారు. కాపీయింగ్‌కు పాల్పడే వారిని రెండేళ్ల పాటు డీబార్ చేస్తామని హెచ్చరించారు. ఇక, మంగళవారం నుంచి ప్లస్–1 పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం 3,224 సెంటర్లను అధికారులు సిద్ధం చేశారు. ఈ పరీక్షలు ముగిసిన తర్వాత ఏప్రిల్ 10వ తేదీ నుంచి 21వ తేదీ వరకు మూల్యాంకనం, మే 5న ఫలితాలు వెల్లడించనున్నట్లు అధికారులు ప్రకటించారు.



చెన్నై ఎగ్మూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో పరీక్షలు రాయడానికి స్కూల్ ఆవరణలో వేచి ఉన్న విద్యార్థినులు

21 కేంద్రాల్లో ప్లస్-2 పరీక్షలు



విద్యార్థినులకు సూచనలు చేస్తున్న డీఎస్పీ విఘ్నేష్

తిరుత్తణి: ప్లస్–2 పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు లాగ్వేంజ్ పేపర్–1 పరీక్షలు జరిగాయి. తిరుత్తణి బాలికల పాఠశాల పరీక్ష కేంద్రంలో డీఎస్పీ విఘ్నేష్ తనిఖీలు చేశారు. పళ్లిపట్టు, పొదటూరుపేట, కనకమ్మసత్రం, కేజీ కండ్రిగ, తిరువలంగాడు సహా 21 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించగా 150 మంది పోలీసులు బందోబస్తులో పాల్గొన్నట్లు డీఎస్పీ తెలిపారు.

వేలూరులో 170 పరీక్ష కేంద్రాలు



వేలూరులో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ కుమరవేల్ పాండియన్



పరీక్షకు ముందు ఆలయంలో ప్రార్థనలు చేస్తున్న విద్యార్థినులు

వేలూరు: వేలూరు, రాణిపేట, తిరుపత్తూరు జిల్లాల్లో 369 పాఠశాలలకు చెందిన 75,135 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. ఇందుకోసం మొత్తం 170 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. కాపీలను అరికట్టేందుకు 200 మందిని ప్రత్యేక సూపర్‌వైజర్‌లను నియమించారు. అదే విధంగా 10 స్పెషల్ స్క్వాడ్‌లతో తనిఖీ చేశారు. తిరువణ్ణామలై జిల్లాలోని 266 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 30,948 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఇందు కోసం జిల్లా వ్యాప్తంగా మొత్తం 134 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. వేలూరులోని పరీక్ష కేంద్రాలను కలెక్టర్ కుమరవేల్ పాండియన్, విద్యాశాఖ సీఈఓ మునస్వామి తనిఖీ చేశారు.

ప్రశాంతంగా ప్లస్‌టూ పరీక్షలు



సహాయకుడి సాయంతో పరీక్ష రాస్తున్న విద్యార్థిని



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్

తిరువళ్లూరు: జిల్లాలో సోమవారం ప్లస్‌టూ పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొత్తం 20790 మంది బాలురు, 22068 మంది బాలికలు, 70 మంది ఖైదీలతో సహా 42842 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరి కోసం జిల్లాలో 145 కేంద్రాలను ఏర్పాటు చేశారు. 2750 మంది ఇన్విజిలేటర్‌లు, 83 మంది ఫ్లెయింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేసి పర్యవేక్షించారు. పరీక్ష హాలుకు వెళ్లే విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతే లోపలికి అనుమతించారు. జిల్లాలోని 28 మంది దివ్యాంగుల కోసం 28 మంది సహాయకులను ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాలకు సమీపంలోని జెరాక్స్, ఇంటర్నెట్ దుకాణాలను మూసివేశారు. పరీక్షలకు మొదటి రోజు 1564 మంది గైర్హాజరయ్యారు.

కలెక్టర్ తనిఖీ

ఆర్‌ఎం జైన్ బాలికల మహోన్నత పాఠశాలను కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్ తనిఖీ చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

మహిళా ఎస్ఐని బెదిరించిన వ్యక్తి అరెస్టు

తిరువొత్తియూరు: తెన్‌కాశి జిల్లాలో మహిళా ఎస్ఐని బెదిరించిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. తెన్‌కాశి జిల్లా శంకరన్ కోయిల్ కక్కన్ నగర్ మూడో వీధికి చెందిన వేలుస్వామి (23). ఇతని భార్య తురైచ్చి. కాగా వేలుస్వామి ప్రతి రోజూ మద్యం తాగి వచ్చి భార్యతో గొడవపడేవాడు. కొన్ని రోజుల క్రితం తురైచ్చి శంకరన్ కోయిల్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి వేలు స్వామిపై ఫిర్యాదు చేసింది. పోలీసులు ఇద్దరిని పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. అదే రోజున వేలుస్వామి శంకరన్ కోయిల్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి అక్కడ డ్యూటీలో ఉన్న మహిళా ఎస్ఐ ఉమాతో వాగ్వాదానికి దిగాడు. ఆమెతో అసభ్యంగా మాట్లాడాడు. దీంతో మహిళా ఎస్ఐ ఉమా ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి వేలుస్వామిని అరెస్టు చేశారు.

లారీ ఢీకొని జల్లికట్టు ఎద్దు మృతి

అన్నానగర్ : తిరుమానారులో ఆదివారం రాత్రి మినీ లారీ ఢీకొని జల్లికట్టు ఎద్దు మృతి చెందింది. డ్రైవర్‌ను అరెస్టు చేయాలని స్థానికులు రాస్తారోకో చేశారు. వివరాలు.. అరియలూరు జిల్లా తిరుమానూరులో ఆదివారం జల్లికట్టు జరిగింది. మడికొండ గ్రామానికి చెందిన గణేశన్ ఎద్దు కూడా పాల్గొంది. వాడివాసల్‌లో వదిలేసిన ఎద్దు ఇంటికి తిరిగి రాలేదు. పలు ప్రాంతాల్లో వెతికినా ఎద్దు కనిపించలేదు. ఈ క్రమంలో ముడికొండన్ సమీపంలో రోడ్డుపై లారీ ఢీకొనడంతో ఎద్దు మృతి చెందింది. దీంతో యాజమాన్యంతో పాటు జల్లికట్టు ప్రేమికులు విషాదంలో మునిగిపోయారు. ప్రమాదానికి కారణమైన మినీలారీ డ్రైవర్‌ను అరెస్టు చేయాలని.. ఎద్దుకు పరిహారం చెల్లించాలని కోరుతూ తంజావూరు–అరియలూరు జాతీయ రహదారిపై నిరసన తెలిపారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆందోళనకారులతో మాట్లాడారు. వారు ససేమిరా అనడంతో వారిని చెదరగొట్టారు.



మృతి చెందిన ఎద్దు

వీధి దుకాణాల్లో అమ్మా క్యాంటిన్ ఆహారం

కొరుక్కుపేట: చెన్నైలోని అమ్మ క్యాంటిన్‌లలో అమ్మకాలు తగ్గిపోతున్నాయి. పేదలకు ఆహారాన్ని సరసమైన ధరలకు అందించే విధంగా రోజుకు 3 పూట్ల టిఫిన్, భోజనం విక్రయిస్తున్నారు. దీని కోసం రూ.140 కోట్లు కార్పొరేషన్‌కు ఖర్చు అవుతుంది. కానీ అమ్మ క్యాంటిన్ ద్వారా రూ.20 కోట్లు మాత్రమే సమకూరుతోంది. దీంతో చాలా వరకు అమ్మ క్యాంటిన్‌లకు గోధుమ పిండి సరఫరా కాకపోవడంతో రాత్రి వేళల్లో చపాతీలు అమ్మడం లేదు. బదులుగా టమాట రైస్ విక్రయిస్తున్నారు. నగరంలో 50 క్యాంటిన్‌లో రోజువారి మొత్తం విక్రయాలు రూ.100, రూ.150 మాత్రమే వసూలు అవుతుంది. అక్కడికి వచ్చేవారి సంఖ్య చాలా తక్కువగా ఉండడంతో విక్రయాలు తగ్గుముఖం పట్టాయని చెబుతున్నారు. ఈ పరిస్థితిలో అమ్మ క్యాంటిన్‌లో తయారు చేసిన ఆహార పదార్థాలను రోడ్డు సైడ్ షాపులకు పెద్ద ఎత్తున విక్రయిస్తుండడంతో ప్రజలకు ఆహారం అందడం లేదని ఫిర్యాదు వచ్చాయి. దీనిపై అధికారులు విచారణ చేస్తున్నారు.

ఫిషింగ్ ఫెస్టివల్

అన్నానగర్: కోవిల్‌పట్టి సమీపంలోని పాండవరమంగళం కొలనులో గ్రామస్తులు కుటుంబ సమేతంగా సోమవారం చేపలు పట్టారు. తూత్తుక్కుడి జిల్లా కోవిల్ పట్టి సమీపంలోని పాండవరమంగళం గ్రామంలోని కొలనులో గ్రామస్తులు చేప పిల్లలను వదిలారు. చేపలు బాగా పెరగడంతో సోమవారం చేపలు పట్టే ఉత్సవాలు నిర్వహించారు. గ్రామస్తులు కుటుంబ సమేతంగా ఉత్సాహంగా కొలనులో దిగి వలలు, చెక్క బుట్టలు, ప్లాస్టిక్ డ్రమ్ములతో చేపలు పట్టారు. వీరిలో కొందరు చిన్న చేపలైన వైరల్, కట్ల, గడ్డి, కార్ప్, ఆర్రై, ఉలువాయి వంటి వివిధ రకాల చేపలను తమ వలల్లో పట్టుకున్నారు. 5 కిలోల నుంచి 7 కిలోల బరువున్న వైరల్, కట్ల, కార్ప్ కొన్ని వలలకు చిక్కాయి. ఈ చేపలను పట్టుకున్న వారు వాటిని చేతిలో పట్టుకుని ఆనందాన్ని ప్రదర్శించారు. వీరిలో చాలా మంది చేపలను పట్టుకున్నారు. కొందరికి తక్కువ సంఖ్యలో చేపలు వచ్చాయి. వాటి కోసం ఎక్కువ చేపలు పట్టిన వారు పంచుకున్నారు. గ్రామస్తుల ఐక్యతను చాటి చెప్పేందుకు, అందరిలో సద్భావన ఉండేందుకు ఈ చేపల పండుగ నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు.



కొలనులో పట్టిన చేపలు చూపుతున్న యువకుడు

వీఏఓ అరెస్ట్

అన్నానగర్: మహిళా ఉద్యోగినిని వేధిస్తున్న వీఏఓను పోలీసులు అరెస్టు చేశారు. తేని సమీపంలోని భూతిపురం వీఏవోగా జయకుమార్ (36) పని చేస్తున్నారు. గతంలో కొడంగిపట్టిలో వీఏఓగా ఉన్న సయమంలో అన్నమైపుదూర్‌కు చెందిన 24 ఏళ్ల మహిళ అక్కడ తాత్కాలిక టైపిస్ట్‌గా పనిచేసేది. కుటుంబ సమస్యల కారణంగా జయకుమార్ వద్ద రూ.2 లక్షలు అప్పు తీసుకుంది. అప్పటి నుంచి ఆ మహిళపై వీఏఓ లైంగికంగా వేధించేవాడు. ఆమెతో సన్నిహితంగా ఫొటోలను తీసుకున్నాడు. ఈ విషయం భర్తకు తెలియడంతో భార్యను మందలించాడు. ఈ క్రమంలో మహిళ బంధువులు నారాయణరాజు, వారికి తెలిసిన న్యాయవాది, మరో నలుగురు వీఏఓను బెదిరించి రూ.3 లక్షల వరకు పొందారు. రూ.10 లక్షలు అడిగి బెదిరించినట్లు తెలిసింది. టైపిస్ట్‌గా పనిచేస్తున్న మహిళ తేని మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీని ఆధారంగా వీఏఓ జయకుమార్‌పై కేసు నమోదు చేసి సోమవారం అరెస్టు చేశారు. అలాగే వీఏఓ నుంచి డబ్బులు వసూలు చేసిన నారాయణరాజుతో పాటు నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పళ్లికొండేశ్వరుడి సేవలో దర్శకుడు ఎస్ఏ చంద్రశేఖర్



పిచ్చాటూరు: నాగలాపురం మండలం, సురుటపల్లిలోని శ్రీమంగళాదేవి సమేత పళ్లికొండేశ్వర స్వామిని తమిళ సినీ హీరో విజయ్ తండ్రి, ప్రముఖ దర్శకుడు ఎస్ఏ చంద్రశేఖర్ దర్శించుకున్నారు. సోమవారం ఉదయం ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ అర్చకులు స్వయంభు శ్రీవాల్మీకేశ్వర స్వామి, మరగదాంబిగ అమ్మవారు, దాంపత్య దక్షిణామూర్తి, ప్రదోష నంది, శ్రీ మంగళాదేవి సమేత పళ్లికొండేశ్వర స్వామివారి దర్శన ఏర్పాట్లు చేశారు. తీర్థ ప్రసాదాలు, ఆశీర్వచనాలు అందజేశారు. ప్రధాన అర్చకులు కార్తికేయ గురుక్కళ్ ఆలయ స్థల పురాణాన్ని, ఆలయ మహిమత్వాన్ని వివరించారు. ధర్మకర్తల మండలి చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఎస్ఏ చంద్రశేఖర్ మాట్లాడుతూ తన భార్య గత నెల 18న మహాశివరాత్రి రోజున ఈ ఆలయానికి వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారని, ఆమె కోరిక మేరకు ఆలయంలో ప్రతి సోమవారం 9 వారాల పాటు ఉదయం 200 మంది భక్తులకు అల్పాహారం అందిస్తామని, అందుకయ్యే ఖర్చు రూ.1.35 లక్షలు నిధులను ఆలయ అన్నదాన ట్రస్టుకు విరాళంగా ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు సోమవారం ఆయన భక్తులకు అల్పాహారం వితరణను ఆలయ అన్నదాన కేంద్రంలో ప్రారంభించారు.

బైక్‌ను ఢీకొన్న లారీ : విద్యార్థి మృతి

పలమనేరు : మండలంలోని పలమనేరు–గుడియాత్తం రహదారిపై టి.వడ్డూరు చెరువు కట్ట మలుపులో సోమవారం రాత్రి బైక్‌ను లారీ ఢీకొనడంతో ఓ విద్యార్థి మృతిచెందగా, మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. తమిళనాడులోని గుడియాత్తానికి చెందిన కార్తికేయన్ కుమారుడు రాహుల్(21), సైనిగుంటకు చెందిన రజకన్ కుమారుడు సాయి పురుషోత్తమన్ (26) బైక్‌పై పలమనేరుకు వస్తుండగా ప్రమాదం జరిగింది. ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో రాహుల్ తల ఛిద్రమైంది. వెనుక కూర్చున పురుషోత్తమన్ తలకు తీవ్రంగా గాయమైంది. క్షతగాత్రుడిని 108లో పలమనేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వేలూరు సీఎంసీకి రెఫర్ చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాగునీటి కోసం రాస్తారోకో

అన్నానగర్: తాగునీరు సరఫరా చేయాలని కోరుతూ అయ్యంకొల్లి గ్రామస్తులు సోమవారం ఖాళీ బిందెలతో రాస్తారోకో చేశారు. నీలగిరి జిల్లా బందలూరు తాలూకా అయ్యంకొల్లి సమీపంలోని కరక్కోలిలో ప్రభుత్వ తేయాకు తోటల్లో పనిచేసి పదవీ విరమణ పొందిన 70 మంది కార్మికులు ఇక్కడ నివసిస్తున్నారు. అపరిశుభ్ర నీటిని సరఫరా చేస్తున్నారని.. ఆ నీటిని తాగి రోగాల బారిన పడుతున్నామని వాపోయారు. పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ఈ నేపథ్యంలో రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. చేరంబాడి పోలీసులు, చేరంగోడు పంచాయతీ అధికారులు అక్కడికి చేరుకుని వారితో మాట్లాడారు. త్వరితగతిన తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

తాడు మెడకు చుట్టుకుని..

- మొండెం నుంచి వేరైన తల

అన్నానగర్: మదురై జిల్లాలో దారుణ ఘటన చోటుచేసుకుంది. గడ్డివామితో వెళుతున్న వ్యానుకు వేలాడుతున్న తాడు మహిళ మెడకు చుట్టుకోవడంతో మొండెం నుంచి తలవేరైంది. వివరాలు.. మదురై జిల్లా కొట్టంబట్టి సమీపంలోని కాంపూర్‌కు చెందిన అళగు వ్యవసాయ కూలీ. ఆదివారం రాత్రి తన భార్య వళ్లియమ్మాళ్ (60), మనవరాలు శరణ్యతో కలిసి కొట్టంబట్టిలోని బంధువుల ఇంటికి వెళ్లారు. అనంతరం ముగ్గురు ద్విచక్రవాహనంపై ఇంటికి తిరిగి వస్తున్నారు. కాంపూర్ వద్ద ఎండుగడ్డితో కూడిన వ్యాను అటుగా వెళ్లింది. వ్యాన్ వెనుక తాడు వేలాడుతోంది. ఈ క్రమంలో అళగు వ్యాన్‌ను ఓవర్ టేక్ చేసే ప్రయత్నం చేశాడు. అనూహ్యంగా వ్యాన్ వెనుక వేలాడుతున్న తాడు వళ్లియమ్మాళ్ మెడకు చుట్టుకుంది. ఈ క్రమంలో బైక్ పైనున్న ముగ్గురు కిందపడ్డారు. అయినా వ్యాన్ వేగంగా వెళ్లడంతో వళ్లియమ్మాల్ తల వేరైంది. తీవ్రంగా గాయపడిన అళగు, శరణ్యలను స్థానిక ఆస్పత్రికి తరలించారు. కొట్టంబట్టి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టంకు తరలించారు. ప్రమాదానికి కారణమైన వ్యాన్ డ్రైవర్ రాజా(50)ని అరెస్టు చేసి విచారిస్తున్నారు. ఈ ఘటన ఆ ప్రాంతంలో తీవ్ర విషాదాన్ని నింపింది.

పడవలకు నిప్పు

కొరుక్కుపేట: కడలూరు ముదునగర్‌లో 8 పడవలకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. దీనిపై పోలీసులు తీవ్ర విచారణ జరుపుతున్నారు. కడలూరులోని ముదునగర్, సింగారతోపు, సోనాంకుప్పం మత్స్యకారులకు నిలయంగా ఉంది. ఇక్కడి నుంచి రోజుకు 100కి పైగా పడవల్లో మత్స్యకారులు వేటకు వెళుతుంటారు. ఈ క్రమంలో అక్కడ ఉంచిన పడవలకు మంటలు వ్యాపించాయి. ఆరు బోట్లు పూర్తిగా దగ్ధం అయ్యాయి. వలలు కూడా దెబ్బతిన్నాయి. దీంతో మత్స్యకారులు కడలూరు పోర్టు పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. ఈ ఘటన ఆ ప్రాంతంలో తీవ్ర కలకలం రేపింది. పాత కక్షల కారణంగా పడవలకు నిప్పు పెట్టారా అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు.



కాలిపోయిన పడవ

దివ్యాంగ విద్యార్థి ప్రతిభ

అన్నానగర్: విల్లుపురంలో ఏటా 9వ తరగతి గ్రామీణ విద్యార్థులకు సామర్థ్య పరీక్ష నిర్వహించి ఉత్తీర్ణులైన మొదటి 50 మంది విద్యార్థులను ప్రతి జిల్లా నుంచి ఎంపిక చేసి వారికి నాలుగేళ్ల పాటు రూ.1,000 ప్రోత్సాహకం అందజేస్తారు. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి రూరల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ డిసెంబర్ 17న తమిళనాడు వ్యాప్తంగా జరిగింది. ఇందులో విల్లుపురం జిల్లా నన్నడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన దివ్యాంగ విద్యార్థి ఎస్. గోకులకృష్ణన్ జిల్లా స్థాయిలో 2వ స్థానం సాధించి సత్తా చాటాడు. గతేడాది నేషనల్ రెవెన్యూ అండ్ స్కిల్ టెస్ట్‌లో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలవడం గమనార్హం. అతని సోదరుడు సూర్యమూర్తి కూడా 2018లో నేషనల్ మీన్స్ ఆఫ్ రెవెన్యూ అండ్ స్కిల్ టెస్ట్, రూరల్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌లో ఉత్తీర్ణత సాధించడం గమనార్హం. పొంగులరసన్ జిల్లా స్థాయిలో 3వ స్థానంలో నిలిచారు. ప్రవీణ్‌కుమార్ 7వ ర్యాంకు సాధించాడు. విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వి.కర్పగాంబికాయి, ఉపాధ్యాయులు అభినందించారు.



గోకులకృష్ణన్

యువకుడిపై పోక్సో కేసు

తిరువొత్తియూరు: కడలూరు జిల్లాలో ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన బాలికను మోసం చేసిన యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. కడలూరు జిల్లా విరుదాచలం సమీపంలోని కరువేపిలై గ్రామానికి చెందిన రవి కుమారుడు శక్తి వేలు (19). ఇతనికి నాగపట్నం జిల్లా తిరుకువలై ప్రాంతానికి చెందిన 16 ఏళ్ల బాలికతో ఆరు నెలల క్రితం పరిచయం ఏర్పడింది. గత నెల 26వ తేదీ బాలిక ఎవరికీ తెలియకుండా శక్తి వేలు ఇంటికి వచ్చింది. తర్వాత శక్తి వేలు ఆమెకు మాయమాటలు చెప్పి లోబర్చుకున్నాడు. కుమార్తె కనిపించకపోవడంతో పలుచోట్ల తల్లిదండ్రులు గాలించారు. ఈ క్రమంలో కడలూరులో కుమార్తె ఉన్నట్లు తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు కడలూరు మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విచారణ చేసి శక్తి వేలును పోక్సో చట్టం కింద అరెస్టు చేసి కడలూరు సెంట్రల్ జైలుకు తరలించారు.

క్లుప్తంగా...

ఈడీ కస్టడీకి 'స్కిల్' కుంభకోణం నిందితులు

- వారం పాటు కస్టడీకి అనుమతిస్తూ న్యాయమూర్తి ఆదేశం

సాక్షి, అమరావతి/విశాఖ లీగల్: చంద్రబాబు ప్రభుత్వ హయాంలో జరిగిన ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) కుంభకోణం కేసులో అరెస్టయిన నలుగురు నిందితులను న్యాయస్థానం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కస్టడీకి అనుమతించింది. ఈ మేరకు ఈడీ న్యాయస్థానం (విశాఖ మెట్రో పాలిటన్ సెషన్స్ కోర్టు) న్యాయమూర్తి ఎ.తిరుమలరావు సోమవారం ఆదేశాలు జారీ చేశారు. ఈ కేసులో సౌమ్యాద్రి శేఖర్ బోస్ అలియాస్ సుమన్ బోస్ (సీమెన్స్ కంపెనీ మాజీ ఎండీ), వికాస్ ఖన్విల్కర్ (డిజైన్ టెక్ కంపెనీ ఎండీ), ఢిల్లీకి చెందిన ముకుల్‌చంద్ర అగర్వాల్, సురేశ్ గోయల్‌లను ఈడీ ఈ నెల 4న అరెస్టు చేసి విశాఖపట్నంలోని ఈడీ న్యాయస్థానంలో హాజరుపరిచింది. వారికి న్యాయస్థానం జ్యుడిషియల్ రిమాండ్ విధించింది. ఈ కేసు దర్యాప్తులో నిందితులు సహకరించలేదని, వారిని మరింత లోతుగా విచారించేందుకు తమ కస్టడీకి అప్పగించాలని కోరుతూ ఈడీ ఈ నెల 10న న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారించిన న్యాయమూర్తి నలుగురు నిందితులను వారం రోజులు ఈడీ కస్టడీకి అప్పగించాలని సోమవారం తీర్పునిచ్చారు. వారిని న్యాయవాదుల సమక్షంలోనే విచారించాలని ఆదేశించారు. నలుగురు నిందితులను ఈడీ మంగళవారం నుంచి విచారించనుంది. దీంతో ఈ కుంభకోణంలో మరిన్ని కొత్త విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని అధికారవర్గాలు భావిస్తున్నాయి.

సీఐఐ ఏపీ చాప్టర్ చైర్మన్‌గా ఎం.లక్ష్మీప్రసాద్

సాక్షి, అమరావతి /బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్ (సీఐఐ) ఏపీ చాప్టర్ చైర్మన్‌గా 2023–24 సంవత్సరానికి సుజయ్ బయోటెక్ సంస్థ ఎండీ ఎం.లక్ష్మీప్రసాద్ ఎన్నికయ్యారు. ప్రస్తుతం సీఐఐ చైర్మన్‌గా ఉన్న శారదా మెటల్స్ ఎండీ నీరజ్ శారదా నుంచి బాధ్యతలను స్వీకరించనున్నారు. సోమవారం జరిగిన ఆఫీస్ బేరర్స్ సమావేశంలో 2023–24 సంవత్సరానికి సంబంధించి స్టేట్ కౌన్సిల్‌ను ఎన్నుకున్నారు. వైస్ చైర్మన్‌గా వైజాగ్ హాస్పిటల్స్ అండ్ క్యాన్సర్ రీసెర్చ్ ఎండీ డాక్టర్ వి.మురళీకృష్ణ ఎన్నికయ్యారు.

ఎస్సీ, ఎస్టీ ప్రాంతాల్లో తాగునీటికి రూ.3,853 కోట్లు

- మంత్రి నాగార్జున



సాక్షి, అమరావతి: జల్ జీవన్ మిషన్(జేజేఎం) కింద రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ నివాసిత ప్రాంతాల్లో రూ.3,853 కోట్లతో చేపట్టిన పనులను వేగవంతం చేయాలని, ప్రస్తుత వేసవిలో ఎక్కడా తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగు నాగార్జున అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో సోమవారం జేజేఎం పనుల పురోగతిని మంత్రి నాగార్జున సమీక్షించారు. రాష్ట్రంలో 7,917 ఎస్సీ నివాసిత ప్రాంతాలు ఉండగా, వీటిలో 4,852 ప్రాంతాలకు ఇప్పటికే తాగునీటి వసతులు పూర్తిగా ఉన్నాయని మంత్రి చెప్పారు. మిగిలిన 3,065 ప్రాంతాల్లో పాక్షికంగా నీటి సరఫరా ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ ప్రాంతాల్లో తాగునీటిని పుష్కలంగా అందించడానికి ప్రభుత్వం జేజేఎం పథకం కింద 19,614 పనుల కోసం రూ.3,853 కోట్లను మంజూరు చేసిందని తెలిపారు. ఎస్సీ సబ్ ప్లాన్ ద్వారా జేజేఎం పథకానికి నిధుల విడుదలకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

నారికేళం.. కలిసొచ్చే కాలం

- కరోనా అనంతరం అపార అవకాశాలు.. విలువ ఆధారిత పరిశ్రమల స్థాపనకు వీలు
- విశ్వవ్యాప్త మార్కెటింగ్‌కు మార్గాలు
- కొబ్బరి నిపుణుల అంచనాలివే

(నాగా వెంకటరెడ్డి, సాక్షి ప్రత్యేక ప్రతినిధి)


కోనసీమలోని కొబ్బరి తోటలు

'ప్రతి సంక్షోభం ఓ ప్రత్యామ్నాయం చూపుతుంది. తప్పక మేలు చేస్తుంది' అనేది కొబ్బరి విషయంలో వాస్తవ రూపం దాల్చనుంది. అంది పుచ్చుకోవాలే కానీ 'కల్పవృక్షం' విశ్వవ్యాప్తంగా మెరుగైన అవకాశాలను చూపుతుందని.. కొబ్బరికి కలిసొచ్చే కాలం ముస్ముందు అపారంగా ఉంటుందని మార్కెటింగ్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. విలువ ఆధారిత పరిశ్రమలు నెలకొల్పడం ద్వారా కొబ్బరి రైతులకు, పారిశ్రామికవేత్తలకు లాభాలు సమకూరుతాయని ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన 'కోకోనట్ ప్రొడక్ట్స్, ట్రేడ్ అండ్ మార్కెటింగ్' అంతర్జాతీయ సదస్సులో నిపుణులు ఉద్ఘాటించారు.

ప్రతికూలతలు కొత్త పాఠాలు నేర్పుతున్నాయ్

రూగోస్ వైట్ ఫ్లై (తెల్లదోమ) వల్ల కొబ్బరి దిగుబడి తగ్గి ఆశించిన ధర దక్కడం లేదు. మరోవైపు క్వాయర్ ఉత్పత్తుల ధరలు నేలచూపు చూస్తున్నాయి. మరోవైపు ఇతర దేశాలతో పోల్చుకుంటే అంతర్జాతీయ ఎగుమతుల్లో భారత్, దేశం నుంచి జరుగుతున్న ఎగుమతుల్లో ఏపీ వెనుకబడి ఉన్నాయి. ఇక్కడి నుంచి కొబ్బరి కాయ, కురిడీ కొబ్బరి, ఎండు కొబ్బరి, కొబ్బరి నూనె ఉత్పత్తులు మాత్రమే ఎగుమతి అవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో కొబ్బరి రైతులు, వ్యాపారుల ఆలోచనా ధోరణిలో మార్పులొస్తున్నాయి. కరోనా మహమ్మారి ప్రబలిన అనంతరం ప్రపంచవ్యాప్తంగా అందరిలోనూ ఆరోగ్య స్పృహ పెరిగింది. కొబ్బరి ఆధారిత ఉత్పత్తుల వినియోగం కూడా అధికమవుతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు ఏర్పాటు చేసేవారు కొబ్బరి విలువ ఆధారిత పరిశ్రమల వైపు మొగ్గు చూపుతున్నారు. కొబ్బరి అభివృద్ధి బోర్డు (సీడీబీ), రాష్ట్ర ప్రభుత్వం నుంచి సహకారం ఉన్నందున కొబ్బరి విలువ ఆధారిత పరిశ్రమల ఏర్పాటు, విస్తరణకు నోచుకోనున్నాయని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. దేశంలో 3 కోట్ల మందికి కొబ్బరి దింపు, సేకరణ, ఎగుమతి, దిగుమతులు జీవనాధారంగా ఉండగా.. వారిలో రైతులు 1.20 కోట్ల మంది ఉన్నారు.

డిమాండ్‌ను ఒడిసి పడితే..

అంతర్జాతీయంగా కొబ్బరి కాయ, కొబ్బరి ముక్క, కొబ్బరి నీళ్లతో తయారు చేసే ఉత్పత్తులకు డిమాండ్ వేగంగా పెరుగుతోంది. వర్జిన్ కోకోనట్ ఆయిల్, కోకోనట్ మిల్క్, డెసికేటెడ్ కోకోనట్ పౌడర్, కోకోనట్ చిప్స్, కోకోనట్ వాటర్ ప్యాకెట్లు, నాటాడీకో వంటి ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్త డిమాండ్ ఉంది. కొబ్బరిని ఆరోగ్యానికి ఔషధంగా గుర్తించారు. కొబ్బరి పాలలో ఉండే ల్యారిక్ యాసిడ్ చిన్న పిల్లలకు చాలా ఉపయోగకరం. పశువులకు సంక్రమిస్తున్న విభిన్న వ్యాధులు, వైరస్‌ల వల్ల వాటి నుంచి వచ్చే పాల వాడకంపై అభివృద్ధి చెందుతున్న దేశాలు విముఖత చూపుతున్నాయి. ఈ మార్కెట్‌ను కొబ్బరి పాలతో భర్తీ చేసేందుకు మెరుగైన అవకాశాలున్నాయి. కొబ్బరి పాల నుంచి తయారు చేసే వర్జిన్ కోకోనట్ ఆయిల్ రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. దీనిని సేవించడం వల్ల శరీరంలోని తెల్ల రక్తకణాలు ఉత్సాహంగా ఉంటాయి. ఎయిడ్స్ రోగులకు ఇది ఇమ్యూనిటీ బూస్టర్ వంటిదని, ఆరోగ్యానికి దివ్య ఔషధమని వైద్య నిపుణులు చెబుతున్నారు. కరోనా తరువాత ఆరోగ్యంపై పెరిగిన శ్రద్ధతో యూరప్ దేశాలకు కొబ్బరి ఎగుమతులు పెరిగాయి.

అవకాశాలు అనేకం


భారీ పరిశ్రమలు మొదలు ఫుడ్ ఇండస్ట్రీకి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని అందిపుచ్చుకుంటే కొబ్బరి విలువ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు అవకాశాలు అనేకం ఉన్నాయి. డిమాండ్ పెరుగుతున్నందున ఔత్సాహికులు ఉప ఉత్పత్తులపై, కుటీర పరిశ్రమల స్థాపనపై దృష్టి సారించాల్సి ఉంది. పచ్చి కొబ్బరి, ఎండు కొబ్బరి ఉత్పత్తులతో పాటు పీచు, పెంకు, కలప వంటి ఉత్పత్తులను తయారు చేయవచ్చు. ఎండు కొబ్బరి (కోప్రా), కొబ్బరి నూనె, వర్జిన్ కొబ్బరి నూనె, కొబ్బరి పొడి, కొబ్బరి పాలు/క్రీమ్, కొబ్బరి పాలతో పొడి, వెనిగర్, చిప్స్, కొబ్బరి నీటితో పాటు పలు రకాల పానీయాలు ఉత్పత్తి చేయవచ్చు.

ఔత్సాహికులు ఇప్పటికే..

అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరంలో యువ పారిశ్రామికవేత్త గుత్తుల ధర్మరాజు వర్జిన్ కోకోనట్ ఆయిల్, కోకోనట్ మిల్క్, డెసికేటెడ్ కోకోనట్ పౌడర్ పరిశ్రమను విజయవంతంగా నిర్వహిస్తున్నారు. అలాగే కృష్ణా జిల్లా హనుమాన్ జంక్షన్ వద్ద మరో యువ పారిశ్రామికవేత్త వికాస్ సైతం వేపూరి ఆగ్రో ప్రొడక్ట్స్ పేరిట ఇవే ఉత్పత్తులను జాతీయంగా ఎగుమతి చేస్తున్నారు. వీరిని చూసి మరికొంతమంది ముందుకు వస్తున్నారు. జపాన్ ఇంటర్నేషనల్ కార్పొరేషన్ ఏజెన్సీ (జైకా) సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో రూ.3.50 కోట్లతో వర్జిన్ కోకోనట్ ఆయిల్, కోకోనట్ మిల్క్, డెసికేటెడ్ కోకోనట్ పౌడర్, కోకోనట్ చార్‌కోల్ (చిప్ప బొగ్గు) తయారీ పరిశ్రమల ఏర్పాటుకు సిద్ధమైంది. ఇటువంటివి మరిన్ని ఏర్పాటు చేసేందుకు కొబ్బరి అభివృద్ధి బోర్డు (సీడీబీ), మినిస్ట్రీ ఆఫ్ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్ఎంఈ) వంటి సంస్థలు రాయితీలు ఇచ్చేందుకు ముందుకు వస్తున్నాయి.

దేశంలో పరిస్థితి ఇదీ (2021-22 గణాంకాలు)

- దేశంలో సాగు విస్తీర్ణం: 2.15 మిలియన్ హెక్టార్లు
- ఏటా సగటు దిగుబడి: 19,260.51 మిలియన్ కాయలు
- అత్యధికంగా కొబ్బరి సాగయ్యే రాష్ట్రాలు: తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ (90 శాతం ఇక్కడి నుంచే)



2021 లెక్కల ప్రకారం ఏపీలో..

జిల్లా పేరు	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)	దిగుబడి (లక్షల్లో)	సగటు దిగుబడి (హెక్టార్‌కు)
తూర్పు గోదావరి	1,24,706	7,208.95	14,337
పశ్చిమ గోదావరి	53,471	4,489.03	20,821
శ్రీకాకుళం	35,910	2,498.59	17,256
విశాఖపట్నం	16,854	767.21	11,290
విజయనగరం	6,723	340.28	16,080
కృష్ణా	5,247	340.28	16,082

(ఉత్పాదకతలో హెక్టారుకు 14,967 కాయల దిగుబడితో ఏపీ ప్రథమ స్థానంలో ఉంది)

విలువ ఆధారిత ఉత్పత్తులకు మంచి మార్కెట్



వర్జిన్ కోకోనట్ ఆయిల్‌ను బేబీ మసాజ్ ఆయిల్‌గా పశ్చిమ బెంగాల్, చుట్టుపక్కల పట్టణాల్లో అమ్ముతున్నారు. మా కంపెనీ నుంచి ఆయిల్ కూడా ఇక్కడకు వెళ్తోంది. అక్కడి ఫార్మా కంపెనీలు సైతం వర్జిన్ కోకోనట్ ఆయిల్‌ను సిఫారసు చేస్తున్నాయి. మన ప్రాంతంలో జాన్సన్ అండ్ జాన్సన్ వాడుతున్నారు. మన రాష్ట్రం కన్నా ఇతర రాష్ట్రాల్లో కొబ్బరి వాడకం పెరుగుతోంది. మన దేశం కన్నా ఇతర దేశాల్లో అధికంగా కొబ్బరి ఉత్పత్తులను వాడుతున్నారు. ఆరోగ్యం పట్ల నెమ్మదిగా అవగాహన పెంచుకుంటున్నారు.

– గుత్తుల ధర్మరాజు, కోనసీమ ఆగ్రోస్ కంపెనీ యజమాని, ముమ్మిడివరం

ఇది మనందరి ప్రభుత్వం

- రాష్ట్రంలో ప్రతి ఇంటికీ మేలు చేశాం
- సమస్యల పరిష్కారంతోపాటు మరింత సాయం అందిస్తాం
- ముస్లిం సంఘాల ప్రతినిధులతో సమావేశంలో సీఎం జగన్


తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో ముస్లిం సంఘాల ప్రతినిధులతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: ''ఇది మనందరి ప్రభుత్వమనే విషయాన్ని మనసులో పెట్టుకోండి. ప్రభుత్వం నుంచి మీకు మరింత సాయం ఎలా అందించాలో సలహాలు తీసుకునేందుకే ఇవాళ పిలిచాం. మీరు చెప్పిన అన్ని అంశాలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరిస్తాం. సమస్యలను పరిష్కరించడంతో పాటు అవసరమైన నిధులను కూడా కేటాయిస్తాం. అన్ని సమస్యలకు సానుకూల పరిష్కారం ఈ సమావేశం ద్వారా లభిస్తుంది'' అని ముస్లిం మైనార్టీలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా ఇచ్చారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో ముస్లిం సంఘాల ప్రతినిధులతో సీఎం జగన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలను సీఎం దృష్టికి తేవడంతో తక్షణమే స్పందించి అప్పటికప్పుడే అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. 'భగవంతుడి దయ, మీ అందరి సహకారాలతోనే ఈ ప్రభుత్వం ఏర్పడింది. రాష్ట్రంలో ప్రతి ఇంటికి, ప్రతి గడపకూ మంచి చేశాం. ఈదఫా మన లక్ష్యం 175కి 175 ఎమ్మెల్యే స్థానాలను గెలవడం. అది కచ్చితంగా సాధిస్తాం. ముస్లింలకు మన ప్రభుత్వం ఇచ్చినన్ని పదవులు మరే ప్రభుత్వంలోనూ ఇవ్వలేదు. శాసన మండలి డిప్యూటీ చైర్మన్, డిప్యూటీ సీఎం, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో పాటు కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లుగా పెద్ద ఎత్తున అవకాశం కల్పించాం' అని సీఎం జగన్ పేర్కొన్నారు.

వక్ఫ్ భూముల పరిరక్షణకు కమిటీలు

వక్ఫ్ బోర్డు ఆస్తులను కాపాడేలా కార్యాచరణ చేపడతామని ఈ సందర్భంగా సీఎం జగన్ హామీ ఇచ్చారు. అన్ని మతాల భూముల ఆస్తులను పరిరక్షించేలా జిల్లా స్థాయిలో ప్రత్యేక కమిటీలను నియమించాలని అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్, ఏఎస్పీలతో కమిటీ వేసి జిల్లా స్థాయిలో సమన్వయ కమిటీని నియమించాలని సూచించారు. కడపలో అసంపూర్తిగా ఉన్న హజ్‌హౌస్ నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. విజయవాడలో హజ్‌హౌస్ నిర్మాణానికి అవసరమైన భూమిని కేటాయించాలని అధికారులను ఆదేశించారు. కర్నూలు ఉర్దూ విశ్వ విద్యాలయం భవన నిర్మాణ పనులను పూర్తి చేయాలన్నారు. మదర్సాలలో పనిచేసే విద్యా వలంటీర్ల జీతాల సమస్యను తక్షణమే పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఉర్దూ పాఠశాలల్లో వచ్చే విద్యా సంవత్సరం నాటికి బైలింగ్యువల్ టెక్ట్స్‌బుక్స్‌లో భాగంగా ఇంగ్లిషుతోపాటు ఉర్దూలో కూడా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సయ్యద్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్న ముస్లిం మతపెద్దల విజ్ఞప్తితో కార్పొరేషన్ ఏర్పాటుకు సీఎం ఆమోదం తెలిపారు.

ఖాజీల పదవీ కాలం పదేళ్లకు పెంచుతూ సీఎం ఆదేశం

టీడీపీ సర్కారు హయాంలో ఖాజీల పదవీ కాలాన్ని మూడేళ్లుగా నిర్ణయించడంతో రెన్యువల్ కోసం చాలా ఇబ్బందులు పడుతున్నట్లు ముస్లిం సంఘాల పెద్దలు సీఎం జగన్ దృష్టికి తెచ్చారు. ఖాజీల పదవీకాలాన్ని పెంచడంతో పాటు రెన్యువల్ ప్రాసెస్‌ను సులభతరం చేయాలని కోరారు. దీనిపై స్పందించిన సీఎం జగన్ ఖాజీల పదవీ కాలాన్ని మూడేళ్ల నుంచి పదేళ్లకు పెంచాలని అధికారులను ఆదేశించారు. గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో సులభతరమైన రెన్యువల్ విధానాన్ని ప్రవేశపెట్టాలని ఆదేశించారు. సమావేశంలో ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషా, వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ ఖాదర్ బాషా, పలు ప్రాంతాలకు చెందిన ముస్లిం సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇంకా మేలు చేస్తామన్నారు: ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా

ఏనాడూ మైనార్టీల స్థితిగతులను పట్టించుకోని టీడీపీకి ఎన్నికల సమయంలో మాత్రమే మైనార్టీలు గుర్తుకొస్తారని ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా మండిపడ్డారు. ముస్లిం సంఘాల ప్రతినిధులతో ముఖ్యమంత్రి జగన్‌ను కలసిన అనంతరం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచే మైనార్టీల సంక్షేమానికి సీఎం జగన్ పెద్దపీట వేశారని గుర్తు చేశారు. ముస్లిం మత పెద్దలతో అన్ని విషయాలను చర్చించారని, మైనార్టీలకు ఇంకా మేలు చేసే కార్యక్రమాలు చేస్తానని సీఎం హామీ ఇచ్చారని తెలిపారు.

అవినాశ్‌పై ఎలాంటి చర్యలొద్దు

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై వాదనలు విన్న అనంతరం అరెస్టు సహా ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోవద్దని సీబీఐని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. తాము తీర్పు వెలువరించే వరకు ఈ మధ్యంతర ఆదేశాలు అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది. తనను విచారణకు హాజరు కావాలని ఆదేశించడంపై స్టే విధించాలని కోరుతూ అవినాశ్‌రెడ్డి తెలంగాణ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఒకవేళ విచారణ చేపట్టినా ఆడియో, వీడియో రికార్డింగ్‌తోపాటు దర్యాప్తు పారదర్శకంగా సాగేలా సీబీఐని ఆదేశించాలని అభ్యర్థించారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ సోమవారం మరోసారి విచారణ చేపట్టారు. ఎంపీ అవినాశ్‌రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. వాదనలు విన్న న్యాయమూర్తి తీర్పు రిజర్వు చేశారు. తదుపరి విచారణపై స్టే ఇవ్వాలన్న పిటిషన్‌పైనా తీర్పు రిజర్వు చేస్తున్నట్లు న్యాయస్థానం పేర్కొంది.

రాజకీయ ఒత్తిళ్లతోనే అభియోగాలు..

'సునీత పిటిషన్ వెనుక సీబీఐ హస్తం ఉంది. కొందరు రాజకీయ నేతల ఒత్తిళ్లతోనే ఆమె పిటిషనర్‌పై అభియోగాలు మోపారు. తన తండ్రి పిటిషనర్ గెలుపు కోసం తీవ్రంగా శ్రమించారని, ఇంటింటికి తిరిగారని హత్య జరిగిన అనంతరం కూడా చెప్పిన సునీత ఏడాది తర్వాత మాట మార్చారు. ఆ తర్వాత నుంచి పిటిషనర్‌పై ఆరోపణలు చేయడం ప్రారంభించారు. వివేకా హత్య కేసులో అల్లుడు రాజశేఖర్‌రెడ్డి, హతుడి రెండో భార్య షమీమ్ పాత్రపై సీబీఐ విచారణ సాగించడం లేదు. వివేకా 2010లో రెండో పెళ్లి చేసుకున్నారు. వారికి ఓ కుమారుడు జన్మించాడు. రెండో పెళ్లి కారణంగానే వివేకా కుటుంబంలో విభేదాలు వచ్చాయి. ఆర్థిక లావాదేవీల విషయంలో మనస్పర్థలు తలెత్తాయి. ఈ క్రమంలో తన పేరుతో ఉన్న ఆస్తులను రెండో భార్య పేరుతో రాయాలని వివేకా భావించారు. ఆస్తుల గొడవల వల్లే వివేకా హత్య జరిగింది. ఈ కేసులో రెండో పెళ్లి కూడా కీలక అంశం. సీబీఐ ఆ దిశగా విచారణ చేయాలి. వివేకాది గుండెపోటని పిటిషనర్ ఎక్కడా చెప్పలేదు. స్థానిక రాజకీయ నేత శశికళతో పిటిషనర్ అసలు మాట్లాడనే లేదు. ఆమె కూడా ఇదే విషయాన్ని సీబీఐకి చెప్పింది. ఇదే కోర్టులో సీబీఐ దాఖలు చేసిన కౌంటర్ మీడియాలో విస్తృతంగా ప్రచారమైంది. అందులో శశికళ గురించి కూడా ప్రస్తావించారు. ఇప్పటివరకు సీబీఐ రెండు చార్జీషీట్లు దాఖలు చేసినా ఎక్కడా సిట్ దర్యాప్తు నివేదికను కనీసం పరిగణలోకి కూడా తీసుకోలేదు. పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో 14న సీబీఐ విచారణకు పిటిషనర్ హాజరుకాకుండా ఆదేశాలివ్వాలి' అని నిరంజన్‌రెడ్డి కోరారు.

సీల్డ్ కవర్‌లో వివరాలు...

వివేకా హత్య కేసు డైరీని సీబీఐ సీల్డ్ కవర్‌లో హైకోర్టుకు సమర్పించింది. 35 మంది సాక్షుల వాంగ్మూలం, 10 డాక్యుమెంట్లు, కొన్ని ఫొటోలు, హార్డ్‌డిస్క్‌లను కోర్టు ముందుంచింది. హత్య జరిగిన ప్రాంతంలో దొరికిన లేఖ, ఎఫ్ఎస్ఎల్ నివేదికను సైతం సమర్పించింది. కేసుకు సంబంధించి ఆధారాలను ధ్వంసం చేసినట్లు పిటిషనర్‌పై ఆరోపణలున్నాయని, ఆయనపై తీవ్ర చర్యలు తీసుకోకుండా ఆదేశాలు జారీ చేయవద్దని కోర్టును సీబీఐ కోరింది. సీబీఐ కార్యాలయం ఎదుట మీడియాకు వివరాలను ఎంపీ వెల్లడించడం సరికాదని న్యాయస్థానం పేర్కొంది. ఈనెల 14న విచారణ హాజరు నుంచి మినహాయింపు కోరే అంశంపై సీబీఐనే ఆశ్రయించాలంది. ఈ కేసు విచారణ హైదరాబాద్‌కు బదిలీ అయ్యాక పిటిషనర్ తండ్రి భాస్కర్‌రెడ్డిని కడపలో హాజరు కావాలని ఎందుకు పిలిచారని సీబీఐని ప్రశ్నించింది. తాము పిలవలేదని సీబీఐ తెలిపింది. కాగా తన కుటుంబంపైనా ఆరోపణలు చేశారని అందుకే ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశానని సునీత నివేదించారు.

ఏపీ ఇన్ పార్లమెంట్

లోక్‌సభ

రూసాలో ఏపీకి పలు పథకాలు




సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్ష అభియాన్ (రూసా)లో భాగంగా ఏపీలో పలు పథకాలు అనుమతించామని, ఆయా ప్రాజెక్టులకు నిధులు విడుదల చేస్తున్నామని కేంద్ర విద్యాశాఖ సహాయమంత్రి సుభాష్ సర్కార్ తెలిపారు. లోక్‌సభలో సోమవారం వైఎస్సార్‌సీపీ ఎంపీలు గొడ్డేటి మాధవి, కోటగిరి శ్రీధర్‌ల ప్రశ్నకు మంత్రి జవాబిచ్చారు. ఆయా పథకాలపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తామని చెప్పారు.

చట్టసవరణ యోచన లేదు





ముఖ్యమంత్రి సహాయనిధి లేదా రాష్ట్ర సహాయనిధిని చేర్చడానికిగాను కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) అనుమతించే కార్యకలాపాల పరిధిని పెంచడానికి కంపెనీల చట్టం–2013లోని షెడ్యూలు 7ను సవరించాలని ప్రభుత్వం భావించడం లేదని కేంద్ర కార్పొరేట్ వ్యవహారాలశాఖ సహాయమంత్రి జితేంద్ర సింగ్.. వైఎస్సార్‌సీపీ ఎంపీలు బి.వి.సత్యవతి, బెల్లాన చంద్రశేఖర్‌ల ప్రశ్నకు సమాధానమిచ్చారు.

ఏపీకి రూ.13,438 కోట్లు



జీఎస్టీ పరిహారం కింద ఆంధ్రప్రదేశ్‌కు 2017–18 నుంచి రూ.13,438 కోట్లు విడుదల చేసినట్లు కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి పంకజ్ చౌధరి.. వైఎస్సార్‌సీపీ ఎంపీ పోచ బ్రహ్మానందరెడ్డి ప్రశ్నకు జవాబిచ్చారు.

జీఎస్టీ కేసుల్లో 17 మంది అరెస్టు




ఆంధ్రప్రదేశ్‌లో జీఎస్టీ కేసుల్లో 17 మందిని అరెస్టు చేసినట్లు కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి పంకజ్ చౌధరి తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీలు పి.వి.మిథున్‌రెడ్డి, ఎన్.రెడ్డెప్పల ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. రూ.5,755 కోట్ల ఎగవేతకు సంబంధించిన ఈ కేసుల్లో రూ.2,296 కోట్లు రికవరీ చేసినట్లు చెప్పారు.

కేంద్ర విద్యాసంస్థల్లో 6,028 ఖాళీలు

కేంద్ర ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీల్లో 6,028 ఖాళీలున్నట్లు విద్యాశాఖ సహాయమంత్రి అన్నపూర్ణాదేవి తెలిపారు. వీటిలో ఓబీసీ 1,543, ఎస్సీ 878, ఎస్టీ 520, ఈడబ్ల్యూఎస్ 611, దివ్యాంగుల కేటగిరిలో 322 ఖాళీలున్నాయని వైఎస్సార్‌సీపీ ఎంపీ ఎన్.రెడ్డెప్ప ప్రశ్నకు సమాధానమిచ్చారు.

ఏపీకి కాంపా నిధులు



అటవీ భూముల అభివృద్ధి కోసం ఆంధ్రప్రదేశ్‌కు కాంపా నిధులు విడుదల చేస్తున్నామని కేంద్ర పర్యావరణ, అటవీశాఖ సహాయమంత్రి అశ్వినికుమార్ చౌబే తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీలు మార్గాని భరత్‌రామ్, ఎన్.రెడ్డెప్పల ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. 2019–20లో రూ.1,734.81 కోట్లు, 2021–22లో రూ.114.05 కోట్లు బదిలీ చేశామని చెప్పారు.

ఉమ్మడి ఏపీలో 67.02 శాతం అక్షరాస్యత



2011 జనాభా లెక్కల ప్రకారం ఉమ్మడి ఏపీలో 67.02 శాతం అక్షరాస్యత ఉందని కేంద్ర విద్యాశాఖ సహాయమంత్రి అన్నపూర్ణాదేవి తెలిపారు. అక్షరాస్యత పెంచడానికి పలు కేంద్ర పథకాలు తీసుకొచ్చామని వైఎస్సార్‌సీపీ ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రశ్నకు సమాధానమిచ్చారు.

బాపు మ్యూజియం అభివృద్ధికి నిధులు




విజయవాడలోని బాపు మ్యూజియం ఆధునికీకరణ, అభివృద్ధికి మ్యూజియం గ్రాంటు పథకం కింద ప్రాజెక్టు వ్యయంలోని 80 శాతం రూ.6.40 కోట్లు విడుదల చేసినట్లు కేంద్ర పర్యాటకశాఖ మంత్రి కిషన్‌రెడ్డి.. వైఎస్సార్‌సీపీ ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, వల్లభనేని బాలశౌరిల ప్రశ్నకు జవాబిచ్చారు.

రాజ్యసభ

విశాఖ ఉక్కుకు బొగ్గు, ఖనిజం లోటు లేకుండా చర్యలు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి ప్రశ్నకు కేంద్రం సమాధానం



సాక్షి, న్యూఢిల్లీ: విశాఖ ఉక్కు పరిశ్రమ (ఆర్ఐఎన్ఎల్) ఎదుర్కొంటున్న కోకింగ్ కోల్, ఐరన్ ఓర్ కొరత సమస్యలను అధిగమించేందుకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర ఉక్కుశాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా చెప్పారు. విశాఖ ఉక్కులో బ్లాస్ట్‌ఫర్నేస్, స్టీల్ మెల్టింగ్ షాప్‌ను ఆధునికీకరించి 7.3 మిలియన్ టన్నుల సామర్థ్యానికి పెంచినా సమగ్ర ఉక్కు ఉత్పాదన విస్తరణ జరగలేదని తెలిపారు. రాజ్యసభలో సోమవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. వాతావరణంలో ఉప్పు సాంద్రత కారణంగా స్టీల్‌ప్లాంట్‌లోని భారీ పరికరాలకు తుప్పుపట్టే అవకాశం ఉన్న నేపథ్యంలో పరికరాలు సమకూర్చుకునే దశలోనే ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకుని తగిన జాగ్రత్తలు తీసుకున్నట్లు చెప్పారు. పూర్తిసామర్థ్యం మేరకు ఉత్పాదన జరగడానికి ప్లాంటుకు నిరాటంకంగా కోకింగ్ కోల్ సరఫరా చేసే అంశంపై బొగ్గుశాఖతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపారు. విశాఖ ఉక్కు కోసం ఇనుప ఖనిజం బ్లాక్‌ను ప్రత్యేకంగా కేటాయించాలని ఒడిశా ప్రభుత్వాన్ని కోరామన్నారు. ఇనుప ఖనిజ నిక్షేపాలను తమ కోసం ప్రత్యేకంగా రిజర్వ్ చేయాలని కేంద్ర గనులశాఖకు సిఫార్సు చేయమంటూ వైజాగ్ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఇప్పటికే ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలను కోరిందని చెప్పారు. స్టీల్‌ప్లాంట్ వర్కింగ్ కేపిటల్ అవసరాలకు సులభతరమైన వడ్డీతో రుణాల మంజూరు కోసం యాజమాన్యం వివిధ బ్యాంకులతో సంప్రదింపులు జరుపుతోందని తెలిపారు. ప్లాంట్ ఎదుర్కొంటున్న పలు ఇతర ఇబ్బందులను అధిగమించేందుకు ఇంకా ఎలాంటి చర్యలు చేపట్టాలన్న అంశంపై చర్చలు, సంప్రదింపులు జరుపుతున్నట్లు మంత్రి వివరించారు.

ఉత్తరాంధ్రలో 211 సీఎన్‌జీ స్టేషన్లు

ఉత్తరాంధ్ర జిల్లాలైన శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నంలలో 2030 నాటికి 211 సీఎన్‌జీ (కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్) స్టేషన్లు ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర పెట్రోలియంశాఖ సహాయమంత్రి రామేశ్వర్ తేలి తెలిపారు. విజయసాయిరెడ్డి మరో ప్రశ్నకు మంత్రి బదులిస్తూ.. సీఎన్‌జీ స్టేషన్ల ఏర్పాటుకు అర్హత పొందిన అధీకృత సంస్థలు ఈ ఏడాది జనవరి 31 నాటికి ఉత్తరాంధ్రలో 13 స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ (సీజీడీ) బిడ్డింగ్ రౌండ్ పూర్తయిన అనంతరం ఏపీ అంతటా సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్‌కు అనుమతించనున్నట్లు తెలిపారు.

ఏపీలో 4 జలవారసత్వ నిర్మాణాలు



స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో నాలుగు జలవారసత్వ నిర్మాణాలు గుర్తించామని కేంద్ర జలశక్తిశాఖ సహాయమంత్రి బిశ్వేశ్వర్ టుడు తెలిపారు. వీటి నిర్వహణకు ఇప్పటివరకు నిధులు విడుదల చేయలేదని వైఎస్సార్‌సీపీ ఎంపీ పరిమళ్‌నత్వానీ ప్రశ్నకు జవాబిచ్చారు.

రూ.1,690.24 కోట్లు వినియోగం



ఏపీలోని 4 స్మార్ట్‌సిటీలకు స్మార్ట్‌సిటీస్ మిషన్ పథకంలో భాగంగా రూ.1,905.20 కోట్లు విడుదల చేయగా రూ.1,690.24 కోట్లు వినియోగించారని కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాలశాఖ సహాయమంత్రి కౌశల్ కిషోర్.. వైఎస్సార్‌సీపీ ఎంపీ బీద మస్తాన్‌రావు ప్రశ్నకు సమాధానమిచ్చారు.

ప్రస్తుతానికి ఆధార్‌తోనే గుర్తింపు



విమాన ప్రయాణికుల డిజిటల్ గుర్తింపు ప్రస్తుతానికి ఆధార్‌తో చేస్తున్నట్లు పౌరవిమానయానశాఖ సహాయమంత్రి వి.కె.సింగ్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. ఆధార్, పాస్‌పోర్ట్, ఈ-పాస్‌పోర్టులతో అనుసంధానం చేయాలని భావిస్తూ డీజీసీఏ 2022లో సర్క్యులర్ జారీచేసిందని చెప్పారు. ప్రయాణికుల వ్యక్తిగత సమాచారానికి సంబంధించిన డాటా సెంట్రల్ స్టోరేజీలో 24 గంటల అనంతరం చెరిగిపోతుందని, ప్రయాణికుల స్మార్ట్‌ఫోన్ వ్యాలెట్‌లో మాత్రమే ఉంటుందని తెలిపారు.

నెల్లూరులో పైపులైను గ్యాస్ కనెక్షన్లు ఇవ్వలేదు



నెల్లూరు జిల్లాలో ఒక్క పైపులైను గ్యాస్ కనెక్షన్ (పీఎన్‌జీ) ఇవ్వలేదని కేంద్ర పెట్రోలియం, సహజ వనరులశాఖ సహాయమంత్రి రామేశ్వర్ తేలి తెలిపారు. 2029 జూన్ 30 నాటికి శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో 8.52 లక్షల పీఎన్‌జీ, 81 సీఎన్‌జీ స్టేషన్లు ఏర్పాటు చేయాల్సి ఉండగా ఇప్పటివరకు కేవలం 15 సీఎన్‌జీ స్టేషన్లు మాత్రమే ఏర్పాటయ్యాయని వైఎస్సార్‌సీపీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నకు సమాధానమిచ్చారు.


'ఆర్‌ఆర్‌ఆర్‌'లో నాటు నాటు పాట... ఎన్టీఆర్, రామ్‌చరణ్


● కీరవాణి, చంద్రబోస్

ఊర నాటు ఆస్కార్ హిట్టు

- బెస్ట్ ఒరిజినల్ సాంగ్ విభాగంలో 'నాటు నాటు'కు అవార్డు
- 'ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్' చిత్రానికి ఏడు అవార్డులు
- 'ఆల్ క్వైట్ ఆన్ ది వెస్ట్రన్ ఫ్రంట్'కి నాలుగు అవార్డులు

'నే పాడితే లోకమే పాడదా.. నే ఆడితే లోకమే ఆడదా...' పాటలో దమ్ముంటే లోకం పాడుతుంది.. ఆడుతుంది.. ఆ పాట విశ్వ విజేత అవుతుంది. 'నాటు నాటు...' అందుకో ఉదాహరణ. క్లాస్, మాస్ తేడా లేకుండా నాటు బీటు అందరి మనసుల్లోకి చొచ్చుకు పోయింది. తెలుగు పరిశ్రమ తొలి ఆస్కార్ ఆనందాన్ని చవి చూసేలా చేసింది. 'ఆర్‌ఆర్‌ఆర్' హీరోలు ఎన్టీఆర్, రామ్‌చరణ్, దర్శకుడు రాజ మౌళి, డాల్బీ థియేటర్‌లో ఇతరుల కరతాళ ధ్వనుల మధ్య చిత్రసంగీత దర్శకుడు కీరవాణి, రచయిత చంద్రబోస్ ఆస్కార్‌ని అందుకున్నారు. దేశం మురిసిన వేళ.. తెలుగు స్క్రీన్ ఆనందించిన వేళ 95వ ఆస్కార్ అవార్డు విశేషాలు తెలుసుకుందాం...

నేను కార్పెంటర్స్ (అమెరికన్ మ్యూజిక్ బ్యాండ్) వింటూ పెరిగాను. ఇప్పుడు ఇక్కడ ఆస్కార్‌తో ఉన్నాను. నా మదిలో ఒకే ఒక కోరిక ఉండేది అంటూ 1970లలో హిట్ అయిన పాప్ సాంగ్ 'టాప్ ఆఫ్ ది వరల్డ్'ని తన స్టయిల్‌లో పాడారు కీరవాణి. "నా మదిలో ఒకే ఒక కోరిక ఉండేది. అదేంటంటే.. రాజమౌళి, నా కుటుంబం, 'ఆర్‌ఆర్‌ఆర్' ఆస్కార్ కైవసం చేసుకోవాలని. ప్రతి భారతీయుడికి గర్వకారణం కావాలని, నన్ను ప్రపంచ శిఖరాగ్రాన నిలబెట్టాలని... థ్యాంక్యూ కార్తికేయ" అని పాడారు.

ఆస్కార్ అవార్డు అందుకున్న 'నాటు నాటు..' పాట రచయిత చంద్రబోస్ 'నమస్తే' అంటూ తెలుగులో మాట్లాడి, తన సంతోషం వ్యక్తం చేశారు.

అంతర్జాతీయ వేదికపై తెలుగోడి 'నాటు నాటు' మారుమోగిపోయింది. ఆస్కార్ వేదికపై నాటు నాటు స్టెప్పులు అదిరిపోయాయి. 'బెస్ట్ ఒరిజినల్ సాంగ్' విభాగంలో 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రంలోని 'నాటు నాటు' పాటకు ఆస్కార్ అవార్డు దక్కింది. దాదాపు 80 పాటలను పరిశీలించి 15 పాటలను బెస్ట్ ఒరిజినల్ స్కోర్ విభాగంలో అవార్డు కోసం షార్ట్‌లిస్ట్ చేసింది ఆస్కార్ కమిటీ. ఈలోపు 'ఆర్‌ఆర్‌ఆర్' టీమ్ ప్రమోషన్స్‌తో 'నాటు నాటు..' విదేశీయులకు కూడా మరింత చేరువైంది. ఈ క్రమంలోనే జనవరి 24న వెల్లడైన ఆస్కార్ నామినేషన్స్‌లో 'బెస్ట్ ఒరిజినల్ సాంగ్' విభాగంలో 'నాటు నాటు..'కు చోటు దక్కింది. 'నాటు నాటు' పాటతో పాటు 'టెల్ ఇట్ లైక్ ఏ ఉమెన్' చిత్రంలోని 'అప్లాజ్', 'బ్లాక్‌పాంథర్: వకాండ ఫరెవర్'లోని 'లిఫ్ట్ మీ అప్', 'ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్' చిత్రంలోని 'దిస్ ఈజ్ ఏ లైఫ్', 'టాప్‌గన్: మ్యావరిక్'లోని 'హోల్డ్ మై హ్యాండ్' పాటలు బరిలో నిలిచాయి. అయితే వీటన్నింటినీ దాటుకుని తెలుగు 'నాటు నాటు' ఆస్కార్ అవార్డును తెచ్చింది. ప్రపంచ సినిమా చరిత్రలో సరికొత్త చరిత్రకు పునాది వేసింది. ఇలా దేశానికి ఆస్కార్ తెచ్చిన తొలి చిత్రంగా, తొలి తెలుగు చిత్రంగా 'ఆర్‌ఆర్‌ఆర్' నిలిచింది (గతంలో కొందరు భారతీయులు, ఇండో-అమెరికన్స్ ఆస్కార్ అవార్డులు సాధించినప్పటికీ అవి భారతీయ చిత్రాలు కావు). ఒక ఏషియన్ చిత్రం (ఆర్‌ఆర్‌ఆర్) నుంచి ఓ పాటకు (నాటు నాటు) అవార్డు రావడం ఇదే తొలి సారి. అలాగే నాన్-ఇంగ్లిష్ పాటల్లో ఆస్కార్ అవార్డు సాధించిన నాలుగో పాటగా 'నాటు నాటు' నిలిచింది. ఇక ఆస్కార్ అవార్డు సాధించిన తొలి తెలుగు వ్యక్తులుగా కీరవాణి, చంద్రబోస్ రికార్డు సృష్టించారు. అలాగే బెస్ట్ ఒరిజినల్ సాంగ్ విభాగంలో ఆస్కార్ అవార్డు సాధించిన రెండో భారతీయుడుగా కీరవాణి, రెండో గీత రచయితగా చంద్రబోస్ నిలిచారు. 2009లో జరిగిన 81వ ఆస్కార్ అవార్డ్స్‌లో ఇంగ్లిష్ చిత్రం 'స్లమ్‌డాగ్ మిలియనీర్'కి గాను 'బెస్ట్ ఒరిజినల్ సాంగ్' విభాగంలో ఏఆర్ రెహమాన్, రచయిత గుల్జార్ ఆస్కార్ అవార్డులను అందుకున్నారు.

ఇక 95వ ఆస్కార్ అవార్డ్స్‌లో ప్రకటించిన మొత్తం 23 విభాగాల జాబితాల్లోకి వస్తే...

ఉత్తమ చిత్రం: ఎవ్రీవేర్ ఎవ్రీథింగ్ ఆల్ ఎట్ వన్స్
ఉత్తమ దర్శకుడు: డానియల్ క్వాన్, డానియల్ స్కీనెర్ట్ (ఎవ్రీవేర్ ఎవ్రీథింగ్ ఆల్ ఎట్ వన్స్)
ఉత్తమ నటుడు: బ్రెండెన్ ఫ్రాసెర్ (ది వేల్)
ఉత్తమ నటి: మిషెల్ యో (ఎవ్రీవేర్ ఎవ్రీథింగ్ ఆల్ ఎట్ వన్స్)
ఉత్తమ ఒరిజినల్‌సాంగ్: 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రంలోని 'నాటు నాటు'(మ్యూజిక్ డైరెక్టర్ కీరవాణి, లిరిక్ రైటర్ చంద్రబోస్)
ఉత్తమ సహాయ నటుడు: కి హుయ్ క్వాన్ (ఎవ్రీవేర్ ఎవ్రీథింగ్ ఆల్ ఎట్ వన్స్)
ఉత్తమ సహాయ నటి: జామి లీ కర్టిస్ (ఎవ్రీవేర్ ఎవ్రీథింగ్ ఆల్ ఎట్ వన్స్)
ఉత్తమ క్యాస్ట్యూమ్ డిజైన్: రూథ్ కార్టర్(బ్లాక్ పాంథర్: వకండా ఫరెవర్)
ఉత్తమ స్క్రీన్ ప్లే: డానియల్ క్వాన్, డానియల్ స్కీనెర్ట్ (ఎవ్రీవేర్ ఎవ్రీథింగ్ ఆల్ ఎట్ వన్స్)
ఉత్తమ సినిమాటోగ్రఫీ: జేమ్స్‌ఫ్రెండ్ (ఆల్ క్వైట్ ఆన్ ది వెస్టన్ ఫ్రంట్)
ఉత్తమ ఎడిటర్: పాల్ రోజర్స్ (ఎవ్రీవేర్ ఎవ్రీథింగ్ ఆల్ ఎట్ వన్స్)
ఇంటర్‌నేషనల్ ఫీచర్ ఫిల్మ్: ఆల్ క్వైట్ ఆన్ ది వెస్ట్రంట్ ఫ్రంట్ (జర్మనీ)
బెస్ట్ డాక్యుమెంటరీ ఫీచర్ ఫిల్మ్: నవాల్నీ
బెస్ట్ డాక్యుమెంటరీ షార్ట్ సబ్జెక్ట్: ది ఎలిఫెంట్ విస్పరర్స్
బెస్ట్ ప్రొడక్షన్ డిజైన్: క్రిస్టియన్ ఎం గోల్డ్ బెక్ (ఆల్ క్వైట్ ఆన్ ది వెస్ట్రంట్ ఫ్రంట్)
బెస్ట్ విజువల్ ఎఫెక్ట్స్: అవతార్: ది వే ఆఫ్ వాటర్ (అవతార్ 2)
బెస్ట్ సౌండ్: టాప్‌గన్: మ్యావరిక్
బెస్ట్ మేకప్ అండ్ హెయిర్ స్టయిల్: ది వేల్
బెస్ట్ యానిమేటెడ్ ఫీచర్ ఫిల్మ్: పినాషియో
లైవ్ యాక్షన్ షార్ట్ ఫిల్మ్: ఏన్ ఐరిస్ గుడ్ బై
యానిమేటెడ్ షార్ట్ ఫిల్మ్: ద బాయ్, ద మోల్, ద ఫాక్స్ అండ్ ది హార్స్
బెస్ట్ అడాప్టెడ్ స్క్రీన్ ప్లే: షెరా పాల్లే (ఉమెన్ టాకింగ్)
బెస్ట్ ఒరిజినల్ స్కోర్: బ్రెటెల్‌మాన్ (ఆల్ క్వైట్ ఆన్ ది వెస్ట్రంట్ ఫ్రంట్)


● ఆస్కార్ వేడుకలో 'ఆర్‌ఆర్‌ఆర్' టీమ్


● ప్రేమ్ రక్షిత్, కాలభైరవ, రాహుల్ సిప్లిగంజ్

హోస్ట్ జిమ్మీపై నెటిజన్ల ఆగ్రహం

ఆస్కార్ వేడుక ప్రారంభంలో 'ఆర్‌ఆర్‌ఆర్' ప్రస్తావన వచ్చినప్పుడు హోస్ట్ జిమ్మి 'ఆర్‌ఆర్‌ఆర్' బాలీవుడ్ మూవీ అన్నట్లుగా చెప్పారు. దీంతో నెటిజన్లు జిమ్మి కిమ్మెల్‌ను తప్పపడుతూ కామెంట్ల వర్షం కురిపించారు. ప్రపంచవ్యాప్తంగా 'ఆర్‌ఆర్‌ఆర్' తెలుగు సినిమా అని గుర్తింపు పొందిన నేపథ్యంలో ఆస్కార్‌లాంటి ప్రతిష్ఠాత్మక అవార్డుకు హోస్ట్ అయిన జిమ్మీ బాలీవుడ్ మూవీ అనడం సరికాదని పలువురు నెటిజన్లు సోషల్ మీడియాలో విమర్శించారు.



డు యూ నో నాటు?

'నాటు నాటు' పాట ఎంత పాపులరో ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. కానీ ఆస్కార్ వేదికపై 'డు యూ నో నాటు?.. ఒకవేళ తెలియకపోతే ఇప్పుడు తెలుసుకుంటారు'.. అంటూ దేశం నుంచి ఆస్కార్ అవార్డ్స్‌కి ఓ ప్రెజెంటర్‌గా వెళ్లిన దీపికా పదుకోన్ 'నాటు నాటు' పాటను పరిచయం చేశారు. వేదికపై రాహుల్ సిప్లిగంజ్, కాలభైరవ 'నాటు నాటు' పాటను పాడగా, వెస్ట్రన్ డ్యాన్సర్స్ కాలు కదిపారు. ఈ వేడుకలో వీక్షకుల్లో 'నాటు నాటు..' పాట ఎంత జోష్ నింపిందంటే.. పాట పూర్తయ్యాక అందరూ స్టాండింగ్ ఓవేషన్ ఇచ్చారు.


● వేడుకలో ఒక దృశ్యం


● ఎన్టీఆర్


● రామ్‌చరణ్

నాటు నాటు... 17 రోజుల కష్టం

'నాటు నాటు' పాటను ఉక్రెయిన్‌లో చిత్రీకరించారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ భవన ప్రాంగణంలో ఈ పాటను షూట్ చేశారు. పక్కనే పార్లమెంట్ భవనం కూడా ఉంది. అయితే ఇలాంటి ప్రదేశంలో ఓ సినిమా షూటింగ్ అంటే చాలా అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ జెలెన్‌స్కీ ఒకప్పుడు టెలివిజన్ యాక్టర్ అట. సో.. ఆర్ట్ గురించి ఆయనకు అవగాహన ఉండటంతో పాటను చిత్రీకరించేందుకు అనుమతి ఇచ్చారు. 'నాటు నాటు..' పాటను 17 రోజుల పాటు షూట్ చేశారు. సెట్స్‌లో ప్రతి రోజూ 150మంది డ్యాన్సర్లు పాల్గొన్నారు. 200మంది సాంకేతిక నిపుణులు ఈ పాట కోసం లొకేషన్‌లో హాజరయ్యారు. ఇక ఈ పాటలో ప్రత్యేకించి చెప్పుకోవాల్సింది 'హుక్ స్టెప్' గురించి. దాదాపు 80 రకాల స్టెప్స్‌ను కంపోజ్ చేశాక ఈ పాట కొరియోగ్రాఫర్ ప్రేమ్ రక్షిత్ అండ్ టీమ్ ఆ స్టెప్‌ను ఫైనలైజ్ చేశారు. ఈ స్టెప్ కూడా ఊరికే పూర్తి కాలేదు. డ్యాన్స్‌లో మంచి ప్రావీణ్యం ఉన్న ఎన్టీఆర్, రామ్‌చరణ్‌లు 18 టేక్స్ తీసుకున్నారు. ఎన్టీఆర్, చరణ్‌ల మధ్య సింక్ రావడానికి ఎక్కువ సమయం పట్టిందట. ఇలా వీరందరి కష్టం ఇప్పుడు ఆస్కార్ అవార్డు రూపంలో ఫలించింది. అలాగే ఈ పాట కోసం దాదాపు రూ. 15 కోట్లు అయింది. నిజానికి ఈ పాటను ముందుగా ఇండియాలోనే షూట్ చేయాలనుకున్నారు. ఢిల్లీలోని ఎర్రకోట లొకేషన్‌ను అనుకున్నారు. కానీ ఆ సమయానికి వర్షాకాలం కావడంతో ఇతర దేశాల్లో తీయాలనుకున్నారు రాజమౌళి. సెట్ అయితే సహజంగా ఉండదని భావించారు. ఆ సమయంలోనే జెలెన్‌స్కీ భవనం లొకేషన్ రాజమౌళి కంట పడింది. అక్కడే పాటను చిత్రీకరించాలని అనుకున్నారు. కానీ అనుమతులు దొరకవని అనుకున్నారు. అయితే ఉక్రెయిన్ టీమ్ వల్ల అది సాధ్యమైంది. అలాగే పాట సమయంలో ఎన్టీఆర్, రామ్‌చరణ్‌లతో పాటు సైడ్ డ్యాన్సర్స్‌కు కూడా రెండు, మూడు కాస్ట్యూమ్స్‌ను రెడీగా ఉంచారు. ఎందుకంటే సాంగ్‌ను దుమ్ములో తీశారు. కాస్ట్యూమ్స్ పాడైతే షూటింగ్ లేట్ అవుతుందని. ఈ సినిమాకు రాజమౌళి భార్య రమా రాజమౌళి కాస్ట్యూమ్ డిజైనర్‌గా వర్క్ చేశారు.

భారతదేశం చాలా బలమైన సాంస్కృతిక నేపథ్యం ఉన్న వైవిధ్యమైన దేశం. 'ఆర్‌ఆర్‌ఆర్'లో మీరు చూసింది అదే. ప్రపంచానికి చెప్పాల్సిన కథలు ఇండియాలో చాలా ఉన్నాయి. చాలా తీవ్రమైన, బలమైన, భావోద్వేగ, నాటకీయ యాక్షన్‌తో కూడిన సినిమాలు ఇండియా నుంచి వస్తాయి. ఇప్పుడు భారతీయులకు పూర్తి నమ్మకం కలిగింది.
- ఎన్టీఆర్

మనం గెలిచాం. మన ఇండియన్ సినిమా గెలిచింది. యావత్ దేశమే గెలిచింది. ఆస్కార్‌ను ఇంటికి తెచ్చేస్తున్నాం. మా జీవితాల్లోనే కాకుండా భారతీయ చలన చిత్ర పరిశ్రమలో 'ఆర్‌ఆర్‌ఆర్' ఎంతో ప్రత్యేకమైనది. ఆస్కార్ అవార్డు సొంతమయ్యేలా చేసిన ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్. నేనింకా కలలోనే ఉన్నట్లు అనిపిస్తోంది. రాజమౌళి, కీరవాణిగార్లు భారత చలనచిత్రపరిశ్రమలో అత్యంత విలువైన రత్నాలు. ఈ అద్భుత కళాఖండంలో నన్ను భాగం చేసినందుకు కృతజ్ఞతలు. ప్రపంచవ్యాప్తంగా 'నాటు నాటు..' అనేది ఒక భావోద్వేగం. ఆ భావోద్వేగానికి రూపమిచ్చిన చంద్రబోస్, రాహుల్ సిప్లిగంజ్, కాలభైరవ, ప్రేమ్‌రక్షిత్‌లకు థ్యాంక్స్. నా బ్రదర్ ఎన్టీఆర్, కో స్టార్ ఆలియాభట్‌కు థ్యాంక్స్. తారక్.. కుదిరితే నీతో మళ్లీ డ్యాన్స్ చేసి రికార్డులు సృష్టించాలనుంది. ఈ అవార్డు భారతీయ నటీనటులు, సాంకేతిక నిపుణులందరి సొంతం. నా భార్య (ఉపాసన)కు ఆరో నెల. మా బేబీయే మాకీ అదృష్టాన్ని తెచ్చిందనుకుంటున్నాను. **- రామ్‌చరణ్**

ప్రముఖుల శుభాకాంక్షలు

"నాటు నాటు పాట పాపులారిటీ ప్రపంచవ్యాప్తమైనది. భవిష్యత్తులో కూడా గుర్తుపెట్టుకునే పాట అది. ఎమ్ఎమ్ కీరవాణి, చంద్రబోస్, 'ఆర్‌ఆర్‌ఆర్' టీమ్ అందరికీ నా శుభాకాంక్షలు. భారతదేశం గర్వపడుతోంది.
– నరేంద్ర మోదీ, భారత ప్రధానమంత్రి

ఉత్తమ ఒరిజినల్ సాంగ్ కేటగిరీలో ఆస్కార్ అవార్డు సాధించిన 'ఆర్‌ఆర్‌ఆర్' సినిమా టీమ్‌కు అభినందనలు. **– అబ్దుల్ నజీర్, ఆంధ్రప్రదేశ్ గవర్నర్**

"ఈరోజు భారతీయ జెండా రెపరెపలాడుతోంది. మన అందమైన వారసత్వ జానపద పాటకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించడం గర్వంగా ఉంది. చరిత్రను తిరగరాసిన రాజమౌళి, ఎన్టీఆర్, రామ్‌చరణ్, కీరవాణిలకు అభినందనలు. నాతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది తెలుగు ప్రజలతో పాటు భారతీయులందరూ గర్వపడేలా చేసిన రాజమౌళి, ఎన్టీఆర్, రామ్‌చరణ్, కీరవాణి, చంద్రబోస్, ప్రేమ్ రక్షిత్, కాలభైరవ, రాహుల్ సిప్లిగంజ్‌తో పాటు మొత్తం 'ఆర్‌ఆర్‌ఆర్' టీమ్‌కు కంగ్రాట్స్.
– వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి

విశ్వ సినీ యవనికపై తెలుగు సినిమా సత్తా చాటింది. ప్రతిష్ఠాత్మక ఆస్కార్ అవార్డు గెలుచుకోవడం తెలుగువారికి గర్వకారణం. 'నాటు నాటు' పాట తెలంగాణ సంస్కృతి, తెలుగు ప్రజల అభిరుచికి నిదర్శనం. తెలుగు మట్టి వాసనలను వెలుగులోకి తీసుకువచ్చిన చంద్రబోస్, సంగీత దర్శకుడు కీరవాణి, చిత్ర దర్శకుడు రాజమౌళి, నటీనటులందరికీ అభినందనలు.
– కేసీఆర్, ముఖ్యమంత్రి, తెలంగాణ

మా అబ్బాయి కీరవాణికి మూడో ఏట నుంచే సంగీతం నేర్పించా. అతడి కడుపునిండా సంగీతమే. అసాధారణ ప్రజ్ఞావంతుడు. నేను తాళాలు తెరిచానంతే. కీరవాణి సాధిస్తున్న విజయాలకు ముగ్ధుడిని అవుతూనే ఉన్నా. ఇప్పుడు ఆస్కార్ తెచ్చి నన్నెంతో ఆనందపరిచాడు. ఓ తండ్రిగా గర్వపడుతున్నాను. **– శివశక్తి దత్త**

మన దేశంలో ప్రతిభకు కొదవ లేదు. అందరూ వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి. 'నాటు నాటు..'కు ఆస్కార్ అవార్డు అందుకున్న 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రబృందానికి శుభాకాంక్షలు. **– విజయేంద్ర ప్రసాద్**

ఇంకా రజనీకాంత్, చిరంజీవి, నాగార్జున, వెంకటేశ్, ప్రభాస్, మహేశ్ బాబు, అల్లు అర్జున్, ఏఆర్ రెహమాన్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

షూటింగ్‌కి వెళ్లడానికి పదేళ్లు!




మిషెల్ యో, స్టెఫానీ, కే హుయ్ క్వాన్, జెన్నీ స్లాట్, జామి లీ కర్టిస్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ఎవ్రీవేర్ ఎవ్రీథింగ్ ఆల్ ఎట్ వన్స్'. డేనియల్ క్వాన్, డేనియల్ స్కీనెర్ట్ సంయుక్త దర్శకత్వంలో రూపొందిన ఈ సైన్స్ ఫిక్షన్ మూవీ గత ఏడాది బాక్సాఫీస్ వద్ద సూపర్ బంపర్‌హిట్ కొట్టింది. 25 మిలియన్ డాలర్ల బడ్జెట్‌తో రూపొందిన ఈ చిత్రం అంతకు నాలుగు రెట్లు అంటే వంద మిలియన్ డాలర్లకుపైగా వసూలు చేసింది. ఇక ఏడు ఆస్కార్ అవార్డులను సాధించిన ఈ చిత్రకథ విషయానికి వస్తే... చైనా నుంచి అమెరికాకు వలస వచ్చిన ఎవిలిన్ క్వాడ్ కుటుంబం అక్కడ లాండ్రీషాపు పెట్టుకుని జీవనం సాగిస్తుంటుంది. వీరు ఒక ప్రపంచంలో జీవిస్తున్నట్లే మరో ప్రపంచంలో వీరిలాంటి వారే ఉంటారు. వీరు ఒకరికొకరు తారసపడినప్పుడు ఎలాంటి విపత్కర పరిస్థితులు ఏర్పడతాయి అన్నదే కథ. ఈ మల్టీవర్స్ కాన్సెప్ట్ ప్రేక్షకులను బాగా మెప్పించింది. ఈ చిత్రదర్శకులు డేనియల్ క్వాన్, స్కీనెర్ట్ 2010లోనే 'ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్' చిత్రకథను స్టార్ట్ చేశారు. కానీ షూటింగ్‌కి వెళ్లడానికి పదేళ్లు పట్టింది. రెండేళ్లకు పైగా షూటింగ్ జరుపుకున్న ఈ చిత్రం 2022లో విడుదలై అఖండ విజయాన్ని అందుకుంది.

నాకు అవార్డు ఇచ్చిన ఆస్కార్ కమిటీకి, ఇలాంటి ఓ బోల్డ్ ఫిల్మ్‌లో నటించే అవకాశం కల్పించినవారికి ప్రత్యేక ధన్యవాదాలు. 'ది వేల్' సినిమాలో భాగమైన వారిని గుర్తు చేసుకోకుండా ఉండలేను. బెస్ట్ యాక్టర్‌గా నాకు అవార్డు రావడాన్ని చాలా గౌరవంగా ఫీల్ అవుతున్నాను. నటుడిగా నేను 30 ఏళ్లుగా ఇండస్ట్రీలో ఉన్నాను. కొన్ని సందర్భాల్లో నాకు గుర్తింపు వస్తుందా? అని ఆలోచించాను. అలా ఆలోచించినప్పుడు చాలా కష్టంగా అనిపించింది. కేవలం తిమింగలాలు మాత్రమే లోలోతుల్లో ఈదగలవు. సినిమా ఇండస్ట్రీలో నేనూ అంతే. నాకు హెల్ప్‌గా ఉన్న నా కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు.
- ఉత్తమ నటుడు బ్రెండెన్ ఫ్రాజెర్
(చెమర్చిన కళ్లతో...)

కలలు కనండి. నిజం అవుతాయనడానికి నేను ఈ అవార్డును ఓ ప్రూఫ్‌గా చూపిస్తున్నాను. మహిళలకు నేను ఒక్కటే చెప్పాలనుకుంటున్నాను. ఎవరైనా మీ ప్రైమ్ టైమ్‌ను మీరు దాటిపోయారు అంటే నమ్మొద్దు. ఈ అవార్డుని నేను మా అమ్మకు... ప్రపంచంలో ఉన్న అమ్మలందరికీ అంకితం ఇస్తున్నాను. ఎందుకంటే వారే నిజమైన సూపర్‌హీరోస్. వీరే లేకపోతే ఇప్పుడు ఇక్కడ ఎవరూ ఉండి ఉండేవారు కాదు. మా అమ్మగారికి 84 ఏళ్లు. కుటుంబసభ్యులు, స్నేహితులతో కలిసి ఇప్పుడు మలేసియాలో ఆమె ఈ వేడుకను చూస్తున్నారు. నేను ఈ అవార్డును ఇంటికి తీసుకువస్తున్నాను (కుటుంబ సభ్యులను ఉద్దేశించి). అలాగే నా కెరీర్ హాంకాంగ్‌లో స్టార్ట్ అయ్యింది. అక్కడ నాకు హెల్ప్‌గా ఉన్నవారికి ధన్యవాదాలు. అలాగే నెవర్ గివప్. డానియల్ ద్యూయో, ఏ 24 షూటింగ్ స్టూడియో, 'ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్..' నటీనటుల సహాయం లేకపోతే నేను ఇప్పుడు ఇక్కడ ఈ వేదికపై ఉండేదాన్ని కాదు.
- ఉత్తమ నటి, మిషెల్ యో


● మిషెల్ యో, బ్రెండెన్ ఫ్రాజెర్

అంబారీ ఎక్కి ఆస్కార్ వచ్చింది



**విఘ్నాలు తొలగిపోయాయి.
పూర్తిగా ఇండియాలో నిర్మితమైన డాక్యుమెంటరీకి తొలి ఆస్కార్ అందింది.
ఇది స్త్రీల ద్వారా జరిగింది.
'ది ఎలిఫెంట్ విస్పరర్స్'కు దర్శకత్వం వహించింది కార్తికి గోంజాల్వేజ్.
నిర్మించింది గునీత్ మోంగా.
వీరికి ఈ అవార్డు రావడానికి కారణం రఘు అనే అనాథ ఏనుగు పిల్ల.
ఆ ఏనుగు పిల్లను సాకిన ఆదివాసి దంపతులు.
మనుషులకు అడవి జంతువులకు మధ్య ఉండే అనుబంధం ఈ డాక్యుమెంటరీలో ఎంతో అద్భుతంగా వ్యక్తమైంది.
అందుకే అంబారీ ఎక్కి వచ్చినట్టుగా మనకు ఆస్కార్ ఘనంగా దక్కింది.**

ఏనుగులు- మావటీలు మన దేశంలో ఎప్పటి నుంచో ఉన్నారు. కాని వారి మధ్య ఉన్నది ఒక రకమైన ప్రొఫెషనల్ స్నేహం. కాని కొన్ని సందర్భాలలో అనాథలైన ఏనుగు పిల్లలను కాపాడే పని ఆదివాసీలు తీసుకుంటారు. వారిది పెంచిన మమకారం. ఆ మమకారమే 'ది ఎలిఫెంట్ విస్పరర్స్' కథాంశం. దర్శకురాలు కార్తికీది ఊటీ. అక్కడే పుట్టి పెరిగింది. ఊటీకి అరగంట ప్రయాణ దూరంలో 'తెప్పకాడు ఎలిఫెంట్ క్యాంప్' ఉంది. అక్కడ ఏనుగులను సంరక్షిస్తుంటారు. కార్తికి గోంజాల్వేజ్ చిన్నప్పటి నుంచి ఆ క్యాంప్‌కు వెళ్లి ఏనుగులను చూసేది. ఆ తర్వాత ఆమె పెరిగి పెద్దదయ్యి ఫొటోగ్రాఫర్‌గా మారినా, కెమెరా ఉమన్‌గా తనకున్న వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రఫీ మీద ఇష్టం వల్ల యానిమల్ ప్లానెట్, డిస్కవరీ చానల్స్‌లో పని చేసినా ఎప్పుడూ తన ప్రాంత ఏనుగుల మీద ఏదైనా ఫిల్మ్ చేయాలని అనిపించలేదు. కాని 2017లో అందుకు బీజం పడింది.

అతడు - ఆ ఏనుగు పిల్ల

కార్తికి గోంజాల్వేజ్ 2017లో బెంగళూరు నుంచి కారులో ఊటీకి వెళుతోంది. ఊటీ చేరుకుంటూ ఉండగా ఒక మనిషి చిన్న ఏనుగు పిల్లను నడిపించుకుంటూ వెళుతూ ఆమె కంట పడ్డాడు. కార్తికి వెంటనే కారు ఆపి ఈ మనిషి ఈ ఏనుగు పిల్లను ఎక్కడకు తీసుకువెళుతున్నాడు అని వెంబడించింది. వారిద్దరూ దగ్గరిలోని ఏటికి వెళ్లారు. ఆ మనిషి ఆ ఏనుగు పిల్లకు చంటి పిల్లలకు మల్లే స్నానం చేయించాడు. దానితో ఎన్నో కబుర్లు చెప్పాడు. 'అరె.. ఈ బంధం భలే ఉందే' అనిపించింది కార్తికికి. అతణ్ణి పలకరించింది. పేరు బొమ్మన్. ఆ ఏనుగు పిల్ల పేరు రఘు. ఆ ఏనుగు పిల్ల ఇటీవలే అనాథ అయ్యింది. పంటలను కాపాడుకోవడానికి పెట్టిన కరెంటు తీగల బారిన పడి రఘు తల్లి మరణించింది. అనాథ అయిన రఘు తల్లి వియోగంతో కృశించి చావుకు దగ్గరగా ఉండగా బొమ్మన్‌కు కనిపించాడు. దానిని ఇంటికి తీసుకెళ్లాడు. బొమ్మన్ భార్య బెల్లి రఘుకు తల్లిలా మారింది. ఆ ముగ్గురు ఒక కుటుంబం అయ్యారు.

ఇలాంటి అనుబంధాలు చూపితే మనిషి, జంతువు కలిసి మెలిసి మనుగడ సాగించాల్సిన అవసరాన్ని చూపినట్టు అవుతుందని కార్తికి అనుకుంది. వెంటనే డాక్యుమెంటరీ నిర్మించడానికి నెట్‌ఫ్లిక్స్‌ను సంప్రదించింది. నెట్‌ఫ్లిక్స్ తన కో ప్రొడ్యూసర్‌గా నిర్మాత మోంగాను సంప్రదించింది. అలా 'ది ఎలిఫెంట్ విస్పరర్స్' డాక్యుమెంటరీ నిర్మాణం మొదలైంది.

ఢిల్లీకి చెందిన గునీత్ దాదాపు పదేళ్లుగా అంతర్జాతీయ దృష్టి పడే సినిమాల నిర్మాణంలో భాగస్వామి అవుతోంది. ఆమె నిర్మాణ భాగస్వామి అయిన 'కవి' (2010) బెస్ట్ లైవ్ యాక్షన్ షార్ట్‌లో ఆస్కార్ నామినేషన్ పొందగా, 'పీరియడ్: ఎండ్ ఆఫ్ సెంటెన్స్' (2018) బెస్ట్ డాక్యుమెంటరీ షార్ట్‌గా ఆస్కార్ అవార్డ్ పొందింది. అయితే 'పీరియడ్'కు పని చేసిన సాంకేతిక నిపుణులు భారతీయులు కారు. 'ది ఎలిఫెంట్ విస్పరర్స్'ను తీయాలనుకుంటున్న కార్తికితో పని చేయడం వల్ల ఈసారి పూర్తి భారతీయ నిర్మాణంతో ప్రపంచం దృష్టిని ఆకర్షించవచ్చని గునీత్ భావించింది. అలా వీరిద్దరు కలిసి పూర్తి చేసిన ఈ డాక్యుమెంటరీ నెట్‌ఫ్లిక్స్‌లో డిసెంబర్ 8, 2022న విడుదలైంది.

ఇది డాక్యుమెంటరీ వేవ్

'ఇప్పుడు ఇండియాలో నడుస్తున్నది డాక్యుమెంటరీ వేవ్. ఫీచర్ ఫిల్మ్స్‌లో కన్నా డాక్యుమెంటరీలో భారతీయ దర్శక నిర్మాతలు వినూత్నమైన కథాంశాలను చెబుతున్నారు' అంటుంది గునీత్. కార్తికి మాట్లాడుతూ– 'ఏనుగులు ఎంత తెలివైనవో ఎంత భావోద్వేగంతో బంధంతో ఉంటాయో నా డాక్యుమెంటరీలో చూపించాను. ఇక మీదటైనా అవి వేరు మనం వేరు అనుకోకపోతే చాలు' అంది. 'నేను తీసే ఫిల్మ్స్ ఇకపై కూడా ఇలాంటి కథాంశాలతో ఉంటాయి' అన్నారు.

39 నిమిషాల డాక్యుమెంటరీ

'ది ఎలిఫెంట్ విష్పరర్స్' నిడివి 39 నిమిషాలు. రెండు ఏనుగు పిల్లలు, నీలగిరి అడవుల్లో ఉండే 'కట్టు నాయకర్' అనే తెగకు చెందిన ఆదివాసీ భార్యాభర్తలు ఈ డాక్యుమెంటరీలో కనిపిస్తారు. ఆ భార్యాభర్తల పేర్లు బొమ్మన్, బెల్లి. ఏనుగు పిల్లల్లో ఒకదాని పేరు రఘు, మరోదాని పేరు అమ్ము. కరెంటు తీగలు తగిలి తల్లి ఏనుగులు మరణించడంతో బొమ్మన్, బెల్లిలు రఘుని, అమ్ముని సాకుతారు. అయితే డాక్యుమెంటరీలో ఎక్కువ భాగం రఘుతో బొమ్మన్, బెల్లిలకు ఉండే అనుబంధం చూపుతుంది. అయితే నేపథ్యంలో అందమైన అడవులు, వాగులు, ఆదివాసీల క్రతువులు ఇవన్నీ దర్శకురాలు కార్తికి చూపడంతో డాక్యుమెంటరీకి ఒక సంపూర్ణత్వం వచ్చింది. బొమ్మన్ ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగి. ఇప్పుడు రఘు, అమ్ములను అటవీ శాఖ వారు 'ముదుమలై టైగర్ రిజర్వ్'కు మార్చారు. దాంతో రఘుతో ఆ దంపతుల బంధం తెగింది.


● కార్తికి (దర్శకురాలు), గునీత్ మోంగ (నిర్మాత)



క్వార్టర్ ఫైనల్లో మనిక జోడీ

ప్రపంచ టేబుల్ టెన్నిస్ సింగపూర్ స్మాష్ టోర్నమెంట్ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో మనిక బత్రా–సత్యన్ జ్ఞానశేఖరన్ (భారత్) జోడీ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. సింగపూర్‌లో సోమవారం జరిగిన రెండో రౌండ్ మ్యాచ్‌లో మనిక–సత్యన్ ద్వయం 11–7, 12–10, 9–11, 11–3తో జెంగ్ జియాన్–క్లారెన్స్ చ్యూ (సింగపూర్) జోడీపై గెలిచింది. మనిక–సత్యన్ జోడీకి తొలి రౌండ్‌లో 'బై' లభించింది. నేడు జరిగే క్వార్టర్ ఫైనల్లో జపాన్‌కు చెందిన హరిమోతో–హినా హయాటా ద్వయంతో మనిక–సత్యన్ ఆడతారు.

నేటి నుంచి ఆల్ ఇంగ్లండ్ టోర్నీ

ప్రతిష్టాత్మక ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ నేడు బర్మింగ్‌హామ్‌లో మొదలుకానుంది. 2001లో పుల్లెల గోపీచంద్ తర్వాత మరో భారత ప్లేయర్ ఈ టోర్నీ టైటిల్‌ను సాధించలేకపోయాడు. మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు, సైనా నెహ్వాల్... పురుషుల సింగిల్స్‌లో శ్రీకాంత్, లక్ష్య సేన్, ప్రణయ్ టైటిల్ కోసం తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. 2009 తర్వాత తొలిసారి భారత క్రీడాకారులెవరికీ సీడింగ్ లభించలేదు.



సిరీస్ మనదే



- ఆస్ట్రేలియాతో చివరి టెస్ట్ 'డ్రా'
- సిరీస్ 2–1తో భారత్ వశం
- డబ్ల్యూటీసీ ఫైనల్‌కు టీమిండియా

ఆఖరి రోజు ఏ మలుపూ లేదు. ఆలౌట్ చేయడం మన బౌలర్ల వల్ల కాలేదు. బ్యాటర్ల జోరులో ఏ మార్పూ లేదు. చివరకు ఎలాంటి డ్రామా లేకుండా నాలుగో టెస్టు 'డ్రా' అయింది. ఆసీస్ ఓపెనర్ ట్రావిస్ హెడ్ ఓ పది పరుగులు చేసుంటే ఇంకో ఈ టెస్ట్‌లో ఐదో సెంచరీ అయ్యేది. ఐదు రోజుల పాటు రోజుకో సెంచరీ చొప్పున ఈ మ్యాచ్‌కు అపూర్వ ఘనత దక్కేది. మరోవైపు క్రైస్ట్‌చర్చ్‌లో న్యూజిలాండ్ చేతిలో తొలి టెస్ట్‌లో శ్రీలంక ఓడిపోవడంతో ఈ మ్యాచ్ తుది ఫలితంతో సంబంధం లేకుండానే భారత్ ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్‌కు అర్హత సాధించింది.

అహ్మదాబాద్: భారత్, ఆస్ట్రేలియాల మధ్య మూడు రోజుల్లో ముగిసిన గత టెస్టులకు భిన్నంగా ఆఖరి మ్యాచ్ 'డ్రా' అయ్యింది. 2–1తో సిరీస్‌ను వశం చేసుకున్న టీమిండియా 'బోర్డర్–గావస్కర్ ట్రోఫీ'ని వరుసగా నాలుగోసారి చేజిక్కించుకుంది. నాలుగో టెస్టు చివరి రోజు కూడా బ్యాటర్స్ హవానే కొనసాగింది. దీంతో భారత బౌలర్లు శక్తికి మించి శ్రమించినా రెండు వికెట్లే పడగొట్టగలిగారు. ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో 78.1 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 175 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. ట్రావిస్ హెడ్ (163 బంతుల్లో 90; 10 ఫోర్లు, 2 సిక్సర్లు), లబుషేన్ (213 బంతుల్లో 63 నాటౌట్; 7 ఫోర్లు) రాణించారు. ఫలితానికి అవకాశం లేకపోవడంతో గంట ముందే 'డ్రా'కు ఇరుజట్ల కెప్టెన్లు అంగీకరించారు. విరాట్ కోహ్లికి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించగా... స్పిన్‌తో భారత్‌కు సిరీస్ విజయాన్నిచ్చిన బౌలింగ్ ద్వయం అశ్విన్–రవీంద్ర జడేజాలకు సంయుక్తంగా 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డు ఇచ్చారు. ఇరు జట్ల మధ్య మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ ఈనెల 17న ముంబైలో జరిగే తొలి మ్యాచ్‌తో మొదలవుతుంది.

హెడ్ సెంచరీ మిస్...

ఆఖరి రోజు ఓవర్‌నైట్ స్కోరు 3/0తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆస్ట్రేలియా కాసేపటికే ఓపెనర్ కునెమన్ (6) వికెట్‌ను కోల్పోయింది. జట్టు స్కోరు 14 పరుగుల వద్ద అతని వికెట్‌ను అశ్విన్ పడగొట్టగానే భారత శిబిరం సంబరపడింది. ఇక మ్యాజిక్ షురూ అనుకుంటే... అక్కడి పిచ్ 'అంతలేదు' అన్నట్లుగా బ్యాటర్లకే సహకరించింది. దీంతో హెడ్, వన్‌డౌన్ బ్యాటర్ లబుషేన్ నింపాదిగా ఆడుకున్నారు. రిస్క్ తీసుకోకుండా 'డ్రా' కోసమే వాళ్లిద్దరు క్రీజుకు అతుక్కుపోయారు. దీంతో భారత బౌలర్లు ఎంత చెమటోడ్చినా తొలి సెషన్‌లో మరో వికెట్ దొరకలేదు. 73/1 స్కోరు వద్ద లంచ్ విరామానికెళ్లారు. అనంతరం రెండో సెషన్‌లో హెడ్ 112 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసుకోగా... మరికాసేపటి ఆసీస్ స్కోరు 100 పరుగులు దాటింది. హెడ్ అడపాదడపా బౌండరీలతో పరుగులు సాధించడంతో ఐదో రోజు కూడా సెంచరీ ఖాయమనిపించింది. కానీ హెడ్ అహ్మదాబాద్ టెస్టుకు ఆ అరుదైన అవకాశం ఇవ్వకుండా 90 పరుగుల వద్ద అక్షర్ బౌలింగ్‌లో అవుటయ్యాడు. లబుషేన్ 150 బంతుల్లో అర్ధసెంచరీ సాధించగా, 158/2 వద్ద రెండో సెషన్ ముగిసింది. 'డ్రా' దిశగా సాగడంతో మూడో సెషన్‌లో 11 ఓవర్ల ఆటే ఆడారు. సిరీస్‌లో జరిగిన మూడు టెస్టుల్లోనూ 30 పైచిలుకు వికెట్లు మూడు రోజుల్లోనే రాలితే... ఆఖరి టెస్టు ఐదు రోజులు జరిగినా బౌలర్లు 22 వికెట్లను మించి పడగొట్టలేకపోయారు.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 480; **భారత్ తొలి ఇన్నింగ్స్:** 571; **ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్:** కునెమన్ (ఎల్బీడబ్ల్యూ) అశ్విన్ 6; హెడ్ (బి) అక్షర్ పటేల్ 90; లబుషేన్ (నాటౌట్) 63; స్టీవ్ స్మిత్ (నాటౌట్) 10; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (78.1 ఓవర్లలో 2 వికెట్లకు డిక్లేర్డ్)** 175. **వికెట్ల పతనం:** 1–14, 2–153. **బౌలింగ్:** అశ్విన్ 24–9–58–1, రవీంద్ర జడేజా 20–7–34–0, షమీ 8–1–19–0, అక్షర్ పటేల్ 19–8–36–1, ఉమేశ్ యాదవ్ 5–0–21–0, గిల్ 1.1–0–1–0, పుజారా 1–0–1–0.

మరో మ్యాచ్ మిగిలుంది... అదే ఫైనల్!

భారత్, ఆస్ట్రేలియాల మధ్య ద్వైపాక్షిక టెస్టు సిరీస్ అయితే ముగిసింది. కానీ ఇరుజట్ల మధ్య మరో 'టెస్టు' మిగిలుంది! అదేనండి... డబ్ల్యూటీసీ ఫైనల్. ఇక్కడ బోర్డర్–గావస్కర్ ట్రోఫీ విజేతను తేల్చినట్లే ఇంగ్లండ్‌లో ప్రపంచ టెస్టు చాంపియన్ ఎవరో కూడా తేలుతుంది. ఈ ఏడాది జూన్‌లో 7 నుంచి 11 వరకు లండన్‌లోని ది ఓవల్ మైదానంలో డబ్ల్యూటీసీ ఫైనల్ మ్యాచ్ జరుగుతుంది.

16 సొంతగడ్డపై భారత జట్టుకిది వరుసగా 16వ టెస్ట్ సిరీస్ విజయం.

1 మూడు ఫార్మాట్‌లలో (టెస్ట్, వన్డే, టి20) కనీసం 10 చొప్పున 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డులు గెల్చుకున్న తొలి క్రికెటర్‌గా కోహ్లి ఘనత.

50 భారత్ తరఫున తక్కువ బంతుల్లో టెస్టుల్లో 50 వికెట్లు పూర్తి చేసుకున్న బౌలర్‌గా అక్షర్ పటేల్ గుర్తింపు పొందాడు. కెరీర్‌లో 12 టెస్టులు ఆడిన అక్షర్ 2,205 బంతుల్లో 50 వికెట్ల మైలురాయి అందుకున్నాడు. బుమ్రా (2,465 బంతులు) పేరిట ఉన్న రికార్డును అక్షర్ సవరించాడు.

2 టెస్టుల్లో అత్యధిక 'ప్లేయర్ ఆఫ ద సిరీస్' అవార్డులు గెల్చుకున్న ఆటగాళ్ల జాబితాలో అశ్విన్ రెండో స్థానానికి చేరుకున్నాడు. అశ్విన్ 37 సిరీస్‌లలో 10 సార్లు ఈ పురస్కారం గెల్చుకున్నాడు. ముత్తయ్య మురళీధరన్ (62 సిరీస్‌లలో 11 సార్లు) అగ్రస్థానంలో ఉండగా... జాక్వస్ కలిస్ (61 సిరీస్‌లలో 9 సార్లు) మూడో స్థానానికి పడిపోయాడు.

'టాప్'లోకి భారత్

విశ్వవిజేత జర్మనీపై 6–3తో విజయం



రూర్కెలా: ప్రొ హాకీ లీగ్‌లో భాగంగా ప్రపంచ చాంపియన్ జర్మనీ జట్టుతో సోమవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో భారత్ 6–3 గోల్స్‌తో గెలిచింది. మూడు రోజుల వ్యవధిలో జర్మనీపై భారత్‌కిది రెండో గెలుపు కావడం విశేషం. ఈ విజయంతో భారత్ 17 పాయింట్లతో 'టాప్'లోకి వచ్చింది. భారత్ తరఫున సెల్వం కార్తీ (24వ, 46వ ని.లో), అభిషేక్ (22వ, 51వ ని.లో) రెండు గోల్స్ చొప్పున సాధించగా... కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ (26వ ని.లో), జుగ్‌రాజ్ (21వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. జర్మనీ తరఫున గ్రామ్‌బుష్ (3వ ని.లో), పీలాట్ (23వ ని.లో), హెల్‌విగ్ (33వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు.

బెంగళూరు ఐదో 'సారీ'

- మళ్లీ ఓడిన స్మృతి మంధాన జట్టు
- ఢిల్లీ క్యాపిటల్స్‌కు నాలుగో గెలుపు



ముంబై: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) వేలంలో అత్యధిక ధర పలికిన స్మృతి మంధాన సారథ్యంలో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టు వరుసగా ఐదో మ్యాచ్‌లోనూ పరాజయం పాలైంది. సోమవారం జరిగిన పోరులో ఢిల్లీ క్యాపిటల్స్ 6 వికెట్ల తేడాతో ఆర్‌సీబీపై గెలిచింది. ఈ టోర్నీలో ఢిల్లీకిది నాలుగో విజయం. మొదట ఆర్‌సీబీ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 150 పరుగులు చేసింది. స్మృతి (15 బంతుల్లో 8; 1 ఫోర్) నిరాశపరచగా... ఎలీస్ పెరీ (52 బంతుల్లో 67 నాటౌట్; 4 ఫోర్లు, 5 సిక్సర్లు) అర్ధసెంచరీ సాధించింది. రిచా ఘోష్ (16 బంతుల్లో 37; 3 ఫోర్లు, 3 సిక్సర్లు) ధాటిగా ఆడింది. ఢిల్లీ బౌలర్లలో శిఖా పాండే 3 వికెట్లు తీసింది. అనంతరం ఢిల్లీ 19.4 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 154 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్ షఫాలీ వర్మ (0) ఆడిన తొలి బంతికే మేగన్ షుట్ బౌలింగ్‌లో బౌల్డ్ అయి పెవిలియన్ చేరుకుంది. అయితే అలైస్ క్యాప్సీ (24 బంతుల్లో 38; 8 ఫోర్లు), జెమీమా రోడ్రిగ్స్ (28 బంతుల్లో 32; 3 ఫోర్లు), మరిజన్ కాప్ (32 బంతుల్లో 32 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్), జెస్ జొనాసెన్ (15 బంతుల్లో 29 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్) సమష్టిగా రాణించి ఢిల్లీ క్యాపిటల్స్ విజయాన్ని ఖాయం చేశారు. ఇప్పటి వరకు ఐదు మ్యాచ్‌లు ఆడిన ఢిల్లీ నాలుగు విజయాలతో ఎనిమిది పాయింట్లు సాధించి ముంబై ఇండియన్స్‌తో సంయుక్తంగా అగ్రస్థానానికి చేరుకుంది. బెంగళూరు పాయింట్ల ఖాతా తెరవలేదు.

నేడు జరిగే మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌తో గుజరాత్ జెయింట్స్ ఆడుతుంది.

హైదరాబాద్ ఎఫ్‌సీ ఓటమి

కోల్‌కతా: ఇండియన్ సూపర్ లీగ్ టోర్నీలో డిఫెండింగ్ చాంపియన్ హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) పోరాటం సెమీఫైనల్లో ముగిసింది. సోమవారం హైదరాబాద్ ఎఫ్‌సీ, ఏటీకే మోహన్ బగాన్ క్లబ్ మధ్య జరిగిన రెండో సెమీఫైనల్ కూడా తొలి సెమీఫైనల్ మాదిరిగానే 0–0తో 'డ్రా'గా ముగిసింది. దాంతో విజేతను నిర్ణయించడానికి షూటౌట్ నిర్వహించారు. 'షూటౌట్'లో మోహన్ బగాన్ 4–3తో హైదరాబాద్‌ను ఓడించింది. షూటౌట్‌లో హైదరాబాద్ తరఫున జావో, డాను, రీగన్ సఫలంకాగా... సివెరియో, ఒగ్‌బెచె విఫలమయ్యారు. ఈనెల 18న గోవాలో జరిగే ఫైనల్లో బెంగళూరు ఎఫ్‌సీతో మోహన్ బగాన్ ఆడుతుంది.



చివరి బంతికి న్యూజిలాండ్ విజయం

- విలియమ్సన్ వీరోచిత సెంచరీ
- తొలి టెస్టులో ఓడిన శ్రీలంక


విలియమ్సన్

క్రైస్ట్‌చర్చ్: కేన్ విలియమ్సన్, నీల్ వాగ్నర్ ఆఖరి బంతికి 'బై' రూపంలో పరుగు సాధించి... శ్రీలంకతో జరిగిన తొలి టెస్ట్‌లో న్యూజిలాండ్ జట్టుకు రెండు వికెట్ల తేడాతో విజయాన్ని అందించారు. శ్రీలంక నిర్దేశించిన 285 పరుగుల లక్ష్యాన్ని న్యూజిలాండ్ 70 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి ఛేదించింది. విలియమ్సన్ (121 నాటౌట్; 11 ఫోర్లు, 1 సిక్స్) వీరోచిత సెంచరీ సాధించి న్యూజిలాండ్‌ను విజయతీరానికి చేర్చాడు. చివరిరోజు వర్షంతో తొలి రెండు సెషన్‌లు ఆట సాధ్యం కాలేదు. వర్షం వెలిశాక మూడో సెషన్‌ను పొడిగించి కనీసం 52 ఓవర్లు ఆడించాలని అంపైర్లు నిర్ణయించారు. దాంతో ఓవర్‌నైట్ స్కోరు 28/1తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన న్యూజిలాండ్ 'డ్రా' కోసం కాకుండా విజయం కోసం పోరాడింది. 90 పరుగుల వద్ద మూడో వికెట్ కోల్పోయిన న్యూజిలాండ్‌ను విలియమ్సన్, డరైల్ మిచెల్ (81; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) నిలబెట్టారు. వీరిద్దరు నాలుగో వికెట్‌కు 142 పరుగులు జోడించారు. ఇన్నింగ్స్ 62వ ఓవర్లో అసిత ఫెర్నాండో బౌలింగ్‌లో మిచెల్ బౌల్డయ్యాడు. అప్పటికి న్యూజిలాండ్ విజయానికి 48 బంతుల్లో 53 పరుగులు అవసరం. మిచెల్ అవుటయ్యాక విలియమ్సన్ జట్టును లక్ష్యం దిశగా తీసుకుపోగా... బ్రేస్‌వెల్, కెప్టెన్ టిమ్ సౌతీ పెవిలియన్ చేరారు. ఆఖరికి న్యూజిలాండ్ విజయానికి చివరి ఓవర్‌లో 8 పరుగులు అవసరమయ్యాయి. అసిత ఫెర్నాండో వేసిన ఈ ఓవర్‌లో తొలి రెండు బంతులకు సింగిల్స్ రాగా... మూడో బంతికి హెన్రీ అవుటయ్యాడు. నాలుగో బంతిని విలియమ్సన్ బౌండరీ దాటించాడు. ఐదో బంతికి పరుగు రాలేదు. చివరి బంతికి విలియమ్సన్ సింగిల్ తీసి కివీస్ విజయాన్ని ఖాయం చేశాడు.

సాగుబడి
పూర్వాభాద్ర కార్తె: మార్చి 5 నుంచి

- అతి తక్కువ వర్షంతో పండే ఎడారి పంట.. ఎరువులు, పురుగుమందులు అక్కర్లేదు
- పశువులు, పక్షులు, అడవి జంతువుల బాధ లేదు
- 30 ఏళ్లుగా.. 30 ఎకరాల్లో జీవీ కొండయ్య అశ్వగంధ సాగు

అశ్వగంధ.. మెట్ట రైతుకు అండ..


అశ్వగంధ పొలంలో కొండయ్య

కింగ్ ఆఫ్ ఆయుర్వేదగా పేరొందిన ఔషధ పంట అశ్వగంధ మెట్ట రైతులకు లాభాల సిరులను కురిపిస్తోంది. తీవ్రమైన వర్షాభావ పరిస్థితుల్లో సంప్రదాయ పంటలను నమ్ముకొని ఏటా పంట నష్టంతో కుదేలైన జీవీ కొండయ్య అనే రైతు వినూత్నంగా ఆలోచించారు. అనంతపురం జిల్లా గుంతకల్లు మండలం జీ.కొట్టాల గ్రామంలోని తన పొలంలో 30 ఏళ్ల క్రితం అశ్వగంధ సాగుకు శ్రీకారం చుట్టి లాభాలు గడిస్తూ రైతులకు ఆదర్శంగా నిలిచారు. కొండయ్యను ఆదర్శంగా తీసుకొని కర్నూలు, అనంతపురం, కడప జిల్లాల్లో ఎందరో రైతులు అశ్వగంధ సాగు చేపట్టారు. ఆయన సలహాలు, సూచనలు పాటిస్తూ లాభాలు గడిస్తున్నారు. అశ్వగంధ పంటపై హైదరాబాదు బోడుప్పల్‌లోని కేంద్రీయ ఔషధ, సుగంధ మొక్కల పరిశోధనా కేంద్రం (సీమాప్)లో జరిగిన అవగాహన సదస్సు పాల్గొన్నారు. శాస్త్రవేత్తలు చెప్పింది శ్రద్ధగా విన్న కొండయ్య ఆ సీజన్‌లోనే ఎకరాకు రూ.6 వేల ఖర్చుతో 5 ఎకరాల్లో అశ్వగంధను సాగు చేశారు. అతి తక్కువ వర్షపాతంలోనే పండే పంట ఇది. ఎటువంటి క్రిమి సంహారక మందులుగానీ, ఎరువులు గానీ వాడాల్సిన అవసరం లేదు. తక్కువ ఖర్చుతోనే మంచి దిగుబడి సాధించారు. ఎకరాకు 3 క్వింటాళ్ల అశ్వగంధ వేర్ల దిగుబడి రావడంతో క్వింటాకు రూ.40 వేల వరకూ ఆదాయం పొందారు. నాటి నుంచి కొండయ్య వెనుతిరిగి చూడలేదు. 5 ఎకరాలతో ప్రారంభించి 30 ఎకరాలకు విస్తరించారు. తనకున్న 8 ఎకరాలతో పాటు ఇతర రైతుల భూమిని కౌలుకు తీసుకొని, ప్రతి ఏడాదీ భూమి మారుస్తూ. అశ్వగంధను సాగు చేస్తున్నారు. అశ్వగంధ సాగులో మంచి దిగుబడి సాధించడంతోపాటు, నాణ్యమైన దిగుబడితో ప్రశంశలు అందుకుంటున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర మెడిషినల్ బోర్డు నుంచి, లక్నోలోని 'సీమాప్'తో పాటు ఢిల్లీ, జైపూర్‌లలో కూడా అవార్డులు సొంతం చేసుకున్నారు. 2 ఎకరాల్లో ఫారం పాడ్లు నిర్మించి, వర్షాభావ పరిస్థితుల్లోనూ మంచి దిగుబడులు సాధిస్తూ వచ్చారు. కొండయ్యను చూసి సొంత గ్రామంతోపాటు రాయలసీమ జిల్లాల రైతులు పలువురు అశ్వగంధ సాగు చేస్తూ లాభాలు గడిస్తుండటం విశేషం.

– యం.మనోహర్,
సాక్షి, గుంతకల్లు రూరల్,
అనంతపురం జిల్లా

మార్కెటింగ్ సమస్య లేదు

అశ్వగంధ పంటను జూలైలో విత్తితే జనవరిలో పంట చేతికి వస్తుంది. వర్షపాతం అతితక్కువ ఉన్న ప్రాంతాలకే ఈ పంట అనుకూలం. వర్షాలు ఎకువైతే వేరు కుళ్లిపోయి పంట పాడైపోతుంది. పెట్టుబడి పెద్దగా అవసరం లేదు. కిలో రూ.200 చొప్పున ఎకరాకు 3 కేజీల విత్తనం వేస్తే సరిపోతుంది. పంటకు చీడపురుగుల బెడదగానీ, తెగుళ్ల బెడద గానీ ఏమీ ఉండవు. పశువులు, పక్షులు, జింకల నుంచి కూడా ముప్పు ఉండదు. పశువుల పేడను ఎరువుగా వేస్తే సరిపోతుంది. విత్తిన నెల తరువాత ఒకసారి, 3 నెలల తరువాత మరోసారి కలుపు తీయాలి. పంట పీకిన రోజే వేరును, కాండాన్ని, కాయలను వేరు చేసి ఆరబెడతాం. వేరు నాణ్యతను బట్టి 6 భాగాలుగా విభజించి ప్యాకింగ్ చేసి పెడతాం. కాయను నూర్పిడి చేసి విత్తనాలు తీస్తాం. ఎకరాకు 50 నుండి 100 కేజీల వరకూ విత్తనం వస్తుంది. అదే విత్తనాన్నే తిరిగి పంట సాగుకు ఉపయోగిస్తాం. మిగిలిన విత్తనాన్ని కావాల్సిన రైతులకు కిలో రూ.200 చొప్పున విక్రయిస్తాం. అశ్వగంధ విత్తనం వేశాక తరువాత నెలరోజుల పాటు వర్షం రాకపోయినా విత్తనం ఏమీ కాదు. అశ్వగంధ పంట సాగు చేసే రైతులకు ప్రభుత్వం సబ్సిడీ రూపంలో ప్రోత్సాహం కూడా అందుతుంది. పంటను నిల్వ చేసేందుకు స్టోరేజీ రూముల నిర్మాణానికి డబ్బు కూడా ఇస్తుంది. వ్యాపారులు పొలం వద్దకే వచ్చి కొంటున్నారు. మార్కెటింగ్ సమస్య లేదు.

– జీవీ కొండయ్య (94415 35325),
అశ్వగంధ రైతు, జీ.కొట్టాల, గుంతకల్లు మం.,
అనంతపురం జిల్లా


అశ్వగంధ పంట కోత

18న బోడుప్పల్‌లో రైతు మేళా

సుగంధ, ఔషధ మొక్కల సాగుపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల రైతులకు అవగాహన కల్పించేందుకు ఈ నెల 18 (శనివారం ఉ. 10–5 గం.)న సికింద్రాబాద్ సమీపంలోని బోడుప్పల్‌లోని కేంద్రీయ ఔషధ–సుగంధ మొక్కల సంస్థ (సీమాప్) పరిశోధనా కేంద్రం ఆవరణలో రైతు మేళాను నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ శాస్త్రవేత్త డా. జి.డి. కిరణ్ బాబు చెప్పారు. పాల్గొనదలచిన వారు తప్పనిసరిగా రిజిస్టర్ చేసుకోవాలి. వివరాలకు.. 040–29301131, 78298 11050, 94910 43252.

మీకు మిద్దెతోట ఉందా?

మిద్దె తోటల్లో కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, పూలు వంటి ఇంటిపంటలు పండిస్తున్న వారు తెలుగు రాష్ట్రాల్లో చాలా మంది ఉన్నారు. అయితే, వారి సంఖ్య ఎంత? ఎన్ని చదరపు అడుగుల్లో వారి మిద్దె తోట ఉంది? వంటి విషయాలు తెలుసుకోవడానికి మిద్దెతోట ఫౌండేషన్ సర్వే చేయదలచింది. మీరు మిద్దె తోటలు/ఇంటిపంటల సాగుదారులైతే ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి గూగుల్ ఫాంలో మీ వివరాలను పొందుపరచండి. సందేహాలుంటే.. గుంటూరు మిద్దెతోటల పెంపకందారుల సంఘం అధ్యక్షురాలు కొల్లి కృష్ణకుమారి (94906 02366)ని సంప్రదించవచ్చు.

సుందర రామన్ సదస్సులు

తమిళనాడుకు చెందిన ప్రకృతి వ్యవసాయ నిపుణులు, రైతు శాస్త్రవేత్త ఎస్.ఆర్. సుందర రామన్ తెలుగు రాష్ట్రాల్లో ఈ నెలలో అనేక చోట్ల రైతు సదస్సుల్లో ప్రసంగించనున్నారు. ఈ నెల 15న ముచ్చింతల్, 16న కల్వకుర్తి, 17న అహోబిలం, 19–20న గుంటూరు రైతునేస్తం ఫౌండేషన్, 21న వినుకొండ, 22న వరగాని, 23న మండలపల్లిలలో ప్రసంగిస్తారు. వివరాలకు.. కిషోర్ – 99490 94370.

- శ్రీగంధం, టేకు చెట్లకు ప్రూనింగ్ మరణ శాసనమే
- 'సాక్షి సాగుబడి'తో శాస్త్రవేత్త డా. సుందరరాజ్

శ్రీగంధం, టేకు చెట్ల కొమ్మలు కత్తిరిస్తున్నారా?

శ్రీగంధం (చందనం), టేకు వంటి అధిక విలువైన కలప తోటల సాగుకు దక్షిణాది రాష్ట్రాలు పెట్టింది పేరు. ప్రైవేటు భూముల్లో సాగుకు ప్రభుత్వం అనుమతించడంతో ముఖ్యంగా శ్రీగంధం తోటల సాగు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో గత 20 ఏళ్లలో బాగా పెరిగింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో ఈ మధ్యనే సాగు విస్తరిస్తోంది. శ్రీగంధం,టేకు సాగు రైతులకు అధికాదాయాన్నిచ్చే కలప తోటలు. శ్రీగంధం చెట్లను 15 ఏళ్లు శ్రద్ధగా పెంచితే ఒక్కో చెట్టుపై రూ. లక్ష వరకూ కూడా ఆదాయం రావటానికి అవకాశం ఉందని బెంగళూరులోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(ఐ.డబ్ల్యు.ఎస్.టి.) శాస్త్రవేత్త చెబుతున్నారు. ఏపీ, తెలంగాణ సహా 5 దక్షిణాది రాష్ట్రాల్లో శ్రీగంధం, టేకు తోటల సాగుపై ఈ సంస్థ పరిశోధనలు చేస్తోంది. ఐ.డబ్ల్యు.ఎస్.టి. శాస్త్రవేత్త డా. ఆర్.సుందరరాజ్ శ్రీగంధం, టేకు తోటల సాగులో సాధారణంగా రైతులు చేసే తప్పుల గురించి 'సాక్షి సాగుబడి'తో పంచుకున్నారు.


ప్రూనింగ్ చేసిన శ్రీగంధం చెట్టు.. ప్రూనింగ్ గాయం


ప్రూనింగ్ చేసిన టేకు చెట్టు.. ప్రూనింగ్ గాయం

ప్రూనింగ్‌తో నష్టాలు

మామిడి, దానిమ్మ, మునగ, మల్బరీ వంటి తోటల్లో పంటకోతలు పూర్తయ్యాక కొమ్మ కత్తిరింపులు చేస్తుంటారు. ఈ తోటల్లో ప్రూనింగ్ వల్ల అనేక రకాలుగా వెసులుబాటు కలుగుతుంది. దిగుబడి పెరగడంతో పాటు చెట్ల కొమ్మలు మరీ ఎత్తుగా పెరగనీయకుండా ఉండటం వల్ల పంటకోత సులువు అవుతుంది. ఈ అలవాటు కొద్దీ శ్రీగంధం, టేకు చెట్లకు కూడా ప్రూనింగ్ చేస్తున్నారు. ఇది పెద్ద తప్పు. మేలు కన్నా కీడు ఎక్కువగా జరుగుతోందని డా. సుందర్‌రాజ్ అంటున్నారు.

శ్రీగంధం, టేకు చెట్ల కాండం లోపలి కలపను, మధ్యలోని చేవను చీడపీడల నుంచి రక్షించేంది కాండం పైన ఉండే బెరడే. కొమ్మలు కత్తిరించినప్పుడు బెరడు దెబ్బతిని, ఎండిపోతుంది. కొమ్మను నరికిన చోట కాండం లోపలి పొరలు బయటపడతాయి. ఆ విధంగా కలపను కుళ్లింపజేసే శిలీంధ్రాలు, నష్టం చేసే కాండం తొలిచే పురుగులు ప్రూనింగ్ జరిగిన చోటు నుంచి చెట్టు లోపలికి ప్రవేశిస్తాయి. తద్వారా చెట్టు బలహీనపడుతుంది. ఆకుల పెరుగుదల మందగిస్తుంది. కాయలు రాలిపోతాయి. ప్రూనింగ్ గాయాలు కొమ్మల సహజ పెరుగుదలను దెబ్బతీస్తాయి. చెట్టు సమతుల్యత దెబ్బతిని గాలుల వల్ల నష్టం కలుగుతుంది. చాలా సందర్భాల్లో చెట్లు ప్రూనింగ్ జరిగిన కొద్దికాలంలోనే చనిపోతాయి కూడా అంటున్నారు డా. సుందర్‌రాజ్.

కలప మన్నికకు గొడ్డలిపెట్టు

టేకు కలప పదికాలాల పాటు చెక్కుచెదరకుండా ఉంటుంది. టేకు కలప జీవక్షీణతకు గురిచేసే సూక్ష్మజీవరాశిని అరికట్టే రక్షక పదార్థాలు (మెటబాలిటీస్ లేదా ఎక్స్‌ట్రాక్టివ్స్) చెట్టు కాండం లోపలి పొరల్లో ఉండబట్టే టేకు కలపకు ఈ గట్టితనం వచ్చింది. ప్రూనింగ్ చేసిన టేకు చెట్లలో ఈ పదార్థాలు లోపించటం వల్ల ఆ కలప మన్నిక కాలం తగ్గిపోతుంది.

ఐ.డబ్ల్యు.ఎస్.టి. నిపుణుల అధ్యయనంలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. ఇంటర్నేషనల్ బయోడిటీరియోరేషన్ అండ్ బయోడిగ్రేడేషన్ జర్నల్‌లో ప్రచురితమైన వ్యాసంలో ఈ విషయాలు పొందుపరిచారు. శ్రీగంధం చెట్లకు ప్రూనింగ్ చేస్తే ఎత్తు పెరగొచ్చు గానీ కాండం చుట్టుకొలత పెరగదు. ప్రూనింగ్ గాయాల దగ్గర సుడులు ఏర్పడటం వల్ల చెక్క అందం పాడవుతుంది.

ప్రూనింగ్ చేయటం వల్ల శ్రీగంధం, టేకు చెట్లకు నష్టం జరగటమే కాదు దాని చుట్టూ ఉండే పర్యావరణ వ్యవస్థకు తెలియకుండానే పెద్ద నష్టం జరుగుతుందట. ప్రూనింగ్ చేసిన చెట్లకు గాయాలపై బోర్డాక్స్ పేస్ట్ వంటి శిలీంధ్ర నాశనులను పూస్తుంటారు. అయితే, ఇది పూర్తి రక్షణ ఇస్తుందని చెప్పలేమని డా. సుందరరాజ్ తెలిపారు. రసాయనాల ప్రతికూల ప్రభావాలు శ్రీగంధం చెట్లపై చాలా ఉంటుంది. ఎవరో చెప్పిన మాటలు విని శ్రీగంధం, టేకు చెట్లకు ప్రూనింగ్ చేయొద్దని, చెట్లను సహజంగా పెరగనిస్తూ ప్రకృతి సేద్య పద్ధతులను అనుసరించాలని డా. సుందరరాజ్ సూచిస్తున్నారు.

– పంతంగి రాంబాబు,
సాక్షి సాగుబడి డెస్క్

15 ఏళ్ల చెట్టుకు 10 కిలోల చేవ

ఒక రైతు ఇంటి దగ్గర పెరుగుతున్న ఈ మూడు శ్రీగంధం చెట్ల వయస్సు 15 సంవత్సరాలు. ఈ మూడిటికీ కొమ్మలు కత్తిరించారు. తక్కువ ప్రూనింగ్ వల్ల రెండు చెట్లు కోలుకున్నాయి. కానీ మూడో చెట్టుకు అతిగా ప్రూనింగ్ చేయటం వల్ల కోలుకోలేకపోయింది. మేం ఈ చెట్లకు చేవ (హార్ట్‌వుడ్) ఎంత ఉందో పరీక్షించాం. మొదటి రెండు చెట్ల కాండంలో మాత్రమే హార్ట్ వుడ్ కనిపించింది. బలహీనంగా ఉన్న మూడో చెట్టులో అసల్లేదు. చెట్టు మీ కోసమో, నా కోసమో చేవదేలదు. తన బలం కొద్దీ చేవదేలుతుంది. కాబట్టి ఏ చెట్టు నాణ్యతైనా, చేవ పరిమాణమైనా అది ఎంత ఆరోగ్యకరంగా పెరుగుతున్నదన్నదానిపై ఆధారపడి ఉంటుంది. నా అనుభవం ప్రకారం, 15 సంవత్సరాలు ఆరోగ్యంగా పెరిగిన చందనపు చెట్టుకు కనీసం 10 కిలోల చేవ ఉంటుంది. దాన్ని బట్టి రైతుకు ఆదాయం వస్తుంది.

– డా. ఆర్.సుందరరాజ్
(97404 33959),
శాస్త్రవేత్త, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, బెంగళూరు




ప్రూనింగ్ చేసిన 3 శ్రీగంధం చెట్లు ఇవే

సాక్షి బిజినెస్
మంగళవారం
14-3-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
897	259
58,238	17,154

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	11,215	△	76
డోజోన్స్	31,904	▽	6
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,549	▽	200
డాక్స్	14,959	▽	469
షాంఘై	3,269	△	39
నికాయ్	27,833	▽	311

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (24 క్యారెట్)	56,968
బంగారం (22 క్యారెట్)	56,740
వెండి (కేజీ)	63,666

ఫారెక్స్ రేట్లు రూ.లలో

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	81.03	82.70
£	బ్రిటన్ పౌండ్	97.67	100.96
€	యూరో	86.29	89.34
¥	జపాన్ ఎన్ (100)	60.16	62.13
AUS	ఆస్ట్రేలియా డాలర్	53.47	55.79
S$	సింగపూర్ డాలర్	59.97	61.92
SAR	సౌదీ రియాల్	20.90	22.58
UAE D	యూఏఈ దిర్హామ్	21.46	23.26
¥	చైనా యువాన్	10.82	12.89

బ్యాంక్.. క్రాష్



ఉన్నట్టుండి యూఎస్ సంస్థ సిలికాన్ వ్యాలీ బ్యాంక్(ఎస్‌వీబీ)ను మూసివేయడంతో మరోసారి ప్రపంచ స్టాక్ మార్కెట్లకు షాక్ తగిలింది. దీంతో యూరప్, ఆసియాసహా దేశీయంగానూ అమ్మకాలు వెల్లువెత్తాయి. వెరసి వరుసగా మూడో రోజు దేశీ స్టాక్ మార్కెట్లు క్షీణించగా.. ప్రధాన ఇండెక్సులు సెన్సెక్స్, నిఫ్టీ 5 నెలల కనిష్టాలకు చేరాయి.

- అమ్మకాల వెల్లువ.. 5 నెలల కనిష్టం
- సెన్సెక్స్ 897 పాయింట్లు పతనం
- ఇంట్రాడేలో 1,416 పాయింట్లు డౌన్
- చివరికి 58,238 వద్ద ముగింపు
- 259 పాయింట్లు కోల్పోయిన నిఫ్టీ
- బ్యాంకింగ్, మీడియా, ఆటో వీక్

ప్రధానంగా బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగ కౌంటర్లలో అమ్మకాలు ఊపందుకోవడంతో దేశీ స్టాక్ మార్కెట్లు పతనమయ్యాయి. సెన్సెక్స్ 897 పాయింట్లు కోల్పోయి 58,238 వద్ద నిలిచింది. నిఫ్టీ సైతం 259 పాయింట్లు దిగజారి 17,154 వద్ద ముగిసింది. ఇది ఐదు నెలల కనిష్టంకాగా.. ఒక దశలో సెన్సెక్స్ 1,040 పాయింట్లు పడిపోయి 58,095 దిగువకు చేరింది. నిఫ్టీ 300 పాయింట్లు క్షీణించి 17,113ను తాకింది. 2008 ఆర్థిక సంక్షోభం తదుపరి యూఎస్‌లో తిరిగి ఒక పెద్ద బ్యాంకు దివాలా స్థితికి చేరడంతో ఇన్వెస్టర్లలో ఆందోళనలు పెరిగినట్లు విశ్లేషకులు పేర్కొన్నారు. సిల్వర్‌గేట్ క్యాపిటల్ కార్ప్ ఇప్పటికే మూతపడటానికితోడు సిగ్నేచర్ బ్యాంక్‌లో సంక్షోభం సెంటిమెంటును దెబ్బతీసినట్లు తెలిపారు. కాగా.. తొలుత మార్కెట్లు లాభాలతో ప్రారంభమయ్యాయి. సెన్సెక్స్ 375 పాయింట్లు ఎగసి 59,511కు చేరింది. తదుపరి అమ్మకాలతో పట్టుతప్పి ఆ స్థాయి నుంచి మధ్యాహ్నానికల్లా 1,416 పాయింట్లు జారింది. మార్కెట్ పతనం నేపథ్యంలో సోమవారం ఇన్వెస్టర్ల సంపదగా పిలిచే బీఎస్‌ఈ మార్కెట్ విలువలో రూ. 4.43 లక్షల కోట్లకు పైగా ఆవిరైంది. రూ. 2,58,56,296 కోట్లకు పరిమితమైంది.

ఎన్ఎస్ఈలో అన్ని రంగాలూ డీలాపడగా.. బ్యాంకింగ్, మీడియా, ఆటో 2.5 శాతం చొప్పున నష్టపోయాయి. రియల్టీ, ఐటీ, కన్జూమర్ డ్యురబుల్స్, మెటల్, ఎఫ్ఎంసీజీ, ఆయిల్ గ్యాస్ 2–1 శాతం మధ్య నీరసించాయి. సెన్సెక్స్‌లో కేవలం టెక్ మహీంద్రా(7%) జంప్‌చేయగా.. నిఫ్టీలో అపోలో హాస్పిటల్స్, బ్రిటానియా, ఓఎన్‌జీసీ సైతం నిలదొక్కుకున్నాయి. అయితే ఇండస్ఇండ్ బ్యాంక్ 7% కుప్పకూలింది. ఎస్‌బీఐ, టాటా మోటార్స్, ఎంఅండ్ఎం, ఐషర్, యాక్సిస్, బజాజ్ ఫిన్, ఇన్ఫోసిస్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, హీరోమోటో, గ్రాసిమ్, అల్ట్రాటెక్, ఐసీఐసీఐ, టైటాన్, ఆర్ఐఎల్ 3–1.5% మధ్య క్షీణించాయి.

యస్ బ్యాంక్ డౌన్

మూడేళ్ల లాకిన్ గడువు ముగియడంతో సోమవారం యస్ బ్యాంక్ కౌంటర్లో అమ్మకాలు పెరిగాయి. తొలుత 13% క్షీణించి రూ.14.4కు చేరింది. చివరికి 5.3% నష్టంతో రూ.15.65 వద్ద క్లోజైంది.

విదేశీ బ్యాంకులు వెలవెల..

ఎస్‌వీబీ వైఫల్యం నేపథ్యంలో సోమవారం ట్రేడింగ్‌లో పలు బ్యాంకింగ్ స్టాక్స్ కుప్పకూలాయి. రీజనల్ బ్యాంకు స్టాక్స్‌లో వెస్టర్న్ అలయెన్స్ 75 శాతం, ఫస్ట్ రిపబ్లిక్ బ్యాంక్ 65 శాతం, పాక్‌వెస్ట్ బ్యాంక్‌కార్ప్ 46 శాతం చొప్పున పడిపోయాయి. ఇక యూరోపియన్, అమెరికన్ దిగ్గజాలలో క్రెడిట్ స్వీస్, డాయిష్ బ్యాంక్, యూబీఎస్, బార్‌క్లేస్, ఐఎన్‌జీ, లాయిడ్స్, హెచ్ఎస్‌బీసీ 8–3 శాతం మధ్య క్షీణించాయి. బ్యాంక్ ఆఫ్ అమెరికా, వెల్స్ ఫార్గో, సిటీగ్రూప్, జేపీ మోర్గాన్ చేజ్, గోల్డ్‌మన్ శాక్స్ 6–3 శాతం మధ్య డీలాపడ్డాయి.

పసిడి జోరు



బ్యాంకింగ్ వ్యవస్థపై భయాలతో రక్షణాత్మక పెట్టుబడిగా భావించే పసిడికి గిరాకీ పెరిగింది. దీంతో కామెక్స్‌లో ఔన్స్(31.1 గ్రాములు) 2.4 శాతంపైగా(44 డాలర్లు) ఎగసి 1,911 డాలర్లను అధిగమించింది. దేశీయంగా(న్యూఢిల్లీ) 10 గ్రాముల ధర రూ. 970 బలపడి రూ. 56,550ను తాకింది. వెండి సైతం కేజీ రూ. 1,600 పుంజుకుని రూ. 63,820కు చేరింది. అయితే యూఎస్ ట్రెజరీ ఈల్డ్స్ క్షీణించాయి. పదేళ్ల బాండ్ల ఈల్డ్ 3.7 శాతం నుంచి 3.46 శాతానికి, రెండేళ్ల బాండ్ల ఈల్డ్ 3.7 శాతం నుంచి 3.46 శాతానికి నీరసించింది. ఫెడ్ చైర్మన్ పావెల్ వడ్డీ రేట్ల పెంపు సంకేతాలివ్వగా.. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో రేట్లలో అత్యవసర కోతలు అవసరమంటూ కొంతమంది ఆర్థికవేత్తలు పేర్కొంటున్నారు.

అమెరికాలో మరో బ్యాంక్ డౌన్



- ఈసారి సిగ్నేచర్ బ్యాంకు వంతు
- నియంత్రణ సంస్థ అధీనంలోకి సంస్థ
- బ్రిడ్జ్ బ్యాంకుకు కార్యకలాపాల బదిలీ

వాషింగ్టన్: అమెరికాలో బ్యాంకుల మూసివేత పరంపర కొనసాగుతోంది. సిలికాన్ వ్యాలీ బ్యాంకు (ఎస్‌వీబీ) ఉదంతం జరిగి మూడు రోజులు కూడా గడవకుండానే తాజాగా సిగ్నేచర్ బ్యాంకు కూడా మూతబడింది. నియంత్రణ సంస్థ న్యూయార్క్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ .. బ్యాంకును తన అధీనంలోకి తీసుకుంది. బ్యాంకు ఆస్తులను విక్రయించి డిపాజిటర్లకు చెల్లింపుల జరిపే ప్రక్రియను పర్యవేక్షించేందుకు ఫెడరల్ డిపాజిట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎఫ్‌డీఐసీ)ని రిసీవర్‌గా నియమించింది. అప్పటి వరకూ డిపాజిటర్లకు యథాప్రకారంగా సేవలు అందేలా చూసేందుకు బ్యాంకు కార్యకలాపాలు, కొన్ని అసెట్లను సిగ్నేచర్ బ్రిడ్జ్ బ్యాంకుకు బదలాయించారు. సాధారణంగా ఏదైనా బ్యాంకు విఫలమైన పక్షంలో ప్రత్యేకంగా ఇలాంటి బ్రిడ్జ్ బ్యాంకు ఏర్పాటు చేసి సదరు బ్యాంకు కార్యకలాపాలను బదలాయిస్తారు. ఎఫ్‌డీఐసీ నియమించిన బోర్డు సారథ్యంలో ఈ బ్యాంకు పని చేస్తుంది. ఈ బ్రిడ్జ్ బ్యాంకు ద్వారా సిగ్నేచర్ ఖాతాదారులంతా యథాప్రకారం లావాదేవీలు నిర్వహించుకోవచ్చని ఎఫ్‌డీఐసీ తెలిపింది. ఎస్‌వీబీ సంక్షోభ నేపథ్యంలో సిగ్నేచర్ బ్యాంకు ఖాతాదారులు కూడా విత్‌డ్రాయల్స్‌కు ఎగబడటం.. బ్యాంకు మూసివేతకు దారితీసింది. ప్రధానంగా న్యాయ సేవల సంస్థలు, రియల్టీ, క్రిప్టో సంస్థలకు సేవలందించే సిగ్నేచర్ బ్యాంకుకు అమెరికావ్యాప్తంగా 40 శాఖలు ఉన్నాయి. 110.4 బిలియన్ డాలర్ల అసెట్లు, 82.6 బిలియన్ డాలర్ల డిపాజిట్లు ఉన్నాయి.

క్రిప్టో సంస్థలకు కష్టకాలం..

సిగ్నేచర్, ఎస్‌వీబీ మూసివేతతో క్రిప్టో కంపెనీల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. క్రిప్టో ఎక్స్చేంజీ కాయిన్‌బేస్‌కు సిగ్నేచర్ బ్యాంకులో 240 మిలియన్ డాలర్ల డిపాజిట్లు ఉన్నాయి. ఇక సర్కిల్ అనే క్రిప్టో సంస్థకు ఎస్‌వీబీలో 3.3 బిలియన్ డాలర్లు, దివాలా తీసిన క్రిప్టో రుణాల సంస్థ బ్లాక్‌ఫైకి 227 మిలియన్ డాలర్లున్నాయి. సిగ్నేచర్ బ్యాంకు కూడా మూతబడటంతో తమ కార్యకలాపాలపై ప్రభావం పడనున్నట్లు సర్కిల్ తెలిపింది. దీన్ని అధిగమించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొంది.

హెచ్ఎస్‌బీసీ చేతికి ఎస్‌వీబీ బ్రిటన్..



ఎస్‌వీబీ బ్రిటన్ విభాగాన్ని నామమాత్రంగా 1 పౌండుకు కొనుగోలు చేసినట్లు బ్యాంకింగ్ దిగ్గజం హెచ్ఎస్‌బీసీ వెల్లడించింది. బ్రిటన్‌లో తమ వ్యాపారాన్ని పటిష్టం చేసుకునేందుకు ఇది తోడ్పడగలదని పేర్కొంది. ఈ లావాదేవీ సజావుగా పూర్తయ్యేందుకు తగు చర్యలు తీసుకున్నట్లు బ్రిటన్ ప్రభుత్వం వెల్లడించింది. తద్వారా 3,000 మంది ఖాతాదారులకు చెందిన 6.7 బిలియన్ పౌండ్ల డిపాజిట్లకు భద్రత లభిస్తుందని పేర్కొంది.

ఎన్ఎండీసీ తాత్కాలిక సీఎండీగా అమితవ ముఖర్జీ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మైనింగ్ రంగ దిగ్గజం ఎన్ఎండీసీ తాత్కాలిక సీఎండీగా సంస్థ ఫైనాన్స్ డైరెక్టర్ అమితవ ముఖర్జీ అదనపు బాధ్యతలు స్వీకరించారు. మూడు నెలలు లేదా కొత్త సీఎండీ నియామకం పూర్తి అయ్యే వరకు ఆయన ఈ పదవిలో ఉంటారు. 1995 బ్యాచ్ ఇండియన్ రైల్వేస్ అకౌంట్స్ సర్వీస్‌కు చెందిన ముఖర్జీ 2017లో ఎన్ఎండీసీలో చేరారు. ఎన్ఎండీసీ సీఎండీ పదవి కోసం పోటీ పడుతున్న ఏడుగురిలో ముఖర్జీ కూడా ఉన్నారు.

ఫిబ్రవరి రిటైల్ ద్రవ్యోల్బణం 6.44 శాతం



న్యూఢిల్లీ: వినియోగ ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం 2023 ఫిబ్రవరిలో 6.44 శాతంగా (2022 ఇదే నెల ధరల బాస్కెట్‌తో పోల్చి) నమోదయ్యింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ)కి కేంద్రం నిర్దేశిస్తున్న 6 శాతం కన్నా ఇది ఎగువన కొనసాగుతుండడం గమనార్హం. అయితే 2023 జనవరి 6.52% కన్నా ద్రవ్యోల్బణం కొంత తగ్గింది. ఆర్‌బీఐ పాలసీకి ప్రాతిపదిక అయిన రిటైల్ ద్రవ్యోల్బణం 2022 నవంబర్, డిసెంబర్ మినహా 2022 జనవరి నుంచి 6 శాతం ఎగువనే కొనసాగుతోంది.

- ఫుడ్ బాస్కెట్ రిటైల్ ద్రవ్యోల్బణం 5.95%గా నమోదైంది. కూరగాయల ధరలు వార్షిక ప్రాతిపదికన చూస్తే, 11.61% తగ్గాయి. సుగంధ ద్రవ్యాల ధరలు 20%, తృణ ధాన్యా లు, ఉత్పత్తుల ధరలు 17% పెరిగాయి.
- ఫ్యూయెల్ అండ్ లైట్ సెగ్మెంట్‌లో ద్రవ్యోల్బణం 9.90 శాతంగా ఉంది.

రెపో మరింత పెరుగుదల: డీబీఎస్ రిసెర్చ్

ఇదిలాఉండగా, రిటైల్ ద్రవ్యోల్బణం 6 శాతం ఎగువనే కొనసాగుతున్న నేపథ్యంలో, వచ్చే నెల జరగనున్న ద్వైమాసిక ద్రవ్య పరపతి విధానం సందర్భంగా ఆర్‌బీఐ రెపో రేటును మరో 25 బేసిస్ పాయింట్లు పెంచే అవకాశం ఉందని డీబీఎస్ రిసెర్చ్ తన తాజా నివేదికలో అంచనావేసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

14-3-2023	
విశాఖ	440-00
చిత్తూరు	473-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	431-00
విజయవాడ	431-00
రిటైల్ ధర (డజను)	66.00
13-3-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	430-00
వరంగల్	432-00
రిటైల్ ధర	4.90

హ్యుందాయ్ చేతికి జీఎం ప్లాంట్!

ఇరు సంస్థల మధ్య ఒప్పందం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: హ్యుందాయ్ మోటార్ ఇండియా.. మహారాష్ట్రలోని పుణే సమీపంలో ఉన్న జనరల్ మోటార్స్ (జీఎం) ఇండియాకు చెందిన తాలేగావ్ ప్లాంటును కొనుగోలు చేయనుంది. డీల్ పూర్తయితే స్థలం, భవనాలు, యంత్రాలు హ్యుందాయ్ పరం కానున్నాయి. ఇందుకోసం జీఎం ఇండియాతో టెర్మ్ షీట్ ఒప్పందం చేసుకున్నట్లు దక్షిణ కొరియాకు చెందిన హ్యుందాయ్ సోమవారం ప్రకటించింది. అయితే డీల్ విలువను వెల్లడించలేదు. ప్లాంటు చేతికి వచ్చిన తర్వాత తొలుత వెన్యూ ఎస్‌యూవీని ఈ కేంద్రంలో తయారు చేసి ఎగుమతి చేయాలన్నది హ్యుండై ఆలోచన. 2028 నాటికి భారత్‌లో రూ.4,000 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు హ్యుందాయ్ ఇప్పటికే ప్రకటించింది. అలాగే 6 ఎలక్ట్రిక్ కార్లను ప్రవేశపెట్టనున్నట్లు పేర్కొంది. చెన్నై సమీపంలోని శ్రీపెరుంబుదూరు వద్ద ఉన్న హ్యుందాయ్ ప్లాంటు దాదాపు పూర్తి సామర్థ్యంతో నడుస్తోంది. భారత్‌తోపాటు విదేశాల నుంచి కంపెనీ కార్లకు పెరుగుతున్న డిమాండ్ నేపథ్యంలో అదనపు తయారీ సామర్థ్యం ఇప్పుడు సంస్థకు తప్పనిసరి.

భవిత
గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- ఇండియన్ పాలిటీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి
ఆంధ్రప్రదేశ్ పోలీసు ఉద్యోగాలకు సంబంధించిన స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి
కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఏపీ ఈఏపీసెట్-2023

ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్–2023 (ఏపీ ఈఏపీసెట్) నోటిఫికేషన్‌ను ఏపీ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి విడుదల చేసింది. ఈ పరీక్షను జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ అనంతపురం (జేఎన్‌టీయూఏ) నిర్వహించనుంది. 2023 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, ప్రైవేట్ అన్‌ఎయిడెడ్, అఫిలియేటెడ్ ప్రొఫెషనల్ కళాశాలల్లో అండర్ గ్రాడ్యుయేట్ ప్రొఫెషనల్ ఇంజనీరింగ్, అగ్రికల్చర్ /హార్టికల్చర్, ఫార్మసీ, వెటర్నరీ/ఫిషరీస్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు.

కోర్సుల వివరాలు

- » ఇంజనీరింగ్, బయో టెక్నాలజీ, బీటెక్(డెయిరీ టెక్నాలజీ), బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్), బీటెక్(ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ); బీఎస్సీ(అగ్రికల్చర్), బీఎస్సీ(హార్టికల్చర్), బీవీఎస్సీ అండ్ ఏహెచ్, బీఎఫ్ఎస్సీ; బీఫార్మసీ, ఫార్మ్–డి.
- » **అర్హత:** కనీసం 45 శాతం మార్కులు(రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులకు 40 శాతం)తో ఇంటర్మీడియట్(ఎంపీసీ/బైపీసీ) లేదా ఇంటర్ ఒకేషనల్ కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. చివరి సంవత్సరం ఇంటర్ పరీక్షలకు హాజరైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. లేదా డిప్లొమా(ఇంజనీరింగ్) ఉత్తీర్ణులై ఉండాలి.
- » **వయసు:** ఇంజనీరింగ్,ఫార్మసీ కోర్సుల అభ్యర్థులు 31.12.2023నాటికి 16 ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ట వయోపరిమితి లేదు. **ఫార్మ్–డి కోర్సు:** 31.12.2023 నాటికి 17 ఏళ్లు నిండి ఉండాలి.
- » **పరీక్ష మాధ్యమం:** ఇంగ్లిష్, తెలుగు మీడియంలో ప్రశ్నలు ఉంటాయి.

ముఖ్య సమాచారం

- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆలస్య రుసుము లేకుండా దరఖాస్తుల సమర్పణ:** మార్చి11 నుంచి ఏప్రిల్ 15 వరకు.
- » **రూ.500 నుంచి రూ.10,000 వరకు ఆలస్య రుసుముతో దరఖాస్తు తేదీ:** ఏప్రిల్ 30 నుంచి మే 14 వరకు.
- » **దరఖాస్తుల తప్పుల సవరణ:** మే 4 నుంచి 6 వరకు;
- » **వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్లు:** మే 09 నుంచి
- » **ప్రవేశ పరీక్షలు:** మే 15 నుంచి మే 18 తేదీల్లో ఇంజనీరింగ్; మే 22 నుంచి 23 తేదీల్లో అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ.
- » **వెబ్‌సైట్:** https://cets.apsche.ap.gov.in

సీఎస్ఐఆర్-యూజీసీ నెట్ డిసెంబర్ 2022/జూన్ 2023

సీఎస్ఐఆర్ యూజీసీ నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్(నెట్) డిసెంబర్–2022 /జూన్–2023కు నోటిఫికేషన్ విడుదలైంది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) పరీక్షను నిర్వహించనుంది. ఈ పరీక్ష ద్వారా జేఆర్ఎఫ్ అర్హత పొందితే సీఎస్ఐఆర్ పరిధిలోని రీసెర్చ్ సెంటర్లలో, విశ్వవిద్యాలయాల్లో పీహెచ్‌డీకి దరఖాస్తు చేసుకోవచ్చు. లెక్చరర్‌షిప్‌కు అర్హత పొందితే విశ్వవిద్యాలయాలు లేదా డిగ్రీ కళాశాలల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఎంపికకావచ్చు.

- » **సబ్జెక్టులు:** పరీక్షను ఐదు సబ్జెక్టుల్లో నిర్వహిస్తారు. కెమికల్ సైన్సెస్, ఎర్త్, అట్మాస్ఫియరిక్, ఓషన్ అండ్ ప్లానెటరీ సైన్సెస్,లైఫ్ సైన్సెస్,మ్యాథమేటికల్ సైన్సెస్,ఫిజికల్ సైన్సెస్.
- » **అర్హత:** కనీసం 55 శాతం మార్కులతో ఎమ్మెస్సీ తత్సమాన ఉత్తీర్ణులు/నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఎస్ఎంఎస్/బీఈ/బీటెక్/బీఫార్మసీ/ఎంబీబీఎస్ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఓబీసీ(ఎన్‌సీఎల్),ఎస్సీ,ఎస్టీ,థర్డ్‌జెండర్,దివ్యాంగ అభ్యర్థులు అర్హత పరీక్షలో కనీసం 50 శాతం మార్కులు పొందాలి.
- » **వయసు:** జేఆర్ఎఫ్‌కు అర్హతకు సంబంధించి జనరల్ కేటగిరీ అభ్యర్థులకు 01.07.2022 నాటికి 28 ఏళ్లు మించకుండా ఉండాలి. ఎస్సీ/ఎస్టీ /దివ్యాంగులు /మహిళ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీ(నాన్‌క్రిమిలేయర్)లకు మూడేళ్ల గరిష్ట వయసు సడలింపు లభిస్తుంది. అసిస్టెంట్ ప్రొఫెసర్/లెక్చరర్‌షిప్‌కు ఎలాంటి గరిష్ట వయోపరిమితి నిబంధన లేదు.
- » **పరీక్ష విధానం:** పరీక్ష 200 మార్కులకు నిర్వహిస్తారు. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో పరీక్ష జరుగుతుంది.మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నల పద్ధతిలో పరీక్ష ఉంటుంది. పరీక్ష వ్యవధి 3 గంటలు. ప్రశ్నపత్రంలో మొత్తం మూడు విభాగాలు ఉంటాయి.

ముఖ్యసమాచారం

- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఫీజు చెల్లింపు,ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 10.04.2023.
- » **దరఖాస్తు సవరణ తేదీలు:** 12.04.2023 నుంచి 18.04.2023 వరకు. **పరీక్ష తేదీలు:** 6.06.2023, 7.06.2023, 8.06.2023.
- » **వెబ్‌సైట్:** csirnet.nta.nic.in

జీఏటీబీ-బీఈటీ పరీక్ష-2023

గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్–బయోటెక్నాలజీ(జీఏటీబీ)/ బయో టెక్నాలజీ ఎలిజిబిలిటీ టెస్ట్ (బీఈటీ)–2023 జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్‌ల కోసం ప్రకటన వెలువడింది. ఈ పరీక్షను పోస్టు గ్రాడ్యుయేట్ బయోటెక్నాలజీ విభాగాల్లో ప్రవేశాలకు నిర్వహిస్తారు. జీఏటీబీ–బీఈటీ–2023ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) నిర్వహిస్తోంది.

- » **జీఏటీ–బీ కోర్సులు:**ఎమ్మెస్సీ(బయో టెక్నాలజీ,అగ్రి బయోటెక్నాలజీ,సంబంధిత విభాగాలు),ఎంటెక్(బయోటెక్నాలజీ, సంబంధిత విభాగాలు),ఎంవీఎస్సీ(యానిమల్ బయోటెక్నాలజీ)
- » **అర్హత:** కనీసం 55 శాతం మార్కులతో సంబంధిత విభాగంలో బీఎస్సీ, ఎంబీబీఎస్, బీడీఎస్, బీవీఎస్సీ, బీఎఫ్ఎస్సీ, బీఏఎంఎస్, బీహెచ్ఎంఎస్, బీపీటీ, బీటెక్, ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ఉత్తీర్ణులై ఉండాలి.
- » **బీఈటీ కోర్సులు:** ఈ పరీక్షలో ప్రతిభ ఆధారంగా పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు.
- » **అర్హత:** కనీసం 60 శాతం మార్కులతో సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్, ఎంబీబీఎస్, ఎంటెక్, ఎంఎస్సీ, ఎంవీఎస్సీ, ఎంఫార్మసీ, ఇంటిగ్రేటెడ్ ఎంఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి.
- » **వయసు:** జనరల్ అభ్యర్థులకు 28 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 33 ఏళ్లు, దివ్యాంగులు, మహిళలు 31 ఏళ్లు మించకూడదు.
- » **పరీక్ష విధానం:** కంప్యూటర్ ఆధారిత విధానంలో మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు అడుగుతారు. **పరీక్ష వ్యవధి:** 180 నిమిషాలు.

ముఖ్య సమాచారం

- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆన్‌లైన్ దరఖాస్తు చివరితేది:** 31.03.2023.
- » **పరీక్ష తేది:** 23.04.2023. » **వెబ్‌సైట్:** dbt.nta.ac.in

ఐసెట్‌తో ఎంబీఏ, ఎంసీఏ

» మొదలైన టీఎస్ ఐసెట్ 2023 దరఖాస్తు ప్రక్రియ
» మే 26, 27 తేదీల్లో నాలుగు స్లాట్లలో ఎంట్రెన్స్ టెస్ట్
» ఈ ర్యాంకు ఆధారంగా ఎంబీఏ, ఎంసీఏల్లో ప్రవేశం

మేనేజ్‌మెంట్ ప్రొఫెషన్.. ఐటీ ప్రొఫెషనల్స్. ప్రస్తుతం డిగ్రీ చదువుతున్న లక్షల మంది విద్యార్థుల లక్ష్యం! భవిష్యత్ మేనేజర్లుగా, ఐటీ ప్రొఫెషనల్స్‌గా మారేందుకు మార్గం.. ఎంబీఏ, ఎంసీఏ కోర్సులు!! వీటిల్లో చేరేందుకు ఐసెట్‌లో ర్యాంకు తప్పనిసరి. తాజాగా.. తెలంగాణ ఉన్నత విద్యా మండలి టీఎస్ ఐసెట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దరఖాస్తు ప్రక్రియ కూడా మొదలైంది. ఈ నేపథ్యంలో.. టీఎస్ ఐసెట్-2023 వివరాలు, అర్హతలు, పరీక్ష విధానం, బెస్ట్ ర్యాంకుకు ప్రిపరేషన్ గైడెన్స్..



ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్.. సంక్షిప్తంగా ఐసెట్! ఇందులో సాధించిన ర్యాంకు ఆధారంగా..మాస్టర్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్(ఎంబీఏ), మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్(ఎంసీఏ) కోర్సుల్లో ప్రవేశం లభిస్తుంది. మేనేజ్‌మెంట్, ఐటీ విభాగాల్లో కొలువులు కోరుకునే విద్యార్థులు ఎంబీఏ, ఎంసీఏల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు.

అర్హతలు

- గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి.
- ఎంసీఏ అభ్యర్థులు ఇంటర్మీడియెట్‌లో మ్యాథమెటిక్స్ గ్రూప్ సబ్జెక్ట్‌గా చదివుండాలి.
- బ్యాచిలర్ డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

ఆన్‌లైన్ పరీక్ష

- టీఎస్ ఐసెట్–2023 పరీక్ష మే 26, 27 తేదీల్లో ఆన్‌లైన్ విధానంలో ఉంటుంది. మొత్తం మూడు సెక్షన్లుగా 200 ప్రశ్నలు–200 మార్కులకు పరీక్ష జరుగుతుంది. -విభాగం–ఏలో డేటా సఫిషియన్సీ 20 ప్రశ్నలు–20 మార్కులు, ప్రాబ్లమ్ సాల్వింగ్ 55 ప్రశ్నలు–55 మార్కులకు; విభాగం–బిలో మ్యాథమెటికల్ ఎబిలిటీ 75 ప్రశ్నలు–75 మార్కులకు, విభాగం–సిలో కమ్యూనికేషన్ ఎబిలిటీ 50 మార్కులకు ఉంటాయి.
- సెక్షన్–ఏలోని డేటా సఫిషియన్సీ విభాగంలో 15 ప్రశ్నలు మ్యాథమెటికల్, మరో అయిదు ప్రశ్నలు వెర్బల్ ఆధారిత ప్రశ్నలు ఉంటాయి. సెక్షన్–ఏలోని ప్రాబ్లమ్ సాల్వింగ్ విభాగంలో.. సిరీస్ కొశ్చన్స్ 25; డేటా అనాలిసిస్ సంబంధిత ప్రశ్నలు 10; కోడింగ్ అండ్ డీ కోడింగ్ సంబంధిత ప్రశ్నలు 10, డేట్, టైమ్ అండ్ అరేంజ్‌మెంట్‌కు సంబంధిత 10 ప్రశ్నలు అడుగుతారు.
- సెక్షన్–బిలో అర్థమెటికల్ ఎబిలిటీ నుంచి 35 ప్రశ్నలు; ఆల్జీబ్రికల్ అండ్ జామెట్రికల్ ఎబిలిటీ నుంచి 30 ప్రశ్నలు; స్టాటిస్టికల్ ఎబిలిటీ నుంచి 10 ప్రశ్నలు ఉంటాయి.
- సెక్షన్–సిలోని కమ్యూనికేషన్ ఎబిలిటీలో.. మీనింగ్స్,సినానిమ్స్ అండ్ యాంటానిమ్స్,వెర్బ్స్, ఫ్రేజల్ వెర్బ్స్ అండ్ ఇడియమ్స్, ఆర్టికల్స్ అండ్ ప్రిపొజిషన్స్, కంప్యూటర్ టెర్మినాలజీ, బిజినెస్ టెర్మినాలజీ, కాంప్రహెన్షన్‌ల నుంచి అయిదు ప్రశ్నలు చొప్పున అడుగుతారు. కాంప్రహెన్షన్ నుంచి మూడు ప్యాసేజ్‌లు ఉంటాయి. ఒక్కో ప్యాసేజ్ నుంచి అయిదు ప్రశ్నలు అడుగుతారు.
- మొత్తం పరీక్షకు కేటాయించిన సమయం రెండున్నర గంటలు.

22 వేలకు పైగా సీట్లు

గత ఏడాది కౌన్సెలింగ్ గణాంకాల ప్రకారం–టీఎస్ ఐసెట్ ద్వారా కన్వీనర్ కోటాలో ఎంబీఏ, ఎంసీఏలకు సంబంధించి 272 కళాశాలల్లో దాదాపు 25 వేల సీట్లు ఉన్నాయి. 231 కళాశాలల్లో 20,481 ఎంబీఏ సీట్లు, 40 కళాశాలల్లో 2,370 ఎంసీఏ సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఐసెట్ ర్యాంకు ఆధారంగా మలి దశలో ఆన్‌లైన్ వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లు కేటాయిస్తారు.

విజయం సాధించేలా

రాష్ట్రంలోని యూనివర్సిటీ క్యాంపస్ కళాశాలలు,అనుబంధ కళాశాలల్లో ఎంబీఏ,ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఐసెట్‌కు పోటీ కూడా పెరుగుతోంది.గత ఏడాది ఐసెట్‌కు 62 వేల మంది దరఖాస్తు చేసుకోవడమే ఇందుకు నిదర్శనంగా చెప్పొచ్చు. కాబట్టి ఇందులో బెస్ట్ ర్యాంకు సాధించేందుకు సిలబస్ అంశాలపై గట్టి పట్టు సాధించాల్సి ఉంటుంది.

అనలిటికల్ ఎబిలిటీ

విశ్లేషణాత్మక నైపుణ్యాలను పరీక్షించే విభాగం ఇది. ఇందులో రాణించడానికి డేటా సఫిషియెన్సీ; ప్రాబ్లమ్ సాల్వింగ్ అంశాల్లో నైపుణ్యం సాధించాలి. డేటాను ఇచ్చి దాని ఆధారంగా సమస్య సాధించేవిగా, స్టేట్‌మెంట్ ఆధారితంగా ప్రశ్నలు ఉంటాయి. వీటికి సమాధానాలు గుర్తించేందుకు బేసిక్ అర్థమెటిక్ అంశాల్లో పట్టు సాధించాలి. ఇది విభాగం–బిలోనూ రాణించేందుకు దోహదపడుతుంది. స్టేట్‌మెంట్ ఆధారిత ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలంటే..గణితంపై ప్రాథమిక అవగాహన అవసరం. ప్రాబ్లమ్ సాల్వింగ్ విభాగంలో రీజనింగ్ ఆధారిత ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థులు కోడింగ్, డీ–కోడింగ్, బ్లడ్ రిలేషన్, సిరీస్, సిలాజిజమ్, సీటింగ్ అరేంజ్‌మెంట్ వంటి అంశాలపై పూర్తి అవగాహన పెంచుకోవాలి.

మ్యాథమెటికల్ ఎబిలిటీ

ఈ విభాగం కోసం హైస్కూల్ స్థాయి మ్యాథమెటిక్స్ పుస్తకాలను అధ్యయనం చేయాలి. ప్రశ్నల శైలి కొంత క్లిష్టంగా ఉండే స్టాటిస్టికల్ ఎబిలిటీ కోసం ఇంటర్మీడియెట్ స్థాయి పుస్తకాలను అనుసరించాలి. అర్థమెటిక్ విభాగంలోని ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలంటే.. శాతాలు, లాభనష్టాలు, నిష్పత్తులు, మెన్సురేషన్, పని–కాలం, పని–సమయం వంటి అంశాలు ముఖ్యమైనవి. ఆల్జీబ్రికల్ అండ్ జామెట్రికల్ ఎబిలిటీ కోసం ట్రిగ్నోమెట్రిక్ రేషియోస్ ఆఫ్ యాంగిల్స్, సెట్స్, లీనియర్ ఈక్వేషన్స్, కోఆర్డినేట్ జామెట్రీలపై పట్టు సాధించాలి.

కమ్యూనికేషన్ ఎబిలిటీ

- ఈ విభాగంలో కొంత ఎక్కువ మార్కులు సొంతం చేసుకునే అవకాశం ఉంది. ప్రాక్టీస్, విశ్లేషణ సామర్థ్యం, కంపేరిటివ్ అప్రోచ్ ఉంటే.. మొత్తం 50 ప్రశ్నల్లో 40 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించొచ్చు. బేసిక్ ఇంగ్లిష్ గ్రామర్‌పై అవగాహన పెంచుకోవాలి. వొకాబ్యులరీ పెంచుకునేందుకు కృషి చేయాలి. ప్రతి రోజు కనీసం 20 కొత్త పదాలు నేర్చుకోవడం , వాటి వినియోగాన్ని ప్రాక్టీస్ చేయాలి. బిజినెస్ అండ్ కంప్యూటర్ టెక్నాలజీలో.. సామాజిక వ్యాపార–వాణిజ్య అంశాలు, అదే విధంగా తాజా పరిణామాలు, కంప్యూటర్ బేసిక్స్‌పై అవగాహనను పరీక్షించే విధంగా ప్రశ్నలు ఉంటాయి. వీటిలో రాణించాలంటే.. బిజినెస్ టెర్మినాలజీ, కొత్త వ్యాపార విధానాలు, ఆయా సంస్థలు–వాటి క్యాప్షన్లు వంటివి తెలుసుకోవాలి. కంప్యూటర్ టెర్మినాలజీకి సంబంధించి బేసిక్ ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్ టూల్స్, అదే విధంగా కంప్యూటర్ హార్డ్‌వేర్‌కు సంబంధించిన ముఖ్య భాగాలు, వాటి పని తీరుకు సంబంధించి ప్రాథమిక నైపుణ్యం కలిసొస్తుంది.
- రీడింగ్ కాంప్రహెన్షన్ విభాగంలో.. ప్యాసేజ్‌ల ఆధారంగా అడిగే 15 ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలంటే.. ముందుగా అభ్యర్థులు ఆయా అంశాన్ని, అందులోని కీలక పదాలను, ముఖ్య సారాంశాన్ని గుర్తించే నేర్పు పెంచుకోవాలి. ఇందుకోసం దినపత్రికల వ్యాసాలు, ఇంగ్లిష్ స్టోరీ బుక్స్ చదవాలి. ఫంక్షనల్ గ్రామర్‌లో మంచి మార్కుల కోసం బేసిక్ గ్రామర్ అంశాలుగా పేర్కొనే సినానిమ్స్, యాంటానిమ్స్, కొశ్చన్ ట్యాగ్స్, డైరెక్ట్–ఇన్‌డైరెక్ట్ స్పీచ్‌లను ప్రాక్టీస్ చేయాలి. ఇందుకోసం ఆరు నుంచి పదో తరగతి వరకు ఇంగ్లిష్ గ్రామర్ బుక్స్ చదవడం ఉపయుక్తంగా ఉంటుంది.

ప్రాక్టీస్‌తో పదును

ఐసెట్‌లో మంచి స్కోర్ సాధించేందుకు చక్కటి మార్గం.. ప్రాక్టీస్. కాబట్టి అభ్యర్థులు ఆయా టాపిక్స్ అధ్యయనంతోపాటు ప్రతి రోజూ కొంత సమయం ప్రాక్టీస్‌కు కేటాయించాలి. దీంతోపాటు పరీక్షకు నిర్దేశించిన సిలబస్ అంశాలను అప్లికేషన్ ఓరియెంటేషన్ కోణంలో అధ్యయనం చేయాలి.

ముఖ్య సమాచారం

- ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు:మార్చి 6–మే6, 2023
- రూ.250 అపరాధ రుసుముతో మే 12 వరకు, రూ.500 అపరాధ రుసుముతో మే 18 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.
- హాల్ టికెట్ డౌన్‌లోడ్ సదుపాయం:మే22, 2023
- ఐసెట్ పరీక్ష తేదీలు: మే 26, 27, 2023
- వెబ్‌సైట్: https://icet.tsche.ac.in

మార్గదర్శి మేనేజర్లకు రిమాండ్

సాక్షి ప్రతినిధి, విజయవాడ/కాకినాడ లీగల్/విశాఖ లీగల్: నిబంధనలకు విరుద్ధంగా చిట్స్ నిర్వహిస్తున్న కేసులో సీఐడీ పోలీసులు అరెస్ట్ చేసిన మార్గదర్శి విజయవాడ బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాస్ (ఫోర్‌మెన్)ను రెండో అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజి స్ట్రేట్ సునందమ్మ ముందు హాజరుపరచగా రిమాండ్ విధించారు. ఈ కేసులో సీఐడీ వాదనలతో ఏకీభవించిన న్యాయమూర్తి మార్గదర్శి మేనేజర్‌కు ఈ నెల 24 వరకు రిమాండ్ విధించారు. కాగా, మార్గదర్శి రాజమహేంద్రవరం బ్రాంచ్ మేనేజర్ సత్తి రవిశంకర్‌ను కాకినాడ రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కమ్ సీఐడీ కోర్టు న్యాయమూర్తి ఎం.ప్రసన్నలక్ష్మి ఎదుట సీఐడీ పోలీసులు సోమవారం హాజరుపర్చారు. రవిశంకర్‌కు ఒకరోజు రిమాండ్ విధించగా.. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు. ఈ కేసులో కాకినాడ సీఐడీ కోర్టు పరిధిలో విచారణ చేయకూడని కొన్ని సెక్షన్లు ఉండటంతో.. సంబంధిత రికార్డును రాజమహేంద్రవరం జిల్లా జడ్జి కోర్టుకు పంపారు. ఈ నేపథ్యంలో రవిశంకర్‌ను రాజమహేంద్రవరం జిల్లా జడ్జి కోర్టులో హాజరు పరచనున్నారు.

పోలీస్ కస్టడీకి అనుమతి

విశాఖపట్నం సీతంపేటలోని మార్గదర్శి బ్రాంచ్ మేనేజర్ కామినేని రామకృష్ణను విచారణ నిమిత్తం తమ కస్టడీకి ఇవ్వాలని సీఐడీ పోలీసులు చేసిన విజ్ఞప్తిని మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు సోమవారం అంగీకరించింది. మంగళ, బుధవారాలలో రెండు రోజులపాటు ఆయనను పోలీసులు విచారించవచ్చని న్యాయస్థానం పేర్కొంది.

చందాదారుల సొమ్ముతో దందా!

సాక్షి, అమరావతి: మార్గదర్శి యాజమాన్యం చందాదారుల డబ్బులను నిబంధనలకు విరుద్ధంగా మళ్లించినట్లు తమ తనిఖీల్లో వెల్లడైందని సీఐడీ అదనపు డీజీ సంజయ్, స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ వి.రామకృష్ణ వెల్లడించారు. చట్ట ప్రకారం చిట్‌ఫండ్ సంస్థల వ్యవహారాలను పర్యవేక్షించే చిట్స్ రిజిస్ట్రార్‌కు మార్గదర్శి యాజమాన్యం సహకరించడం లేదని తెలిపారు. చందాదారుల ప్రయోజనాలను పరిరక్షించడం తమ బాధ్యతని, ఇదే ధోరణి కొనసాగితే మార్గదర్శి చిట్‌ఫండ్స్‌పై కఠిన చర్యలకు సైతం వెనుకాడబోమన్నారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో నిధుల దుర్వినియోగం, మోసం, చట్ట ఉల్లంఘనలకు సంబంధించి తాము నమోదు చేసిన కేసులో ప్రాథమిక ఆధారాలున్నట్లు న్యాయస్థానం కూడా రిమాండ్‌కు అనుమతిస్తూ ఇచ్చిన ఉత్తర్వుల్లో పేర్కొందని గుర్తు చేశారు. «మన రాష్ట్రంలో చందాదారుల సొమ్మును ఇతర రాష్ట్రాలకు అక్రమంగా బదిలీ చేస్తున్నారు. అందుకు ఇక్కడ బాధ్యులు ఉండరు. ఇతర రాష్ట్రాల్లో అడిగితే మీకు సంబంధం లేదంటున్నారు. అంటే చందాదారులు చెల్లిస్తున్న సొమ్ముకు ఎలాంటి భద్రతా లేదు» అని పేర్కొన్నారు. సోమవారం వెలగపూడిలోని సచివాలయంలో వారు సంయుక్తంగా విలేకరులతో మాట్లాడుతూ మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాలను వివరించారు.

- చిట్‌ఫండ్ చట్టం సామాజిక, ఆర్థికపరమైన చట్టమని సుప్రీంకోర్టు గతంలోనే స్పష్టం చేసింది. చందాదారుల హక్కుల పరిరక్షణ, చిట్‌ఫండ్ కంపెనీల్లో ఆర్థిక క్రమశిక్షణ కోసమే ఈ చట్టం చేశారని పేర్కొంది. చిట్‌ఫండ్స్ చట్టం–1982 ప్రకారం చిట్‌ఫండ్ కంపెనీ బ్రాంచిలోని మేనేజర్ (ఫోర్‌మేన్) చందాదారులు చెల్లించే సొమ్ముకు పరిరక్షకుడు. చిట్స్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ పర్యవేక్షకుడు.
- బ్యాంక్ లావాదేవీల నిర్వహణ, నిధుల చెల్లింపులన్నీ ఫోర్‌మేన్ నిర్వహించాలి. రాష్ట్రంలో మార్గదర్శి చిట్‌ఫండ్స్‌కు ఉన్న 37 బ్రాంచీల్లో ఏడు బ్రాంచిల్లో తనిఖీలు చేశాం. చందాదారులు చెల్లించిన మొత్తం అక్కడి బ్యాంకుల్లో లేదన్న విషయం అందులో వెల్లడైంది. ఆ సొమ్మంతా నిబంధనలకు విరుద్ధంగా పక్క రాష్ట్రానికి తరలించేశారు.
- మార్గదర్శి ఫోర్‌మేన్‌కు చట్ట ప్రకారం ఉండాల్సిన చెక్ పవర్‌తోసహా ఎలాంటి అధికారాలు లేవు. బ్యాంకు వ్యవహారాలు, చెక్ పవర్ అంతా హైదరాబాద్‌లోని మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఎండీ శైలజతోపాటు ఆ సంస్థ ప్రధాన కార్యాలయంలోని 11 మందికే ఉంది.
- ఇక్కడున్న చందాదారుల సొమ్ముల భద్రత గురించి అడిగితే తనకు తెలియదని ఫోర్‌మెన్ చెబుతున్నారు. హైదరాబాద్ వెళ్లి అడిగితే తెలంగాణలో ఉన్న ప్రధాన కార్యాలయం ఏపీ అధికారుల పరిధిలోది కాదంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన చందాదారులు చెల్లిస్తున్న డబ్బులకు బాధ్యులెవరని ప్రశ్నిస్తే సమాధానమే లేదు. సొమ్ము రాష్ట్ర ప్రజలది...పెత్తనం పక్క రాష్ట్రంలో వారిది.
- మార్గదర్శి చిట్‌ఫండ్స్ చందాదారులకు చెందిన సొమ్ములను నిబంధనలకు విరుద్ధంగా మ్యూచువల్ ఫండ్స్, ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్స్, తమ అనుబంధ కంపెనీల్లో పెట్టుబడులుగా పెట్టారు. ఆ సంస్థ బ్యాలెన్స్ షీట్, కొన్ని బ్యాంకు ఖాతాలను చార్టెడ్ అకౌంటెంట్ ద్వారా పరిశీలిస్తే ఈ విషయాలు బయటపడ్డాయి. అందుబాటులో ఉన్న కొన్ని బ్యాంకు ఖాతాలను పరిశీలించగా ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మ్యూచువల్ ఫండ్స్‌లో మూడుసార్లు రూ.29 కోట్లు, రూ.10 కోట్లు, రూ.8 కోట్లు చొప్పున, ఎడెల్‌వైజ్ ఆర్బిట్రేడ్ ఫండ్స్‌లో రూ.10 కోట్లు చొప్పున నిబంధనలకు విరుద్ధంగా పెట్టుబడులు పెట్టినట్లు వెల్లడైంది. పూర్తి బ్యాంకు ఖాతాలను పరిశీలిస్తే ఇంకా ఎన్ని పెట్టుబడులు పెట్టారో తెలుస్తుంది.


మాట్లాడుతున్న సీఐడీ ఏడీజీ సంజయ్. చిత్రంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్‌ల శాఖ ఐజీ రామకృష్ణ

- విశాఖపట్నం, రాజమహేంద్రవరం, విజయవాడ, గుంటూరులో మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఫోర్‌మెన్‌లను అరెస్టు చేసి న్యాయస్థానంలో ప్రవేశపెట్టాం. గుంటూరు మినహా మిగతా మూడు చోట్లా న్యాయస్థానాలు నిందితులకు రిమాండ్ విధించాయి. నిందితులపై సీఐడీ మోపిన అభియోగాలకు సంబంధించి ప్రాథమిక ఆధారాలున్నాయని రిమాండ్‌కు అనుమతిస్తూ న్యాయస్థానాలు స్పష్టం చేశాయి. సీఐడీ కేసు డైరీలో పేర్కొన్న అంశాలతో తాము సంతృప్తి చెందినట్లు, వారిని అరెస్టు చేయడం సరైనదేనని పేర్కొన్నాయి.
- మార్గదర్శి యాజమాన్యం నిధులను అక్రమంగా బదిలీ చేస్తూ, చిట్స్ రిజిస్ట్రార్‌కు సహాయ నిరాకరణ కొనసాగిస్తే చందాదారుల ప్రయోజనాల పరిరక్షణ కోసం తీవ్రమైన చర్యలు తీసుకుంటాం. ఇతర రాష్ట్రాల్లో ఏం చేస్తున్నారన్న అంశంతో మాకు నిమిత్తం లేదు. ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలు, చందాదారుల సొమ్ముకు భద్రత కల్పించడమే మా విధి. ఈ కేసులో విచారణ కొనసాగిస్తాం. కేసు దర్యాప్తులో పురోగతికి అనుగుణంగా ఏ–1 చెరుకూరి రామోజీరావు, ఏ–2 చెరుకూరి శైలజను కూడా విచారించడంతోపాటు ఇతర చర్యలను తగిన సమయంలో తీసుకుంటాం.

ఇదో.. పోంజీ తరహా స్కామ్

మార్గదర్శి చిట్‌ఫండ్స్ యాజమాన్యం పోంజీ స్కామ్ తరహా అక్రమాలకు పాల్పడుతోంది. చిట్టీలలో 30 శాతం నుంచి 40 శాతం టికెట్లు (సభ్యత్వాలు) యాజమాన్యం పేరిట ఉంచుతోంది. ఆ టికెట్లకు చెల్లించాల్సిన చందాలను చెల్లించడం లేదు. ఇతర చందాదారులు చెల్లించిన చందాలను తాము చెల్లించినట్లు రికార్డుల్లో చూపిస్తోంది. వాటిపై మళ్లీ 5 శాతం కమీషన్ తీసుకుంటోంది. చందాదారుల సొమ్మును వ్యక్తిగత ప్రయోజనాలకు వాడుకుంటోంది.

రూ.15 వేల కోట్ల అక్రమ డిపాజిట్ల సేకరణ

మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమ డిపాజిట్లు సేకరిస్తోంది. చిట్‌ఫండ్ కంపెనీలు డిపాజిట్లు సేకరించడం చట్ట విరుద్ధం. మార్గదర్శి ఫైనాన్సియర్స్ పేరిట అక్రమ డిపాజిట్లు సేకరించిన చరిత్ర మార్గదర్శి చిట్‌ఫండ్స్‌కు ఉంది. గతంలో అక్రమంగా సేకరించిన రూ.15 వేల కోట్ల డిపాజిట్లపై ఆదాయపన్ను చెల్లించాలని ఐటీ శాఖ నోటీసులు కూడా ఇచ్చింది.

చందాదారుల నుంచి ఫిర్యాదులు

సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పాటిస్తూ చిట్‌ఫండ్ చట్టం, ఇతర చట్టాలను అనుసరించి మార్గదర్శిపై స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ ఫిర్యాదుతో సీఐడీ కేసు నమోదు చేసింది. ఒక్క చిట్‌ఫండ్ చట్టమే కాకుండా ఇతర చట్టాలను కూడా ఉల్లంఘించారు. సీఐడీ కేసు నమోదు చేయగానే పలువురు చందాదారులు తాము మోసపోయామని, తమకు డబ్బులు ఇవ్వడం లేదని ఫిర్యాదులు చేసేందుకు ముందుకొస్తున్నారు. ఈ రెండు రోజుల్లోనే 8 మంది చందాదారులు ఫిర్యాదు చేశారు. ఓ చందాదారుడు తనకు ఇవ్వాల్సిన రూ.10 లక్షలను ఆర్నెల్లుగా ఇవ్వడం లేదని ఫిర్యాదు చేశారు.

- మార్గదర్శిని ప్రశ్నించిన తెలంగాణ హైకోర్టు
- ఏపీలో హైకోర్టు ఉంది కదా..?
- కేసులు, దర్యాప్తు అంతా అక్కడే..
- అలాంటప్పుడు వీటిని విచారించే పరిధి ఈ కోర్టుకు ఉందా?
- దీనిపై తేలకుండా దర్యాప్తులో జోక్యం చేసుకోలేం
- విచారణ ఈ నెల 20వతేదీకి వాయిదా

ఇక్కడెందుకీ పిటిషన్?

సాక్షి, హైదరాబాద్: 'ఆంధ్రప్రదేశ్‌లో హైకోర్టు ఉంది కదా..? మరి ఇక్కడెందుకీ పిటిషన్ దాఖలు చేశారు..?' అని మార్గదర్శి చిట్‌ఫండ్స్ యాజమాన్యాన్ని తెలంగాణ హైకోర్టు ప్రశ్నించింది. కేసులు ఏపీలో నమోదయ్యాయి.. విచారణ అధికారులూ ఏపీ వారే.. బ్రాంచ్‌లు ఉన్నది కూడా అక్కడే.. అలాంటప్పుడు ఈ పిటిషన్‌పై విచారణ జరిపే పరిధి ఈ కోర్టుకు ఉందా? అని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. దీనిపై తేలకుండా దర్యాప్తులో తాము జోక్యం చేసుకోవడం సరికాదని అభిప్రాయపడింది. ఏదేమైనా విచారణను వచ్చే సోమవారానికి వాయిదా వేస్తున్నామని, ఆలోగా పరిధిపై నిర్ణయిస్తామని స్పష్టం చేసింది. మార్గదర్శిపై ఏపీలో నమోదైన కేసుల దర్యాప్తులో భాగంగా అరెస్టు సహా బలవంతపు చర్యలు చేపట్టకుండా, హైదరాబాద్‌లోని తమ ప్రధాన కార్యాలయంలో తనిఖీలు నిర్వహించకుండా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్, చెరుకూరి రామోజీరావు, శైలజ తరఫున లంచ్‌మోషన్ పిటిషన్లు దాఖలయ్యాయి. దీనిపై తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి సోమవారం విచారణ చేపట్టారు. వాదనలు విన్న అనంతరం తదుపరి విచారణను ఈ నెల 20వ తేదీకి వాయిదా వేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున స్పెషల్ జీపీ గోవిందరెడ్డి, మార్గదర్శి తరఫున న్యాయవాది దుర్గాప్రసాద్ వాదనలు వినిపించారు.

అక్కడి కేసులపై.. ఇక్కడ విచారణా?

'409, 477(ఏ), 420 సహా పలు సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. ఇవన్నీ 10 ఏళ్లకు పైగా శిక్ష పడే కేసులే. కాగ్నిజబుల్ నేరాల కిందికే వస్తాయి. ఏపీలో నమోదైన కేసులపై ఇక్కడ ఉపశమనం కోరలేరు. ఈ కోర్టుకు అక్కడి కేసులపై విచారణ జరిపే పరిధి లేదు. గతంలో పిటిషన్‌పై విచారణ సందర్భంగా తెలంగాణలోని మార్గదర్శి కార్యాలయాల్లో తనిఖీలపై కోర్టు స్టే ఇచ్చింది. అయితే అప్పటికే స్వాధీనం చేసుకున్న డాక్యుమెంట్లను, రిజిస్టర్లను పరిశీలించగా అనేక అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. ఈ క్రమంలో కేసులు నమోదు చేశారు. అక్రమాలు నిగ్గు తేలినప్పటికీ కేసులు నమోదు చేయవద్దని, ఎఫ్‌ఐఆర్ దాఖలు చేయవద్దని కోర్టు ఉత్తర్వుల్లో ఆదేశించలేదు. చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌పై తీవ్ర ఆరోపణలున్నాయి. మొత్తం బ్రాంచ్‌లకు వారే బాధ్యులు. ఖాతాదారుల నుంచి వసూలు చేసిన నగదును మ్యూచువల్ ఫండ్స్, షేర్ మార్కెట్లలోకి అక్రమంగా మళ్లిస్తున్నారు. చట్టాలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తూ చందాదారుల హక్కులకు విఘాతం కలిగిస్తున్నారు. ఒకటి రెండు అంశాల్లో మినహా ఏపీ హైకోర్టు పరిధిలోని విషయాలపై తెలంగాణ హైకోర్టు కలుగజేసుకునే అవకాశం లేదు. ఇది ఏపీ పునర్విభజన చట్టంలో స్పష్టంగా ఉంది. ప్రత్యేకంగా ఏపీకి హైకోర్టు ఏర్పాటైన తర్వాత తెలంగాణ హైకోర్టుకు అక్కడి అంశాలపై పరిధి ఉండదని చట్టం చెబుతోంది. ఒక్క డెట్ రిలీఫ్ ట్రిబ్యునల్(డీఆర్‌టీ)కి సంబంధించి డీఆర్‌టీ–2 రాయలసీమ పరిధి వరకు జోక్యం చేసుకోవచ్చని చట్టం చెబుతోంది. కేసులు నమోదు చేసిన నేరాలన్నీ ఏపీలోనే జరిగాయి. దర్యాప్తు చేస్తున్న పోలీసులూ అక్కడి వారే. అలాంటప్పుడు అరెస్టులు చేయవద్దని ఇక్కడ కోరడం చట్ట విరుద్ధం. అసలు అలా పిటిషనే వేయలేరు. హైకోర్టుల పరిధికి సంబంధించి సుప్రీం కోర్టు కూడా పలు సందర్భాల్లో స్పష్టంగా పేర్కొంది. ఏపీ హైకోర్టు పరిధిలో కలుగజేసుకోలేమని ఇదే హైకోర్టు పలు తీర్పులను ఇచ్చింది. నిందితులు ఏ రాష్ట్రంలో ఉన్నా అరెస్టు చేసే అధికారం పోలీసులకు ఉంటుంది. అది వారికున్న చట్టబద్ధమైన అధికారం. ఏపీలో హత్య చేసి వచ్చి తెలంగాణలో దాక్కుని అరెస్టు చేయవద్దని ఇక్కడి కోర్టును కోరడం ఎలా చట్టవిరుద్ధమో.. ఇదీ అంతే' అని గోవిందరెడ్డి నివేదించారు. ''పోలీసులు హైదరాబాద్ వస్తున్నారా?'' అని న్యాయమూర్తి ప్రశ్నించగా.. ప్రాథమికంగా నేరం జరిగింది.. అక్రమాలు జరిగాయని నిరూపణ అయితే అరెస్టు చేయవచ్చని గోవిందరెడ్డి నివేదించారు. ఇదో భారీ వైట్ కాలర్ నేరమన్నారు.

ముందుగా 'పరిధి' తేలుద్దాం..

'ఖాతాదారుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదు. అయినా తనిఖీలు చేస్తున్నారు. ఎఫ్‌ఐఆర్‌లో ఏ–1గా రామోజీరావు, ఏ–2గా శైలజ పేర్లు చేర్చారు. మార్గదర్శి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ తెలంగాణలో నివసించడం, తెలంగాణలోని బ్రాంచ్‌ల్లోనూ తనిఖీలు చేసే అవకాశం ఉన్నందున ఈ హైకోర్టులో పిటిషన్ వేశాం. ఏపీలో పలు బ్రాంచ్ మేనేజర్లను అరెస్టు చేసి కేసులు నమోదు చేశారు. తనిఖీలపై స్టే విధిస్తూ ఇదే కోర్టు గతంలో మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ఇప్పుడు తనిఖీలు చేపడితే అది కోర్టు ఆదేశాలను ఉల్లంఘించడమే అవుతుంది' అని మార్గదర్శి తరఫు న్యాయవాది దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. ఈ సమయంలో న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ మిగతా అంశాల జోలికి ఇప్పుడు వెళ్లకుండా అసలు ఈ కోర్టుకు పరిధి ఉందా? లేదా? అన్న విషయాన్ని ముందుగా తేలుద్దామని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వం తరఫున న్యాయవాది రూపేందర్ వాదనలు వినిపించారు. తెలంగాణ డీజీపీని ప్రతివాదిగా చేర్చారని, అసలు ఈ పిటిషన్ విచారణార్హం కాదన్నారు. వచ్చే సోమవారం వరకు పిటిషనర్లపై అరెస్టులు లాంటి చర్యలు తీసుకోబోమని గోవిందరెడ్డి తెలియచేయడంతో న్యాయమూర్తి విచారణను ఈ నెల 20వ తేదీకి వాయిదా వేశారు.

ముల్లు.. అది గులాబీ ముల్లైనా, పిచ్చి పొదల్లో ముల్లైనా.. చివరికి చేప ముల్లైనా గుచ్చుకుంటుందని భయపడతాం. గులాబీని వాడేటప్పుడు, చేపలు తినేటప్పుడు చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తాం. కానీ పొందూరు ఖాదీ నేతకార్మికులు ఆ ముల్లు లభించక తల్లడిల్లుతున్నారు. వారికి అవసరమైన కృత్రిమ ముళ్ల తయారీకి అనేకమంది ప్రయత్నిస్తున్నారు. అధ్యయనాలు, పరిశోధనలు చేస్తున్నారు. అష్టాల్ ఒక ముల్లు కోసం ఇన్ని మల్లగుల్లాలా! ఏమిటి దాని గొప్ప? అని వెటకారం చేయకండి.. చిన్న చూపు చూడకండి. ఎందుకంటే ఆ ముల్లు లేనిదే ఖాదీ దారం తయారు కాదు. ఖాదీ వస్త్రాలు ఆ నునుపు, మెరుపు సంతరించుకోలేవు మరి! అలాగని అన్ని చేపల ముళ్లు పనికిరావు. ఖాదీ వస్త్రాల తయారీకి ఉపయోగపడే ముడి కొండపత్తిలోని పొల్లు తీసి శుభ్రం చేసేందుకు వాలుగు చేప ముల్లు మాత్రమే ఉపయోగపడుతుంది. ఆ చేప దవడ పలువరుసతో ఉండే ప్రత్యేకమైన ముల్లు లభించక దాని ప్రభావం ఖాదీ నేతపై పడుతోంది. అందుకే వాలుగ చేప ముల్లును పోలి ఉండేలా కృత్రిమ పరికరం తయారీకి ఒక సీనియర్ సైంటిస్ట్, ఒక యువజన సంఘం, ఖాదీ కార్మికాభివృద్ధి సంఘం ఎన్నెన్నో ప్రయత్నాలు చేస్తున్నాయి.


పత్తిని శుభ్రం చేసేందుకు వినియోగించే వాలుగ చేప దవడ భాగాలు

• పొల్లు తీసే ముల్లు

దొరక్క తల్లడిల్లు!


వాలుగ చేప ముల్లుతో పత్తిని శుభ్రం చేస్తూ..

- ముడిపత్తిని శుభ్రం చేయడంలో వాలుగచేప ముల్లు కీలకం
- ప్రస్తుతం లభ్యం కాని పరిస్థితి
- ప్రత్యామ్నాయాలపై శాస్త్రవేత్తలు దృష్టి



శ్రీకాకుళం డెస్క్:

పొందూరు ఖాదీ తయారీలో **కీలకమైన.. పత్తిని శుభ్రం చేసేందుకు వినియోగించే..** వాలుగ చేప **దవడ భాగం** అవసరానికి **తగినంతగా** లభ్యం **కావడం** లేదా? ఆ చేప **ముల్లును** సేకరించడం **కష్టతరంగా** మారిందా..? ఆ ముల్లుకు **ప్రత్యామ్నాయాలను రూపొందించే** పనిలో **సీనియర్** శాస్త్రవేత్తలు **దృష్టిపెట్టారా..?** అంటే **అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి.**

ఏమిటీ వాలుగ.. ఎందుకీ వెలుగు..

వాలుగు చేప.. శాస్త్రీయ నామం వల్లగో అట్టు. మంచినీటిలో పెరిగే చేప. మిగతా చేపల మాదిరిగా కాకుండా దవడ భాగం విభిన్నంగా ఉంటుంది. దవడలోని ఉండే మృదువైన పళ్లవరసే ఖాదీ వస్త్రం రూపొందించడంలో కీలకం. ఖాదీకి అంత తెలుపు రంగు తీసుకురావడంతో కూడా కీలక పాత్ర దీనిదే.

వినియోగం ఎలా..

వాలుగ చేప దవడ భాగాన్ని మత్స్యకారుల నుంచి సేకరిస్తారు. పైదవడను రెండు ముక్కలుగా, కింది దవడను రెండు ముక్కలుగా చేస్తారు. ఆ ముక్కను ఓ చిన్న కర్రకు దువ్వెన మాదిరిగా కడతారు. దాని సాయంతో పత్తిని శుభ్ర పరుస్తారు. ఈ క్రమంలో పత్తి మృదువుగా తయారవడంతో పాటు మరింత తెలుపుగా మారుతుంది. ఎడమ చేతి వాటం ఉన్న నేత కారులు ఎడమ దవడను, కుడి చేతి వాటం ఉన్న వారు కుడి దవడను వినియోగించి పత్తిని శుభ్రపరిచేందుకు వినియోగించడం మరో విశేషం.

గతంలో రాజమండ్రి నుంచి..

తొలినాళ్లలో రాజమండ్రి ధవళేశ్వరం నుంచి కరకు సత్యమ్మ అనే మహిళ పొందూరు ఖాదీ కార్యాలయానికి వాలుగ చేప దవడల్ని సరఫరా చేసేవారు. ఆమె మరణాంతరం అక్కడ్నుంచి ముల్లు రావడం లేదు. శ్రీకాకుళం, విజయనగరం పరిసరాల్లోని మత్స్యకారులు అడపాదడపా తెచ్చి విక్రయిస్తున్నారు.


వాలుగ చేప

ప్రత్యామ్నాయాల రూపకల్పనలో..

- ఖాదీ తయారీలో వాలుగ చేప దవడ కీలకం కావడం.. అవసరమైన మేర లభ్యత లేకపోవడంతో ప్రత్యామ్నాయాలపై సీనియర్ శాస్త్రవేత్తలు దృష్టి సారించారు. మహారాష్ట్ర వార్ధాలోని మహాత్మాగాంధీ ఇన్‌స్టిట్యూట్ ఫర్ రూరల్ ఇండస్ట్రియలైజేషన్(ఎంజీఐఆర్ఐ) సంస్థకు చెందిన సీనియర్ శాస్త్రవేత్త మహేష్‌కుమార్ ఆధ్వర్యంలోని ఓ బృందం స్టీల్‌తో వాలుగ చేప దవడ మాదిరిగా ఓ పరికరాన్ని రూపొందించింది. దీనిని హైదరాబాద్‌కు చెందిన ఎంఎస్ఎంఈ సంస్థ తయారు చేసింది. ఆ పరికరం పనితీరును పొందూరు ఖాదీ తయారీలో ప్రయోగాత్మకంగా పరిశీలించింది. కానీ వాలుగ చేప దవడతో వచ్చేంత మృదుత్వం ఈ పరికరంతో రాలేదు. నేతన్నల చేతులకు గాయాలవ్వడం.. ఇతర అంశాల కారణంగా ఆ పరికరం వినియోగంలోకి రాలేదు.
- అయినా సీనియర్ సైంటిస్ట్ మహేష్ కుమార్ ప్రత్యామ్నాయాలపై పట్టువిడవలేదు. చేప దవడ మాదిరిగానే ఉండేలా సన్నని ప్లాస్టిక్ సూదుల్ని స్విట్జర్లాండ్‌లో, దవడ భాగాన్ని థాయ్‌లాండ్‌లో రూపొందించి మరో కొత్త పరికరాన్ని రూపొందించారు. కానీ ఈ పరికరం ఖర్చు ఎక్కువగా ఉండడంతో.. ఖాదీ కమిషన్ ఆఫ్ ఇండియా అనుమతి కోసం పంపించారు.
- జిల్లాకు చెందిన పొగిరి జశ్వంత్‌నాయుడు (చెన్నై ట్రిపుల్ ఐటీ, ఐఐఎం అమృత్‌సర్ పూర్వ విద్యార్థి) బృందం కూడా ప్రత్యామ్నాయ పరికరంపై దృష్టిసారించింది. ఐఐఎం అమృత్‌సర్ వేదికగా ఐదుగురు సభ్యుల బృందం త్రీడీ టెక్నాలజీ సాయంతో మోడల్‌ను రూపొందించింది. ప్లాస్టిక్‌ది కావడం.. ఇతర అంశాల వల్ల ఇదీ సఫలీకృతం కాలేదు. ఈ బృందం మరిన్ని ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించింది.
- పొందూరుకు చెందిన ఆంధ్రప్రదేశ్ ఫైన్ ఖాదీ కార్మికాభివృద్ధి సంఘం(ఏఎఫ్‌కేకే) వాలుగ చేప సేకరణకోసం విస్తృతంగా ప్రయత్నిస్తోంది. వాలుగ సేకరణ కష్టంగా మారడంతో దానిని పోలి ఉండే మరో రకం చేపపై దృష్టిసారించారు. హిరమండలం రిజర్వాయర్‌లో వీటిని సేకరించేలా ఏర్పాట్లు చేసుకున్నారు. కానీ దీని వినియోగంలో కూడా ఇబ్బందులు ఉన్నాయి. త్వరగా విరిగిపోవడం, అరిగిపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో దీనిని వినియోగిస్తున్నారు.


శాస్త్రవేత్త మహేష్ కుమార్ తయారు చేసిన కృత్రిమ పరికరం

- విదేశీ సాంకేతికతతో తయారు చేసిన ప్రత్యామ్నాయ పరికరం ఖరీదు రూ.750 వరకు ఉంది.
- అదే వాలుగ చేప దవడ అయితే కేవలం రూ.25 నుంచి రూ.50 వరకు ఉంది.

వాలుగకు ఏదీ సాటిరాదు..

పత్తిని శుభ్రం చేసేందుకు వాలుగ చేప **దవడకు ప్రత్యా**మ్నాయం లేదనే చెబుతు**న్నారు నిపుణు**లు. ఆ సున్నితత్వం.. ఆ శ్వేత **వర్ణం వాలు**గుకు ఏదీ సాటిరాదంటు**న్నారు.** విజయనగరం జిల్లా వంగర **మండలం** మడ్డువలస రిజర్వాయ**ర్‌లో వా**లుగ చేపలు ఉన్నాయని జీవ**వైవిధ్య** పరిశోధకులు చెబుతున్నారు. ఈ ప్రాంతంలో వేట సాగించే మత్స్యకారులకు దీని వినియోగంపై విస్తృతమైన అవగాహన కల్పించి వారితో ఒప్పందం కుదుర్చుకుంటే మంచిదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఆ దిశగా కూడా ఖాదీ బోర్డు ప్రయత్నాలు ప్రారంభించాల్సిన అవసరం ఉందంటున్నారు.


దారం తయారీకి సిద్ధమైన పత్తి



స్విట్జర్లాండ్‌లో తయారీ..



వాలుగ చేప దవడకు ప్రత్యామ్నాయంగా ఇప్పటికే ఒక పరికరాన్ని రూపొందించాం. కొన్ని ఇబ్బందులు గమనించాం. అందుకే విదేశీ పరిజ్ఞానంతో కొత్త ప్రాజెక్ట్ పూర్తి చేశాం. తలవెంట్రుకల పరిమాణంలో ఉండే సూదులను ప్లాస్టిక్ మెటీరియల్‌తో స్విట్జర్లాండ్‌లో రూపొందించాం. దవడ భాగాన్ని థాయ్‌లాండ్‌లో తయారు చేయించాం. పరికరం ఖరీదు కాస్త ఎక్కువ.
–మహేష్‌కుమార్, సీనియర్ సైంటిస్ట్, ఎంజీఐఆర్ఐ, వార్ధా, మహారాష్ట్ర

ప్రయత్నం చేస్తున్నాం..




పొందూరు ఖాదీలో కీలకమైన వాలుగ చేప దవడ భాగం సేకరణ కష్టతరం కావడంతో ప్రత్యామ్నాయాల దిశగా ఐఐఎం అమృత్‌సర్ వేదికగా మా టీమ్ దృష్టి సారించింది. ప్రొఫెసర్‌తో సహా ఐదుగురు సభ్యులు ఓ పరికరాన్ని రూపొందించాం. కొన్ని ఇబ్బందులు గమనించాం. పూర్తి పర్యావరణ హితమైన మెటీరియల్‌తో తయారు చేసేందుకు మా వంతు ప్రయత్నం మేం చేస్తున్నాం. – పొగిరి జశ్వంత్ నాయుడు, స్ట్రాటజీ కన్సల్టెంట్, ఈవై

శిక్షణ తీసుకున్నాం..



కృత్రిమ చేప ముల్లుతో పత్తిని శుభ్రం చేసే ప్రక్రియను నేర్చుకునేందుకు హైదరాబాదుకు వెళ్లాం. దీని వినియోగంతో నాణ్యమైన 100 కౌంటు దారం రాదు. ఈ కృత్రిమ ముల్లుతో చేయడం వల్ల చేతి వేళ్లకు గాయాలై రక్తం వచ్చేది.
–కాపల కుమారి, చేనేత కార్మికురాలు

ఆ రిజర్వాయర్‌లో గుర్తించాం..



వాలుగ చేప శాస్త్రీయ నామం వల్లగో అట్టు. ఇది మంచి నీటి చేప. మా అధ్యయనాల్లో వాలుగు చేపలు మడ్డువలస రిజర్వాయర్‌లో విస్తృతంగా ఉన్నాయి. చాలా పెద్ద సైజుల్లోనే లభ్యమవుతున్నాయి.
–డాక్టర్ కర్రి రామారావు, జీవవైవిధ్య శాస్త్రవేత్త, డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల, విశాఖపట్నం

కొరత వాస్తవమే..



పొందూరు ఖాదీకి కీలకమైన వాలుగ చేప దవడ కొరత వాస్తవమే. చాలా మంది ప్రత్యామ్నాయాల వేటలో ఉన్నారు. కానీ అవి సఫలీకృతం కాలేదు. మా వంతుగా ఇటీవలే హిరమండలం రిజర్వాయర్‌లో వేరే రకం చేపను వినియోగించేందుకు ప్రయత్నాలు ప్రారంభించాం. వాలుగుకు ఏదీ సాటి రాదు.
–డి.వెంకటరమణ, సెక్రటరీ, ఏఎఫ్‌కేకే, పొందూరు

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943
Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.